మిసిమి

చింతనాత్మక సారస్వతం

మాసపత్రిక ఏప్రియల్ 2015 ₹ 25



బైరన్ నివసించిన ఇటాలియన్ పెలాజో

మిసిమి
మాసపత్రిక

"All that we are is the product of what we have thought"
- Dammapada.

సంపుటి 25 ఏప్రియల్ 2015 సంచిక 4

ప్రధాన సంపాదకుడు
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

సంపాదకుడు
వల్లభనేని అశ్వినీకుమార్

సహాయ సంపాదకుడు
కాండ్రేగుల నాగేశ్వరరావు

సాంకేతిక సహాయకులు
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రాముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేముల రాణి, సారిక నిర్మల,
నీలకంఠం నరసరాజు

సంస్థాపక సంపాదకులు
రవీంద్రనాథ్ ఆలపాటి

Printed & Published by

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹ 25 సంవత్సరానికి : ₹300
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060

ఈ నెల...

కమ్మతెమ్మెరలు 5
నేరేటి లంక 7
– సాయి పాపినేని, జయశ్రీ నాయని

సాహిత్య విమర్శ పరమార్థం 12
– ప్రొ. చందు సుబ్బారావు

కేశవరెడ్డి సంస్మరణ 15
– కాండ్రేగుల నాగేశ్వరరావు

మారణకాండలో విరిసిన మానవత్వం 21
– *గబ్బిట కృష్ణమోహన్*

బోయ కొట్టములు పండ్రెండు (కరణం బాల సుబ్రహ్మణ్యం పిళ్లె) ... 25
– *వి.రాజారామమోహనరావు*

జ్ఞానపీఠం పై స్త్రీలు 30
– *మంతెన సూర్యనారాయణరాజు*

శిల్పంలో స్త్రీ 33
– *సంజీవదేవ్*

తెలుగు గాథాకారులు 39
– *ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావు*

కన్నడ ప్రసారభారతి 47
– *డా॥ రాజేశ్వరి దివాకర్ల*

మిసిమి పాతికేండ్ల పండుగ 51
– *నీలకంఠం నరసరాజు*

కృష్ణగిరి తెలుగు తేజాలు 57
– *జి. చంద్రశేఖర్*

తెలుగులో సూక్ష్మికలు 61
– *కొల్లూరు లావణ్య*

స్వాతంత్ర్యోద్యమం – మద్దూరు అన్నపూర్ణయ్య 64
– *డా॥ సి.వి. రాజగోపాలరావు*

ఆకాశవాణి బాణి 70
– *డా॥ పి.ఎస్. గోపాలకృష్ణ*

సంగీత గజారోహణ – కొచ్చెర్లకోట రామరాజు 80
– *తనికెళ్ళ భరణి*

యడ్ల గోపాలరావు విజయయాత్ర 83
– *డా॥ వేమలి త్రినాథరావు*

నిఘంటు నిర్మాణంలో వెలగా వెంకటప్పయ్య కృషి 87
– *కొడాలి సుదర్శనబాబు*

సారంగపాణి పదములు 90
– *కొచ్చెర్లకోట శ్రీలేఖ*

సాహిర్ గీతాలు 93
– *డా॥ జె.పి. వైద్య*

పుస్తక పరిచయం 96

ముఖచిత్రం : ద్రాక్ష సుందరి ... చిత్రకారిణి : మేరియా ఎస్టఫాన్
రెండవ అట్ట : ఇటాలియన్ పెలాజో
మూడవ అట్ట : స్పెయిన్‌లో మ్యూజియం
నాల్గవ అట్ట : అల్బేనియన్ దుస్తుల్లో బైరన్ ... చిత్రకారుడు : థామస్ ఫిలిప్స్

వివరాలు 50వ పుటలో...

“...సాహిత్య విమర్శ కట్టమంచి రామలింగారెడ్డిగారితో మొదలయ్యిందంటారు. అంతకు ముందు గిడుగు రామ్మూర్తి, గురజాడ వారి వ్యాసాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి....” అంటూ ‘సాహిత్య విమర్శకు’ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందిన రాచపాళెం చంద్రశేఖర రెడ్డి సాహిత్య విమర్శ పోకడలు, రాళ్ళపల్లి, పుట్టపర్తి వారి వాస్తవ మార్గం, తరువాత అభ్యుదయ మార్గం గురించి కూడా తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అంతటితో ఆగక “... సాహిత్యంలో ఒక గుంపు గందరగోళం సృష్టించేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తోంది. ఉద్యమం కాని దానిని ఉద్యమంగా ప్రచారం చేస్తున్నది...” అన్న మాటల్లో వాస్తవాన్ని కాదనలేము.

ఇక ఆధునికం – ఆధునికానంతర పదాలను విరివిగా వాడే గుంపులు కూడా ఉన్నాయి. వారికి సమాధానంగా “... అసలు సమాజం ఆధునికం కాకుండానే ఆధునికానంతరం అనటం అసంబద్ధమే...” అని గట్టిగా వాదించారు. “... జీవితంలో రాకుండా సాహిత్యంలో ఈ పోస్ట్ మోడర్న్ పోకడలు ఎలా సాధ్యం?...” అని నిలదీశారు. ఆ విధంగా ఆధునికం – ఆధునికానంతరం వాస్తవ ప్రాతిపదిక లేనివని తేల్చి చెప్పారు.

ఆధునికమంటే ఏమిటి? దీనికి సమాధానం మన ‘గుంపులు’ మోడర్న్‌కు అనువాద పదాన్ని తెస్తాయి. అలాగే ఆధునికానంతరం కూడా. అయితే తెలుగులో ఆధునిక సాహిత్యం ఏది? అంటే ముందు ఆధునికత అంటే తెలియాలి.

‘అంతకు ముందు ఉన్న దానిని కాదనటం’ ఆధునికత అని స్థూలంగా చెప్పవచ్చు. ఈ అర్థంలో రాచపాళెం వారి వాదన అక్షరాల సత్యమే కదా! అలాగే ఆధునిక సాహిత్యం కాని దానికి విమర్శ ఎక్కడ నుంచి వస్తుంది? ‘ఆది’ లేకుండా, ఆధునికానంతర సాహిత్యమని తాము రాసినదంతా దానికి ముడిపెట్టి ప్రచారం చేసుకోవటం కూడా చంద్రశేఖర రెడ్డి చెప్పినట్లు ఉద్యమం కానిదాన్ని ఉద్యమంగా ప్రచారం చేసుకోవటమే. ఈ బాధ తెలుగు వరకే పరిమితమా? అని ఇతర భాషా పండితులను ఎప్పటినుంచో అడుగుతూనే ఉన్నాము – ఇంతవరకు మాకు సమాధానం కాని, ఆ దిశలో వ్యాసాలు కాని రాలేదు.

సామాజిక జీవితం ఆధునికం కానిదే, ఆధునిక సాహిత్యం గురించి చర్చ, ప్రచారం కేవలం జుట్టుకు, బట్టలకే పరిమితమై పోతుంది కదా!

– సంపాదకులు

కమ్మతెమ్మెరలు

✶ "... ఫిబ్రవరి *మిసిమి*లో పేలిన్ డ్రోమ్‌ను గురించి దొర్లిన తప్పులు, బహుశా ముద్రారాక్షసాలేమో...! శీర్షికలోనే పేలిన్ డ్రోమ్‌కు బదులు పాలిడ్రోమ్ అనీ... ... స్పెల్లింగ్‌లో – Polymdrome అనీ... "వ తీవ" అంటే మునుపు అని అర్థం అనీ యివ్వబడింది...

... అలాగే విలోమ కావ్యం నుండి ఉటంకించిన శ్లోకం మొదటి పాదంలోని ముక్తి ముదారహాసం, అనీ, రెండవ పాదంలోని ముక్తి మూతాసు భూతాంలోని ము వర్ణానికి దీర్ఘం యివ్వడం జరిగింది. ఆంగ్లంలోని Palindromes చాలా ఉదాహరణలు చూపవచ్చు. మచ్చుకు కొన్ని...

- rise to vote sir ! - draw nine men inward - no, it is open on one position - was it a car or a cat I saw ? - no lemons no melon - do geese see god ?..."

– టి.వి. ప్రసాద్, నల్లగొండ.

✶ "... ఫిబ్రవరి ***మిసిమి*** మాసపత్రికలో *వెంకటగిరి జీవితం* రచన చదివాక ఈ రెండు మాటలు; శ్రీ వేణుగోపాల్‌గారికి రెండు సంవత్సరాల తరువాత కనిజ మహలులో నివాసం ఇవ్వబడిందని వ్రాసారు. అది కనిజ కాదు – కనీజ్. కనీజ్ అంటే ఆడపాప, దాసి, పనికత్తె, బానిస అని అర్థం. ఇది ఫారశీభాషకు చెందిన పదం. ఇక మహల్ అంటే భవనం లేక బంగ్లా. కనిజ మహల్‌లో కలశాలు పెట్టారని కలశ మహల్ అని కూడా అంటారని వ్రాసారు. అది తప్పు. అవి కేవలం అందం కోసం ఏర్పాటు చేసినవే. అంటే రాచరిక వ్యవస్థలో దాసీల కోసం, ఆడపాపల కోసం, పనికత్తెల కోసం ఒక భవనాన్ని వారి వసతికి ఏర్పాటు చేసేవారు. వీరు ప్రభువులకు, ప్రభ్వీణులకు అందుబాటులో ఉండడానికి. ప్రభువుల చిత్తం స్థిరంగా లేనప్పుడు, ఈ కనీజేలతో వ్యవహారం కొనసాగించేవారు. కనీజ్ అన్న పదం మొగలులు, కుతుబ్‌షాహీలు, బహమనీలు, నిజాంల పరిపాలన కాలంలో వెంకటగిరి సంస్థానంలోకి జొరబడి ఉంటుంది. అలా చాలా ఫారశీ, ఉర్దూ పదాలు, చాలా ప్రాంతీయ భాషల్లోకి ఒదిగి పోయాయి. నా చిన్నతనంలో కనీజ్ అన్న హిందీ సినిమా కూడా వచ్చింది. ఉర్దూ డిక్షనరీ చూస్తే కనీజ్ అంటే ఏమిటో తెలుస్తుంది.

... మార్చి ***మిసిమి కమ్మతెమ్మెరలు***లో పెన్మెత్స హరిశ్చంద్రరాజుగారు, కీ.శే. ఉత్పల సత్యనారాయణాచార్యగారి జన్మస్థలం గుంటూరు జిల్లా యాజలి అని వ్రాశారు. అది సరియైనది కాదు. వీరిది ఖమ్మం జిల్లా చింతకాని గ్రామం. చిలుమూరు పాఠశాలలో, వారికి సత్కారం జరిగినప్పుడు నేనూ, సత్యనారాయణాచార్యులవారు ఒకే చోట వున్నాం అతిథులుగా. వారు నాతో స్వయంగా తమది ఖమ్మం జిల్లా, చింతకాని గ్రామమని తెలిపారు. జీవిక కోసం యాజలి వెళ్లారేమో కాని – వాస్తవం అదికాదు. నన్ను వారింటికి కూడా ఆహ్వానించారు. అప్పటికే వారి భార్య కాలం చేసిందని కూడా తెలిపారు. వారిని వారింటి వద్దే కలుద్దామని అనుకుంటూనే కాలం గడిపాను. ఆ లోపే వారు కాలం చేశారు. చింతకాని గ్రామంలో ఇప్పటికీ వాళ్ళ వాళ్ళూ వున్నారు..."

– గుడిపూడి సుబ్బారావు, హైదరాబాదు.

✶ "... మీరు 10–10–2014 నాకొక లేఖ వ్రాసారు. ***మిసిమి*** పండుగకు, నేను రాగల్గినందుకూ, మీ విరచిత గ్రంథాన్ని (ఏరియల్) ఆవిష్కరించినందుకూ నన్ను కొనియాడారు. మీ కొనియాట నా ఆయుర్దాయాన్ని కొన్ని దినాలపాటు పెంచింది. ధన్యుణ్ణి!... మీ మైత్రి, నా బ్రతుకునకొక తళుకు! ఎంత సరసులు, సజ్జనులు, ఉత్తమాభిరుచులకు ఆశ్రయమైన మీ యెడ నాకు గల వాత్సల్య భావం ; మా అబ్బాయి, కృష్ణకుమార్, యెడల నాకుగల వాత్సల్యానికి తీసిపోనిది. మీ నాన్నగారంటే, మీకెంత అభిమానమో, వాడి నాన్నగారన్నా వాడికంత అభిమానం! మిస్టర్ కాంద్రేగులకూ, నా శుభాకాంక్షలు తెల్పండి!..."

– పెద్ది సత్యనారాయణ, బెంగుళూరు.

✶ "... నాలుగు పదుల వయసులో ఉన్న నాకు ఆచార్య ఆత్రేయ అంటే సినీ రచయితగానే ఎక్కువగా తెలుసు. *ఎన్జీవో, కప్పలు* వంటి నాటకాలు ఆయనకు ఎంతో కీర్తి తెచ్చిపెట్టాయనీ తెలుసు. కానీ ఆధునిక నాటక చరిత్రలో ఆత్రేయ పాత్రేమిటన్న దానిపై అంతగా అవగాహన లేదు. బహుశా సాహితీ రంగంలో ఉన్న నా వయసు వాళ్లలో, నా కంటే చిన్న వయసువాళ్లలో ఎక్కువమందికి నాటక రంగానికి ఆత్రేయ చేసిన సేవ, మేలు గురించి తెలిసి ఉండదనే నమ్ముతున్నాను. ఆత్రేయ సమగ్ర సాహిత్యంతో పరిచయం ఉన్న ఏ కొద్దిమందో దీనికి మినహాయింపు. ఆత్రేయ నాటకాలు చదవుకోకపోయినా ఆయన రాసిన నాటకాలేమిటో, ఏ కాలంలో ఆయన వాటిని రాశారో, ఆ కాలంలో అవి నిర్వర్తించిన పాత్రేమిటో ***మిసిమి*** జనవరి 2015 సంచికలో ప్రొ. రావినూతల సత్యనారాయణ రాసిన *ఆచార్య ఆత్రేయ* వ్యాసం వివరంగా తెలియజేసింది. ఆయనకు ధన్యవాదాలు. ఆత్రేయను ఆధునిక నాటక రంగానికి మూలపురుషునిగా ఆయన అభివర్ణించారు. అది నాకెంతో ఆశ్చర్యాన్ని కలిగించిన అంశం. ఆధునిక నాటక రంగానికి ఇంతటి సేవ చేసిన ఆత్రేయ కేవలం సినీ రచయితగానే, కవిగానే ఇప్పటి తరానికి తెలియడం బాధాకరం. ఆయన నాటకాలు, నాటికలపై విరివిగా వ్యాసాలు, పరిశోధనలు తరచూ వస్తుంటే ఆయనకు తగిన న్యాయం జరిగినట్లవుతుందనేది నా అభిప్రాయం. ఇలాంటి చక్కని వ్యాసాలు అందిస్తూ, సాహిత్య సాంస్కృతాభివృద్ధికి కృషి చేస్తున్న ***మిసిమి***కి నా అభినందనలు..." **– యజ్ఞబుద్ధ,** ఆన్‌లైన్.

✶ "... జనవరి, ఫిబ్రవరి సంచికలలో మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన ప్రవాసాంధ్రుల గురించి వ్రాసారు. రెండు వ్యాసాలు బాగున్నాయి. దీనికి సంబంధించి మరిన్ని విశేషాలు అందిస్తున్నాను...

... మహారాష్ట్రలోని కాంప్టీకి చెందిన పారిశ్రామికవేత్త దుహగం లక్ష్మీనారాయణ తన యావదాస్తిని దానం చేసి లక్ష్మీనారాయణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని స్థాపించారు. 1942లో స్థాపించిన ఈ కళాశాల దేశంలోనే ఒక ఉత్తమ సాంకేతిక విద్యాసంస్థ. వీరు దానం చేసిన భూమిలోనే నాగపూరు విశ్వవిద్యాలయం కూడా స్థాపించబడింది. కాంప్టీ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడుగా చలసాని కోదండరామయ్య చౌదరి చాలాకాలం పనిచేశారు... కాంప్టీలోనే పుట్టిన ఈడ్పుగంటి రాఘవేంద్రరావుగారు ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్‌కు మొదటి పురపాలక సంఘ వ్యక్తులుగా 1915లో ఎన్నికై పన్నెండేళ్లు ఆ పదవిలో కొనసాగారు. రావుగారు బిలాస్‌పూర్ డిస్ట్రిక్ట్ బోర్డులో అధ్యక్షులుగా మహాకోసల (మహాకౌశల్) కాంగ్రెస్ అధ్యక్షునిగా, నాగపూర్ రాజధానిగా ఉన్న సెంట్రల్ ప్రావిన్సెస్ (CP & Berar) కు 1926 – 1930 మధ్య ప్రధానమంత్రిగా రెండు సార్లు మంత్రివర్గం ఏర్పాటు చేశారు. 1936 లో ఆ రాష్ట్రానికి గవర్నర్ అయ్యారు. 1937 మళ్ళీ ఆ రాష్ట్రానికి (1935 యాక్ట్ క్రింద) ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత ఆయన లండన్‌లోని సెక్రటరీ ఆఫ్ స్టేట్ సలహాదారునిగా, 1942లో లార్డ్ లిన్ లిత్ గో వైస్రాయిగా ఉన్నప్పుడు ఆయన మంత్రివర్గంలో సివిల్ డిఫెన్స్ మంత్రిగా ఉన్నారు. ప్రవాసాంధ్రులలో ఇంత గౌరవం, ఘనత వహించిన వారు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు... అప్పుడు సెంట్రల్ ప్రావిన్సెస్‌లో ఉన్న ప్రాంతాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో భాగం అయ్యాయి... మాచిరాజు భవానీ శంకర నియోగి నాగపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు... కెప్టెన్ సి.కె. నాయుడు (కటారి కనకయ్య నాయుడు) మనదేశానికి మొదటి టెస్ట్ క్రికెట్ కెప్టెన్ ఈ ప్రాంతాలకు చెందిన వారే...సి.వై. చింతామణి, ఎమ్. చలపతి రావు, కోటరాజు రామారావు మరెందరో ప్రవాసాంధ్ర యోధులు. వీరందరినీ ***మిసిమి*** ద్వారా గుర్తు చేసుకుంటే, ముందు తరాల వారికి ప్రత్యేకంగా ఇప్పటి సంకుచిత రాజకీయ ధోరణులకు ఒక కనువిప్పు..." **– మోటూరు శివరాంప్రసాద్,** హైదరాబాదు.

✶ "... *త్యాగరాజస్వామి* వ్యాసం గొప్పగా ఉంది. సత్యనారాయణ వ్యాస పరంపర, "తప్పులతో ప్రచారంలోనున్న త్యాగరాజ కీర్తనలు" గమనించి కూడ సరిగ్గా త్యాగరాజ కీర్తనల ప్రచురణకు ఎవ్వరు పూనుకొనలేదు. ఆ వ్యాస పరంపర కూడా మధ్యలో ఆగిపోవడం చింత్యము. త్యాగరాజస్వామి మూడవ యక్షగానం *ప్రహ్లాద భక్తి విజయం* వ్యాస రచయిత గమనించినట్లు లేదు. *సీతారామ విజయం* మన దేశంలో దొరకదు. లండన్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. దాని ప్రతి సంపాదించి తిరిగి ప్రచురించడం మన కర్తవ్యం..." **– ఇప్పగుంట సాయిబాబా,** హైదరాబాదు.

నేరేటి లంక

- సాయి పాపినేని & జయశ్రీ నాయని

జంబూద్వీపే భరతవర్షే భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే ... పౌరాణిక సంప్రదాయంలో మన చిరునామా ఇలా మొదలౌతుంది. చారిత్రక వాస్తవాలని గ్రహించేందుకు వంశావళుల కాలనిర్ణయంతో బాటూ ఆనాటి భౌగోళిక పరిస్థితులను ఆకళింపు చేసుకోవడం కూడా అవసరం.

పురాణాల్లోని మౌలికమైన అంశాలు క్షత్రియ సంప్రదాయానికి చెందినవి. కనుక అవి క్షత్రియుల వాస్తవిక చరిత్రని సూచిస్తాయి. కానీ కాలక్రమేణా అవి బ్రాహ్మణ మతగ్రంధాలుగా రూపాంతరం చెందాయి. ఎన్నో అద్భుత గాథలు ప్రక్షిప్తాలుగా చొరబడ్డాయి. ప్రస్తుత మన్వంతరానికి చెందిన వంశానుక్రమణికల తేదీలు హరప్పా నాగరికత, ఆ తదనంతర సంస్కృతికి చెందినవిగా సహేతుకంగా నిరూపించబడింది. దానికన్నా ముందరి కాలానికి చెందిన వాస్తవాలను తెలుసుకోవాలంటే మనం ఆ అద్భుత గాధలను ఆశ్రయించక తప్పదు. ఇటువంటి ఐతిహ్యాలు పురాణాల్లోనే కాక వైదిక సంప్రదాయంలో కూడా ఉన్నాయి. కానీ వాటి ఆధారంతో చారిత్రక వాస్తవికతని నిరూపించడం హేతుబద్ధం కాదు. వంశానుక్రమణికలకు అనుబంధంగా, మన పురాణ సంప్రదాయంలోని భౌగోళిక సమాచారంలో కొంత చారిత్రక వాస్తవికత నిలిచి ఉంది. ప్రాచీన భౌగోళికాంశాలు, వాతావరణానికి సంబంధించిన వివరాల్లో పౌరాణికులకి, పురాణవేత్తలకీ ఆసక్తి కనపడదు. కొత్త ప్రదేశాలకు, స్థలాలకూ ప్రాచీన సంప్రదాయంలోని పేర్లు పెట్టడం జరిగినా ఆ మార్పులూ చేర్పులు సులభంగానే గుర్తించవచ్చు. భౌతిక పురాతత్వ సంస్కృతుల పరిధులు దాటకుండా, పురాణాల్లో ప్రస్తావించిన భౌగోళిక వివరాలు పరిశీలించడం ద్వారా కొంతవరకూ చారిత్రక నిజాలని వెలికి తీయవచ్చు.

జంబూద్వీపం : అంటే నేరేడు చెట్ల లంక! :

వంశావళుల్లో ఎందరో రాజులు, ఎన్నో వంశాలు. వాళ్లలో కొందరు మాత్రమే చక్రవర్తులుగా చెప్పబడ్డారు. చక్రవర్తి అనే పదానికి, 'జంబూద్వీపాన్ని అంతటినీ ఏకఛత్రం కింద పాలించిన రాజు' అనే అర్థం చెప్పవచ్చు. చారిత్రక యుగంలో అశోకుడు సమస్త జంబూద్వీపానికి చక్రవర్తిగా పిలువబడ్డాడు. కొన్ని ఈశాన్య రాష్ట్రాలు తప్ప అశోకుని రాజ్యం భారత ఉపఖండమంతా విస్తరించి కనిపిస్తుంది. కనుక జంబూద్వీపానికి భారత ఉపఖండమనే అర్థం చెప్పవచ్చు. కానీ పురాణాలు సూచించే కాలంలోని నాగరికత హరప్పా క్షేత్రానికే పరిమితమై కనిపిస్తుంది. ప్రాగ్హరప్పా యుగంలో, అంటే క్రీపూ. 3200కి ముందు కాలంలోని నాగరికత పరిధులను మరింత కుదించవలసి వస్తుంది. పురాణాల్లోని వివరాలనుబట్టి ఆనాటి భౌగోళిక జ్ఞానాన్ని అంచనావేద్దాం.

మన పురాణాల్లో భూమిని ఏడు ద్వీపాలుగా విభజించారు. అందులో జంబూద్వీపం, మనదైతే దాని చుట్టూ మరో ఆరు ద్వీపాలని సూచించారు. ముఖ్యంగా ద్వీపాల ఉనికిని గురించి శోధించిన పాశ్చాత్య మేధావులు, 'మనవి ఉత్త పుక్కిటి పురాణాలనీ, వాటిలో చారిత్రక సత్యం శూన్యమనీ,' అన్నారు. కొందరు పురాణాల్లో సూచించినది విశ్వాంతరాళాలకి చెందిన అలౌకిక ఖగోళ విశేషాలే కాని సహజ భౌగోళిక జ్ఞానం కాదన్నారు. వాస్తవానికి పురాణాల్లోని ద్వీపాల వర్ణనలను పరిశీలిస్తే అవి నిర్దిష్టంగా భూమిమీద కనిపించే ప్రకృతిని, వాతావరణాన్నీ సూచించేవే కానీ ఏవో నక్షత్ర మండలాల్ని గురించి కాదని గ్రహించవచ్చు. ఈ ఏడు ద్వీపాలూ భూతలంలో వివిధ ఖండాల చలనంవల్ల కాలగమనంలో వచ్చిన మార్పులని సూచిస్తాయనే ఆధునికులూ ఉన్నారు, వీరికి ఆధారం, 1912 లో ఆల్ఫ్రెడ్ వెజెనర్ అనే భౌగోళికశాస్త్రవేత్త ప్రతిపాదించిన ప్లేట్స్ టెక్టానిక్స్ సిద్ధాంతం. ఈ వాదం పూర్తిగా అసంబద్ధం. ఎందుకంటే జంతు పరిణామ దశల్లో మానవుడి ఆగమనానికి 5 కోట్ల సంవత్సరాల ముందే వివిధ భూఖండాలు ప్రస్తుత స్వరూపానికి వచ్చాయి. ఇక ఈనాటి వరల్డ్ మ్యాప్‌ని పక్కనపెట్టుకొని పురాణాల్లోని సప్తద్వీపాలు, మనకి తెలిసిన ఆసియా, ఐరోపా,

ఆఫ్రికా, ఉత్తర, దక్షిణఅమెరికాలు, ఆస్ట్రేలియా, అంటార్కటికా అనే సప్తఖండాలే అనేవాళ్లు లేకపోలేదు. చెప్పుకోడానికి బాగున్నా ఇది హాస్యాస్పదం. పై వాదాలని పక్కనపెట్టి, సప్తద్వీపాలు చరిత్రలో మన పూర్వికులకి తెలిసిన కొన్ని ప్రాంతాలని సూచిస్తాయనే, ఎక్కువమంది ఆమోదించిన సిద్ధాంతాన్ని పరిశీలిద్దాం. కానీ ఈ కోవకి చెందిన మేధావులు కూడా సప్తద్వీపాల వివరాలని ఒక్కొక్కరూ ఒక్కొక్కవిధంగా ప్రతిపాదించారు. ముఖ్యమైనవి కింద పట్టికలో చూడవచ్చు.

ద్వీపాలు	జంబూ	ప్లక్ష	కుశ	శాల్మ లి	క్రౌంచ	శక	పుష్కర
ప్రతిపాదనలు	ఉత్తర భారతదేశం	బర్మా	ఇండొనేసియా దీవులు	మలేసియా	దక్షిణ భారతదేశం	ఇండోచైనా	చైనా మంగోలియా
	భారతదేశం	ఆసియా మైనర్	ఇరాన్	మధ్య ఐరోపా	పశ్చిమ ఐరోపా	గ్రేట్ బ్రిటన్	ఐస్‌ల్యాండ్
	భారతదేశం	గ్రీకుదేశాలు	అరేబియా తీరదేశాలు	సర్మేటియా	ఆసియా మైనర్	స్కిథియా	తుర్కిస్తాన్

వీటిలో పురాణాల్లో సూచించిన భౌగోళిక, వాతావరణ విషయాలపై దృష్టికంటే 20వ శతాబ్ది మేధావుల బౌగోళిక జ్ఞానమే ఎక్కువ కనిపిస్తుంది. పురాణల్లోని షోడశ రాజచరిత్రలో కృత, త్రేతాయుగాల్లో జంబూద్వీపాన్ని పాలించిన 16మంది చక్రవర్తుల ప్రస్తావనలు ఉన్నాయి. మనం అనుసరించిన కాలక్రమం ప్రకారం వీరందరు క్రీపూ. 3200 నుంచి 2000 మధ్యకాలానికి చెందుతారు. అంటే వాళ్ళు పాలించిన జంబూద్వీపం హరప్పా నాగరికత క్షేత్రంగా భావించవచ్చు. సప్తద్వీపాల నైసర్గిక, వాతావరణ వివరాలను బట్టి వాటిని హరప్పా నాగరికత పరిసర ప్రాంతాలుగా గుర్తించడం సమంజసం. పురాణాలు, ఈ ద్వీపాల ఆనవాళ్లు చెప్పేటప్పుడు వాటి పరిసరాల్లో 'మేరుపర్వతం', 'క్షీరసాగరం' వంటి భౌగోళిక ప్రదేశాలను తెలుపుతాయి. కనుక ముందుగా ఆయా ద్వీపాల గుర్తింపుకు కీలకమైన మేరుపర్వతం, క్షీరసాగరాల ఉనికిపై అవగాహన అవసరం.

మేరుపర్వతం :

1966లో 'జాగ్రఫీ ఆఫ్ పురాణాస్' రచించిన ప్రొ. ఎస్ ఎమ్ అలీ వంటి ఆధునిక శాస్త్రజ్ఞులు మేరువు ఉప ఖండానికి ఉత్తరాన పామీర్‌ముడి ప్రాంతంగా అభిప్రాయపడ్డారు. పురాణాల్లోని మేరువు, మొట్టమొదటి మానవ సమాజాల ఉనికి, జంబూద్వీపమనే నాగరికతా క్షేత్రానికి నాభి వంటిది. అలాంటి మేరువు ఎక్కడో మారుమూల జనసంచారం లేని పామీర్ పర్వతాలపై ఉందంటే నమ్మలేము. పామీర్ ప్రాంతంలో సగటు ఉష్ణోగ్రతలు 7.0 to 8.3^0 C. అంటే వ్యవసాయిక సమాజాలే కాదు సంచార పశుపాలక సమూహాలు సైతం స్థిరనివాసం ఏర్పరుచుకోవడం కష్టం.

ఉత్తరదిశాధిపతి కుబేరుడి నగరం పేరు 'అలకా'పురి. ఇది మేరువు పాదపీఠంపై ఉన్నదని సంప్రదాయం. గంగ ఉపనదుల్లో ప్రధానమైన అలకనంద హిమాలయాల్లో మానససరోవరం వద్ద పుట్టి ఉత్తరాంచల్ రాష్ట్రంలో గంగానది చేరుతుంది. కనుక మానసరోవర ప్రాంతాన్ని, మేరువుగా గుర్తించిన వాళ్లూ ఉన్నారు. కానీ పురాణాల్లోని అలకాపురి ఒక అభివృద్ధి చెందిన పట్టణం, సంపదకి నిలయం, వాణిజ్యానికి పేరుగన్నది. కనుక ఎక్కడో హిమాలయాల్లో ఉండటానికి అవకాశం లేదు. మొట్టమొదటి వ్యావసాయిక సమాజాలు అంటే నవీనశిలాయుగపు సమాజాలు సముద్రమట్టం నుండి 1000 మీటర్ల కంటే తక్కువ ఎత్తున కనిపిస్తాయి. కాబట్టి మేరువు ఉనికిని నవీన శిలాయుగపు స్థావరాలకు దగ్గరగా, వాణిజ్యాభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో వెదకక తప్పదు.

అలకాపురి రాజు కుబేరుడు యక్షుడు. గంధర్వులకు అధిపతి. అత్యంత సంపన్నుడు. అతడు పుట్టుకతో అలకాపురికి చెందలేదు. పురుకుత్సుని కాలంలో సముద్రంలోని లంకను వదిలి, కొండల్లో కాపురం పెట్టాడు. ఆ అలకాపురికే మరికొన్ని పేర్లున్నాయి. అవి వసుస్థలి, వసుధర, ప్రభాస (ప్రభాసుడు అష్టవసువుల్లో ఎనిమిదవ వాడు).

మేరువు ప్రాంతపు మూలవాసులు వసువులు. వసు అనే పదం 'వస' అంటే 'గోవు లేదా సంపద' నుంచి వచ్చింది. వసువు పదానికి సంపన్నుడు అనే అర్థం. తరువాతి కాలంలో వసుంధర భూమికి పర్యాయపదంగా కనిపిస్తుంది. వాస్తు అనే పదానికి అర్థం కూడా నివాసయోగ్యమైన స్థలం. వాస్తుశాస్త్రం ముందుగా పట్టణాల నిర్మాణానికి సంబంధించిన శాస్త్రం. ఈ అంశాలను బట్టి ఈ వసుస్థలి పశుపాలక వ్యవస్థనుండి మొట్టమొదటి పట్టణీకరణదిశగా ఎదిగిన ప్రదేశంగా భావించవచ్చు. సింధులోయకి వాయవ్యంగా విస్తరించిన హిందుకుష్-కిర్తార్ పర్వత శ్రేణుల్లోని ముఖ్యమైన కనుమ మార్గాలు ఖైబర్, బోలాన్ కనుమలు. ఈ రెండు కనుమల్లో పుట్టిన సింధు ఉపనదులు, స్వాత్, శోబ్ నదులు. స్వాత్ నదికి వేద వాఙ్మయంలోని పేరు సువాస్తు. అలాగే శోభ్ నదిని యువాన్ చువాంగ్ 'సు-పొ-ఫొ-సు-తు' (శుభవాస్తు)గా పిలిచాడు. కనుక ఈ రెండు కనుమలకు దారితీసే మార్గాల్లో అలకాపురిని అన్వేషించాలి. ముందుగా చారిత్రక ఆధారాలు చూద్దాం.

క్రీపూ. 2400 ప్రాంతంలో సుమేరియాకి చెందిన 'లుగల్‌బండా' అనే రాజు తూర్పుదిశగా ఎన్నో పర్వతాలు లోయలూ దాటి అరట్ట అనే దేశానికి వెళ్ళిన కథ అక్కడియన్ మృణ్ఫలకాల్లో ఉంది. అరట్ట, సింధు ప్రాంతానికి చెందిందని ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఆ కథలో 'ఉమ్మేరు' అనే కనుమ వద్ద అతడు పరివారం నుండి దూరమైయ్యాడు. ఆ ఉమ్మేరు ఒక సరిహద్దు చెక్‌పోస్ట్. సింధులోయకీ ఇరాన్ పీఠభూమికి మధ్య ఖైబర్, బోలాన్ కనుమల గురించి ముందే ప్రస్తావించాం.

గ్రీక్ గ్రంథం *ఇండిక*లో అలెక్జాండర్ దండయాత్రలో పుష్కలావతి (పెషావర్) నగరానికి వెళ్ళే మార్గంలో 'మేరుస్' అనబడే పర్వతం వివరణ ఇలా ఉంది. "And the mountain near the city, on whose foothills Nysa is built, is called Merus because of the incident at Dioanysus' birth..." ప్రాచీన గ్రీకు దేవుడు డైయొనిసస్‌ని శివుడితో పోలుస్తారు. ఋగ్వేదంలోని రౌద్రబ్రాహ్మణం సృష్టి కార్యానికి రుద్ర/అగ్ని దేవుడినే బాధ్యునిగా చూపెడుతుంది. గ్రీకు వాఙ్మయంలో డైయొనిసస్ వ్యావసాయిక సమాజాలకు మూలపురుషుడు. చంద్రగుప్తునికి 6042 సంవత్సరాల ముందు డైయొనిసస్ మేరు ప్రాంతానికి వచ్చినట్లు స్థానికుల సమాచారమని ఇండికలో చెప్పబడింది. అంటే క్రీపూ. 6363 నాటికే మేరు పర్వత ప్రాంతంలో నవీనశిలాయుగం ఆరంభమై ఉండాలి.

పురాతత్వ శాస్త్రజ్ఞులు, కిర్తార్ పర్వత శ్రేణిలో బోలాన్ కనుమ దిగువన సముద్రమట్టానికి 800 మీటర్ల ఎత్తున 'శోభ్' లోయలో 'మెహర్‌గఢ్' పట్టణానికి సమీపంలో నవీనశిలాయుగ నాగరిక స్థావరాన్ని కనుగొన్నారు. ఇది భారత ఉపఖండంలోనే కాదు ప్రపంచంలోనే మొట్టమొదటిది. అక్కడ క్రీపూ. 9000కు ముందే సంచార జనజాతుల ఆనవాళ్ళున్నాయి. క్రీపూ. 6500 ప్రాంతానికి అదొక స్థిరమైన గ్రామీణ ఆవాసంగా 200 హెక్టార్లలో అభివృద్ధి చెందింది. ప్రపంచ నాగరికతకి బీజమని చెప్పబడే 'ఫర్టైల్ క్రెసెంట్' భూభాగానికి చెందిన, అన్తోలియాలో 'చతల్‌హుయుక్', పాలస్తీనాలో 'జెరికో' వంటి ప్రాచీన ఆవాసాల కంటే కాస్త ముందే భారత ఉపఖండంలో నాటుకున్న విత్తనం, మెహర్‌గఢ్. ఇటుకలతో వరుసల్లో నిర్మించిన గిడ్డంగులు, మాతృదేవతారాధన, ఇంద్రనీలం, చంద్రకాంతం, కురువిందం, వైఢూర్యం వంటి మణులతో చేసిన ఆభరణాలు, సూక్ష్మశిలా పరికరాలు, బార్లీ, గోధుమ పంటలే కాక పత్తి విత్తనాలు, ఆవు, గొర్రె, మేక మొదలైన పశువుల పెంపకం, మెహర్‌గఢ్ సంస్కృతిని ఆనాటి ప్రపంచంతో పోలిస్తే ఒక అద్భుతంగా భావించవలసిందే. సింధులోయవంటి సమీప ప్రదేశాల్లో అప్పటికింకా వేటాడటం, ప్రకృతిసిద్ధంగా దొరికే ఆహారాన్ని పోగుచేయడం ద్వారా జీవనం సాగించే ప్రాచీన శిలాయుగపు జనజాతులకి ఆ 'మెరక' ప్రాంతంలో పశువులని పెంచుతూ పంటలు పండిస్తూ, స్థిరమైన కట్టడాలలో నివసించేవాళ్ళు, మానవాతీతులుగా, వారి జీవన విధానం ఒక అద్భుతంగా కనిపించడంలో ఆశ్చర్యమేమీలేదు. ద్రవిడ భాషల్లో 'మేల్' అనే పదప్రయోగానికి అర్థాలు పశ్చిమం, ఎగువ ప్రదేశం అని మనకు తెలుసు. మెరక అనే తెలుగు పదానికీ 'మేరుక' అనే పదానికీ ఉన్న సామ్యం గుర్తించదగినదే. అక్కడియన్ భాషలో కూడా మేరు పదానికి ఎత్తైన ప్రదేశం అనే అర్థం ఉంది. సుమేరియా ఫలకాల్లోని మేలుహ్హ, మేలుఖ్ఖ అనే పదాలు మేరుక రూపాంతరాలే. ఈనాటికీ జంబూద్వీపానికి చిరునామా 'మేరోర్దక్షిణదిగ్భాగే' అనే చెప్పుకుంటాం.

కనుక ఈ మెహర్‌గఢ్ ప్రాంతమే మేరుపర్వత స్థానమని నిర్ధారణకి వచ్చే ముందు, పురాణాల్లో మేరువు వర్ణనలని మరోమారు పరిశీలిద్దాం. మేరుపర్వతం గుండ్రంగా ఉంటుందనీ, షట్భుజమనీ, అష్టభుజమని, త్రికోణమనీ అనేక వర్ణనలు ఉన్నాయి. వేర్వేరు దిక్కుల నుండి, ప్రదేశాల నుండీ చూసినప్పుడు భిన్నంగా కనిపించడం ఒక కారణమై ఉండవచ్చు. గర్గ సంహితలో మేరువు ఒక జడలా వంకరలు పోతూ పొడవుగా ఉన్నట్లు వర్ణించబడింది. దీన్నిబట్టి మేరువు ఒక పర్వతంగా కాక పర్వతశ్రేణిగా కూడా భావించవచ్చు. ఏదియేమైనా, ప్రపంచంలో అతి ప్రాచీన పట్టణీకరణ కేంద్రమైన కిర్థార్, హిందుకుష్ పర్వతశ్రేణిలోనే మేరువు ఉనికిని గుర్తించడం సమంజసం.

క్షీరసాగరం :

సప్తద్వీపాల ఉనికిని గుర్తించేందుకు పురాణాల్లోని మరొక ముఖ్యమైన భౌగోళికాంశం, పాలసముద్రం. సాగరమథనం వృత్తాంతంలో చారిత్రకత ఉందోలేదో చెప్పలేము. కానీ ఆ కథ ఇతివృత్తం, పురాణాల్లో వర్ణనలూ, క్రీపూ. 2000 ముందుకాలంలోని భౌగోళిక పరిస్థితులు, గుజరాత్‌లోని కచ్ కడలిమలుపే (Gulf of Kutch) క్షీరసాగరం కావచ్చని సూచిస్తాయి. పురాతత్వ గవేషణల ఫలితాల్లో కూడా, ఈ అభిప్రాయాన్ని సమర్థించే కొన్ని అంశాలున్నాయి.

1) వాయుపురాణం, మేరువుయొక్క ఒక శిఖరం పాలసముద్రంలో విసిరివేయబడిందని, అదే మంధర పర్వతమనీ చెప్తుంది. ఈనాటికీ కచ్ కడలిమలుపులోని కదీర్ బెట్ (కదీర్ ద్వీపం)లో హరప్పా నాగరికతకి చెందిన ప్రముఖ పట్టణం 'ధోలవీరా' తావులోని, ఒక ముఖ్యమైన యేరు పేరు 'మందర్'.
2) సాగరమథనం కథలో విష్ణువు అదే పర్వతాన్ని కచ్ఛప రూపంలో (తాబేలు) వీపుపై మోసాడు. కచ్ఛపద్వీపమే కచ్.
3) విష్ణువు నివాసమైన వైకుంఠం పాల కడలిలో ఉంది. భాగవత సంప్రదాయపు తొలి చారిత్రక ఆనవాళ్లు గుజరాత్ ప్రాంతంలోనే లభించాయి. విష్ణువు ఆఖరి అవతారమైన శ్రీకృష్ణుని నగరం ద్వారక అక్కడకి సమీపంలోనే ఉంది.
4) బరోడాలోని సాయాజీరావ్ యూనివర్సిటీ పురాతత్వ శాఖవారి గవేషణల్లో కచ్ తీరంలో 'కీర్‌సార' అనే స్థావరం వెలుగు చూసింది. అది హరప్పా యుగానికి చెందిన రేవు. 'కీర్‌సార' సంస్కృత పదం 'క్షీరసాగరాని'కి రూపాంతరం. ఇది కూడా క్షీరసాగరపు ఉనికిని సూచిస్తుంది.

కచ్ కడలిమలుపు పురాతన కాలంలో పాలసముద్రంగా పిలువబడటానికి కారణాలు ఆనాటి భౌగోళిక స్వరూపంలో వెదకాలి. వేదవాఙ్మయంలో, పురాణాల్లో సరస్వతి అనబడ్డ ఒక పెద్ద నది ప్రస్తావన ప్రముఖంగా కనిపిస్తుంది. హిమాలయాల్లో పుట్టి సాగరంలో కలిసే ఈ నదిని రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహ చిత్రాలు, థార్, చోలిస్తాన్ ఎడారుల్లో భూగర్భజలాలపై జరిపిన పరిశోధనలు, ఆ ప్రాచీన నదీ పరివాహక్షేత్రంలో అసంఖ్యాకంగా వెలుగుచూసిన హరప్పా నాగరికత స్థావరాలు, ఎగువ యమునా ప్రాంతం నుండి కచ్ కడలిమలుపు వరకూ క్రీపూ.

2000కు ముందు ప్రవహించిన మహానది ఆనవాళ్లను నిరూపిస్తాయి. సింధునది ఉపనదుల్లో అతి పెద్దదైన సత్లూజ్, గంగ ఉపనదియైన యమున ఎగువనీరు కలుపుకొని సింధునదికి సమాంతరంగా ప్రవహించి కచ్ కడలిమలుపులో కలిసింది. ఆ నదినే 'దేవీతమా నదీతమా సరస్వతీ' అని వేదాలు వర్ణించాయి. సింధు, సరస్వతీ అనబడే ఈ రెండు మహానదుల నుండి వచ్చిచేరే మంచినీటి వల్ల కచ్ కడలిమలుపులోని నీటిలో ఉప్పు శాతం తగ్గి అదొక ప్రత్యేకమైన పర్యావరణ క్షేత్రంగా ఆవిర్భవించింది. దానినే మన పూర్వికులు పాలసముద్రంగా పిలవడంలో ఆశ్చర్యమేమీలేదు.

హరప్పా నాగరికతా క్షేత్రపు సముద్ర వాణిజ్యానికి అదే ముఖద్వారం. సముద్ర వాణిజ్యంపై ఆధిపత్యం కొరకు దేవతలు, అసురుల మధ్య స్పర్థ, సాగరమథనం కథకి మూలమనే వాదం కూడా ఉంది. అనేక రేవుపట్టణాలతో అద్భుతమైన విలాస వస్తువులకు నెలవైన కచ్ ప్రాంతమే, క్షీరసాగరం అయేందుకు అవకాశం ఉంది. ఈ ఆధారాలనుబట్టి కచ్ కడలిమలుపే క్షీరసాగరం అనుకుంటే, పురాణాల్లోని సప్తద్వీపాల వివరాలు కొత్త కోణం నుండి చూడవచ్చు.

సప్తద్వీపాలు :

సప్తద్వీపాల వర్ణనల్లోని ప్రత్యేక వాతావరణం, స్థానిక వృక్షజాతులు, నదులు, మొదలైన భౌగోళిక అంశాల్లో, ప్రక్షిప్తాలు చొరబడే అవకాశం తక్కువ. పైన ప్రస్తావించినట్లు, హరప్పా నాగరికతా క్షేత్రం సమీపంలో ఆ ద్వీపాల ఉనికిని గుర్తించే ప్రయత్నం చేద్దాం. (పట్టిక)

ముగింపు :

జంబూద్వీపం హరప్పా క్షేత్రం అనుకుంటే, దానికి ప్రకృతి, ఖనిజ వనరులను అందిస్తూ, నాగరికత క్షేత్రం చుట్టూ విస్తరించిన ప్రదేశాలని మిగిలిన ఆరు ద్వీపాలు సూచిస్తాయి. హరప్పా నేపథ్యంలో దొరికిన వస్తువుల ముడిపదార్థాలకీ ఈ ప్రాంతాలకీ సంబంధముంది. హరప్పా వణిజులు ఆ ప్రాంతాల్లో నివసించే నవీనశిలాయుగ సమాజాలతో లావాదేవీలు జరిపిన ఆధారాలున్నాయి. కనుక ఇతిహాసపురాణ సంప్రదాయంలోని జంబూద్వీపాన్ని హరప్పా నాగరికతా క్షేత్రంగా నిర్ధారించవచ్చు. ఆ జంబూద్వీపంలోని భౌగోళిక వివరాలు, నదీనదాలు, జనజాతుల ప్రస్తావనలు వచ్చే సంచికలో చూద్దాం. మి



శకద్వీపం	టేకు చెట్లు, మేరువుకు తూర్పు, భారీ ఋతుపవనాలపై ఆధారపడ్డ ఏడు పెద్దనదులు, వందలకొలదీ చిన్న యేర్లు, పాలసముద్రానికి అవతలి ప్రాంతం.	కొంకణ తీరప్రాంతం
కుశద్వీపం	పచ్చికమైదానం, కుశగ్రాసం (దర్భలు) విరివిగా దొరికే ప్రదేశం, ఇంద్రుడి దయవల్ల వర్షాధారాలై అడపాతడపా పారే ఏడు నదులు, పాలసముద్రాన్ని చుట్టి ఉండే ప్రాంతం.	కచ్, గుజరాత్, మాల్వా ప్రాంతాలు
పుష్కరద్వీపం	వర్షాభావం, ఎడారి, దాని మధ్యప్రాంతం 'ధాతకి' అనీ, చుట్టూతా 'మహావీతం' అనీ పిలువబడింది, పుష్కర సరోవరం ఉన్న ప్రాంతం, పాలసముద్రానికి దగ్గరలో, కొండలచే చుట్టబడిన ప్రాంతం, .	థార్ ఎడారి, చుట్టుపక్కల ప్రాంతం, ఆరావళి శ్రేణి.
శాల్మలద్వీపం	మబ్బులచే కప్పబడిన కొండలు, చలీ, వేసవి లేక ఏడాది పొడవునా ఒకే రకమైన ఉష్ణోగ్రతలు, పోగుచేసేందుకు వలసినంత ఆహారం, శాల్మలం అంటే బూరుగదూది చెట్టు. కానీ శాల్మలాన్ని శాల-మల అనే పదబంధంగా విభజిస్తే, శాల వృక్షాలు అధికంగా ఉండే కొండలు అనే అర్థం తోస్తుంది.	సహ్యాద్రి, మలబార్ తీరం
క్రౌంచద్వీపం	జంబూద్వీపానికి వాయవ్య ప్రాంతం, అధిక జనాభా, వాతావరణంలో జంబూద్వీపంతో సామ్యత, పెద్ద నదులు. ఘ్రితోదం అంటే నేతి సముద్రం ఉన్న ప్రాంతం పశుసంపదను సూచిస్తుంది.	ఆఫ్ఘనిస్తాన్, బలూచిస్తాన్ మైదానప్రాంతాలు.
ప్లాక్షద్వీపం	ప్లక్షవృక్షం అంటే అత్తి చెట్టు. వాతావరణ వివరాలు కనిపించవు. నిర్ధారంగా చెప్పలేము కానీ ప్లాక్ష పదాన్ని ప్రాచ్య లేదా 'ఇండిక' లోని 'ప్రాసై'గా భావిస్తే అది మధ్యగంగా మైదానానికి, వింధ్య పాదపీఠానికి సరిపోవచ్చు.	పశ్చిమ వింధ్యా, చంబల్ ప్రాంతాలు.

సాయి పాపినేని; బెంగుళూరు; ఫోన్ : 09845034442

సాహిత్య విమర్శ పరమార్థం

– చందు సుబ్బారావు

కవులకూ, రచయితలకూ ప్రశంస ఇచ్చినంత ఆనందం విమర్శ ఇవ్వదు. సాహిత్యతత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేనివారికి విమర్శ ప్రాధాన్యత ఏమిటో కూడా బోధపడదు. 'గిట్టనివారి శత్రుకార్యం'గా భావిస్తుంటారు. లేదా పొగడ్త మాత్రమే దాని కర్తవ్యం అని అపోహ పడుతుంటారు. ఈ బాల్యావస్థ స్థితి దాటి పరిణత మనస్కులైనకొద్దీ విమర్శ అంతరం గోచరిస్తుంది. ఆంగ్ల నిఘంటువు ప్రకారం...

Critique - (విమర్శ) analysis or evaluation అని వుంటుంది. విశ్లేషణ లేక అంచనా. Critic - (విమర్శకుడు) one who gives judgement of plays, books music or art. కళపైన, గ్రంథాలపైన, నాటకాలపైన, సంగీతంపైన తీర్పుల నిచ్చువాడు. తెలుగులో *శబ్దరత్నాకరం ప్రకారం*..... విమర్శనము – అంటే – పరామర్శ... అనీ, పరామర్శము – అంటే చక్కగా విచారించుట అనీ... విచారించుట – అంటే – ఆలోచించుట.. అనీ అర్థాలు.

వెరసి ఒక కళారూపంపైన తీవ్రంగా పరిశీలించి దాని స్థాయినీ, విలువనీ, అది చేయగల మంచి/చెడుల్నీ, తత్కళాకారుని ప్రతిభ లేక హీనతనూ వుటంకిస్తూ తీర్పు చెప్పటం అని పై నిర్వచనాలు చెబుతున్నాయి. ఇది ప్రాథమిక అవగాహనకు మాత్రమే పనిచేస్తుంది. ఒక కావ్యం, ఒక నవల, ఒక నాటకం ఏయే సూత్రాలవలన ప్రజలను రంజింప చేస్తుంది, ఏయే అంశాలవల్ల జనహితానికి పనికొస్తుంది, ఏయే సామాజిక విషయాలను ఎలా ప్రభావితం చేస్తుంది – చివరిగా కూడికలు, తీసివేతలు పోగా దాని విలువ – అటు కళాత్మకతలోనూ – యిటు ప్రయోజనాత్మకతలోనూ ఎంతెంత అని చెప్పటమే విమర్శకుడిచ్చే తీర్పు.

ఇది సమీక్ష అనే పరిచయం వంటిది కాదు. అభిప్రాయం అనే సాధారణ వ్యవహారం కాదు. పొగడ్త – తెగడ్తలనే వైయక్తిక, ద్వంద్వాల క్షుద్ర విద్య కాదు. విమర్శ కళకు మాతృక... గురువు.. ఆయుష్షునిచ్చి అపార కీర్తి సౌఖ్యాల వరమివ్వగల దైవం – శ్రేయోభిలాషి. స్థూలంగా అందరూ అంగీకరించిన దాని తత్వం 'గుణదోష విచారణ'. అలా అనగానే కోర్టులో విచారణ అనో, నేరారోపణ అనో అర్థం కాదు. మంచి రచన కోసం, మంచి 'రసం' కోసం, ఆ విభాగంలో మరింత మంచి రచన ఆవిర్భావం కోసం మాత్రమే. 'నిజమైన కావ్యానందం కలిగినప్పుడే విమర్శ అంటే ఏమిటో తెలియవస్తుంది' అన్నది ప్రఖ్యాత విమర్శకుడు C.S. Lewis. దానిని విశ్లేషిస్తూ లెవిస్, "వైద్యుడు పరిమితాహారాన్ని, చేదు మందును, సూది మందును, కొండొకచో కత్తులను వినియోగించి శరీరాన్ని కోసి భాగాలు బయటకు తీస్తాడు. అయినా మనిషికి ప్రాణదాత వైద్యుడైనట్లే, విమర్శకుడు కావ్యకర్తకు హితైషి అవుతాడు." విమర్శకుడు కొన్ని సందర్భాల్లో గురువులాంటివాడు. 'తనదు మేలు కోరి తత్వంబు బోధించు గురుడు తిట్టవచ్చు. కొట్టవచ్చు. తల్లి బుగ్గ గిల్లి త్రాగింపదా ఉగ్గు' అన్న వేమన్న సూక్తి విమర్శకునికి పూర్తిగా వర్తిస్తుంది.

విమర్శకుడికింత శక్తి, స్థాయి ఎలా వస్తాయి. ఈ తీర్పుల జడ్జీ పదవి ఎవడిచ్చాడు. అతడు తప్పుడు తీర్పులనిస్తేనో...! అస్సలతగాడి సాహిత్య శక్తికన్నా కవి, నాటకకర్తా, కథకుడూ గొప్పవారైతే, వాళ్ళను యీ 'బాలకుడు' తప్పు పట్టటమేమిటి. విచారం జరపటమేమిటి, అన్న సందేహం తొలినుండీ వున్నదే. భారతీయ సంప్రదాయంలోని భాష్యకారులు, వ్యాఖ్యాతలు, టీకాతాత్పర్య విశేషాది విశ్లేషకులు కవిత్రయా వ్యాస. వాల్మీక, శ్రీనాథ, కాళిదాసాదులకన్నా గొప్పవారు కాలేదు. ఈ సందర్భాన్ని విశ్వనాథ సత్యనారాయణ ఒకచోట బాగా వివరించారు.

'అంతయొు, ఇంతయో తెలిసినట్టి కావ్యసిద్ధాంతుల వొత్తిడింబడి
మహాకవి నాగటిచాలు దీర్చు.. కాలాంతరకీర్తివృష్టి గతమై 'జనున్'

లాభమునొందుచున్.." అన్నారంటే విమర్శకులైన సిద్ధాంతులు కవులకన్నా "తక్కువవారే". అయినా వాళ్ళ 'వత్తిడి'తో కావ్యం మెరుగుపడుతుంది. కీర్తి వస్తుంది. లాభం కవిదే కదా. అనేకదా ఆయన విశ్లేషణ! ప్రఖ్యాత ఆంగ్లకవీ, విమర్శకుడూ (కవీ, విమర్శకుడూ ఒకరే కావటం చాలా తరచుగా జరుగుతుంటుంది. *'ఈ అర్ధనారీశ్వరులు చెప్పే మాటలు శివంకరం.. శుభంకరంగా భావించక తప్పదు. కవీ.. విమర్శకుడూ అనే వైవిధ్యంలోని వైరుధ్యం ఇక్కడ అంతరిస్తుంది)* అయిన టి.యస్. ఎలియట్ తన 'Sacred Wood' అనే గ్రంథంలో విమర్శ పరమార్థాన్ని నాలుగు

విభాగాలుగా చేసాడు.

(ఎ) కాల, ప్రాంత, తత్వ, చారిత్రక దిశలతో ఏర్పడ్డ చతురస్రంలో కావ్యాన్ని దూర్చి, విశ్లేషించి వైశాల్యం కనుక్కోవటం. ఇది ఉత్తమ శ్రేణి విమర్శ అన్నాడాయన. అయితే ఇంకొ విభిన్న పద్ధతులున్న మాట నిజమే.

(బి) దృక్పథాల నుండి, సామాజిక సిద్ధాంతాల నుండి, వాటి ప్రాభవం చూపించే వత్తిళ్ళ నుండి రచయితల కృషిని అంచనా కట్టటం. ఇది ద్వితీయ శ్రేణికి చెందిన విమర్శ.

(సి) నాకు నచ్చింది... నేను మెచ్చాను. అన్యులతో నాకేల... సామాజిక, శాస్త్రీయ పద్ధతులలో నాకు ప్రమేయం లేదు. అని రాయవచ్చును. తాను మెచ్చింది రంభ అనవచ్చును. ఆమె కాకపోనూ వచ్చును. ఇది మూడవశ్రేణి.

(డి) నాల్గవది అనుభూతి విమర్శ – కవి రాసిన ప్రతి వాక్యాన్నీ విశ్లేషించటం. ప్రతి Metaphor కూ చలించిపోవటం. నిజంగా రచన బాగా వుండవచ్చును. అలాగని విమర్శకుడు వంధిమాగధుడి స్థాయికి దిగజారకూడదు. దీనిని 'ఇంప్రెషనిస్టు' పద్ధతి అన్నాడాయన. Impressionist critics react in excess of the stimulus. Thus preventing the criticism form its natural course.

ఎలియట్ నాలుగో పద్ధతిలో తెలుగులోసైతం ఎక్కువ గ్రంథాలే వెలువడ్డాయి. *విశ్వనాథ 'ఒకడు నాచనసోమన' అన్నా, హృదయోల్లాసవ్యాఖ్య అని తాపీ ధర్మారావు అన్నా 'కృష్ణశాస్త్రి కవితాత్మ' అని సోమసుందర్ అన్నా అన్నీ అనుభూతి విమర్శ పద్ధతిలో వెలువడినవే. ఒకానొక విమర్శ గ్రంథం పేరు "శేషేంద్రజాలం... ఇరవయ్యో శతాబ్దపు ఉషస్తార" అని...* గ్రంథంలో చదివేదేమిటో ముందే చెప్పేసినట్లుందికదా. అసలుసిసలైన రచయితల్లో (ఔత్సాహికులు – amateurs కానివాళ్లు) వైమర్శిక తత్వం అంతర్లీనంగా వుంటుంది – మనం బాగా మెచ్చుకున్న ఒక గేయానికి శ్రీశ్రీ తన వ్రాతప్రతిలో – మార్జిన్లో "ఉత్త సాధారణ గేయం... నానా తిప్పలూపడి రాసినట్లుంది'' అని రాసుకున్నాడు...! కవులు మహాకవులూ, గొప్ప రచయితలూ అయిన కొద్దీ విమర్శ విస్తృతి, తీవ్రత, స్థాయీ పెరుగుతాయి. అనరాని మాటలంటారు. కొండొకచో కవి – రచయితలు ఆరోగ్యాలు కోల్పోయిన సందర్భాలుంటాయి. గురజాడ, కందుకూరి, విశ్వనాథ, శ్రీశ్రీ, చలం లకు ఈ పరిస్థితులెదురయ్యాయి. పళ్ళచెట్టుకు రాళ్లదెబ్బలు హెచ్చువుతాయి. ఇది అనివార్యం. నిజానికి విమర్శ ధాటికి చెడిపోయిన, పడిపోయిన కవీ, కళాకారుడూ బహు తక్కువ. శక్తిమంతులకు విమర్శ శక్తి పెంచుతోంది. Mediocre అర్భకులైన శక్తిమంతులు మాత్రమే అప్పుడప్పుడూ కుప్ప కూలుతుంటారు.

"వీటిని వ్యక్తిగత విమర్శలంటారుకదండీ' అంటే, దానికి సమాధానంగా ఆధునిక విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.) "సన్మానాలూ, సత్కారాలూ, గజారోహణలూ, స్వర్ణకంకణధారణలూ వ్యక్తులకు జరుగుతుండగా, విమర్శ వ్యక్తిగతంగా వుండక ఏమవుతోంది?" అన్నాడు. "కవుల మధ్య కీచులాటలు – విమర్శలూ... ప్రతివిమర్శలూ స్థూలదృష్టికి తగాదాలు. సూక్ష్మదృష్టికి సాహిత్య చైతన్య సూచికలు" అన్నది ప్రఖ్యాత కథకుడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. ప్రఖ్యాత పాత్రికేయుడు నార్ల, విశ్వనాథను తీవ్రంగా విమర్శించటం ఎరుగుదుం. అది వ్యక్తిగత విమర్శ కాదు. విశ్వనాథ కావ్య శక్తిపై విమర్శే.

"కవికి బుర్ర లోపించినపుడు, క్రొత్త కోసం, శక్తి కోసం, సంచలనం కోసం నానా వెర్రివేషాలువేసి... విమర్శకులను ఎలాగైనా తనవేపు త్రిప్పుకోవాలని చూస్తాడు... నోరు మూయించాలని యత్నిస్తాడు" అన్నది అలెగ్జాండర్ పోప్. ఆయనే ఇంకా విశ్లేషిస్తూ "నిజమే. అసమగ్రజ్ఞానం, పాక్షిక దృష్టి. పార్టీ దృష్టి. చిత్త చంచల్యం.. కొందరిపై ప్రేమ... కొందరిపై అసూయ తప్పుడు విమర్శలకు దారితీస్తుంది... అలా అని తెలిసిపోతుంది. విమర్శ అల్పాయిష్షుతో చచ్చిపోతుంది. కవులకొచ్చిన నష్టమేమీ వుండదు" అన్నాడు. అలనాడు అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరుడు భావకవులైన కృష్ణశాస్త్రి, నండూరి, బసవరాజు, విశ్వనాథ, వేదుల యిత్యాదులపై *నేటి కాలపు కవిత్వం* అనే గ్రంథంలో విరుచుకుపడి చిత్రవధ చేసాడు. పాండిత్య ప్రకర్షే కాని అక్కిరాజుకు స్వార్థ గుణాలేమీ లేవు. భావకవులు ఉపేక్షించి ఊరుకున్నారు. విమర్శ గ్రంథం కాలగర్భంలో గతించి పోయింది. భావకవిత్వం బ్రతికి బట్టకట్టింది. ఇదే సమయంలో మరో పార్శ్వం కూడా వుంది. కవులూ, రచయితలూ సామాన్యులు కారు. అంత తేలిగ్గా తమపై 'నెగెటివ్' విమర్శను చూసి మౌనంగా ఉండిపోరు. మరో మార్గంలో విరుచుకుపడతారు. పోప్ ఆ వర్గాన్ని గురించి రాస్తూ "Fear most to tax the honorable fool, whose

right it is to be dull and uncensured" అన్నాడు. గౌరవనీయ దద్దమ్మ గార్లపై విమర్శకు పూనుకోవద్దు. దుష్ఫలితాలు నీపై ప్రసరిస్తాయి అని దాని భావం. శామ్యూల్ జాన్సన్ మాత్రం "కవిత్వంలో బలహీన ప్రాంతాలను బయటకు లాగవలసిందే" అన్నాడు. "అయితే నెగెటివ్ విమర్శ ఉత్త దండగ. తిరిగి తిరిగి మళ్ళీ చెయ్యవలసి వస్తుంది. వీలైనంత వరకు లోటుపాట్లను Positive styleలోనే చెప్పటం మంచిది అన్నది T.S. ఎలియట్టే – ఎలాగంటారా... ఆయన మాటల్లోనే "Poetry is not a thing to be practised by thousand poetasters and hobbledehoys in three weeks of training.." బాలాకుమారులూ, కవి కుమారులూ మూడు వారాల్లో నేర్చుకునే విద్య కాదండీ కవిత్వం... అంటున్నాడాయన.. చాలదా అని!

మార్జొరీ బోల్టన్ అనే ఆంగ్ల విమర్శకురాలు "మంచి కవిత్వం మంచి నాటకం ఆనందాన్ని ఎలా కలిగించాయి. మరొకరి కవిత్వం ఎలా కల్గించలేకపోయింది – దానికి ఈ సూత్రాలను అన్వయించటం, లేకపోవటం కారణాలు.. అంటే చాలును" అన్నది.. "తైలం కవిది. వత్తి ప్రజలది... అగ్గిపుల్ల మాత్రమే విమర్శకులది" అని ఆమె అన్నప్పుడు విమర్శకుడి పాత్ర నిమిత్త మాత్రమని అవగతమవుతుంది. నాగరికత ప్రయాణంలో బుద్ధుడూ, జీసస్, గాంధీ, శంకరుడూ, వివేకానందుడూ ఎవరూ విమర్శను తప్పించుకోలేకపోయారు! మధ్యలో కవులూ, కళాకారుల సంగతేమిటి గొప్ప! విమర్శకుడు చేతగానితనంతో, చేయి చేసుకొని కుళ్ళునూ, కుత్సితాన్ని ప్రోగుచేయటం కూడా వుంటుంది. నచ్చని విషయాల్ని సంతృప్తికరంగా చెప్పలేని వారు హెచ్చు. వారంతా విమర్శకులు కాలేరు. విమర్శ సామగ్రి, శస్త్రాస్త్ర సంధాన సంవిధానాలూ తెలియకుండా రణరంగంలో దిగితే చెయ్యి కాల్చుకుంటారు. కువిమర్శకు పాల్పడతారు.

"కువిమర్శ మృణ్మయి నిర్జవ మస్తిష్కులు గృహింప జాలుదురా, మత్భవిమత్, పవివత్ కవితాక్షి విలోకన తీక్షధార సిరిసిరిమువ్వా" అని శ్రీశ్రీ అన్నపుడు ఇటువంటి విమర్శకుల మీదేకదా! నా గొప్పతనం నీకేం తెలుసురా మట్టిబుర్రా అంటున్నాడు! పోప్ 'An essay on criticism' అనే తన గ్రంథంలో విమర్శకులకు క్లీన్ ఛిట్ ఇవ్వలేదు సరికదా తీవ్ర 'విమర్శ' చేసాడు (విమర్శకులపై విమర్శ). "విమర్శకుల్లో కొందరికి స్థిరమైన అభిప్రాయాలే వుండవు' చదువు తక్కువ. సందడెక్కువ. ఇవ్వాళో అభిప్రాయం చెబుతారు. రేపొచ్చి ఇది తప్పంటారు. ఎల్లుండొచ్చి మొన్న చెప్పిందే రైటంటారు!" అన్నాడు. 'చదువు తగ్గినకొద్దీ... శక్తి తగ్గినకొద్దీ వీరికి గర్వం పెరుగుతుంటుంది. అల్పత్వాన్ని అహంకారంతో పూర్తి చేస్తుంటారు" అని కూడా అన్నారాయన.

అయితే విమర్శ శాస్త్రసాంకేతిక కళాజగత్తులో, ఆధునిక సమాజంలో ఘర్షణకు ప్రాణం. ఘర్షణ నూతన సృష్టికి నాంది. చైతన్య ప్రగతికి దిక్సూచిగా పనిచేస్తుంది. 1960 ప్రాంతంలో ఇంగ్లాండులో ఒక ఉదంతం దీనికి ఉదాహరణ. 'ఛార్లెస్ ఫిలిప్స్ స్నో' అనే విశ్వవిద్యాలయ ఆచార్యుడు రసాయన శాస్త్రంలో దిట్ట. ఆయన చిన్న నవలాకారుడు కూడా. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఒక ఉపన్యాసం చేస్తూ 'శాస్త్ర సంస్కృతి సాహిత్య సంపన్నులుకన్న మిన్న. సమాజానికి ఆహారం, నివాసం, నాగరికతనిచ్చేది విజ్ఞానశాస్త్రం, కథలు, నవలలూ, కావ్యాలూ, నాటకాలనిచ్చే సాహిత్యంకన్నా ఎన్నో రెట్లు గొప్పది. ఎన్నో మహాకావ్యాలకన్నా న్యూటన్ చలనసూత్రాలు గొప్పవి" అన్నాడు. ఈ ప్రసంగ వ్యాసాన్ని అచ్చువేసి పంచారు. అంతే ఇంగ్లండ్‌లో నిప్పంటుకుంది. పత్రికల్లో 'స్నో'ను దుమ్మెత్తిపోసారు. 'స్పెక్టేకర్'లో వ్యాసాలు రాసారు. అజ్ఞాని, నీచుడు, దుర్మార్గుడు, కళాహీనుడు, నిరాకారుడు, నస్మరంతి, మూర్ఖుడు.. అని వందల ఉత్తరాలూ, వ్యాసాలూ వచ్చాయి. స్నో స్నేహితులూ, అభిమానులూ, శిష్యులూ అవాక్కయ్యారు. బాధపడ్డారు. స్నో దుర్మార్గుడు కాదు. అతడు చేసింది మేధోవర్గానికి ఒక హెచ్చరిక మాత్రమే. అపార్థం జనించింది. సాహిత్యవేత్తల అహం దెబ్బతింది. విమర్శ ఆకాశాన్ని అంటింది. అప్పటికే వృద్ధుడైన బర్ట్రాండ్ రస్సెల్ కల్పించుకుని ఒక సంపాదక లేఖలో "స్నో, ఇంతటి ఖండనకు అర్హుడు కాదు. ఆలోచనాపరుడు. ఒక సత్యాన్ని చెప్పటంలో పొరబడ్డాడు. అతడన్న విషయంలో ఎంతో సత్యం వుంది. మా తాతగారు జాన్ కార్ట్ రైట్ యంత్రమగ్గాన్ని కనుక్కొన్నవాడు అని ఎవరికీ తెలియదు. హోమర్ పాఠాలు చెప్పుకునే ట్యూషన్ మాస్టరుగానే ప్రపంచానికి తెలుసు. అలాంటి సత్యాల ప్రాధాన్యత గురించి మాత్రమే స్నో అంటున్నది" అని సర్దిచెప్పవలసి వచ్చింది. విమర్శ యొక్క శిఖరాగ్ర స్థాయి ఒక గొప్ప సత్యావిష్కరణ దారి తీసిన సందర్భం అది!

ప్రొ. చందు సుబ్బారావు
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం



– కాండ్రేగుల నాగేశ్వరరావు

ఇంకా వసంతకాలమే నడుస్తుందనుకుంటున్నాను. ఇంతలోనే అతడుతో అడవిని జయింపచేసిన డా॥ కేశవరెడ్డి కేన్సర్‌ను జయించలేక వెళ్ళిపోయాడు. అప్పుడే ఆకు రాలు కాలం వచ్చేసిందా! అనిపించింది. అతను వయసులో నా కన్నా ఒక సంవత్సరం చిన్న. నిన్న కాక మొన్న రిటైరయిన జ్ఞాపకం ఇంకా మదిలో పచ్చిగానే మెదులుతుంది.

యంగ్ అండ్ ఎనర్జిటిక్ అనిల్ బత్తుల, స్నేహపాత్రుడు తల్లావఝ్ఝల శివాజి, సాహిత్యమంటే చెవికోసుకొనే వాసిరెడ్డి నవీన్, అందమైన పాటలా నవల రాసే శ్రీరమణ, తను విట్ అండ్ విజ్‌డమ్‌తో అందరినీ ఆకట్టుకొనే కార్టూనిస్ట్ మోహనుడు, జలపాతం లాంటి కవితా గంగాధరుడు శివారెడ్డి, పున్నా కృష్ణమూర్తి, కేశవరెడ్డి మిత్రుడు సుమనస్పత రెడ్డి, నున్నా నరేష్, జగన్నాథ శర్మ ఇలా అందరూ కలిసి 22-2-2015 ఆదివారం, ఉ॥ 10 గం॥లకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్బులో డా॥ కేశవరెడ్డిపై తమకున్న మైత్రిని, అతని రచనలను, మూర్తిత్వాన్ని ఆ సభావేదికపై విశ్లేషించుకున్నారు. మార్చి 10వ తేదీ కేశవరెడ్డి పుట్టిన రోజు కావటంతో ఆ రోజు అతని స్మృతిలో అంబటి సురేంద్రరాజు జరిపిన సభలో మరికొందరు వక్తలు మాట్లాడారు.

సదాశివరావుగారు మాట్లాడుతూ, ఈ సంస్మరణ సభ చాల విలక్షణమైంది. అన్ని వర్గాల భావజాలాలతో రచన చేసే రచయితలంతా ఒకే వేదికపై కలిసి, కేశవరెడ్డిగారిని సంస్మరించడం చాల గొప్ప విషయం. కాకపోతే, ఈ పని అతను బతికున్నప్పుడే చేసివుంటే, ఎంతో బాగుండేది. మునెమ్మతో కేశవరెడ్డిగారనుభవించిన వ్యధ కొంత తగ్గి ఎంతో మనోధైర్యం కలిగేది. ఇలా, ఒక రచయిత జీవించి ఉండగా ఆ వ్యక్తి రచనల గురించి మనమెందుకు చర్చించుకోవడం లేదని ఆత్మావలోకనం చేసుకుంటే బాగుంటుందన్నారు. కేశవరెడ్డిగారి కుమారుడు నందన్ రెడ్డి మాట్లాడుతూ, మా నాన్నగారికి కొన్ని ప్రత్యేకమైన అలవాట్లున్నాయన్నారు.

ఒకటి : చైన్ స్మోకింగ్ చేసేవారు. సిగరెట్లు దొరక్క పోతే బీడీలు తాగేవారు.

రెండు : ప్రతిరోజూ సాయంత్రం స్మశానం వెళ్ళి అక్కడ కొంత సమయం గడిపి రాత్రి ఏడు గంటలకు ఠంచనుగా ఇంటికి తిరిగి వచ్చేవారు. ఒక్కోరోజు ఆలస్యమైతే, నేను సైకిల్‌పై వెళ్లేవాడిని భయపడుతూ; సైకిల్ గంట మ్రోగించుకుంటూ, నాన్నా అని పిలుస్తూ.... తరువాత ఇద్దరం కలిసి ఇంటికి వచ్చేవాళ్లం. స్మశానంలోనే తనకు ప్రశాంత వాతావరణం, ఆలోచనలు వస్తాయని ఆ స్థలం అత్యంత ప్రీతి పాత్రమైందని అనేవారు.

మూడు : ఎంత దూరమైనా నడిచో, సైకిల్ మీదో వెళ్లేవారు. మనకు కారుందిగా నాన్నా, ఎందుకు ఇబ్బంది పడతారు అంటే – నీవూ నడవటం అలవాటు చేసుకో. కాస్త ఒళ్ళు తగ్గుతుందని సమాధానం.

నాలుగు : నాన్నగారికి సెప్టెంబరు 2013లోనే తన ఆరోగ్యం క్షీణిస్తున్నదని, కేన్సరని తెలిసాక ఏమీ మాట్లాడలేక ఒక పేపర్‌పై 'కౌంట్ డౌన్ బిగిన్' అని వ్రాసి యిచ్చారు. ఎవరితోనూ తన బాధను చెప్పవద్దని అభిలషించారు.

ఐదు : తన అంత్యక్రియలు చిత్తూరు జిల్లాలోని స్వగ్రామంలో చేయాలని కోరారు. కానీ ఆరోజు జరిగిన పరిస్థితులను బట్టి, డిచ్‌పల్లి, నిజామాబాద్ ప్రజల, హితైషుల

ప్రోద్భలంతో ప్రేమానురాగాలకు అనుస్పందనగా ఆ ఆస్పత్రి ఆవరణలోనే ఆంగ్లేయుల రాచ కుటుంబాలకు కేటాయించిన స్థలంలోనే సమాధి చేశారు.

ఎందరో అభిమానులు, చికిత్సపొందిన వారు, అశ్రు నయనాలతో వీడ్కోలు యిచ్చారు.

సంస్మరణ సభలో కేశవరెడ్డిగారి నవల *చివరి గుడిసె* ను నాటకంగా రూపొందించిన శ్రీనివాసుగారి వీడియో



పెండ్లి తప్పించుకున్న పెండ్లి కొడుకు

ప్రదర్శన జరిగింది. ఏ వ్యక్తికైనా అతని తొలి యౌవన దశ అంటే 14 నుంచి 21 సంవత్సరాల మధ్యకాలం చాలా ముఖ్యమైనది. తల్లిదండ్రులు, బంధువులు, సహ విద్యార్థులు, చదువుకునే పాఠాలు, పాఠాలు చెప్పే గురువులు, చూసే సినిమాలు, వినే పాటలు, ఇంకా ఇతరత్రా తన చుట్టూ ఉన్న ప్రకృతి నుంచి గ్రహించే సంగతులు వీటన్నిటినీ క్రోడీకరించుకొంటూ కొన్ని ఇష్టాలు రూపుదిద్దుకొనే రోజులవి. మనిషిలోని కోరికలు, అనుభూతులు, కల్పనలతో కలిసి ఒక నిర్దిష్ట వ్యక్తిత్వానికి రూపు దిద్దుతాయి.

కేశవరెడ్డి 1960వ సంవత్సరం నాటికి ఆ వయసుకు చెందినవాడు. ఆ కాలంలో మెడిసిన్‌లో సీటు రావటమంటే ఎవరెస్టు శిఖరం అధిరోహించనంత గొప్ప. సీటు వచ్చిన విద్యార్థులు మితిమీరి ఆత్మస్థైర్యంతో కాలు భూమిపై ఆనకుండా అడుగెత్తున నడిచేవారు. ఆరోజులలో మూడు ముఖ్యమైన కాలేజీలు వుండేవి. అందులో మొదటిది ఆలిండియా కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, న్యూ ఢిల్లీ. రెండవది ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజి, పూనా. మూడవది పాండిచ్చేరి మెడికల్ కాలేజ్. ఇందులో సీటే రావాలంటే అఖిలభారత స్థాయిలో ర్యాంకు వచ్చి వుండాలి. కేశవరెడ్డికి పాండిచ్చేరి మెడికల్ కాలేజిలో సీటు వచ్చింది. అక్కడే మెడిసిన్ పూర్తి చేశాడు. చర్మవ్యాధిపై పి.జి డిప్లమోను వెల్లూరు మెడికల్ కాలేజీ నుంచి పొందాడు. అప్పట్లో మెడిసిన్ చదివితే చాలు, జీవితం స్థిరపడిపోయినట్లే. బోలెడంత కట్నంతో పెండ్లి చేసుకోవచ్చు. కేశవరెడ్డి సామాజికంగా ఉన్నత వర్గానికి చెందినవాడు. తిరుపతిలో ఆర్థికంగా ఉన్నతంగా యెదిగిన ఒక వ్యక్తి కూతురుతో పెండ్లి నిశ్చయమయింది. పెండ్లి రేపు ఉందనగా ఎవరికీ చెప్పా పెట్టకుండా సూట్‌కేసులో బట్టలు సర్దుకుని నిజామాబాదు జిల్లాలోని డిచ్‌పల్లికి చేరుకున్నాడు. డెర్మటాలజీలో తనకున్న ప్రత్యేక నైపుణ్యంతో జీవితాంతం అక్కడే విక్టోరియా ఆసుపత్రిలో కుష్టురోగులకు సేవ చేస్తూ ఉండిపోయాడు.

అక్కడే నర్సుగా పనిచేస్తున్న ఒక దళిత యువతిని వివాహం చేసుకున్నాడు. కేశవరెడ్డి ఒకసారి నాతో మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తనను ప్రభావితం చేసిన మొదటి వ్యక్తి గాంధీ అని తరువాతి రోజుల్లో కార్ల్‌మార్క్స్ అనీ చెప్పాడు. అతనిలోని మానసికమైన స్వచ్ఛత, నిరాడంబరత, సేవాదృక్పథానికి బహుశా ఎప్పటికీ చెరగని వారి ప్రభావం కారణం కావచ్చును.

కేశవరెడ్డి చాలా అపార్థాలకు గురియైన రచయితగా విశ్లేషించారు ఎన్. వేణుగోపాలరావు. అతను వ్రాసిన **అతడు అడవిని జయించాడు** అతనికి ఎనలేని పాపులారిటీ తెచ్చినా అది హెమ్మింగ్‌వేకు కాపీ అనే ముద్ర అతనిపై పడింది. అతను వ్రాసిన **స్మశానం దున్నారు** మొదట భారతిలో ప్రచురితమైనప్పుడు అతనొక మార్క్సిస్ట్ అని నిరసించారు మార్క్సిస్ట్ కానివాళ్లు. అతని నవలలో సాటిలేని మేటయిన **మూగవాని పిల్లనగ్రోవి** వచ్చినప్పుడు అందులో బక్కిరెడ్డి పాత్రకు లేనిపోని మిత్‌ను ఆపాదించాడని నిరసించారు మార్క్సిస్ట్‌లు కొన్నాళ్లు ఒక పక్క అ.ర.సం. వారు మరొక పక్క వి.ర.సం. వారు కేశవరెడ్డి తమవాడంటే తమవాడని అటూ ఇటూ లాగి చివరకు వదిలేసారు. **మునెమ్మ కథ** లోని బొల్లెద్దు, మనుషులపైకి తన ముందు రెండు కాళ్లు చాపి ఎక్కడం లాంటి సహజమైన Instinct అపార్థం పాలై బూతుగా భావించబడి విమర్శల వెల్లువకు తావిచ్చింది. ఈ విమర్శ కేశవరెడ్డిని తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. కొన్నాళ్లపాటు రచనలు చేయటం ఆపేశాడు. కేశవరెడ్డికి గురువైన మధురాంతకం రాజారాంగారు విమర్శలను మరీ

అంత తీవ్రంగా తీసుకోవద్దని చెప్పినా, కేశవరెడ్డి ఆ పని చేయలేకపోయాడు. అతనిలో విమర్శకు తీవ్రంగా స్పందించే గుణం ఉంది. 1996వ సంవత్సరంలో తిరిగి పునః ముద్రణ పొందిన **అతడు అడవిని జయించాడు, మూగవాని పిల్లనగ్రోవి, చివరి గుడిసె** నవలల విడుదల సందర్భంలో పాత్రికేయులతో మాట్లాడుతూ కేశవరెడ్డి తెలుగులో ఇంతవరకూ గొప్ప నవల రాలేదన్నాడు. దానితో రంగనాయకమ్మతో పాటు అనేకమంది అతను మితిమీరిన అహంభావంతో తెలుగు నవలా రచయితలను కించ పరిచాడన్నారు. ఆ విషయమై నాతో మాట్లాడుతూ తెలుగులో అప్పటి నుంచి ఇప్పటికీ మనమంతా సగర్వంగా చెప్పుకోగలిగేది కన్యాశుల్కం నాటకం ఒక్కటేనని, అటువంటి సారస్వత పుష్టి కలిగిన నవల మనకింకా రాలేదన్నదే తన అభిప్రాయమన్నాడు. ఈ మధ్యనే సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు డాక్టర్ కడియాల రామ్మోహనరాయ్ తెలుగు సాహిత్యంలో సరియైన ఆధునిక నవల లేదు. ఈ ఆవశ్యకతను మాండలిక కోణం నుంచి కూడా తెలుగు సాహితీ వేత్తలు గుర్తించాలి అన్నారు. పూర్వం 70వ దశకంలో ఇంప్రింట్ అనే ఇంగ్లీషు మ్యాగజైన్ వచ్చేది. అందులో సగం పేజీలు కవితలు, వ్యాసాలతో నిండి వుండినా, మిగిలిన సగభాగం ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ లాంటి బడుగు దేశాలనుంచి వచ్చిన కొన్ని ప్రసిద్ధి గాంచిన నవలలను ప్రచురించేవారు. ఇవంటే కేశవరెడ్డికి ఎంతో ఇష్టం.

ఎర్నెస్ట్ హెమ్మింగ్‌వే రాసిన **ఓల్డ్‌మేన్ అండ్ ద సీకి, అతడు అడవిని జయించాడు** నవలకి సాహిత్య పరమైన శిల్ప శైలి (మ్యాజిక్ రియలిజమ్) లో తప్ప మరే సామ్యమూ లేదు. కేశవరెడ్డి నవల ఎత్తుగడే సాయం సంధ్యతో ప్రారంభమవుతుంది. ఇప్పుడు సాయంత్రం నాలుగవుతుంది అన్న *కన్యాశుల్కంలా!* వయసు మీరిన పేరులేని ముసలి వాడు ఆ రాత్రిలో వెన్నెల సాయంతో తప్పిపోయిన తన చుక్క పందిని వెతకడానికి వెళతాడు. ఆ ముసలి వాని గురించి చెపుతూ అతనొక బండరాయిలా పడున్నాడు. అతని పాదాలు పగుళ్ళు తీసి ఉన్నాయి. ఆ పగుళ్ళలో చిన్న చిన్న మట్టి బెడ్డలు చిక్కడి ఉన్నాయి లాంటి వర్ణనలతో మన చుట్టూ ఉన్న సమాజంలోని వ్యక్తులలో మరో సారి మనల్ని పరిశీలింప జేస్తాయి. ముసలి వాడు ఒక తోటిగువ్వ అరుపుతో చుక్క పందిని గుర్తిస్తాడు. తనకు సాయం చేసినందుకు దానిని అభినందిస్తాడు. అతను చుక్క పందికి దరి జేరుతున్నప్పుడు తిరిగి ఆ పిట్ట అరుపుతో అడవిలోని జంతుజాలం అప్రమత్తమవుతుంది. ఇప్పుడు అది తన ఉనికిని చాటినందుకు గాను దానిని చంపాలనుకుంటాడు. సహజమైన మానవ దృక్పథానికిదొక దృష్టాంతం. జీవితాన్ని, పరిసరాలను, ప్రకృతిని తనకు అనుకూలంగా మలచుకొని తన దృష్టితోనే ప్రపంచాన్ని చూడగలిగే స్వార్థ పూరితమైన మానవనైజాన్ని కథలో ఒక భాగంగా విశ్లేషించాడు కేశవరెడ్డి. సంజీవదేవ్ తన ముందుమాటలో అరణ్య వర్ణనలో అక్కడక్కడా కనిపించే కాలిబాటల గురించి ఇవి ఎందుకో అరణ్య మధ్యలో మొదలై మధ్యలో అంతమవుతాయి అన్న రచయిత పరిశీలనాత్మకతను ప్రశంసించారు.

అతడు అడవిని జయించాడు నవలలో రెండు ప్రధాన రసాలు పోషించబడ్డాయి. వెన్నెలలో ఓలలాడుతున్న ప్రకృతి సౌందర్య వర్ణన మనలోని ఈస్తటిక్‌ని మేలుకొలిపితే, కథ ముందు ఏమి జరగబోతుంది? ముసలివాడు చుక్క పందిని, వాటి పిల్లలను క్షేమంగా తీసుకురాగలడా అన్న ఉత్కంఠ పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కేశవరెడ్డి నవలలన్నిటిలోను డిటెక్టివ్ నవలలలో ఉండే ఉత్కంఠత ఉంటుంది.

కుప్పిలి పద్మ తన వ్యాసంలో **అతడు అడవిని జయించాడు**లోని ఆ అడవి, ఆ వెన్నెల నన్ను వదలకుండా పట్టుకున్నాయి. ఆ వెన్నెల నడకలు హత్తుకున్నాయి. కేశవరెడ్డిగారు పరిచయం కాగానే "ఆ వెన్నెల అడవి భలే రాసారు" అని చెప్పాను. ఆయన నవ్వారు. మళ్ళీ నవ్వారు. నవ్వటం ఆపి ఇంత అందంగా కొత్తగా ఆ పుస్తకం గురించి నాకు ఎవ్వరూ చెప్పలేదు. ఇప్పటి వరకు అంతా చాలా గంభీరమైన feedback చెప్పారన్నారు. తన రచనల గురించి కాని, తన పలానా నవల చదివారా అనడం గాని ఆయన అడగటం నేనైతే వినలేదు. మనకు అన్పించింది చెప్తే శ్రద్ధగా వింటారు. అవసరమైతే తప్ప తన రచనలగురించి మాట్లాడరు. మనం ఓ విశిష్టమైన, సుసంపన్నమైన రచయితతో మాట్లాడుతున్నామన్న భావనే కలుగదు అని పేర్కొన్నారు.

నగ్నముని తన వ్యాసంలో కేశవరెడ్డి నవల రాముడున్నాడు – రాజ్జిం ఉండాది. ఆంధ్రజ్యోతి వారపత్రికలో సీరియల్‌గా వచ్చినప్పుడు వరసగా చదివాను. ఆ నవల నన్ను బాగా ఆకట్టుకుంది. గ్రామీణ పేద రైతాంగం

పూట గడవని స్థితికి చేరుకుని నగరాలకు వలస పోతున్న నేపథ్యాన్ని ఆ నవల చూపిస్తుంది. దాని మీద నేను 1988 నాటి ఆంధ్రజ్యోతి వీక్లిలో వ్యాసం రాస్తే పురాణం గారు కేశవరెడ్డి ఫొటోతో పాటు నా ఫొటో కూడా పెట్టి ప్రచురించారు. పరవస్తు లోకేశ్వర్ తన వ్యాసంలో కేశవరెడ్డి ఆలోచనలకు, రచనలకు, జీవితానికి మధ్య ఎటువంటి వ్యత్యాసం, వైరుధ్యం లేని మహామనిషి, చిత్తూరులోని ఒంటిమిట్ట నుంచి బయల్దేరిన ఒక బాటసారి, ఒక బైరాగి, ఒక సూఫీముసాఫిర్, డిచ్‌పల్లిలో కుష్టురోగుల సేవలో తరిస్తూ సాహిత్యంలో ధిక్కారపు జెండా ఎగుర వేసి, జీవితాంతం పీడిత జన పక్షపాతిగా నిలబడ్డాడు. ఆయన జీవితాంతం మోటుతోలుచెప్పులతో నడిచాడు. అది డిచ్‌పల్లి కుష్టురోగుల పునరావాస కేంద్రంలో సగం చేతివేళ్లు అరిగిపోయిన ఒక రోగి చాలా ప్రేమతో ఆ చెప్పులు కుట్టి తనకు బహుమతిగా అందించాడని చెప్పేవారని పేర్కొన్నాడు.

అతడు అడవిని జయించాడు నవల శిల్పపరంగా **ది ఓల్డ్‌మేన్ అండ్ సీ**ని అనుకరించినా, కథాకథనంలో – తాత్త్వికత, పాత్రచిత్రణలో కేశవరెడ్డి గాఢతను సాధించగలిగాడు. ఈ నవలను నేషనల్ బుక్‌ట్రస్ట్‌వారు పధ్నాలుగు భారతీయ భాషల్లో అనువదించి ప్రచురించినప్పుడు దానికి నేను ముందుమాట రాశాను. అలాగే **ఇన్‌క్రెడిబిల్ గాడెస్** మరాఠీలో అనువాదమై పుస్తకంగా వెలవడటంతో అనుసంధానకర్తగా వ్యవహరించాను. చివరిసారిగాతన ఆఖరి నవల **మునెమ్మ కథ**ను ప్రత్యేకించి పంపిస్తే చదివి, నాకు నచ్చలేదని నా అభిప్రాయం రాసి "ఇలాంటి ఇతివృత్తంతో మీరేమి సాధించగలిగారు" అని ప్రశ్నించాను. తిరిగి సమాధానం రాసి ఫోనులో కూడా మాట్లాడి ఆయన తన వాదనను వినిపించారు.

అతి పేద దళితుల జీవితాల గురించి ఒక దళితేతర రచయితగా కేశవరెడ్డి తన సామాజిక స్ఫూర్తిని, ప్రతిభను నిరూపించుకున్నారు. ఏనాడూ సన్మానాల కోసం, అవార్డుల కోసం ఎగబడలేదు. కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు రాలేదు. జ్ఞానపీఠ్ అవార్డుకోసం అన్ని అర్హతలున్న రచయితగా కేశవరెడ్డి పేరును వివరాలతో పాటు సూచిస్తూ రెండు మూడుసార్లు నా వంతు ప్రపోజల్స్ పంపించాను. ఆయన మితభాషి. నెమ్మదిగా మాట్లాడుతూ సెన్స్ ఆఫ్ హ్యూమర్‌తో ఎంతో సీరియస్ అంశాన్నైనా తేల్చేసేవాడు. అవార్డులను కూడా అలాగే చూసి ఉండవచ్చు. ఇప్పుడు ఆయన లేదు. నాకు మాత్రం ఆయనతో కలసి ఆయా సందర్భాలలో నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ సభలలో ఒకే వేదిక పై నుంచి ప్రసంగించిన జ్ఞాపకాలు మిగిలిపోయాయి.

మునెమ్మకథ 1930 కాలం నాటిది. ఆనాడు సైనిక పటాలం వెడుతున్నప్పుడు వెంట కొందరు స్త్రీలను క్యాంపు ఫాలోయర్‌గా పంపించేవారు. ఇది చరిత్రకెక్కిన సత్యం. ఈ విషయాన్ని చూచాయగా ఈ నవలలో వివరిస్తారు కేవశరెడ్డి. ఇది ఆయన సూక్ష్మమైన పరిశీలనా దృష్టికి నిదర్శనమన్నారు నరేష్ నున్నా. ఇంతటి విలక్షణ శైలి ఉండటం చేతనే *అతడు అడవిని జయించాడు* నవల పధ్నాలుగు భారతీయ భాషలలో అనువాదితమై తెలుగు వాని సత్తాను చాటింది. లక్ష్మీరెడ్డిగారు దీన్ని హిందీలో అనువదించారు. ఇంగ్లీషు అనువాదం జయప్రద చేశారు. ఇది మాక్మిలన్ వారు పబ్లిష్ చేశారు.

చివరి గుడిసె నవలను రచయితే ఇంగ్లీషులోకి అనువదించారు. ఆక్స్‌ఫర్డ్ ప్రెస్ వారు కేశవరెడ్డి ఇంగ్లీషు అనువాదాలను నొవెల్లా సీరిస్‌గా ప్రచురించారు.

అతడు అడవిని జయించాడు రేడియో నాటకంగా విశాఖపట్నం నుంచి ప్రసారమయింది. దీనికి ఆలిండియా రేడియో ప్లే కంటెస్ట్‌లో రెండవ బహుమతి పొందింది.

చివరి గుడిసె, మూగవాని పిల్లనగ్రోవి నాటకంగా ప్రదర్శించ బడ్డాయి. ఇంతవరకు కేశవరెడ్డి రచనలపై 12 పి.హెచ్.డిలు వెలువడ్డాయి. కేశవరెడ్డికి ఒక చిత్రమైన హాబీ ఉండేది. తనకు నచ్చిన కొన్ని హాలివుడ్ చిత్రాలకు సంబంధించి స్క్రిప్‌ను ఇంటర్‌నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని చదివి ఆనందించేవాడని మిత్రులు సుమనస్పత రెడ్డి పేర్కొన్నారు.

అతడు అడవిని జయించాడు మొట్టమొదటిసారిగా 1987వ సం॥లో శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ ముందుమాటలతో, ఆ తరువాతి ముద్రణలో శ్రీ సంజీవదేవ్ ముందుమాట వ్రాశారు. 1996 ముద్రణలో వరవరరావు ముందు మాటతో, మరోసారి వచ్చి పాఠకులను అలరించింది.

మూగవాని పిల్లనగ్రోవికి అ.సు.ర చివరి మాట వ్రాశారు. కేశవరెడ్డి నవల *సిటీబ్యూటిఫుల్*కు కాశీభట్ల వేణుగోపాల్ ముందు మాట వ్రాశారు. ఈ ప్రవేశికలన్నీ నవలా విస్తృతితో పోలిస్తే సుదీర్ఘమైనవనే చెప్పాలి. మేజిక్

రియలిజం శైలిలో వ్రాసేవారందరూ తమ రచనలలో పరిపూర్ణతను కోరుకుంటారు. అందువల్లనే కేశవరెడ్డి తన 35 సం॥ల సుదీర్ఘకాలంలో తొమ్మిదికి మించి నవలలు వ్రాయలేదు. వ్రాసినదంతా కలిపిచూస్తే వేయి పేజీలలోపే వుంటుంది. హెమింగ్‌వే కూడా అంతే. అతను *ఫేర్‌వెల్ టు ఆర్మ్స్* అన్న నవలలోని పతాక సన్నివేశాన్ని 39 సార్లు తిరగ వ్రాసాడు. కేశవరెడ్డి రచనలను పరిణామరీత్యా నవలలనకూడదు. వాటిని పెద్ద కథలనో లేక నవలిక లనో అనవలసి వస్తుంది. ఇక్కడ నాకు కేశవరెడ్డికి మధ్య జరిగిన సంభాషణ గుర్తుకొస్తుంది.

"మీ నవలలోని కథాంశం చిన్నదిగా ఉంటుంది. చాలా సింపుల్‌గా కూడా ఉంటుంది. కానీ చదువుతున్నప్పుడు గొప్ప ఉత్కంఠతో సాగుతుంది. పతాక సన్నివేశంలో ఒక అనూహ్యమైన ట్విస్ట్ ఉంటుంది. దీనికి మీ ప్రణాళిక ఏమిటి?" అని ప్రశ్నించాను. దానికి కేశవరెడ్డి "మన చుట్టూ ఎన్నో విషయాలు, సంఘటనలు జరుగుతూ ఉంటాయి. కొన్ని మనల్ని కలచివేస్తాయి. మనస్సు వాటికి స్పందిస్తుంది. దానిని ఇతరులతో పంచుకోవాలనుకుంటాం. అది సాహిత్యపరంగా అయితే మరింత విస్తృతంగా ఉంటుంది. అంతేకాదు శాశ్వత రూపాన్ని పొందుతుంది.

అందుకు నేను ఒక ఇతివృత్తం ఇలా ఉంటే బాగుంటుందని ఆలోచిస్తాను. మనం చెప్పేది పాఠకుల మనసులో గాఢంగా నాటుకోవాలంటే Climax ఉన్నతంగా ఊహాతీతంగా ఉండాలి. కొన్ని కథలు మంచి Concept తో ప్రారంభమవుతాయి. కానీ పేలవమైన ముగింపువల్ల తేలిపోతాయి. అందుకనే నేను చాలాకాలం ఇతివృత్తం ముగింపు పైనే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తాను. ముగింపు ఇలా ఉంటే బాగుంటుందని నిర్ణయానికి వచ్చిన తరువాత కథను వెనక నుంచి నడిపిస్తూ ముందుకు వస్తాను' అంటాడు.

కేశవరెడ్డి నవల లన్నిటిలోనూ ఇది కనిపిస్తుంది. అతని నవలలో ఆ తరువాత చెప్పదగినవి 'చివరి గుడిసె', 'మూగవాని పిల్లనగ్రోవి'. ఈ రెండు నవలలోను మొదటి దానిలో రియలిజమ్ పాలెక్కువ. రెండవదానిలో మాజిక్ పాలెక్కువ. ఈ రెండు నవలలకు వాడ్రేవు చిన వీరభద్రుడు ముందుమాట వ్రాస్తూ "మూగవాని పిల్లనగ్రోవి ఒక రైతు మరణ పునరుత్థానం గాథ. ఆ రైతు ప్రయత్నం నుంచి వైఫల్యానికీ, వైఫల్యం నుంచి అభద్రతా భావానికీ, అభద్రతా భావం నుండి ఉన్మాదానికీ, ఉన్మాదం నుండి మరణానికి నడిచిన కథ. తన మరణంలో ప్రాణత్యాగం చేసిన తీరువల్ల కర్మవీరుడై, అమరుడై, పురాణపురుషుడైనాడు బక్కిరెడ్డి.

డా॥కేశవరెడ్డి ఈ కథ ఇతివృత్తం ఎంచుకోవటంలో, ఈ కథను చెప్పిన తీరులో అసమాన కౌశల్యాన్ని ప్రదర్శించాడు. ఈ కథలో కూడా పురాతన ఆసియా కథను సాంప్రదాయాన్ని ఆదిమ జాతుల విశ్వాసధోరణిలో చెప్పే నేర్పువల్ల ఇంతదాక తెలుగు సాహిత్యంలో మనం వినివుండని అపూర్వ కథనాన్ని ప్రదర్శించాడు అన్నారు." జానపదుల నాలుకల్లో ఒక వీరగాథ కలిగి ఒక స్థలపురాణంగా రూపాంతరం చెందటం.

కేశవరెడ్డి చూపించిన మాజిక్ రియలిజం. అలానే *చివరి గుడిసె* కథాకాలం రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంగా ఎంచుకున్నాడు. 1924వ సం॥నుంచి యానాదుల్ని పుట్టునేరస్థుల జాబితాలోకి చేర్చింది ప్రభుత్వం. ఒక జాతిని పిండదశనుండే నేరస్థులుగా ముద్రవేసింది ప్రభుత్వం. ఇంతకీ ప్రభుత్వం అంటే ఎవరు. "గవర్మెంటోళ్ళంటే ఎవరు సావి, తాసిల్దారు, రివినిస్పిట్రూ, మనేగాడు ఈళ్ళే కదా'' అనిపిస్తాడు ఒక పాత్రచేత. ***రాముడొచ్చాడు...*** నవలలో 'గవర్మెంటోడంటే తెగీ తెగని కత్తితో గొంతులు కోసేటోడు' అనిపిస్తాడు. కేశవరెడ్డి కోపం గవర్నమెంటుమీద కాదు, గవర్నమెంటు ప్రతినిధులుగా నున్న ఫ్యూడల్ వ్యక్తులపైనే.

కేశవరెడ్డి అభిమానించే రచన కన్యాశుల్కం. *కన్యాశుల్కం* నాటకం 'ఇప్పుడు సమయం నాలుగు కావచ్చింది' అన్న డైలాగుతో సంధ్యాసమయంలో ప్రారంభమౌతుంది. కేశవరెడ్డి నవల **'అతడు అడవిని జయించాడు'** కూడా సూర్యాస్తమయ సమయంలోనే మొదలవుతుంది.

అలానే కేశవరెడ్డి నవలలో బైరాగి పాత్ర తరచు కనిపిస్తుంది. అయితే ఇది కన్యాశుల్కంలో కనిపించే పాత్రకంటే భిన్నమైంది. ఇక్కడ బైరాగి పాత్రలో వేమన, పోతులూరి వీరబ్రహ్మం, స్వయంగా కేశవరెడ్డి ఉన్నారని అంటారు వరవరరావు. బైరాగి మాటలద్వారా కేశవరెడ్డి ఇలా అనిపిస్తాడు. 'హరిశ్చంద్రున్ని అప్పుల బాధలు మొదలు, తానీషా అప్పుల బాధల వరకు తీర్చిన దేవుడు ఈ దేశంలో రైతుల అప్పులబాధలు తీర్చేదగ్గరకు వచ్చేసరికి రాతి

కేశవరెడ్డి

దేవుడైపోయాడు. కలరా, ప్లేగువంటి రోగాలు స్వామి వల్లనే మాయ మయ్యాయని జనం నమ్మారు కాని ఆకలి రోగం అరికడతానని ఆయన భరోసా ఇవ్వలేదు. ఈ రోగం ఎందుకు వచ్చిందని వారు స్వామిని ప్రశ్నలడగటం లేదు'. ఆయన రచనలలో విషాదం ఉంది. కానీ ఆది విషాదం అనిపించేటంతగా పాఠకునికి తోచదు కానీ చదివిన తరువాత ''ఎంత అన్యాయం, ఏమిటీ దారుణం'' అనుకునేటట్టు చేస్తాడు.

ఇప్పుడు మనం ఏం చేయాలి మన బాధ్యత ఏమిటి అని మేధావులు, శాస్త్రజ్ఞుల ఆలోచనలకు వదిలివేస్తాడు. ఈ శైలిలో రచన సాగించేటపుడు రచయిత వీలయినంతవరకూ అలంకార శోభితమైన శిల్పానికి దూరంగా ఉండాలి. అప్పుడే రియలిజమ్ పండుతుంది. ఈ విషయంపై కేశవరెడ్డికి సమగ్ర అవగాహనుంది. అలానే *ఇన్‌క్రెడిబుల్ గాడెస్, స్మశానం, దున్నేరులాంటి* రచనలున్నాయి. ఆయన వ్రాసిన Semi autobiographical నవల *సిటీబ్యూటీఫుల్.* ఆయన ఈ మధ్యనే వ్రాసిన *మునెమ్మ* కథ కొంతమంది విమర్శలకు తావిచ్చింది.

దానికి కారణం అందులోనున్న ఇతివృత్తం, సామాన్యంగా కేశవరెడ్డి ఎంచుకునేది కాకపోవటం. దాని కథాంశం కేశవరెడ్డి ఇంతకు ముందు వ్రాసిన దానికంటే పూర్తిగా భిన్నమయింది కావటం. రెండవది అందులోని కొన్ని సంఘటనలు bold గా ఉండటం. ఇది కొందరు సున్నిత పాఠకులకు అభ్యంతరమనిపించింది. **మునెమ్మ కథ**లోని సందర్భాలు biological events, మిస్టిక్ ఘట్టాలను మరింత లోతుగా పరిశీలన, చర్చించటం జరగాలి. అందులోని కథాకథనం పైకి కనిపించినంత తేలిక విషయం కాదు. *అతడు అడవిని జయించాడు* నవలకు, Old man.. నవలకు భావ సారూప్యత కనబడుతుంది.

'Man can be destroyed, but he cannot be defeated' అన్న మాటలు, వానితోబాటు సాంటియాగో చెప్పినట్లు, You need not be great, but you should be Unique అన్న మాటలు సాంటియాగోకే కాదు, ముసలివానికి, కేశవరెడ్డికి, అ.జో, వి.బో, కందాళ ఫౌండేషన్ సభ్యులకు మీకు, నాకు ఇక్కడున్న మనందరికీ వర్తిస్తుంది.

'We are unique, **Yes, We are unique**' అందుకే మనమందరం ఇక్కడ కలిసాం.

కేశవరెడ్డి నవలలతోనే సరిపెట్టుకోలేదు. వృత్తి పరంగా తనకున్న అంకితభావాన్ని చాటుకుంటూ కుష్టురోగపు చికిత్సపై జాతీయ, అంతర్జాతీయ మెడికల్ జర్నల్స్‌లో పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురించారు. కేశవరెడ్డి నవలలో కొన్నిటిని హెచ్.బి.టి. వారు పుస్తక రూపంలో ప్రచురించారు. అతని మొదటి రచన **బానిసలు, భగవానువాచ, రోడ్డు** ఇప్పుడు లభ్యం కావటంలేదు. విద్యార్థి దశలో ఉండగానే రాసినవి కొన్ని ఉన్నాయని వాటిని సేకరించవలసిన ఆవశ్యకత ఉందని శివారెడ్డి చెప్పారు.

కేశవరెడ్డి వ్రాసిన అన్ని రచనలను వాటి ముందుమాటలు, విమర్శలను కలిపి సంపూర్ణంగా ఒక పుస్తకంగా తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉంది. ***మిసిమి*** ప్రధాన సంపాదకులైన ఆంజనేయ రెడ్డిగారు, *ఆర్ట్స్ అండ్ లెటర్స్* ద్వారా కేశవరెడ్డి రచనలను సంపూర్ణంగా ప్రచురిస్తామని ముందుకొచ్చారు. పని మొదలైంది. ఉన్నతాభిరుచి కలిగిన పాఠకులకు *ఆర్ట్స్ అండ్ లెటర్స్* సమర్పించే ఒక కానుకగా త్వరలో ఇది రాబోతుంది.

కాండ్రేగుల నాగేశ్వరరావు
హైదరాబాదు



మారణకాండలో విరిసిన మానవత్వం

– గబ్బిట కృష్ణమోహన్

సెప్టెంబర్ పదకొండవ తేది, 2001 సంవత్సరం, (9/11) నాడు అమెరికాలో జరిగిన మారణహోమం తరవాత డెల్టా 15 విమాన సిబ్బందికి చెందిన ఫ్లైట్ అటెండెంట్ రాసిన అత్యద్భుత ఉదంతం.

సెప్టెంబరు 11, మంగళవారం నాటి పొద్దున మా విమానం ఫ్రాంక్‌ఫర్ట్ విడిచి అయిదు గంటలు దాటి ప్రస్తుతం ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా ప్రయాణిస్తోంది. అకస్మాత్తుగా కర్టెన్లు తెరుచుకోవడం నన్ను కాక్‌పిట్‌లోకి వెళ్లి కెప్టెన్‌ని కలవమనడం జరిగింది. వెంటనే నేను లోపలికి వెళ్ళి చూసేసరికి సిబ్బంది ముఖాలు ఎప్పటిలో పనిలో నిమగ్నమైనట్టు వున్నాయి. నన్ను చూడగానే కెప్టెన్ నా చేతిలో ఒక ప్రింటెడ్ సందేశం వుంచాడు. అట్లాంటాలోని డెల్టా మెయిన్ ఆఫీసునుంచి వచ్చిందది. "అమెరికాలో వాణిజ్య విమానాల రాకపోకలు నిషేధించారు. వీలైనంత త్వరలో దగ్గరి విమానాశ్రయంలో దిగాలి. ఎక్కడ దిగింది తెలపాలి."

దీని అర్థం ఎవరూ విడమర్చి చెప్పలేదు. పరిస్థితి గంభీరం కనక వెంటనే దిగాలి. మాకు దాపులో వున్న విమానాశ్రయం 400 మైళ్ళు వెనకగా న్యూఫౌండ్‌ల్యాండ్‌లో వున్న గ్యాండర్ అని కెప్టెన్ ధ్రువీకరించాడు. మార్గ మళ్ళింపుకు కెనడియన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌ని అడిగిందే తడవు వెంటనే అనుమతి లభించింది. ఎలాంటి ప్రశ్నలు లేకుండా అంత త్వరగా ఎలా ఆమోదించారన్న దానికి సమాధానం తరవాత వెల్లడైంది. వైమానిక సిబ్బంది నేలమీదికి దిగడానికి సన్నాహాలు చేస్తుండగా న్యూయార్క్ ప్రాంతంలో టెర్రరిస్టుల కార్యకలాపాలు జరుగుతున్నాయని డెల్టా నుంచి సమాచారం వచ్చింది. విమానాలు హైజాకింగులకి గురి అయినట్టు మరికొన్ని నిమిషాల తరవాత తెలిసింది.

ప్రయాణికులకి నిజం చెప్పకూడదని విమానం ఎగురుతున్నప్పుడే నిశ్చయించాము. విమానంలో ఇన్‌స్ట్రుమెంట్ ప్రాబ్లం వచ్చిన దృష్ట్యా దగ్గర్లో న్యూఫౌండ్ ల్యాండ్‌లో వున్న గ్యాండర్ విమానాశ్రయంలో దిగి తనిఖీ చేయించాలని చెప్పాం. గ్యాండర్‌లో దిగిన తరవాత మరింత సమాచారం యివ్వగలమన్నాం. ప్రయాణీకుల్లో కలకలం చెలరేగింది. అయితే అది మాకు కొత్తకాదు! 40 నిమిషాల తరవాత మా విమానం గ్యాండర్‌లో దిగింది. అప్పుడు అక్కడి టైము మధ్యాహ్నం పన్నెండున్నర. అంటే న్యూయార్కులో సమయం పొద్దున పదకొండు గంటలు.

అమెరికా వెడుతూ అలా దారి మళ్ళింపుకు గురి అయి వివిధ దేశాలకి చెందిన విమానాలు అప్పటికే యిరవైకి పైగా దిగి వున్నాయక్కడ. విమానం నేలకి దిగిన తరవాత మా కెప్టెన్ యిలా ప్రకటించాడు: "లేడీస్ అండ్ జెంటిల్‌మెన్, మన చుట్టూ వున్న విమానాలను చూసి అన్నిటికీ ఒకే తరహా సాంకేతిక లోపం వచ్చిందా అని మీరు ఆశ్చర్యపడుతుండవచ్చు. మనం వేరే కారణం వల్ల ఇక్కడ దిగాల్సి వచ్చింది" అని చెప్పి, అమెరికాలో జరిగిందాన్ని గురించి అంతో ఇంతో తెలిసిన సమాచారం ఇచ్చాడు. విమానమంతా గట్టిగా అరుపులు, నమ్మలేనట్టు చూస్తున్న చూపులు.

మా బాధ్యత కెనడా ప్రభుత్వం తీసుకుంది. విమానం దిగడానికి ఎవరికీ అనుమతి లేదు. అలాగే బయటివాళ్ళు విమానాల దగ్గరకి రావడం కూడా నిషేధం. కెనడాకి చెందిన పోలీసు బలగం అప్పుడప్పుడు వచ్చి మమ్మల్ని చూసి మరో విమానం వైపుకి కదలడం మాత్రం జరిగింది. ఇంకో గంటలో మరిన్ని విమానాలు దిగడంతో గ్యాండర్ విమానాశ్రయంలో ప్రపంచంలోని నలుమూలల నించి వచ్చి చేరిన వాణిజ్య విమానాల సంఖ్య 53 కు చేరుకుంది. అందులో 27 అమెరికాకు చెందినవి.

ఈ లోపల మా విమానంలో వున్న రేడియో సెట్టు ద్వారా మరికొంత సమాచారం మొట్టమొదటిసారి లభించింది – న్యూయార్క్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోకి, డి.సి.లో వున్న పెంటగన్ లోకి హైజాక్ చేసిన విమానాలు చొచ్చుకొని వెళ్ళాయి. కెనడాలో సెల్ సిస్టమ్ వేరే అయినందువల్ల సెల్‌ఫోన్లు వాడటానికి ప్రయాణీకులు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయి. కొంతమందికి కనెక్షన్ దొరికినా అమెరికాలో లైన్లన్నీ జామయినట్టో, బ్లాక్ చేసినట్టో కెనడా ఆపరేటర్ నుంచి సమాచారం వచ్చింది.

వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనాలు కుప్పకూలాయని హైజాక్ చేసిన నాలుగవ విమానం కూలిపోయిందన్న సమాచారం ఎప్పుడో సాయంత్రానికి తెలిసింది. అప్పటికే ప్రయాణీకులు భయభ్రాంతులకి లోనవడమేకాక మానసికంగా, శారీరకంగా కుంగిపోయున్నారు – అయినా అందరూ ప్రశాంతంగా వుండటం చూసి ఆశ్చర్యమేసింది. అటువంటి స్థితిలో వున్నది మేమొక్కరమే కాదు, కిటికీలోంచి బయటికి చూస్తే మరో 52 విమానాల్లో వున్న ప్రయాణీకుల స్థితి కూడా అదేనని అందరం గుర్తించాం.

ఒక్కొక్క విమానం నుంచి దశలవారీగా బయటికి దిగే అవకాశం ఇస్తామని ముందుగానే చెప్పారు. మా వంతు మర్నాడు ఉదయం పదకొండు గంటలకి అని గ్యాండర్ విమానాశ్రయం నుంచి సాయంత్రం ఆరు గంటలకి సమాచారం అందింది. దానితో ప్రయాణీకులు తృప్తిపడలేదు. చేసేదేమీ లేకపోవడంతో ఆ సమాచారాన్ని దిగమింగి రాత్రంతా విమానంలోనే గడపడానికి సన్నద్ధమయ్యారు. అవసరానికి వైద్య సదుపాయం, తాగేందుకు నీరు, టాయిలెట్ల శుభ్రత సమకూర్చడానికి గ్యాండర్ విమానాశ్రయ అధికారులు మాట ఇచ్చారు. మాటప్రకారం నడుచుకున్నారు కూడా. అదృష్టవశాత్తు వైద్యసహాయం అవసరం లేకపోయింది. అయితే 33 వారాల గర్భంతో వున్న పడుచు స్త్రీ ఒకామె వుంది. నిజంగా ఆమెను మేము చాలా బాగా చూసుకున్నామని చెప్పాలి. సీట్లలో పడుకోడానికి కొంత ఇబ్బందిగానే వున్నా ఎలాంటి సంఘటనలు లేకుండా ఆ రాత్రి గడిచింది.

పన్నెండవ తేదీ పొద్దున సుమారు పదిన్నర గంటలకి స్కూలు బస్సుల సమూహమొకటి వచ్చి చేరింది. మేమందరం విమానం దిగి టెర్మినల్‌లోకి ప్రవేశించాం. ఇమిగ్రేషన్, కస్టమ్స్ తనిఖీలు ముగిసిన తరవాత రెడ్‌క్రాస్ వారు మా వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆ తరవాత మమ్మల్ని, అంటే సిబ్బందిని, ప్రయాణీకుల్నించి వేరుచేసి వ్యాన్‌లో హోటల్‌కి తీసుకెళ్ళారు. ప్రయాణీకులంతా ఎక్కడికి వెడుతున్నారో అప్పుడు మాకు తెలియలేదు. ప్రపంచం నలుమూలలనుంచి పలు విమానాల్లో దిగిన ప్రయాణీకుల సంఖ్య 10,500 అని, 10,400 మంది వున్న గ్యాండర్ పట్టణ జనాభా వారందరి బాగోగుల్ని చూసుకోవాలని రెడ్‌క్రాస్ వారి ద్వారా తెలిసింది.

సిబ్బందిని మాత్రం హోటలుకి వెళ్ళి విశ్రాంతి తీసుకోమని చెప్పి అమెరికా విమానాశ్రయాలు రాకపోకలకి తెరవగానే సమాచారం అందిస్తాము. అయితే అది అంత శీఘ్రంగా జరుగుతుందని అనుకోవద్దు అంటూ హెచ్చరించాడు కూడా. అమెరికాలో జరిగిన విధ్వంసకాండ గురించిన పూర్తి వివరాలు 24 గంటల తరవాత, హోటల్లో వున్న టీ.వీ.లో చూసి తెలుసుకున్నాము.

గడిపేందుకు సమయం చాలా వుండటంతో అటూ ఇటూ తిరుగుతూ గ్యాండర్‌లో స్థానికులు చాలా స్నేహ పూర్వకమని గుర్తించాం. మమ్మల్ని "విమానం వాళ్ళు" అని సంబోధించారు. వారి ఆతిథ్యం అనుభవిస్తూ గ్యాండర్ పట్టణం చుడుతూ చక్కగా కాలక్షేపం చేశాము.

రెండు రోజుల తరవాత పిలుపు వచ్చింది. మమ్మల్ని గ్యాండర్ విమానాశ్రయానికి తీసుకెళ్ళారు. ప్రయాణీకులంతా మళ్ళీ విమానంలో కలిశాక రెండు రోజుల పాటు వాళ్లందరూ ఏం చేసింది ఎలా గడిపిందీ తెలుసుకున్నాం. వాళ్ళు చెప్పిందంతా విని సంభ్రమాశ్చర్యాలతో మునిగిపోయాం.

గ్యాండర్‌తోపాటు దాని చుట్టుపక్కల 75 మైళ్ళ పరిధిలో వున్న వూళ్ళలో హైస్కూళ్ళు, మీటింగు హాల్సు, లాడ్జిలు, మరితర కూడళ్ళు మూసివేసి వాటిని యిలా ఆగిపోయిన ప్రయాణీకుల బస కోసం వినియోగించారు. కొన్నిచోట్ల మంచాలు, మరికొన్ని చోట్ల చాపలు వేసి స్లీపింగ్ బ్యాగ్సు, తలగడలు ఏర్పాటు చేశారు. "అతిథుల" బాగోగులు చూసుకోడానికి హైస్కూలు విద్యార్థుల్ని స్వచ్ఛంద సేవకి నియమించారు.

మా విమానానికి చెందిన 218 మంది ప్రయాణీకుల బస – గ్యాండర్‌కు 45 కిలోమీటర్ల దూరంలో

లూయిస్‌పోర్ట్ అన్న వూరి హైస్కూలులో. స్త్రీలెవరైనా ఆడవారికి ప్రత్యేకంగా కేటాయించిన వసతిలో బస చెయ్యదలచుకుంటే అదీ ఏర్పాటు చేశారు. ఒకే కుటుంబానికి చెందినవారందరినీ ఒక్కచోటే వుంచారు. వయసు మళ్ళిన వారిని స్వంత ఇళ్ళకి తీసుకెళ్ళారు.

మా ప్రయాణీకుల్లో వున్న గర్భిణీ స్త్రీ గుర్తుందా? 24 గంటలూ అర్జెంట్ కేర్ సదుపాయం వున్న హాస్పిటలుకి రోడ్డుకి ఆవైపునున్న ఇంట్లో వుంచారు. పిలవగానే పలికే డెంటిస్టుతోపాటు ఆడ నర్సులు, మగ నర్సులు ఆ రెండు రోజులూ వీరితోనే వున్నారు.

అమెరికాతోపాటు ప్రపంచంలో అన్ని ప్రదేశాలకీ ఫోన్‌కాల్సు, ఇ-మెయిలు సదుపాయాలు అందరికీ రోజుకోసారి చొప్పున అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణీకులందరికీ పగటిపూట విహారయాత్రలు ఏర్పాటు చేశారు. కొంతమంది అక్కడున్న సరస్సుల్లోనూ, హార్బర్లలోనూ నౌకా విహారం చేస్తూ, మరికొంతమంది చుట్టుపక్కలున్న అడవులు గాలించి వచ్చారు.

ఎట్టకేలకి వాణిజ్య విమానాల రాకపోకలకి అమెరికాలో విమానాశ్రయాలు తెరిచారన్న విషయం తెలియగానే - ఒక్క ప్రయాణీకుడినీ విడిచిపెట్టకుండా, ఆలస్యం కాకుండా సమయానికి అందర్నీ విమానాశ్రయానికి తీసుకొచ్చి దిగబెట్టారు. ఏ ప్రయాణీకుడు ఎక్కడున్నది, ఏ విమానం ఎక్కవలసింది, ఆ విమానం బయలుదేరే సమయం భోగట్టా అంతా రెడ్‌క్రాస్ వారి వద్ద వుంది.

అతిథుల కోసం బ్రెడ్ తయారు చేసేందుకు వూళ్ళో బేకరీలన్నిటినీ రాత్రింబవళ్ళు తెరిచి వుంచారు. వూరి ప్రజలంతా భోజనం ఇంట్లోనే తయారు చేసి స్కూలుకి తెచ్చారు. కొంతమందిని కోరుకున్న హోటళ్ళకి తమ కార్లలో తీసుకెళ్ళి చక్కటి భోజనం అందించారు. ప్రయాణీకుల సామానంతా విమానంలోనే వుండిపోవడం మూలాన బట్టలు ఉతుక్కునేందుకు అక్కడి లాండ్రీ మ్యాట్స్‌కు టోకెన్లు ఇచ్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆగిపోయిన ప్రయాణీకుల ప్రతి అవసరమూ అలా వాళ్ళు తీర్చారు. ఈ విషయాలన్నీ వివరిస్తుంటే ప్రయాణీకుల కళ్ళల్లోంచి ధారాపాతంగా నీళ్ళు కారాయి.

ఎట్టకేలకి వాణిజ్య విమానాల రాకపోకలకి అమెరికాలో విమానాశ్రయాలు తెరిచారన్న విషయం తెలియగానే - ఒక్క ప్రయాణీకుడినీ విడిచిపెట్టకుండా, ఆలస్యం కాకుండా సమయానికి అందర్నీ విమానా శ్రయానికి తీసుకొచ్చి దిగబెట్టారు. ఏ ప్రయాణీకుడు ఎక్కడున్నది, ఏ విమానం ఎక్కవలసింది, ఆ విమానం బయలుదేరే సమయం భోగట్టా అంతా రెడ్‌క్రాస్ వారి వద్ద వుంది. ఆ సంస్థ సహకారం చాలా గొప్పది.

వింటుంటే అంతా నమ్మశక్యం కాకుండా వుంది.

అలా కలసికట్టుగా విమానం ఎక్కిన ప్రయాణీకులు సరదా ప్రయాణం చేసొచ్చిన వారిలా కనబడ్డారు. అందరికీ అందరి పేర్లూ పరిచయమయ్యాయి. వాళ్ళు ఎలా గడిపిందీ కథలు కథలుగా వర్ణిస్తుంటే ఒకర్నిమించి ఒకరు మరింత ఆనందంగా గడిపినట్టు తెలిపారు. తిరిగి అట్లాంటాకు బయల్దేరుతున్న మా విమానం ఇప్పుడు ఏదో బృందంగా ఏర్పడి కుదుర్చుకున్న ఛార్టర్డ్ ఫ్లైటులా కనబడింది. దాంతో మా సిబ్బంది వారికి దూరంగా వుండిపోయింది.

మనసుకి అందని అద్భుతం.

ప్రయాణీకులందరూ అలా కలసి మెలసిపోయి ఒకర్నొకరు ఇంటి పేరుతో కాక అసలు పేరుతో పిలుచుకుంటూ ఫోన్ నెంబర్లు, అడ్రస్‌లు, ఇ-మెయిల్ అడ్రస్‌లు ఇచ్చి పుచ్చుకున్నారు.

ఆ తరవాత అనూహ్యమైన సంఘటన ఒకటి జరిగింది.

ఒక ప్రయాణీకుడు ముందుకొచ్చి అందర్నీ మైకులో సంబోధిస్తానన్న కోరిక వెళ్ళబుచ్చుతూ నా అనుమతి అడిగాడు. మామూలు పరిస్థితుల్లో అలాంటివాటికి అనుమతి వుండనే వుండదు. అయితే ఇప్పటి ప్రత్యేక పరిస్థితిలో "అఫ్‌కోర్స్, తప్పకుండా" అంటూ మైకు అతనికి అందించాను.

ఆయన మైకులో గత రెండు రోజుల అనుభవాల్ని అందరికీ గుర్తుచేస్తూ పూర్తి అపరిచితుల ఆతిథ్యం ఎంత గొప్పగా వున్నదీ స్ఫురణకు తెచ్చాడు. లూయిస్‌పోర్ట్ ప్రజల అభిమానానికి కృతజ్ఞతతో బదులుగా ఏదైనా చేయాలని తలపెట్టానన్నాడు. డెల్టా 15 (అది మా ఫ్లైట్ నెంబరు) పేరుతో ఒక ట్రస్ట్ ఫండు ఏర్పాటు చేస్తానన్నాడు. ఆ మొత్తం లూయిస్‌పోర్ట్‌లోని పిల్లల కాలేజి చదువు కోసం ఆర్థిక సహాయం అందించేందుకన్నాడు. ప్రయాణీకులందర్నీ చేతనయినంత విరాళం ఇమ్మని అర్థించాడు. కాసేపటికి విరాళాల వివరాలతోపాటు వారి ఫోన్ నెంబర్లు, అడ్రసులతో

కూడిన జాబితా మాకు అందింది. ఆ మొత్తం 14 వేల డాలర్ల పైబడి వుంది. వర్జీనియాకి చెందిన ఆ పెద్దమనిషి, ఎమ్.డి., ఆ మొత్తానికి అంత మొత్తం తను చేర్చి స్కాలర్‌షిప్పుల వితరణ కోసం అవసరమైన యంత్రాంగాన్నీ ఏర్పాటు చేస్తానన్నాడు. ఈ ప్రతిపాదనని డెల్టా యాజమాన్యానికి కూడా తెలిపి వారిని కూడా విరాళం అడుగుతానన్నాడు.

నేను ఈ వృత్తాంతం రాసే సమయానికి ఆ ట్రస్టు ఫండు ఒకటిన్నర మిలియన్ డాలర్లకు పైగా వుండి 134 మంది విద్యార్థుల కాలేజీ చదువులకు సాయమందించింది.

ఈ కథ మీతో పంచుకోవడంలో ముఖ్య వుద్దేశ్యం మనకిప్పుడు మంచి కథలు కావాలి కనక.

ఎక్కడో దూరప్రాంతానున్న ప్రజలు అకస్మాత్తుగా ఆకాశాన్నించి వూడిపడ్డ (నిజం కూడా అదే!) వారికి చూపించిన దయాగుణం గుర్తించినందుకు.

ప్రపంచంలో ఎంత మంచితనం వుందో స్మరణకి వచ్చి ఆశావహంతో వున్నందుకు.

మన చుట్టూ ఎన్నో నీచాతి నీచమైన వ్యవహారాలు జరుగుతున్నా ఈ రోజుల్లో ప్రపంచంలో మంచివారు యింకా చాలామంది వున్నారని, పరిస్థితులు అనుకూలించని సమయంలో ఆదుకునేందుకు వారు ముందుకొస్తారని తెలిసినందుకు.

నలుగురితో పంచుకోవాల్సిన కథల్లో యిది ఒకటి... దయచేసి ఆ పని చెయ్యండి.

2011, సెప్టెబర్ 11వ తేది. మారణహోమం జరిగి పది సంవత్సరాలు అయిన సందర్భంలో గ్యాండర్ పట్టణ మేయరుని, మరితర అధికారులని అమెరికాకు ఆహ్వానించి కృతజ్ఞతలు తెలిపి ప్రశంసించిన సందర్భంలో మేయర్ ఎలియట్, సెప్టెంబరు 11, 2001న జరిగిన సంఘటన ప్రపంచాన్ని పూర్తిగా మార్చివేసింది కానీ, గ్యాండర్‌తోపాటు చుట్టుపక్కల వున్న పౌరుల నడవడి మీద దాని ప్రభావం చూపలేదు. గ్యాండర్ పుర ప్రజలు ప్రక్క దేశానికి అందించిన సహాయ సహకారాలు గుర్తింపు పొందడానికో లేక బహుమతులు అందుకోడానికో కాదు, కేవలం “మేము మానవులం” కనక అని చెప్పాడు. అదే సందర్భంలో ప్రెసిడెంట్ ఒబామా కెనడా ప్రధానమంత్రి స్టీఫెన్ హార్పర్‌కు రాసిన లేఖలో సెప్టెంబరు 11, 2001 న జరిగిన దారుణ సంఘటన సమయంలో కెనడా దేశపు పౌరులు ఆ రోజున, ఆ తరువాతి రోజుల్లో చక్కటి స్నేహసౌభ్రాతృత్వం ప్రదర్శిస్తూ అసాధారణ సేవలందించారు. విమానాశ్రయాలే కాక వారి గృహాలని, హృదయ కవాటాలని తెరిచి వుంచారు. దానికి మేమంతా ఎప్పటికీ కృతజ్ఞులం అని వుల్లేఖించాడు.

సమాధానంగా కెనడా ప్రధానమంత్రి, సరిగ్గా పది సంవత్సరాల కిందట జరిగిన దానికి మీకు, అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలకు నా తరఫున, మా దేశ ప్రజల తరఫున ప్రగాఢ సానుభూతి. కెనడా. అమెరికాల మధ్య వున్న స్నేహం గాఢం, మీరు చెప్పినట్టు గ్యాండర్‌తోపాటు కెనడాలోని అన్ని ప్రాంతాల సాధారణ పౌరులు తమ గృహాలని, హృదయాలని మార్గ మళ్ళింపుకు గురి అయిన ప్రయాణీకులకి తెరిచి వుంచి ఆ స్నేహాన్ని మరింత దృఢపరిచారు అని రాశాడు.

అమెరికా రాయబారి డేవిడ్ జాకబ్‌సన్ గ్యాండర్ పట్టణం సందర్శించి అక్కడి హాకీ మైదానంలో పురప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి సహకారాన్ని దగ్గుత్తికతో ప్రశంసించాడు. న్యూయార్క్ అగ్నిమాపక సిబ్బందిలో ఒకరు వరల్డ్ ట్రేడ్ సెంటర్ శిథిలావశేషాల్లోంచి తీసిన రెండు ఉక్కు దూలాలు (గర్డర్స్) అక్కడి ప్రజలకి జ్ఞాపకార్థంగా పంపితే దాన్ని వైమానిక మ్యూజియంలో భద్రపరిచారు.

ఆ తరవాత మేయర్ ఎలియట్ మాట్లాడుతూ, ఆ రోజున “మాకు అలా చేయాలనిపించింది, చేశాము. తిరిగి వెడుతున్న ప్రయాణీకుల ముఖాల్లో వెల్లివిరిసిన దరహాసాలే మాకు చాలు” అని చెప్పి, “మన కోసం మనమేం చేస్తామో అది మనతోనే చనిపోతుంది, కాని, యితరుల కోసం చేసినది చిరకాలం నిలుస్తుంది” అంటూ ముగించాడు.

డెల్టా 15కి చెందిన ఫ్లైట్ అటెండెంట్ నజీమ్‌తోపాటు మరికొన్ని విమానాలకి చెందినవారు రాసిన వుదంతాలు అంతర్జాలంలో లభిస్తాయి.

ఆ మధ్య మిత్రులు ఫేస్‌బుక్‌లో వుంచిన ఈ వుదంతం చదివి, మరికొంతమందికి తెలపాలన్న వుద్దేశ్యంతో చేసిన తెలుగుసేత.

గబ్బిట కృష్ణమోహన్
హైదరాబాదు



కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై -

బోయ కొట్టములు పండ్రెండు

వి. రాజారామమోహనరావు

ఈ నాటి కాలానికి ఇది అరుదైన నవల. ఏదేనా రాయటం లో శ్రద్ధ తగ్గటం సామాన్యమై పోయిన ఈ రోజుల్లో, ఎంతో శ్రద్ధతోటి, పట్టుదలతోటి, సుదీర్ఘ కృషి తోటి శ్రీ కరణం బాలసుబ్రహ్మణ్య పిళ్ళై వెలువరించిన నవల *బోయ కొట్టములు పండ్రెండు.* ఈ నవల అట్టమీద, నవల పేరు రెండు రకాలుగా ముద్రించారు. పైన పేర్కొన్న పేరుకి పైన *బోయ కొట్టంబుల్వణ్ఱెణ్డు* అని వుంది. ఈ నవలలోని కథాకాలం కీ.శ. 614 – క్రీ.శ. 848. ఆ కాలంలో భాష, లిపి ఆ రకంగా వ్యవహారంలో వుండేవన్న సూచనే ఈ రకంగా ముద్రించటానికి కారణం. మొత్తం నవలంతా ఇదే రకమైన జాగ్రత్త భాష విషయంలోనూ, రచన విషయంలోనూ తీసు కోవటం జరిగింది. ఈ నవలని ఒకసారి చదివితే కథ తెలుస్తుంది. నవలలోని గాఢత, విషయ సూక్ష్మత మనసుకి పట్టాలంటే మరోసారి, మరోసారి చదవాలి.

ఈ నవలా రచనకి నాంది, ప్రేరణా కూడా చిత్రమైనవి. తన సహజాభిలాషతో కరణం బాలసుబ్రహ్మణ్య పిళ్ళై గారు అద్దంకి శాసనాన్ని చూడటం తటస్థించింది. కీ.శ. 848 కి చెందినది ఈ పండరంగని అద్దంకి శాసనం. 'పండరంగడు అను చాళుక్య సేనాధిపతి సామంత సైన్యముతో దండెత్తిపోయి, పండ్రెండు బోయ కొట్టములను స్వాధీనము చేసుకొని, కట్టెపు దుర్గమును నేలమట్టము గావించి, కందుకూరును బెజవాడవలె పటిష్టముగావించెను. ఆదిత్య బటరనికి ధర్మపురమున కొంత భూమి దానమిచ్చెను. 'ఇది శాసనమునందలి విషయము.

ఈ 'చారిత్రక విషయం ఆధారంగా నవల రాస్తే...' అనిపించింది పిళ్ళైగారికి. అక్కడ నుంచి ఆయన అన్వేషణ ఆరంభమైంది. విషయపరంగా ఎన్నో సందేహాలు తలెత్తాయి. భాషా, సంస్కృతీ పరంగా పరిశోధన అవసరమైంది. సంవత్సరంపాటు కృషిచేసి, ఎన్నో విషయాలు సేకరించారు. శాసనాలు, అనేక చారిత్రక గ్రంథాలు పరిశీలించారు. అద్దంకి, ధర్మవరము, గుండ్లకమ్మ, ముస్సివాగు, ఒంగోలు, కందుకూరు మొదలైన ప్రదేశాలు తిరిగి తమ పరిశోధన సాగించారు. ఆ కృషితో, ఓ వరుసలో చారిత్రకాంశములని క్రోడీకరించారు. క్రీ.శ. 614 – కీ.శ. 848, అంటే రెండువందల ఏళ్ళ పై చరిత్ర. వరుసగా అన్ని వివరాలు ఒకచోట కాదు సరికదా, ఏ రకంగా సేకరించ టానికి కుదరని పని. ఆంధ్రుల చరిత్ర వున్న గ్రంథాల ఆధారంగా సేకరించారు. ఏడెనిమిది తరాల చరిత్రకు ఎంతో విషయ సేకరణ జరగాలి. లభించింది తక్కువ. కృషి పట్టుదలతో కూర్చుకున్నది ఎక్కువ.

కొట్టము అనగా ఒక చిన్న పరిపాలనా విభాగము. అటువంటి పన్నెండు బోయ కొట్టముల కథ ఇది. పల్లవులు, చాళుక్యుల సామ్రాజ్య విస్తరణ దాహముతో ఇరువురి మధ్య నలిగిన పన్నెండు బోయ కొట్టముల కథ ఇది. బోయలు నల్లమల అడవుల ప్రాంతము నుండి వలస వచ్చినవారని చరిత్రకారుల ఊహ. ఆ ఊహ ఆధారంగా, త్రిపురాంతకం ప్రాంతం నుండి గుండ్లకమ్మ, ముస్సీనదుల మధ్య ప్రాంతానికి బోయలు వలస వచ్చినట్టు రచయిత చిత్రించారు.

కట్టెం వీరన బోయడు ఆధ్వర్యంలో బోయలు వలస సాగుతున్న దృశ్యంతో ఈ నవల ఆరంభమవుతుంది. ఈ దృశ్య వర్ణనలోనే పిళ్ళై గారు బోయల రూపురేఖలని, వారి నాయకుడు వీరబోయనుడి పరాక్రమాన్ని వారి జీవన సంచారాల్ని, పరిమాణాన్ని ప్రశాంత సంతోష జీవన ప్రియత్వాన్ని ఎంతో చక్కగా వివరించారు. వీరి వలసని కన్నులముందు దృశ్యరూపంగా ఊహించుకుంటే, అదొక విస్తృత గంభీర యాత్ర. నవలకి మంచి బిగువైన ఆరంభం. బోయలు అసలుసిసలైన తెలుగు వీరులు.

ధైర్యం, ఆత్మాభిమానం వారి సొత్తు. యుద్ధవిముఖులు. అలా అని పిరికివారు కాదు. మహావీరులు. ప్రశాంత జీవనం వారి అభిమతం. అందుకే, చాళుక్యుల దండయాత్రలో పూర్తిగా నాశనం అయిన తమ నెలవుని, వదలక తప్పని పరిస్థితిలో వదిలి, ప్రశాంత జీవితానికి అనువైన స్థలానికి బయలుదేరారు.

త్రిపురాంతకం దగ్గర్లో నివసించేవారు బోయలు. కొండలు, గుట్టలు, చిట్టడవులతో ఉండే ప్రాంతం అది. వేట, మెట్ట వ్యవసాయం, గొర్రెలు, మేకలు మేపుకొనుట వారి జీవనాధారము. విష్ణుకుండినుల ఏలుబడిలో ప్రశాంతంగా జీవించారు. సంవత్సరానికి రెండుసార్లు బెజవాడలోని విష్ణుకుండిన ప్రభువులని దర్శించుకుని, కానుకలు సమర్పిస్తూ సుఖజీవనం సాగిస్తూ వచ్చినవారు బోయలు.

చాళుక్యరాజు సత్యాశ్రయ పులకేశి దండెత్తి వచ్చినది మొదలు వీరి కష్టాలు ఆరంభం అయ్యాయి. చాళుక్యుల ఆ పెద్ద దండు వీరి ప్రాంతం మీద నుంచి వెళ్ళింది. వారి ఆకృత్యాలకి వీరి పదిహేను గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. అప్పుడు చాటు నుంచి వీరు చూపిన ప్రతిఘటనకి చాళుక్యసేన చెదిరి, త్వరగా ఆ ప్రాంతం నుంచి వెళ్ళిపోయినా, మనసులో వీరిమీద కక్ష పెట్టుకున్నారు. ఆ ప్రాంతం మీద పట్టుకోసం ఆ తర్వాత చాళుక్యులకి, ఇతరులకి జరిగిన ప్రతి దండయాత్రలో బోయలు తీవ్రంగా నష్టపోయారు.

వారి ధన, మాన, ప్రాణాలకి హాని జరిగింది. పది పదిహేను ఏళ్ళ దండయాత్రలు, వరుసగా రెండేళ్ళు వర్షాలు లేకపోవటంవల్ల బోయలకి అక్కడ ఉండలేని పరిస్థితి ఎదురైంది. వేంగి సామ్రాజ్యాన్ని పూర్తిగా తన అధీనంలోకి తెచ్చుకోవటానికి సత్యాశ్రయ మహారాజు మరింత పెద్ద సైన్యంతో వచ్చి విరుచుకుపడ్డాడు. తమని గతంలో బోయలు బంటు దెబ్బ తీశారని కసితో తరచుగా వీరిని హింసలపాలు చేశారు.

క్రీ.శ. 624లో చాళుక్య సత్యాశ్రమ పులకేశి వేంగిని స్వాధీనపరచుకుని, తన తమ్ముడు కుబ్జ విష్ణు వర్ధునుని రాజుగా నియమించాడు. పగపట్టిన వారి మధ్య ఉండటం ఇష్టం లేక వలసకి నిశ్చయించుకున్నారు.

వీరన బోయడు తమకు తగిన స్థలంగా కందుకూరు సమీపంలో వంగవోలుకు తూర్పుగా విస్తారమైన చిట్టడవుల ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. కందుకూరులో వున్న పల్లవరాజ ప్రతినిధిని దర్శించి, బోయలందరు ఆ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకోటానికి అనుమతి పొందాడు. ఆ ప్రాంతంలో కొంత


కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్లై

భూమిని వ్యవసాయానుకూలంగా ఆరునెలల కాలంలో పరివర్తన చేసి, కొన్ని ఇళ్ళు కట్టించాడు. ముందు మూడు బోయపాళెముల వారిని అక్కడికి తరలిస్తున్నాడు. త్వరలోనే అందరినీ అక్కడికి చేర్చే ప్రయత్నం వీరబోయన దొరది. ఓ మనిషి ఒక ప్రాంతం నుంచి, అపరిచిత ప్రాంతానికి వలసవెడితేనే ఎంతో ప్రయాస. అలాంటిది ఓ తెగ, ఓ సమూహాన్ని తరలించటం మరెంతో కష్టం. ముఖ్యంగా చెదిరిపోయిన వారి మనసుల్లో ధైర్యం నింపాలి.

కందుకూరు పరిసరాల్లోని నివాసం చేరాక వీరబోయనుడు తనవాళ్లని ఉద్దేశించి.. “మన దేశమున మనము పడరాని ఇడుములు పడినాము. పొందరాని నష్టములు పొందినాము. మన మనుష్యులను కోల్పోయినాము. పశువులు పోయినవి. ధనము, ధాన్యము కొల్లబోయినది. అక్కడ బ్రతుకలేక ఇట్లు వలస రావలసి వచ్చినది. అంతమాత్రముచేత మనము ధైర్యము కోల్పోరాదు. మనము బోయదొరలము. ధైర్యమే మన బలము. కష్టపడుటయే మన ఊపిరి. ఇదికూడ మన కన్నతల్లి భూమాతయే. వేరే లోకము కాదు. మనము ముందు వచ్చియున్నాము. తక్కిన పాళెములవారును తొందరగానే వత్తురు. వారికొరకు మనము కొన్ని సౌకర్యములుచేసి పెట్టవలెను” అని చెపుతూ వారిని ఉత్తేజపరిచాడు. నూతనోత్సాహంతో వారు కొత్త జీవితం ఆరంభించారు.

కొద్ది నెలలలోనే మిగిలిన బోయలు వీరిని అనుసరించి అక్కడికి చేరి నివాసం ఏర్పరుచుకున్నారు. గుండ్లకమ్మ, ముస్సివాగుకు మధ్యగల ప్రదేశంలో మొత్తం పన్నెండు బోయ కొట్టములు స్థిరపడ్డాయి. అటు చాళుక్యులు, ఇటు పల్లవుల మధ్యనున్న వీరిది స్వతంత్ర జీవనం. స్వయంపరిపాలన. వీర బోయనుడితో ఆరంభమై నన్ని బోయడు, పొన్ని బోయడు పిల్లల వరకూ ఏడుతరాల పైబడిన వీరి జీవితాన్ని పిళ్ళైగారు అద్భుతంగా ఆవిష్కరించారు. పల్లవుల, చాళుక్యుల మధ్య బతికిన బోయ కొట్టముల మీది పై అధికారం కొంతకాలం పల్లవులు, మరికొంత కాలం చాళుక్యుల మధ్య మారుతూ వచ్చింది. ఎవరు దండెత్తి గెలుపు సాధిస్తే వారిదే అధికారం.

ఇటువంటి రాజకీయ అనిశ్చితస్థితిలో తమ స్వతంత్ర జీవితాన్ని నిలబెట్టుకుని విరోచితంగా, సవ్యంగా, సగర్వంగా బతికిన బోయుల చరిత్ర ఇది. వారి ఆత్మాభిమానం అసామాన్యమైనది. సామ్రాజ్య విస్తరణ, రాజ్యకాంక్షే

ప్రముఖంగా ప్రభువులు ప్రవర్తించిన కాలంలో, ఎన్నో చిన్నా పెద్ద యుద్ధాలతో అల్లకల్లోలంగా గడిచిన సమయంలో, చక్కటి ప్రశాంత, యుద్ధవిముఖ, ఆత్మాభిమానపూరిత వీర జీవితం కోసం తమ సర్వస్వం ఒడ్డిన బోయల స్ఫూర్తి పిళ్ళె గారి చేత ఇంతటి బృహత్ నవలని రాయించిందనిపిస్తుంది.

పల్లవ, చాళుక్య చరిత్ర, బోయల జీవితంతోపాటు, శ్రీకరణం బాలసుబ్రహ్మణ్య పిళ్ళె గారు ఈ నవలలో సరిజోడుగా నడిపిన మరికొన్ని ముఖ్య అంశాలు వున్నాయి. వాటిలో ముఖ్యమైనది తెలుగు కవితా ప్రారంభం, దాని ఎదుగుదల.

'ప్రాఙ్నన్నయ యుగానికి చెందిన తెలుగువాడి చరిత్ర, శాస్త్రం, సాహిత్యం అన్నీ కనుమరుగైపోయాయి. అదృష్టవశాత్తు శిలాశాసనంలో చోటు దొరకడంవల్ల క్రీ.శ. 848 లో రచించబడ్డ ఓ తెలుగు పద్యం కాలానికి ఎదురీది నిలిచింది. ఈ పండరంగని అద్దంకి పద్యశాసనం గుండ్లకమ్మ తీరంలో అద్దంకి వేయిస్తంభాల గుడి పరిసరాల్లో 1900 ప్రాంతంలో లభించింది. తెలుగు భాషకు భారతప్రభుత్వం ప్రాచీన హోదా పట్టాన్ని కట్టబెట్టడానికి నిలువెత్తు సాక్ష్యంలా నిలిచింది ఈ శాసనం' అంటూ ఈ నవల ముందుమాటలో గాడేపల్లి దివాకరదత్తు గారు మరిన్ని విషయాలు రాశారు. ప్రాఙ్నన్నయ యుగంలో తెలుగు సాహిత్య స్వరూపం ఇలా ఉండేదేమో అనే అంచనాకు రావటానికి ఈ నవల ఉపయోగ పడుతుంది. మార్గ కవిత్వం (సంస్కృత కవిత్వం) లోకంలో ప్రశస్తంగా ఉండగా, సత్యాశ్రయ పులకేశి (బాదామి చాళుక్యరాజు). దేశకవితను (దేశీయమైన తెలుగు కవిత్వం) పుట్టించి, తెలుగున నిలిపారని నన్నెచోడుడు *కుమార సంభవం*లో పేర్కొన్నాడు. తరువోజ, సీసం, ఆటవెలది, తేటగీతి, మధ్యాక్కర వంటి పద్యాలన్నీ దేశి కవితలే. వీటి ఆధారంగా పిళ్ళెగారు దేశీయచ్ఛందాల పుట్టుకను అలరింపుగా అందించారు.

అందుకోసం యతులు, ప్రాసలు, సంధులు లేని కొన్ని పద్యాలను రచించి, తెలుగు పద్యం ప్రాథమిక దశలో ఇలా ఉండవచ్చు అని చూపారు. తమిళులకు పూర్వమే, తెలుగువారు మంచి కవిత్వం చెప్పారని, *గాథాసప్తశతి* ఉటంకిస్తూ చక్కటి సంఘటనని కూర్చారు. తెలుగు కవిత్వ ఆవిర్భావ, క్రమ దశలతోపాటు, పిళ్ళె గారు లిపి, భాషా సంబంధమైన పలు అంశాలని వివరంగా చర్చించారు. దొరికిన చారిత్రిక ఆధారాలకి, తమ ఊహని జోడించి ఓ క్రమాన్ని సాదృశం చేశారు. ఈ నవలను పిళ్ళెగారు సరళ గ్రాంథికంలో రాశారు. నవల ప్రాచీన కాలానికి చెందినదవటంవల్ల అన్యదేశ్యాలను వాడకుండా, దేశ్య తత్సమ తద్భవాలతోనే రచన సాగించారు. కనుమరుగైన దేశ్యపదాలను ఆత్మీయంగా స్వీకరించి, ఈ నవలలో తిరిగి వాడారు. ద్విపదకి తరువోజ పద్యానికి గల సాన్నిహిత్యం ఎత్తిచూపారు. ఈ రకంగా ఈ నవల కొంతవరకూ భాషాచరిత్ర కూడా.

రాజ్యాధికార సుస్థిరత కోసం, భాషని తెలుగువారము అన్న నినాదాన్ని సత్యాశ్రయ పులకేశి, ఆయన తరువాత జయసింహ వల్లభుడు ఏ రకంగా ప్రచారం చేశారో పిళ్ళె గారు ఈ నవలలో మరో పాయలారాసుకు వచ్చారు. పల్లవులు కందుకూరు ప్రాంతంలో బోయల వలసని సమర్థించటానికి గల రాజ్యరక్షణ రహస్యాన్ని మరో పాయగా రాశారు పిళ్ళె గారు. ఇలా వివిధ పాయలని కలుపుకుంటూ, ఆయా కాలాల రాజకీయ పరిస్థితుల్ని సూత్రంగా చేసుకుని సాగించిన ఈ నవల రచనాశిల్పం, అల్లికల్ని ఎంత మెచ్చుకున్నా తక్కువే.

బోయ కొట్టములు ఏర్పరచిన వీరబోయనుడు, అతని తరువాత మంగసాని, తాత పేరే పెట్టిన వీరనబోయడు, పృథ్వీ వ్యాఘ్రరాజు (పులిరాజు), కేసవన బోయడు, అతని మనుమలు నన్నిబోయడు, పొన్నిబోయడు. ఈ క్రమంలో సాగిన బోయకొట్టముల చరిత్ర పిళ్ళె గారి అద్భుత కూర్పు. వలస వచ్చిన చిన్న స్థితి నుంచి బోయ కొట్టములు నెమ్మదిగా స్థిరపడటం, వ్యవసాయ పశు అభివృద్ధి, నెమ్మదిగా ఎందరో ఇతర వృత్తుల వారు అంటే కమ్మరి, మంగలి, సాలె, తదితరులు వచ్చి కలిసి వీరితో ఉండటం, చిన్న రాజ్యంగా ఎదిగి ఈ బోయ కొట్టములు వెలుగొందటం, వీరి వస్త్ర వ్యాపారం బైటి వ్యాపారుల దృష్టికి వచ్చి సముద్రం దాటి విస్తరించటం, రేవు పట్టణాల మీద పట్టు సాధించి సుంకం వసూలు చేసుకునే స్థితికి చేరటంలాంటి పలు జీవనాంశాల్ని ఎంతో ప్రతిభావంతంగా ఏడు తరాల చరిత్రగా మన ముందుకు తెచ్చారు పిళ్ళె గారు.

కరణం బాలసుబ్రహ్మణ్య పిళ్ళెగారు, ఓ శాసనం చూసి నవల రాయాలన్న ప్రేరణ పొందటం చిత్రం. అదీ చరిత్ర పుటల్లో ఓ మూల ఓ వాక్యంగా వున్న విషయాన్ని ఏడుతరాల

బోయకొట్టములు పండ్రెండు - నవలలో ప్రస్తావింపబడిన ప్రదేశములు.



చరిత్రగా తీర్చిదిద్దటం మరీ చిత్రం. దీనికి వారు చేసిన కృషి, శ్రమ గొప్పవి. పరిశోధనకి సంవత్సరం, రాయటానికి పదిహేను నెలలు పట్టినా ఫలితం దక్కింది. *బోయకొట్టములు పండ్రెండు* నవలలో అంతర్భాగంగా వున్న పలు విషయాలు ఎంతో విలువైనవి. వెలుగులోకి తప్పక రావలసినవి. రచయితకి కలిగిన ప్రేరణ, అంతర్దృష్టి ప్రత్యేకమైనవి. ఆయన మాటలలోనే "...సాధారణముగా చరిత్రకారులు జయించినవానిని కొనియాడుదురు. ఓడినవాని పాట్లునెన్నరు. పైపెచ్చు చులకన చేసి మాట్లాడుదురు. ఇంక దండయాత్ర సాగిన మార్గములోనూ, యుద్ధభూమి యొుక్క పరిసరములలోను ఉండు సామాన్య జనుల అగచాట్లను గురించియు, కష్టనష్టములను గురించియు మాట్లాడువాడెవడు? అలెగ్జాండరు, చెంఘిజ్ ఖాన్, అశోకుడు, మాలిక్ కాఫర్ మొదలగు విజేతలందరిని చరిత్రకారులు అట్లే కీర్తించిరి. వారి వలన జరిగిన విధ్వంసమును ప్రస్తావింపరైరి.

యుద్ధమనగానేమి? నరమేధము, విధ్వంసము, తగులబెట్టుట, రెండు పక్షములవారును చేయునది ఇదియే. యుద్ధమున విజేత అనగా ఎవరు? పై ఘోర కార్యములను నిర్దాక్షిణ్యముగా, నిష్కారుణముగా సాగించుటలో ఎవడు పైచేయి సాధించునో వాడు విజేత. దాదాపు రెండు వందల సంవత్సరాల కాలవ్యవధిలో ఆవిర్భవించి, విస్తరించి, అభివృద్ధి పొంది, ఒక వెలుగు వెలిగి, ఆత్మాభిమానంతో బతికిన పన్నెండు బోయ కొట్టములు, ఒక్కరోజు.... కేవలం ఒక్కరోజు యుద్ధములో సమూలంగా నేలమట్టమయ్యాయి.

పండరంగడు తన తండ్రికి బోయవారి వల్ల కలిగిన యుద్ధావమానానికి ప్రతిగా, కక్షతో ఈ వినాశనం చేశాడు. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన పండరంగడి ప్రాణాలు కాపాడిన వైద్యుడు ఆదిత్య బటరనికి కొంత భూమి దానం చేశాడు. శాసనప్రకారం ఇదీ కథ. యుద్ధాల దారుణ ముఖచిత్రాన్ని వివరంగా మరొక కొత్త కోణంలో సామాన్య ప్రజల పక్షం నుంచి చూపించటం పిళ్ళైగారి ప్రధాన పూనిక. ఈ పనిని ఎంతో రసబంధురంగా నిర్వర్తించారు.

ఆనాటి కాలాన్ని తన ఊహలో నిలుపుకుని అప్పటి యుద్ధ తీరుని తనే ఓ సైనికుడిలా భావించుకుని, ఈ నవలలో బోయల పోరాటాన్ని, విలువిద్యా ప్రదర్శనలని ఆయన ఎంతో చాతుర్యంతో రూపుకట్టించారు.

యుద్ధంలో దొరికిన దోషుల్ని కొరత వెయ్యటం, పసివాడికి విషం పెట్టిన నాగసానిని సున్నపు రాళ్ళలో విడగబోయడం (సున్నపు నీళ్ళలో ఉడికించి చంపటం) లాంటి బీభత్స దృశ్యాలలో ఆ రసం ఎంతో తీవ్రంగా వుంది. అలాగే ప్రణయ దృశ్యాలలో, సాహితీ సమావేశాల్లో, ప్రకృతి వర్ణనల్లో పిళ్ళైగారు గొప్ప నేర్పుని చూపించారు. వీరత్వం, ధీరత్వం నిండిన మంగసాని, అన్నెమ, వకుళ లాంటి అద్భుత స్త్రీ పాత్రలున్నాయి.

ఈ నవలని వచన మహాకావ్యం అన్నారు గాడేపల్లి దివాకరదత్తు గారు. రసపుష్టి, చక్కటి ప్రణాళిక, మంచి నడక వున్న చక్కటి నవల ఇది. అప్పటి కాలాన్ని కళ్ళముందు నిలిపిన గొప్ప శైలి వుంది రచనలో. హెగ్గడికత్తె, ముమ్మొనవాలు (త్రిశూలం)లాంటి పదాలని కూర్చటం మరో ప్రత్యేకత. 'సామ్రాజ్యము సంపన్నమగుటకు రేవు పట్టణములే కదా ప్రధాన సాధములు', అదే పనిగా పగపట్టిన వారి మధ్య ఎంత కాలము బ్రతుకగలము', 'వ్యవహారము నుండి శాస్త్రము పుట్టును కాని శాస్త్రము నుండి వ్యవహారము పుట్టదు'...లాంటి కీలకమైన వాక్యాలు సందర్భానికి ఆయువుపట్టువై నడిపించాయి.

కాలం, చరిత్ర, భాషాసాహిత్య క్రమపరిణామం, బోయల ప్రత్యేక జీవనం, యుద్ధ దాహం, జీవన ప్రణయం, ఇలా ఎన్నెన్నో కలగలసిన, మేలిమి కూర్పుగా రూపుదిద్దుకున్న అరుదైన విస్తృత నవల *బోయ కొట్టములు పండ్రెండు*. ఈ నవలని ఆసాంతం చదివితే ఓ సుదీర్ఘ ప్రయాణం చేసిన అనుభూతి కలుగుతుంది.

తమ ముందుమాటలో పిళ్ళై గారు, తాము సేకరించిన చరిత్రాంశాలు ఆరింటిని ఓ పట్టికలా ఇచ్చారు. అలాగే వారు



ఈ నవలలో చేసిన ప్రధాన కల్పనల పట్టిక కూడా ఇస్తే, అంటే ఏ పాత్ర, ఏ సంఘటన పూర్తిగా కల్పితాలో, చరిత్ర విషయంలో మరింత స్పష్టంగా వుంటుంది. మి

వి. రాజారామమోహనరావు
హైదరాబాదు

జ్ఞానపీఠం పై స్త్రీలు

– మంతెన సూర్యనారాయణ రాజు

బెంగాలీ సాహిత్యంలో చిరస్మరణీయులైన రచయిత్రులుగా పేరుపొందిన ఇద్దరిలో 'గ్రాండ్ ఓల్డ్ లేడీ'గా పిలవబడే ఆశాపూర్ణాదేవి ప్రథమురాలైతే, మేథో కలంలో మానవతా సిరా నింపుకున్న మహాశ్వేతాదేవి రెండవ సమర్థురాలైన రచయిత్రిగా నిలుస్తారు. ముందుగా వయసు రీత్యా1976లో 'జ్ఞాన్‌పీఠ్'అవార్డు గ్రహీతగా, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఆశాపూర్ణాదేవి గురించి తెలుసుకుందాం!

ఆశాపూర్ణాదేవి :

ఈమె నూటికి నూరుపాళ్లూ బెంగాలీ రచయిత్రిగా యావద్భారతదేశ ఖ్యాతినార్జించిన సాహిత్య వేత్తగా సుపరిచితురాలు. ఇరవయ్యో శతాబ్దంలో బెంగాలీ సాహిత్య పరిణామక్రమం గురించి చెప్పుకోవలసివచ్చి నట్లైతే ఆకాశం మీదే కాదు అక్షరం మీదా వంగదేశపు మహిళా రత్నాలు తమతమ హక్కుల్ని కోరుకున్న దాఖలాలు ఎన్నో అగుపిస్తాయి.బెంగాలు రాష్ట్ర మహిళ ఈ శతాబ్దిలోనూ చాకలి పద్దులు వ్రాసేటందుకో, పుక్కిటి పురాణాలు వల్లెవేసేటందుకే తనకు వానాకాలం చదువు నేర్పిస్తానంటే ససేమిరా అంగీకరించే వీలు లేదు. వారివారి హృదయ స్పందన ఎటువైపు సాగితే అటు ప్రతిస్పందించి కలం సాగించాలన్న ధ్యేయంతో ఉన్నారు. ఆశాపూర్ణాదేవి ముందుతరం రచయిత్రిగా, అక్షరాలమీద అధికారం కోసం కలం పట్టిన వ్యక్తిగా పేరుతెచ్చుకున్నది.

ఆశాపూర్ణాదేవి

మొట్టమొదటిసారిగా బెంగాలు రాష్ట్రంలో మహిళకు ఇటువంటి సామాజిక స్పృహ రావడం ఆమెతోనే ప్రారంభమైనదని చెబుతారు. ఈమె తన 13 వ ఏట నుండి రచనావ్యాసంగం ప్రారంభించినది. తాను రచయిత్రి కావడానికి ముందు ఆమె సంప్రదాయ పద్ధతిలో విద్యాభ్యాసం చెయ్యలేకపోయింది. ఆడపిల్లలకు చదువెందుకు అనే ప్రశ్న రాజ్యమేలుతున్న కాలంలో ఆశా ఇంటిదగ్గరే విద్యనభ్యసించింది. ధైర్యంతో ఆమె ఆనాటి సమాజంలోని స్త్రీలకు జరిగేటటువంటి అన్యాయాల్ని ఎదురించేందుకు కంకణధారిగా నిలిచి, తన కలాన్ని కత్తిగా చేసుకొని రచనలు చేస్తూ వచ్చింది. ఆశాపూర్ణాదేవిలో ఎంతటి ఆలోచనాస్రవంతి, పట్టుదల, కృషి, అభ్యుదయ భావాల పరంపర పుట్టుకొచ్చిందో గమనించినట్లైతే ఆశ్చర్యం కలగకపోదు. కడు సాహసిగా రచయిత్రి అవతారం ఎత్తి పురుషాధిక్య ప్రపంచంలో కూడా వంగ నారీమణుల గుండె చప్పుళ్లను భారతీయ సాహిత్యంలో వినిపించగలిగింది. ఆమెకు ఒక అభ్యుదయ కామనగల స్త్రీగా కొన్ని స్థిరమైన అభిప్రాయాలు ఉన్న కారణంగానే నాటికీ నేటికీ ఆశాపూర్ణాదేవి పేరు చిరస్మరణీయమై మార్మోగింది.

కుటుంబపరంగా చెప్పాల్సొస్తే ఆమె మాతృమూర్తి, సాహిత్యాభిమాని, తండ్రి ఒక చిత్రకారుడు. ఇంట్లో నెల కొన్న లలిత కళాసంబంధమైన వాతావరణం కారణంగా ఆమె ఆలోచనాసరళి, అభ్యుదయ దృక్పథం, ప్రతిభా పాటవాలు ఒక చైతన్య స్ఫూర్తిగల రచయిత్రిగా ఆలోచింపజేశాయి. భారతీయులందరికీ ప్రాచుర్యంగల పండుగ దీపావళి పర్వదినాన ఆమె వివిధ బెంగాలీ పత్రికలలో పలు రచనలు ప్రారంభించి, అనంతర కాలంలో వంగదేశమంతా పాఠకాభిమానులను సంపాదించుకున్నది. తన జీవితకాలంలో ఆమె 200 లకు పై చిలుకు నవలలు, 30 చిన్న కథల సంపుటాలు, ఇంచుమించు 50 వరకూ బాలసాహిత్య గ్రంథాలు రచించి గణనీయమైన ఖ్యాతిని స్వంతం చేసుకున్నది. ఆశాపూర్ణ రచనల్లో ఒక్క బాల సాహిత్యం మినహా మిగిలిన రచనలు చాలమటుకు వివిధ

భారతీయ భాషల్లోకి తర్జుమా చేయబడ్డాయి. ముఖ్యంగా ఆమె తాను రాసిన ప్రతి కథలో, నవలలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించి లక్షలాది పాఠకులకు స్ఫూర్తి ప్రదాతగా నిలబడింది. ఇంకా ఎక్కువగా తను రాసిన నవలల్లో ప్రాథమికంగా స్త్రీల మనస్తత్వాన్ని సమగ్రంగా చిత్రిస్తూ వచ్చింది. అట్టి రచనల్లో *'ప్రతిస్పతి', 'సువర్ణలతా', 'వకుళ కథ'* అనే మూడు నవలల్లో మూడు తరాలకు చెందిన స్త్రీలను చిత్రించడం చాల విశేషంగా భావించాలి. ఈమె విరచిత ప్రతిష్ఠాత్మకమైన నవలల్లో బాగా పేరు తీసుకొచ్చినవైతే *'మాయాజాల్', 'అగ్నిపరీక్ష', 'కొఖోనో దీన్ కొఖోనో రాత్'*గా పేర్కొనాలి. కథావికాసం సంపుటాలలో 'శల్పపంచాశత్' మొదటి వరుసలో నిలుస్తుంది.

ఆశాపూర్ణా భౌతిక సౌందర్యాకర్షణను నిరాదరించగల వాళ్ల ప్రేమలో సత్యసంధతను, గాఢతను నిరూపించ గలందులకు అంగవైకల్య కల్పనకు సాంకేతికమైన యుక్తిగా ఉపయోగించడం గమనించాల్సిన అంశం. ఆమె సృష్టించిన పాత్రలు కొత్తకొత్త రూపాలలో అలరారుతుంటాయి. ముఖ్యంగా పాఠకుల్ని ఆలోచింపజేయగల కథావస్తువుతో అందుకు అనుగుణమైన పాత్రల్ని సృష్టించడంలో ఆశాపూర్ణ నిష్ణాతురాలు. ఆశాపూర్ణ 1944లో కేంద్రసాహిత్య ఫెలోషిప్, పశ్చిమబెంగాల్ ప్రభుత్వ 'రవీంద్ర పురస్కార్', పద్మశ్రీ అవార్డు, 1954లో 'లైలాప్రైజ్', 1963లో 'భువన్ మోహినీ దాస్ గోల్డ్‌మెడల్', 1966లో 'రవీంద్ర మెమోరియల్ ప్రైజ్', 1976లో 'జ్ఞానపీఠ్' అవార్డు, 1988వ సంవత్సరంలో 'హరనాథ్‌ఘోష్ మెడల్' – వంటివెన్నెన్నో స్వంతం చేసుకోగలిగింది. 1995 జులై 13వ తేదీన ఆమె తన 86వ ఏట తనువు చాలించింది. వంగ సాహిత్య లోకంలో ఆశాపూర్ణాదేవి ఒక తారగా ఈ అనంత సాహితీ విశ్వాంతరాళంలో నిలిచిపోగలిగింది.

మహాశ్వేతాదేవి :



మహాశ్వేతాదేవి

ఆశాపూర్ణ దేవి తరువాత అత్యంత ప్రతిభా వ్యుత్పత్తులు గల అరుదైన మంచి రచయిత్రి గానే కాక, ఒక సామాజిక కార్యకర్తగానూ ఆదరణపొందిన బెంగాలీయుల ఆడబడుచు మహాశ్వేతాదేవి. మహాశ్వేతాదేవి మేధావి కుటుంబంలో జన్మించినది. ఆమె తల్లి ధరిత్రీదేవి, రచయిత్రి, సంఘసేవకురాలు కూడా. తండ్రి ఘటక్ ప్రముఖ కవి, రచయిత. వారి పినతండ్రి 'రిత్విక్ ఘటక్' బెంగాలీ చిత్రాల దర్శకుడు. శ్వేత సోదరుడు శంఖాచౌదరి శిల్పి. మరోసోదరుడు సచిన్ చౌదరి 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ ఆఫ్ ఇండియా' పత్రికాస్థాపకుడు.

1926 జనవరి 14వ తేదీన ఢాకాలో అంటే ప్రస్తుత బంగ్లాదేశ్‌గా వ్యవహరించబడుతున్న తూర్పు బెంగాల్‌లో మహాశ్వేతాదేవి జన్మించింది. దేశవిభజన సమయంలో వారి కుటుంబం పశ్చిమ బెంగాల్‌లో స్థిరపడిపోయింది. ఆమె విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నెలకొల్పిన 'శాంతినికేతన్'లో విద్యనభ్యసించినది. 'విశ్వభారతి' విశ్వవిద్యాలయంలో డిగ్రీచేసి, కోల్‌కతా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లీషు లిటరేచర్ చేసిన విద్యాధికురాలు. శ్వేత ఆనాటి బెంగాలీ నాటకకర్త, నటుడైనా 'బిజోన్ భట్టాచార్య'ను వివాహమాడింది. ఆ దంపతులకు 'నబరున్ భట్టాచార్య' జన్మించాడు. 1959లో మహాశ్వేతా దేవి ఏవో కారణాల మూలంగా భర్త నుండి విడాకులు తీసుకోవడం సంభవించింది. ఆమె కుమారుడు 'నబరున్ భట్టాచార్య' కూడా విద్యాబుద్ధులు నేర్చిన మీదట తాను బెంగాలీ సాహిత్యంలో గొప్ప ప్రశంసలందుకున్న రచయితగా వాసికెక్కాడు. మేధోశక్తితోబాటు ఆధ్యాత్మిక పరిమళాలు అద్దినట్లుగా ఉంటాయి నబరున్ యొక్క రచనలు.

1964 ప్రాంతంలో మహాశ్వేతాదేవి 'బిజోఘర్ కళాశాల'లో బోధన చెయ్యడం ప్రారంభించింది. ఇది ఉద్యోగం చేసే స్త్రీలకు ఉద్దేశించిన కళాశాల. దీనిలో పనిచేస్తూనే ఆమె జర్నలిస్టుగా పనిచేయడం విశేషం. అక్కడ ఉండగానే శ్వేతాదేవి సృజనాత్మక రచనలకు స్వీకారం చుట్టారు. తాను ఒక రచయిత్రిగా అట్టడుగు వర్గాల ప్రజల, వారి స్థితిగతులే ఆమె రచనలకు ఆధారభూతమైనాయి. ఎక్కువగా దళిత స్త్రీలే శ్వేతాదేవి రచనల్లో ప్రధాన పాత్రలుగా దర్శనమిస్తారు. పశ్చిమ బెంగాలులో గల 'ధాస్, షాబరీస్' – అనే గిరిజన తెగలకు సంబంధించిన జీవితాల తాలూకు మహిళల దుఃఖభూయిష్టమైన దుర్భర జీవన శైలిని ప్రతిబింబిస్తూ అక్షరరూపం ఇవ్వడం మూలంగా ఆమె పేరు దేశం నలుదిశలూ మార్మోగిపోయింది. కేవలం స్వరాష్ట్ర సంబంధమైన అంశాలతోనే సరిపెట్టక తన సాహితీ

మహాప్రస్థానంతో ఆమె బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ – ట్రైబల్ తెగలవారి గురించి కూడా ఎంతో పోరాటం జరిపిన దాఖలాలు అగుపిస్తున్నాయి. యదార్థానికి వారెంత పాశవికమైన అణచివేతకు ఏ విధంగా గురౌతున్నారో, అంటరానితనం వికృతరూపం ధరించి వేధిస్తున్నదీ సాక్షాత్కరింపజేసింది. అగ్రవర్ణాలుగా చెలామణిలో వున్న భూస్వాములు, వడ్డీవ్యాపారులు, అవినీతిపరులైన ప్రభుత్వ అధికారులు, లంచగొండుల దుష్టనీతిని, దౌర్జన్యాల్ని తన సాహిత్యం ద్వారా, సామాజిక కార్యకర్తగా ఆవిష్కరిస్తూ రచనలు చేస్తూ బహిర్గతం చేసినందుకు శ్వేతాదేవిని తప్పక అభినందించి తీరాలి.

ఆమె కలం నుండి *ది క్వీన్స్ ఆఫ్ ఝాన్సీ, హజార్ చౌరా శిర్‌మూ, అరణ్యేర్ అధికార్* (అరణ్య దురాక్రమణ); *అగ్ని గర్భ, ఛోటీముండా ఏవం తార్ తిర్, ఇమాజినరీ మ్యాప్స్, ధౌలీ, డస్ట్ ఆన్ ది రోడ్, అవర్ నాన్‌వెజ్ కౌ, తీతూమిర్, రుదాలీ, బ్రెస్ట్ స్టోరీస్, ఏక్ కోరీస్ డ్రీమ్, ది బుకాఫ్ ది హంటర్, ద్రౌపది, టిల్ డెత్ డు అజ్‌పార్ట్, ఓల్డ్ విమెన్, కులపుత్ర, దివై-వెగాళ్* – ఇంకా మరెన్నో గ్రంథాలు జాలు వారినవంటే అది అతిశయోక్తిగా అనిపించదు. తాను రచించిన గ్రంథాలలో ఏ ఒక్కటీ ఏ భాషలో రాసినా కాలక్షేపం కోసం రాసినట్లుగా అనిపించవు. అన్నింటినీ శ్రమైకజీవన స్వేదబిందువుల ఘోష, పీడనల రక్తపు మరకల నుంచి పుట్టుకొచ్చినవిగా భావించాల్సి వస్తుంది.

శ్వేత సాహిత్య, సామాజిక సేవల్ని పరిగణనలోనికి తీసుకుని 'సాహిత్య అకాడమీ అవార్డు', 'బెంగాలీ భూషణ్' 'పద్మశ్రీ', 'పద్మవిభూషణ్', 'జ్ఞానపీఠ్' పురస్కారాలతో సత్కారాలు, 'రామన్ మెగసెస్ అవార్డు', 'యశ్వంత్ రావు చవాన్ జాతీయ అవార్డు' వంటి పలు ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు కూడా స్వంతం అయ్యాయి. 90 సంవత్సరాల ఆమె జీవన యాత్రలో నేటికీ సాహిత్యపరంగా ఇంకా ఫేడ్ అవుట్ కాలేదంటే ఆ గొప్పతనం ఆమె వ్యక్తిత్వం, సుదీర్ఘ సాహిత్యపోరాటం అనే చెప్పక తప్పదు.

మహాశ్వేతాదేవి రచనల్ని ఆధారంగా చేసుకుని *సంఘర్ష్, రుదాలీ, హజార్ చౌరాసీకీమా, మాటిమాయ్, గగోర్* – మొదలైన చిత్రాలు రావడం ఆమె రచనా ప్రతిభకు పరాకాష్ఠగా మనం భావించాలి. శ్వేత సాహిత్య, సామాజిక సేవల్ని పరిగణనలోనికి తీసుకుని 'సాహిత్య అకాడమీ అవార్డు', 'బెంగాలీ భూషణ్' 'పద్మశ్రీ', 'పద్మవిభూషణ్', 'జ్ఞానపీఠ్' పురస్కారాలతో సత్కారాలు ఆమెను వరించాయి. వీటికితోడు ఆమెకు 'రామన్‌మెగసెన్ అవార్డు', 'యశ్వంత్‌రావు చవాన్ జాతీయ అవార్డు' వంటి పలు ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు కూడా స్వంతం అయ్యాయి. నేటికీ ఆమె పొందిన ఆ పురస్కారాలకే ఒక ప్రత్యేకమైన గౌరవం పెరిగిందని చెప్పడం బాగుంటుంది. 90 సంవత్సరాల ఆమె జీవన యాత్రలో నేటికీ సాహిత్యపరంగా ఇంకా ఫేడ్ అవుట్ కాలేదంటే ఆ గొప్పతనం ఆమె వ్యక్తిత్వం, సుదీర్ఘ సాహిత్యపోరాటం అనే చెప్పక తప్పదు.

ఈ రచయిత్రుల ద్వయంలో కొన్ని సాధారణ ఉమ్మడి భిన్నలక్షణాలను మనం పరిశీలించినట్లైతే ఇవి దృగ్గోచరాలౌతాయి. అవి క్రింద వివరిస్తాను.

1. స్త్రీ జాతి విలువల్ని, ఔన్నత్యాన్ని ఒకరు ఆవిష్కరిస్తే ఇంకొకరు అవినీతిపరుల, భూస్వాముల, వడ్డీవ్యాపారుల, లంచగొండుల దుర్నీతిని, దౌర్జన్యాలను ఎండగట్టారు.

2. ఇద్దరూ బెంగాలీ మాతృ భాషగా కలవారు, జ్ఞానపీఠ్ అవార్డు పొందినవారు కావడం.

3. తమతమ వంతు సాహిత్య సేద్యం చేస్తూ సమకాలీన సమస్యలను ఆవిష్కరించటం ఒకరికన్నా ఇంకొకరు మరో అడుగు ముందుకు వేయ గలగడం. ఒకరికన్నా ఇంకొకరు సామాజిక సేవలు కూడా చేయడం.

4. ఆశాపూర్ణాదేవి ఒకనాటి అర్థం పర్థం లేని నీతినిబంధనలపై పోరాటం సాగిస్తే – మహాశ్వేతాదేవి బాధాసర్ప ద్రష్టలైన గిరిజనుల, అంటరానివారి గాథల్ని అక్షరీకరించడం.

5. ఈ రచయిత్రుల ద్వయం రచనలలో పదునైన ఆలోచనాసరళి నిక్షిప్తమై ఉంది. అభ్యుదయ మహిళల్ని తయారుచేయాలన్న తపన గోచరిస్తున్నది.

6. వీరిద్దరి కుటుంబ నేపథ్యాల్నీ పరిశీలించినట్లైతే మేధావి కుటుంబాల నుంచి సాహిత్య సామాజిక రంగాలలో వచ్చినట్లుగా అనిపిస్తుంది.

ఇంకో ముఖ్య విషయం వీరు భావితరాలకోసం స్త్రీ రచయిత్రుల ఔన్నత్యాన్ని పెంచడం కోసం పాటుబడిన నారీమణులుగా బెంగాలీ సాహిత్య చరిత్రలో సముచిత స్థానాన్ని సంపాదించుకోగలిగారు. ⓜ

శిల్పంలో స్త్రీ...

– సంజీవదేవ్

సౌందర్యానుభూతి, సామాజిక ప్రయోజనమూ వేర్వేరా? రెండూ ఒకటి కావా? సౌందర్యానుభూతి సమాజానికి హితం చేకూర్చక అహితం చేకూరుస్తుందా? 'సత్యం శివం సుందరం' అన్నప్పుడు సుందరం అనేది సత్యానికంటే శివానికంటే భిన్నమైందని కాదు. సత్యం, శివం రెండూ కూడుకొంటేనే సుందరం అవుతుందని. అసత్యమైందీ, అశివం అయిందీ సుందరం కాజాలదు. అసుందరం మాత్రమే అవుతుంది. సౌందర్యం అనేది ఎల్లప్పుడూ ఉత్తమమైందే. అది సామాజిక ప్రయోజనాన్నే కలిగిస్తుంది కాని ప్రమాదాన్ని కలిగించదు. మానవ హృదయం మీద ఒక్కసారి సౌందర్య ముద్ర పడిందా అంటే అది బతుకుకాలం వరకూ మానవుణ్ణి మంచిగా వుంచుతుంది. కనుక సౌందర్యానుభూతి సామాజిక ప్రయోజనకరమే. ఈ దృక్పథంలో సౌందర్యానుభూతికీ సామాజిక ప్రయోజనానికీ ప్రభేదం లేదు; రెండూ ఒకటే.

ఇక రెండవ దృక్పథంలో అనుశీలిస్తే ఆ రెంటికీ తారతమ్యం గోచరిస్తుంది. సౌందర్యానుభూతి అంటే ఒక కళాకృతిలోని సాంకేతిక నైపుణ్యం మాత్రమే అని విశ్వసిస్తే ఆ సాంకేతిక నైపుణ్యాన్ని సామాన్య ప్రజలు ఆనందించజాలరు. అటువంటప్పుడు అది వారి హృదయాల మీద ఏ ముద్రనూ వేయకుండా విఫలమవుతుంది. కనుక అది వారికి ప్రయోజనం కలిగించజాలదు. సమాజంలోని అధిక సంఖ్యాకులు సామాన్యులే కనుక దాని మూలంగా సామాజిక ప్రయోజనం లేనట్టే అవుతుంది. ఈ దృక్పథంలో సౌందర్యానుభూతి వేరు, సామాజిక ప్రయోజనం వేరు. ఈ రెంటిలో ఏ ఒక్కటి మాత్రమే వున్నది ఉత్తమ కళాకృతి కాజాలదు. రెండూ అటు సౌందర్యానుభూతీ ఇటు సామాజిక ప్రయోజనమూ, వున్నప్పుడే అది ఉత్తమ కళాకృతి కాగలదు.

శిల్పకళంతా కూడ ప్రాచీనకాలం నుంచీ సామాజిక ప్రయోజనం కొరకు నిర్మించబడినదే. అయితే అది నీతిశాస్త్రం ద్వారా సామాజిక ప్రయోజనం కాక సౌందర్యానుభూతి ద్వారా సామాజిక ప్రయోజనం. ప్రేయం ద్వారా శ్రేయం.

శిల్పంలోని స్త్రీ మూర్తులలో 'యక్షి' అనేది ప్రధానం. యక్షి జాతిలోని పురుషుడు 'యక్షుడు', స్త్రీ 'యక్షిణి'. భర్‌హుత్ లోని క్రీ.పూ. రెండవ శతాబ్దానికి చెందిన 'యక్షి' శిలాప్రతిమలు సౌందర్యంలోను, గాంభీర్యంలోను చేతనామయంగా గోచరిస్తాయి. ఈ శిల్పమూర్తుల లోని విశిష్టత బృహత్ స్తనాలు. 'కుచకుంభాలు' అని ప్రాచీన ప్రబంధాలలో వర్ణించిన మాటలకు ఇవి దృష్టాంతాలు. మరో మాటలో చెప్పాలంటే ఇవి శిలల్లోని కావ్యాలు అనవచ్చు!

శిల్పంలో స్త్రీకి ప్రాధాన్యం వుండటానికి మరొక ప్రధాన కారణం ఏమంటే, స్త్రీ శరీరంలోని నిమ్నోన్నతాలు, లయమయమైన వంపులు, కళ్ళలోని కమనీయత, ఒక విధమైన కావ్యకోమలత్వ మొదలైనవి పురుషుల శరీరాలలో కనిపించవు. స్త్రీ శరీర నిర్మాణంలోని ఈ వైశిష్ట్యం కళా నిర్మాణానికి కాంతినివ్వటంలో శిల్పులు స్త్రీ మూర్తులకు తమ శిల్పసృష్టిలో ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతూ వచ్చింది.

అయితే, ఈ స్త్రీ శిల్పమూర్తుల వల్ల సామాజిక ప్రయోజనం ఏమిటి అంటే ఈ శిల్పమూర్తులన్నీ కేవలం శరీర లావణ్యం చూపే నిమిత్తం శిల్పించబడినవి కావు; ఆనాటి ప్రజల ఉపయోగార్థమే శిల్పించబడినాయి. ఆనాటి సమాజంలో భౌతిక ప్రయోజనాలకు తోడు అంతకంటే ముఖ్య ప్రయోజనాలు కూడ వుండేవి. అవి మత విశ్వాసాలు, తాంత్రిక ఆచారాలు, మొదలైనవై వుంటుండేవి. అటువంటివన్నీ మంచివా, చెడువా అనే హేతువాద పరిశీలన విషయం వేరు. మంచివో చెడువో ఆనాటి సమాజంలో అవి వ్యాప్తి చెంది వున్నాయి. ఆ ప్రజల విశ్వాసాల కనుగుణంగా, వారి అవసరాలను తీర్చటానికి ఆనాటి శిల్పులు అటువంటి శిల్పాలను శిల్పించేవారు. కనుక అది సామాజిక ప్రయోజనాత్మకమే. ఈ వైజ్ఞానిక యుగంలో కూడ మనదేశంలో అటువంటి మత విశ్వాసాలకూ, తాంత్రిక ఆచారాలకూ కొరత లేదు!

ఇక మన ఆంధ్ర దేశం లోని శిల్పకళలో స్త్రీ మూర్తుల విషయం. భారత దేశపు అన్ని ప్రాంతాలలో కంటే ఆంధ్ర దేశంలో శిల్పం ఎక్కువనే చెప్పవలసి వుంటుంది. ఇందులో ఎక్కువ బౌద్ధ శిల్పమే. ఇది శాతవాహనుల కాలంలో అంటే క్రీ.పూ. మొదటి శతాబ్దం మొదలు క్రీ.శ. మూడవ శతాబ్దం వరకు వర్ధిల్లింది. గౌతమీ పుత్ర శాతకర్ణి, వాశిష్టీ పుత్ర పులమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి కాలాల్లో ఈ శిల్పం వ్యాప్తి చెందింది. ఈ శాతవాహనుల రాజధాని అమరావతి కావటం వల్ల ఈ శిల్పానికి అమరావతి శిల్పం అని పేరు వచ్చింది.

అమరావతి శిల్పం లోని స్త్రీ మూర్తులు సజీవ స్వరూపాలు, తన్మయ స్వరూపిణులు. అమరావతి శిలా వేదికలు రాతి లోని కావ్యాలు. అమరావతి శిల్ప ఫలకాలలో ఒక ఫలకంలో ఒక స్త్రీ బుద్ధుని ఆరాధిస్తున్నట్లు శిల్పించబడి వుంటుంది. ఆమె లోని లయమయపు వంపులు, ఆ భంగిమ లోని మనోజ్ఞత, ఆ ప్రాణ స్పందన లోని అసమేతన మొదలైనవి వాటికవే సాటి. ఆ వనిత ముఖం లోని తన్మయీ భావం అంటువ్యాధి లాంటిది. ఆ శిల్పాన్ని చూస్తున్నంత సేపూ ఆమెతో పాటు దర్శకుడు కూడ తన్మయీ భావం లో నిండిపోతాడు. అసలు ఆ శిల్పం లోని ఆ స్త్రీని రూపించిన రచనా చమత్కారమే ఒక చమత్కారంగా వుంటుంది. ఇటువంటి రసాత్మకమైన సజీవ స్త్రీ మూర్తులు అమరావతి శిల్పంలో ఎన్నో వున్నాయి.

ఆంధ్ర శిల్పంలో అమరావతి అంతటి తరువాత చెప్పుకో తగ్గది నాగార్జున కొండ శిల్పం. కృష్ణా తీరం లోనే వున్న నాగార్జున కొండను క్రీ.శ. మూడు నాలుగు శతాబ్దాల్లో ఇక్ష్వాకులు పాలించారు. ఆ వంశాన్ని స్థాపించింది శ్రీ శాంతి మూలుడు. వీరి కాలంలో నాగార్జున కొండ శిల్పం రూపొందింది. నాగార్జున కొండ శిల్పాలలో సుందరమైన స్త్రీ మూర్తులెందరో గోచరిస్తారు. అమరావతి శిల్పం లోని స్త్రీ మూర్తులలో లోకోత్తర భావానుభూతి ఎక్కువగా గోచరిస్తే నాగార్జున కొండ శిల్పం లోని స్త్రీలలో శృంగారానుభూతి ఎక్కువగా గోచరిస్తుంది. కొన్ని ప్రాచీన సంస్కృత

కావ్యాలకు శిల్పాల రూపం ఇచ్చినట్లు గోచరిస్తాయి ఈ శిల్పాలు.

నాగార్జున కొండ లోని శిల్ప ఖండాలలోని ఒక దానిలో ఒక సుందరి తనకు ప్రియుడందిస్తున్న మధుపాత్రను నిరాకరిస్తున్నట్లు చెక్కబడి వుంది. ఆమె ముఖంలో గోచరిస్తున్న విముఖ భావాభివ్యక్తి ఎంతో కమనీయంగా రూపొందించబడింది. ఇక్కడ మరొక శిల్పం ప్రణయ జీవితాన ఒక ఘట్టాన్ని చూపిస్తుంది. దానిలో ఒక స్త్రీ ఎడమ మణికట్టు మీద ఒక చిలుక కూర్చొని వుంటుంది. ఆ వనిత ఏదో ఆవేదనలో వున్నట్లు తెలుస్తుంది. తాను ఆ చిలుకకు ఏదో ఇవ్వనున్నట్లు కన్పిస్తుంది. అదే సమయంలో ఆమె ప్రియుడు అక్కడే నిలచి ఏదో తృప్తిగా చిరునవ్వు నవ్వుతూ వుంటాడు. ఈ ఘట్టం "అమరు శతకం" అనే సంస్కృత కావ్యంలో వర్ణించబడి వుంది. నాగార్జున కొండ శిల్పాలలోని స్త్రీ మూర్తులు రసమూర్తులుగా ప్రకాశిస్తుంటాయి.

ఇటువంటి శిల్పంలోని స్త్రీ మూర్తులు సుందరీ మణులే అయినప్పటికీ ఇటువంటి శిల్పాలు 'సమాజ ప్రయోజనానికి' ఏ విధంగా తోడ్పడతాయి అనవచ్చు. ఇప్పటి సమాజానికి అవి రసాత్మకమైన సూక్ష్మ ప్రయోజనాన్నే కలిగిస్తాయి కాని స్థూల ప్రయోజనాన్ని కలిగించవు. అవి ఆనాటి సమాజ ప్రతిబింబాలను చూపుతాయి.

జీవసృష్టికి ప్రధాన పాత్ర స్త్రీదే. జీవం ఒక సృష్టి అయినట్లే కళ కూడ ఒక సృష్టి. అందుకే కళాసృష్టిలో స్త్రీ మూర్తి సర్వతో ప్రత్యక్షం!

వీరి శిల్పాల్లో ప్రాణస్పందనను పొందింది. ఈ విధంగానే, ఆఫ్రికన్ నీగ్రోల దారు శిల్పంలో కూడా స్త్రీ తగిన స్థానాన్ని పొందింది. ప్రపంచంలోని ప్రతి దేశంలోను, ప్రతి దేశంలోని ప్రతి మూలలోను వున్న శిల్పసంపద లోని మూర్తులలో ఎక్కువ భాగం స్త్రీ మూర్తులే. ఒక్కొక్క దేశపు సామాజిక ప్రయోజనాలను బట్టి ఆయా దేశాల స్త్రీ మూర్తుల శిల్పాలు నిర్మించబడినాయి. అయితే, ప్రపంచంలోని ఆధునిక శిల్పం అంతా కూడా ఆధునిక నైరూప్య రీతిలో నిర్మించబడుతూండటంలో అందులో స్త్రీ మూర్తులు కాని, పురుష మూర్తులు కాని అరుదుగా మాత్రమే గోచరిస్తాయి. ఎక్కువగా నైరూప్య రూప కల్పన (abstract construction) మాత్రమే వుంటుంది ఆధునిక శిల్పంలో. ప్రసిద్ధ ఆధునిక ఇంగ్లీషు శిల్పి హెన్రీ మూర్ నిర్మించిన శిల్పాల్లో కొంత అసహజ రూపంలో స్త్రీ మూర్తి తొంగి చూస్తుంటుంది.

ఒక మహా విచిత్రం ఏమంటే, శిల్పకళలో స్త్రీ ఇంతగా వ్యాప్తిని కలిగి వున్నా కూడ స్త్రీ శిల్పులు విరివిగా వున్నట్లు కనిపించరు. సర్వదేశాల్లో సర్వకాలాల్లో కూడా. స్త్రీలలో విరివిగా కవయిత్రులున్నారు, చిత్రకారిణులున్నారు, సంగీతకారిణులున్నారు, నర్తకీమణులున్నారు, నటీమణులున్నారు. కాని శిల్పకారిణులున్నట్లు లేదు. ఆధునికులలో వున్నారు అరుదుగా అక్కడక్కడ శిల్పకారిణులు, మన దేశంలో కంటే విదేశాల్లో. శిలాశిల్పం చాలా శరీర శ్రమతో కూడుకొన్న పని. అందువల్ల ప్రాచీన కాలంలో శిల్పకారిణులుండక పోవటం జరిగి వుండవచ్చు ఆ శరీర శ్రమకు వోర్చుకోలేక. ఇంతకు మించి ఇంకే కారణం కనిపించదు. నేటి శిల్పం ఎక్కువగా బంకమట్టితో తయారు చేసేది కనుక శిలను చెక్కే శ్రమ ఇందులో వుండదు. అందుకే ఆధునిక స్త్రీలు కొందరు ప్రధానంగా చిత్రకారిణులుగా వుంటూ శిల్పాలను కూడ తయారు చేస్తుంటారు అల్పంగా. పురుషుల కంటే ఏ విషయంలోను అబలలు కాని స్త్రీలు శిలలను చెక్కే శ్రమకు బెదిరి వుంటారంటే నమ్మ శక్యం కాకుండా వుంది.

యక్షి యక్షులు గ్రామాలను, నగరాలను, ఇళ్లను వాకిళ్లను రక్షిస్తాయని నాటి ప్రజల నమ్మకం. యక్షి యక్షులు అప్పటి కాపలాదారులు, ద్వారపాలకులు. ఇదే విధంగా రకరకాల ప్రయోజనాల నిమిత్తం రకరకాల శిలా ప్రతిమలు, కంచు విగ్రహాలు మొదలయినవి ఎన్నో నిర్మించబడినాయి. వాటిలో సౌందర్యానుభూతికి కొరత లేనట్టే నాటి సామాజిక స్పృహకు కూడా కొరత లేదు. వనదేవతలు, జలదేవతలు, నాగదేవతలు మొదలైన సుందర స్త్రీమూర్తులెన్నో మన శిల్పకళలో యుగయుగాలుగా ప్రత్యక్షమైనాయి. వీటి నిర్మాణంలో శిల్పులు ప్రదర్శించిన శిల్పనైపుణ్యం అద్భుతం. వీటన్నిటిలో చాలా భాగం గోచరించేది నగ్నసౌందర్యమే. చిరునవ్వులో వున్న ముఖాలు, ముందుకు పొడుచుకు వచ్చిన ఉన్నత స్తనాలు, సన్నని నడుములు, నిమీలిత నేత్రాలు, అభంగ, సమభంగ, త్రిభంగ రీతులలో నిలచి వున్న తీరులు, వీటన్నిటి ద్వారా శిల్పులు స్త్రీత్వానికి ఒక అమరత్వాన్ని ప్రసాదించారు.

పాశ్చాత్య శిల్పాల్లో కూడా గ్రీక్ శిల్పులు, రోమన్ శిల్పులు తమ తమ శిల్ప నిర్మాణాల్లో స్త్రీకి చాలా ప్రాముఖ్యం ఇచ్చారు. క్రీ. పూ. నాలుగవ శతాబ్దం నాటి "వీనస్" ప్రతిమ ఎంతో సహజంగా, సుందరంగా, నగ్నదేహంతో, మూడు వంతుల ముఖం మాత్రమే కనిపించే భంగిమలో నిలచి వుండి, ఎడమ చేతితో తన యోనిని కప్పి, కుడి చేతితో తన స్తనాలను కప్ప ప్రయత్నించినా అవి కప్పబడక కనిపిస్తూనే వున్న తీరులో ఎంతో మనోజ్ఞంగా వుంటుంది! ఇంకెందరెందరో పాశ్చాత్య శిల్పులు స్త్రీకి తమ తమ శిల్పకల్పనలో మహోన్నత రూపాల నిచ్చారు. వారిలో విశ్వవిఖ్యాతి గాంచిన శిల్పి రొడిన్ తన శిల్పసృష్టిలో స్త్రీని ఎన్నో సుందర రూపాల్లో శిల్పించాడు.

టిబెట్, మంగోలియా, చైనా, జపాన్ మొదలైన దేశాలలో కూడా అక్కడి శిల్పాల్లో స్త్రీ తక్కువ స్థానం పొందలేదు. వీరి శిల్పాల్లో "ప్రజ్ఞాపారమిత" అనే దేవి రూపంలో మహాయాన బౌద్ధ శిల్పుల ఉలుల క్రింద స్త్రీ అద్భుతమైన సొబగులను సంతరించుకొన్నది.

తెలుగు గాథాకారులు

– తంగిరాల వేంకట సుబ్బారావు

'**గా**థాకారుఁడు' అను శబ్దమునకు 'వీరగాథలను కూర్చువాఁడు; వీరగాథలను పాడువాఁడు' అని రెండర్థము లున్నవి. 'దేశద్రిమ్మరు'లగు గాయకభిక్షువులే వీర గాథలను కూర్చువారును పాడువారును గావున వారియెడ నీ శబ్దమన్వర్థ మగుచున్నది. గాథాకారుఁడను శబ్దమేకాక 'గాథకుఁడు' అను వేఱొక శబ్దమున్నది. దీనికి 'వీరగాథలను పాడువాఁడు' అని ఒకే యర్థము కలదు. గాయక భిక్షువులు పాడు గాథలన్నియును వారు సమకూర్చినవి మాత్రమే కాదు. ప్రత్యేక కవులచే వ్రాయఁబడిన కథలును గలవు. కావున 'గాథక' శబ్దము గూడ నీ గాయక భిక్షువుల పరముగా వాడవచ్చును.

దేశద్రిమ్మరులగు నీ 'గాథాకారులు' లేక 'గాథకులు' ఆంగ్లదేశమున 'మిన్‌స్ట్రల్స్' (Minstrels) అని పిలువఁబడు చున్నారు. ఫ్రాన్సు దేశమున 'జాంగ్లీర్స్' (Jongleurs), 'త్రోబాదోర్స్' (Troubadours) అను పేర్లతో వ్యవహరించ బడుచున్నారు. 'మిన్‌స్ట్రల్స్' అనునది ఆధునిక ఆంగ్లపదము. ప్రాచీనాంగ్లమున గాథాకారుఁడు 'స్కాప్' (Scop) అని పిలువఁబడెడివాఁడు. ఐర్లండు దేశమున 'బార్డ్' (Bard) అనియు, స్కాండినేవియా (డెనార్మర్క్, నార్వే, స్వీడన్ దేశముల)లో, 'స్కాల్డ్ (Skald) అనియు, జర్మనీదేశమున 'మిన్నేసింగర్' (Minnesinger) అనియు, స్పెయిను దేశమున 'త్రోబాదోర్' అనియుఁ బిలువఁబడుచున్నాఁడు. అరేబియా దేశమున గాథాకారులను 'రావీ'లందురు.

భారతదేశమున నౌత్తరాహులు గాథకులను 'చారణు' లందురు. దేశమంతయు చరించువారు కావున చారణులు కాఁబోలును. వీర గాథల పుట్టిల్లయిన రాజస్థానమునందు 'భోపాలు' 'మిరోసీలు' అనువారు రావణహస్తముతో వీర గాథలను పాడుచుందురు. మధ్యప్రదేశ్‌లో 'రావత్' (Rawat) వర్ణమువారు వీర గాథలను గానము చేయుదురు. తెలుఁగులో 'జంగము'లను శబ్దము దేశసంచారులగు నీ గాథకులకు బాగుగా నన్వయించును. కాని శక్తికథలు, పల్నాటి వీరకథలు, కాటమరాజు కథలు మున్నగు నతిప్రసిద్ధ వీరగాథలను జంగములు పాడుట లేదు. అందుచే జంగమ శబ్దము అవ్యాప్తి దోషదూషితమని భావించి, గాథాకార శబ్దమును స్వీకరించు చున్నాను.

పూర్వకాలమున రాజస్థానములలో నా రాజుల యొక్కయు, వారి పూర్వులయొక్కయు కీర్తిప్రతిష్ఠలను, శౌర్యసాహసములను స్తుతించుటకై, బిరుదులను పఠించుటకై వందిమాగధులు, భట్లు మున్నగువారుండెడివారు. వీరే కాలక్రమమున నా రాజులు చేసిన యుద్ధములపై పాటలను కూర్చి పాడఁదొడఁగిరి. అవియే వీరగాథలు. వానిని పాడువారే 'గాథాకారులు' లేక 'గాథకులు'. ఈ పద్ధతి ప్రపంచమునఁ బ్రతిదేశమందును, బ్రతి రాజాస్థానమందును నుండెడిది. ఇది గాథాకారుల యవతరణమునఁ బ్రథమ ఘట్టము. కాని పాశ్చాత్య విమర్శకులలో 'గాస్టన్ పారిస్' (Gaston Paris) వంటివారు కొందఱింకను వెనుకకుఁబోయి యూహించుచున్నారు. రాజాస్థానములలో మొదట కీర్తిగాయకు లుండెడివారు కారనియు, నాయా ప్రభువులే తమ సాహస గీతములను పాడుకొనెడివారనియు, నా తరువాతి కాలమున వారు గాథాకారుల నేర్పఱుచు కొనిరనియు నీ విమర్శకుల తలంపు. దీనిచే రాజాస్థానములలో గాథాకారుల యవతరణమును రెండవ ఘట్టముగా భావింపవలసియున్నది.

రాజాస్థానములలోని గాథాకారులు ఆయా కులముల వారికి 'యాచకులు'గా మాఱుట మూఁడవ ఘట్టము. రాజులు రాజ్యములు నశించి, ప్రజాస్వామ్యాది నూతన రాజకీయ

వ్యవస్థలు తలలెత్తిన తరువాత, నీ గాథాకారులు రాజా స్థానములను వీడి, పూర్వకాలమున రాజ్యములేలిన ఆయా కులములవారిని యాచించుచు, వారి పూర్వుల గాథలను గానము చేయుచు బ్రతుకుచుండిరి. నేఁటి మన వర్ణ వ్యవస్థలోఁ బ్రతివర్ణము వారికిని నిట్టి యాచకులున్నారు. బ్రాహ్మణులకు 'విప్రవినోదులు' (సూర్యవంశ క్షత్రియులు), క్షత్రియులకు 'భట్రాజులు', వైశ్యులకు 'వీరముష్టులు', యాదవులకు 'కొమ్ములవారు' (మాదిగలు), రెడ్లకు 'పిచ్చుగుంట్లు', 'కమ్మవారికి 'భట్రాజులు' (గుంటూరు కృష్ణా మండలములలో కమ్మవారికిఁ గూడ పిచ్చుగుంట్లే గోత్రములను జెప్పుచున్నారు), వెలమలకు బలిజలకు 'మాలదాసరులు', కంసాలురకుఁ 'బనసవాండ్రు', సాలీలకు 'మిత్ర అయ్యవార్లు' (లేక 'మిత్తరిదాసరులు'), పంచములలో మాలలకు 'మాష్టీలు', మాదిగలకు 'డక్కలవారు' యాచకులుగాఁ గలరు. ఇట్టి యాచకులను బోషించు వర్ణములవారందఱును బూర్వకాలమున రాజ్యవ్యవస్థలో గొప్ప గొప్ప స్థానములను నిర్వహించుయుందురు. బ్రాహ్మణులు మహామంత్రులుగను, దండనాథులుగను; క్షత్రియులు చక్రవర్తులుగను; వైశ్యులు పేరు మోసిన రత్నాల వ్యాపారులు గను; శూద్రులలో రెడ్డి, కమ్మ, వెలమ మున్నగువారు రాజులుగను దండనాథులుగను నుండి యుందురు. ఈ వివిధమగు యాచకులు అప్పటి నుండియు వీరిని ఆశ్రయించి యుందురు.

ఈ యాచకులు సంచార గాయక భిక్షువులుగా మాఱుట గాథాకారుల చరిత్రలో నాల్గవ ఘట్టము. ఆధునిక కాలమున పాశ్చాత్య నాగరికత మహమ్మారివలె వ్యాపించి మన సంప్రదాయములను సంస్కృతిని రూపుమాపుచున్నది. ఫలితముగా మన వర్ణవ్యవస్థలోని వివిధ వర్ణములవారు, తమతమ యాచకులను సోమరులుగా భావించి నిర్లక్ష్యము చేయుట జరుగుచున్నది. దీనివలన గాథాకారులు క్షీణించు చున్నారు. ఇట్టి నిర్లక్ష్యము పాశ్చాత్య నాగరికతా ప్రభావమనుటలో సందేహము లేదు. ఈ యాచకులే మన అమూల్య వీరగాథాసంపదను మౌఖిక సంప్రదాయమున తరతరముల నుండి సంరక్షించిన వజ్రమంజూషికలని అధునాతన పశ్చిమబుద్ధి లెఱుంగకుండుట విచారకరము. ఇట్లు పాశ్చాత్య నాగరికతా ఫలితముగా యాచకులకు ఒకే వర్ణమును యాచించి బ్రతుకుట దుర్లభమైనది. అందుచే వారు అన్ని వర్ణములవారిని యాచించుచు సంచార భిక్షువులుగా మాఱిపోయిరి. వీరిలోఁ గొందఱు వేఱువృత్తులను స్వీకరించిరి. మఱికొందరు చదువు సాములు నేర్చి తమ కులవృత్తినే విస్మరించిరి. ఇది నేఁటి దైన్యావస్థ. ఆంధ్ర జానపదసాహిత్య చరిత్రలో నిది క్షీణయుగము. నాగరికతకు దూరముగా నున్న కొందఱు యాచకులు మాత్రము పూర్వపద్ధతిని వీరగాథల నింకను నెమరువేయుచున్నారు. వీరివలననే ఆంధ్రుల వీరగాథాజ్యోతి కొనయూపిరితోనైనను మినుకుమినుకు మనుచున్నది. ఈ యల్పజ్యోతి సహితము అనతి కాలముననే నాగరికతా ఝంఝానిలముచే 'కొండెక్కఁ'గలదు. దీపముండఁగనే ఇల్లు చక్కఁబెట్టుకొనుట వివేకవంతులగు ఆంధ్రుల కర్తవ్యము. రాఁబోవు పదిసంవత్సరములలో వీనిని సేకరించి భద్రపఱుచు కొననిచో, భవ్యాంధ్రులకు వీరగాథలు గగన కుసుమములు కాఁగలవు!

ఆంధ్రదేశమున సంచార గాయక భిక్షువులు పెక్కు రకముల వారున్నారు: బవనీలు, పంబలవారు, వీరవిద్యావంతులు, కొమ్ములవారు, పిచ్చుకుంట్లు, పూసల బలిజలు, శారదకాండ్రు, వీరముష్టులు, జంగములు, దాసరులు, గరుడ స్తంభపు దాసరులు, భాగవతులు, బీరన్నలవారు, సుద్దులగొల్లలు, గంగిరెద్దులవారు, బాలసంతువారు, బుడబుక్కలవారు, చిందుమాదిగలు, జోగులవారు, జక్కులవారు, హట్కరులు, డక్కలివారు, మాష్టీలు, బొమ్మలాటగాండ్రు- మున్నగు వారలనేకులు గలరు. ఈ గాథాకారులు అతి ప్రాచీన కాలము నుండియుఁ దెలుఁగు నాట వ్యాపించియుండి రనుటకు శ్రీనాథుని (?) క్రీడాభిరామము, పాలవేకరి కదిరీపతి (1650) 'శుకసప్తతి', అయ్యలరాజు నారాయణామాత్యు (1750)ని 'హంసవింశతి' మున్నగు కావ్యములు సాక్ష్యమిచ్చుచున్నవి. ఈ గాథకులలో వీరగాథా గానము చేయుచున్న కొందఱు ముఖ్యులనుగూర్చి క్లుప్తముగాఁ జర్చింతును:

బవనీలు :

ఇది వీరికి పండితులు పెట్టిన పేరు. వీరి వాద్యమును బట్టి ఈ నామము వచ్చినట్లున్నది. వీరి వాద్యము పేరు 'జమిడిక'. జమిడికను శిష్టులు 'బవనిక' యందురు. బవనికను వాయించువారు కావున బవనీలు. సర్కారు జిల్లాలలో జమిడికను 'జముకు' అందురు. జముకులు వాయించువారు కావున వీరిని 'జముకుల వారు' అందురు.

శ్రీకాకుళ మండలమున బవనీలను 'బుడబుడకల వారు' అందురు (ఇది 'బుడబుక్కల శబ్దము కాదు). వీరు తమ వ్యామగు జమిడికను వాయించునప్పుడు 'బుడబుడక్-బుడబుడక్' అను రీతిని శబ్దము వచ్చుటచే వీరికి ఈ పేరు పెట్టిరని తెలియుచున్నది.

తెలంగాణమున వీరిని 'బైండ్లవారు' – 'పంబాలవారు' అను పేర్లతోఁ బిలుతురని డా॥ రామరాజుగారు తెలుపుచున్నారు (బవనీల శబ్ద భవమే 'బైండ్ల'). కాని నాకుఁ జూడఁగా బైండ్లవారు వేఱు, పంబాలవారు వేఱు అనిపించుచున్నది.

బవనికను వాయించువారు బవనీలు లేక బైండ్లు అయినట్లే, 'పంబ' యను వాద్యమును వాయించువారు 'పంబలవారు' లేక 'పంబాలవారు' నయియుందురు. ఈ పంబయను వాద్యము జమిడికంటె భిన్నమైనది. చిన్న 'సైజు' వీరణములవలె నుండునవి పంబలు. ఇవి రెండు కలిపి ఒక జంటగా నుండును. వీనిని 'పంబజోడు' అందురు. ఈ పంబజోడును వాయించుచు అంకమ్మకథలను పాడువారు పంబలవారు. వీరు మాలలు. జమిడికలు వాయించుచు పరశురాముని కథలను పాడువారు బవనీలు లేక బైండ్లవారు. వీరెక్కువగా మాదిగలు. (మాలలు కూడఁ గొందఱు జమిడిక వాయించుచుఁ బరశురాముని కథలను బాడుచున్నారు.) ఈ బవనీలు అమ్మగారి దర్శనమునకుఁ జెందినవారు; పంబలవారు అయ్యగారి దర్శనమునకుఁ జెందినవారు. కాఁబట్టి బైండ్లవారును పంబాలవారును నొక్కరేయని తలంచుట సమంజసము కాదు.

రాయలసీమలో నీ బవనీలను 'ఆసాదివారు' అనియు 'బైనీండ్లు' అనియుఁ బిలుతురు. ఈ బవనీలు చాల ప్రాచీన కాలము నుండియుఁ గలరని తెలియుచున్నది. ప్రతాపరుద్రుని కాలమున నోరుగల్లులో బవనీల చక్రవర్తి యేకవీరా మహాదేవి యెదుట నిలిచి, పరశురాముని కథలన్నియును ప్రౌఢితో పాడినట్లు క్రీడాభిరామకర్త సాక్ష్యమిచ్చుచున్నాఁడు. శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో జమిడికను బేర్కొన్నాఁడు.

ధూర్జటి తన శ్రీకాళహస్తీశ్వర శతకమున నూరూరను బవనీనికాంద్రే కవులుగాఁ జెలామణి యగుచున్నారని తెల్పినాఁడు. పాలవేకరి కదిరీపతి బవనీలను, జమిలికలను, పరశురాముని కథను పాడు మాతంగిని పేర్కొన్నాఁడు.

బవనీలు సాధారణముగా ఎల్లమ్మ (రేణుక)ను బూజింతురు. ఎల్లమ్మ కథలను (పరశురాముని కథలను) పాడుచుందురు. ఈ కథలకు గౌతుపురాణమనియు నామాంతరము గలదు. విశాఖ, విజయనగర, శ్రీకాకుళ మండలములలోని బవనీలు లక్ష్మణ మూర్ఛ, అంగద రాయబారము, గంగావివాహము మొదలగు హరిహరీ పదములను, బొబ్బిలి కథను గూడ పాడుచున్నారు. పరశురాముని కథలలో ఎల్లమ్మ తల్లిపేరు 'జమిడిక' (జముకు) అను పేరు వచ్చియుండునని నా యనుమానము. వీరు వాయించెడి రెండు రకముల జముకులలో చిన్నది శ్రుతి కొఱకును, పెద్దది తాళమునకును ఉపయోగించును.

ఈ బవనీలు అమ్మవారి జాతరలలో గావుపట్టుటవంటి భయంకర కార్యములు చేయుదురు. (బలిపశువును నోటితోఁ గొంతికిఁ జంపుటను 'గావుపట్టు' యందురు.) మంత్ర గాండ్రుగాఁగూడ వీరు ప్రసిద్ధికెక్కియున్నారు.

పంబలవారు :

వీరినిగూర్చి పైన కొంత వివరింపఁబడినది. వీరు అయ్యగారి దర్శనమునకుఁ జెందిన మాలలు. వీరి వాద్యము పంబజోడు. ఈ పంబలనుబట్టి వీరికిఁ బంబలవారని పేరు వచ్చినది. వీరెక్కువగా అంకమ్మకథలను బాడుచుందురు. అంకమ్మను గొలుచు గమల్ల, బలిజ, చాకలి, మాల, ముత్రాసులను వీరు యాచింతురు. నెల్లూరు గుంటూరు మండలములలో నీ పంబలవారు ఎక్కువగ నున్నారు. వీరు కొలిచెడి అంకమ్మను 'మారాసపు అంకమ్మ' యందురు.

'పల్నాటి అంకమ్మ' యను వేఱొక అంకమ్మ గలదు. ఆమెకును నీమెకును భేదమున్నది. మారాసపు అంకమ్మపైఁగల కథాచక్రమున 'అంకమ్మకథ, రవద్దేవిరాజు కథ, గంగురాజుకథ' అను మూఁడు కథలున్నవి.

ఈ కథలనన్నిటిని పంబలవారు పాడుదురు. వంతలు పంబజోడును వాయించుచుఁ తిత్తిపట్టుచుండఁగా, కథకుఁడు రాజకుమారునివలె వేషమును ధరించి, కుడిచేతిలో పెద్ద కత్తిని, ఎడమచేతిలో 'జమజాల' యను చిన్నకత్తిని బట్టుకొని, వీరావేశముతోఁ జిందులు త్రొక్కుచుఁ గథను పాడుచుండును. ఈ పంబలవారు కూడ బనీలవలెనే అంకమ్మ జాతరలలో బలులను నఱకుట, మంత్రతంత్రములు నెఱపుట చేయుచుందురు.

వీరవిద్యావంతులు (పల్నాటివారు) :

వీరు చెన్నుని దర్శనమునకుఁ జెందిన మాలలు. గుంటూరు మండలమునందంతటను వీరు వ్యాపించి యున్నారు. కృష్ణా నెల్లూరు మండలములలోను కొందఱు గలరు. ఈ వీరవిద్యావంతులు గురువులు కారెంపూడిలో నున్న 'పిడుగువారు'. పిడుగువారు ఆఱువేల నియోగి బ్రాహ్మణులు.

వీరవిద్యావంతులు పల్నాటి వీరకథల నన్నిటిని ప్రశస్తముగాఁ బాడుచుందురు. అందుచే వీరిని పల్నాటివారనియుఁ బిలుచుట కలదు. వీరు వీరణములు, తిత్తి, కత్తి, డాలు నుపయోగించి పల్నాటి కథలను బాడుదురు. కథకుఁడు పల్నాటి వీరునివలెనే వేషము వేసికొని పంద్రెండు బిరుదులు ధరించి, ఒకచేతితో కత్తి, వేఱొక చేతితో డాలు పట్టుకొని, మహోద్రేకముతో వీరచరిత్రను గానము చేయును. చెన్నకేశవునిఁ గొలుచు వర్ణములవారందఱును వీరినాదరింతురు. వీరు పల్నాటి ప్లవవీరుఁడగు కన్నమదాసు సంతతివారై యుందురని నాయూహ. కారెంపూడి వీరోత్సవములో గాథలు పాడు నధికారము ఈ వీరవిద్యావంతులకు మాత్రమే కలదు. (ఈ వీరవిద్యావంతులను గూర్చిన ఇతర విషయములకు 'పలనాటి వీరకథాచక్ర'మను 11వ ప్రకరణమును చూడుఁడు.)

కొమ్ములవారు :

వీరు గంగదర్శనమునకుఁ జెందిన మాదిగలు. వీరు తాము జాంబవంతుని వంశమువారని చెప్పుకొందురు. ఈ కొమ్ములవారినే చిత్తూరు మండలమున 'భట్టువారు' అనయుఁ బిలుచుచున్నారు. కొమ్ముల వారు యాదవులను యాచింతురు. వారి గోత్రములను జెప్పుదురు. కాటమరాజు కథలను, విష్ణుభాగవతమును నామాంతరముగల 'కంసుఁడు కథ'ను వీరు పాడుచుందురు. ఈ కథలను పాడుటలో వీరణములు, తిత్తి, తాళములు, కొమ్ములు నుపయోగింతురు. తమ వీరగాథా సంపదను కాపాడుచుండిన వారగుటచే యాదవులు వీరిని మిక్కిలిగ నభిమానింతురు. కాటమరాజు కథలన్నియును వీరికడ తాళపత్ర రూపముననను, ముఖస్థలములుగను నున్నవి. గంగజాతరలలో వీరు పాల్గొని, గావుపట్టుట, కొమ్ముల నూఁదుట, తానకములు పాడుట, కాటమరాజు కథలు చెప్పుట చేయుచుందురు. కాటమరాజు సైన్యమునఁ బ్రత్యేకముగా గోసంగిదళ మున్నట్లు కథలోఁ జెప్పఁబడినది. దాని నాయకుఁడు బీరినీఁడు. ఇతఁడు మాతంగ వీరుఁడు. ఈతని సంతతివారే నాఁటినుండి నేఁటివఱకును నీ కథలను గానము చేయుచున్నారని నా యూహ. వీరే నేఁడు 'కొమ్ములవా'రని పిలువఁబడుచున్నారు. (ఈ కొమ్ములవారిని గూర్చిన ఇతర వివరములకు 'కాటమరాజు కథాచక్ర'మను 12వ ప్రకరణమును చూడుఁడు.)



పిచ్చుకుంట్లు :

'పిచ్చుక గుంట్లు'- 'పిచ్చ కుంట్ల'- 'పిచ్చుక కుంట్ల'- 'భిక్ష కుంట్ల'- 'పిచ్చు కుంట్లు'- 'పిచ్చుకుంట్లు' - ఇత్యాది వివిధ నామములతో వీరు పిలువఁబడుచున్నారు. 'పిచ్చుక' శబ్దము 'భిక్షుక' శబ్దభవమై యుండును. వీరు రెడ్లను, గొల్లలను యాచింతురు. గుంటూరు, కృష్ణా మండలములలో కమ్మవారికిఁగూడ పిచ్చుకుంట్లే గోత్రములను జెప్పుచున్నారు. ఏమైనను, వీరు ప్రధానముగా రెడ్లకు, అందునను మోటాటి రెడ్లకు వందిమాగధులు. రాయలసీమలో నీ మోటాటి రెడ్లు రాజ్యములేలిన ప్రభువులు. నొస్సంకోటను బాలించిన ఉయ్యాలవాడ నారసింహారెడ్డి మోటాటి కులమువాఁడే. ఈతని వీరగాథను పిచ్చుకుంట్లే పాడుచున్నారు. పాల్కురికి సోమనాథుఁడు తన పండితారాధ్య చరిత్రలో పిచ్చుకుంట్లను వికలాంగులుగాఁ బేర్కొన్నాఁడు.

ఈ పిచ్చుకుంట్ల పుట్టువునుగూర్చి రెండు వింతకథలను డా॥ బి. రామరాజుగారు చెప్పియున్నారు (చూ. తెలుఁగు జానపద గేయ సాహిత్యము, పుట ౭౬౩) నాకు వేఱొక కథ లభించినది. పిచ్చుకుంట్లు రెడ్లకు గోత్రములు చెప్పుటతోపాటు వారి పూర్వులనుగూర్చిన వీరగాథలనుగూడ గానము చేయుచుందురు. రాయలసీమలోని పిచ్చుకుంట్లు 'కుంటిమల్లారెడ్డి కథ' యను 'రెడ్ల పురాణము'ను, 'ఎలనాగిరెడ్డి కథ' యను శైవ జానపద గాథను, 'వేమారెడ్డి కథ, ఉయ్యాలవాడ నారసింహారెడ్డి కథ' యను చారిత్రక వీరగాథలను పాడుచున్నారు. ఇందు కుంటిమల్లారెడ్డి కథలో బిచ్చుకుంట్లు రెడ్ల సంతానముగాఁ జెప్పఁబడినది: (చూ. పైనున్న వంశవృక్షము).

కల్పవృక్షము క్రింద ఆదిరెడ్డి పుట్టెను. ఆదిరెడ్డి భార్య ఆదెమ్మ. ఈ దంపతులకు బుచ్చిరెడ్డి పుట్టెను. బుచ్చిరెడ్డి భార్య పొన్నమ్మ. ఈమెకుఁ బంద్రెండుగురు పుత్రులు కలిగిరి. వీరిలోఁ బెద్దవాఁడు ఉత్తమారెడ్డి, రెండవవాఁడు సత్యమారెడ్డి. ఉత్తమారెడ్డి భార్య పెద్దమంగమ్మ, సత్యమారెడ్డి భార్య చిన్నమంగమ్మ. ఉత్తమారెడ్డి సంతానమే నేఁటి రెడ్లలోఁగల వివిధ శాఖలు. రెండవాఁడైన సత్యమారెడ్డికి మల్లికార్జునుని వరముచే కుంటిమల్లారెడ్డి పుట్టెను. ఇతఁడు గొప్ప శివభక్తుఁడు. శ్రీశైలమునఁ దపస్సు చేసుకొనెడివాఁడు. ఇతఁడు కుంటివాఁడు. అందుచేతనే కుంటిమల్లారెడ్డి యను పేరు వచ్చినది. ఇతని భార్య పిచ్చిదఁట. ఈ దంపతుల సంతానమే 'పిచ్చికుంట్లు'. పిచ్చిభార్యకును కుంటిభర్తకును గలిగిన సంతానమగుటచే వీరికి 'పిచ్చికుంట్లు' అని పేరు వచ్చినదఁట.

పై కథనుబట్టి పిచ్చికుంట్లు రెడ్లకు సోదరులని తెలియుచున్నది. నేఁటి రెడ్లు కూడ వీరిని సోదరతుల్యులుగనే యభిమానింతురు. రెడ్లలో ఎన్ని తెగలున్నవో ఈ పిచ్చుకుంట్లలోను అన్ని తెగలున్నవి. 'గొల్ల, తెలగ, గంట, తురక, మంద, తిత్తి' - మున్నగునవి పిచ్చికుంట్లలోని ఉపజాతులు.

పిచ్చుకుంట్లందఱును శైవులు. శ్రీశైలమల్లికార్జునుఁడు వీరి యారాధ్యదైవము. వీరు పాడు కథలన్నింటను మల్లికార్జున ప్రసక్తి తప్పక వచ్చును. జంగములు వీరికి గురువులు, పురోహితులును. రాయలసీమలోని పిచ్చుకుంట్లు 'ఎలనాగిరెడ్డి కథ'ను ఎనిమిది రాత్రులు పాడుదురు. గుంటూరు మండలములోని పిచ్చుకుంట్లు పల్నాటి వీర కథలనుగూడఁ బాడుచున్నారు. పిచ్చుకుంట్లు మొదట గంట, తిత్తి మాత్రమే ఉపయోగించి కథలను పాడెడివారు. తరువాత, జంగముల ప్రభావముచేఁ గాఁబోలును, తంబుఱ గుమ్మెటలను ఉపయోగించుచున్నారు. కాని వీరు ఉపయోగించెడి గుమ్మెటలు మిక్కిలి చిన్నవిగ నుండును. ఇవి ఇత్తడితోఁ జేయఁబడినవి. తెలంగాణములో జంగములు ఉపయోగించెడి 'బుడిగె' లిట్టివే. తెలంగాణమునఁ బిచ్చుకుంట్లు, జంగములు పాడు వీరగాథలనుగూడఁ బాడుచున్నారు.

సుద్దులు గొల్లలు లేక గొల్లసుద్దులవారు :

'గొల్లసూక్తులు' అను శబ్దము నుండి 'గొల్లసుద్దులు' అను శబ్దమేర్పడి, కాలక్రమమున నిది కాటమరాజు కథలను పాడు నొక వర్గమునకుఁ బేరైనది. ఈ గొల్లసుద్దులవారు బడుగుల యాచారము నకుఁ జెందిన గొల్లలలో నొకశాఖ. వీరు యాదవులను యాచింతురు. సుద్దులను పాడు గొల్లలగుటచే వీరికి 'సుద్దుల గొల్లలు' లనియు 'తెరచీరభక్తు'లనియుఁ బిలుతురు. వీరు పూజగొల్లలు. తెలంగాణమున ఎఱ్ఱగొల్లలు ఈ వృత్తియందున్నారు. భక్తిరన్న కాశి నుండి తనతోఁ బంద్రెండుగురు శిష్యులను తోడితెచ్చెననియు, వారిని కాటమరాజు కథలను గానముచేయుచు, యాదవులను యాచించి బ్రతుకుఁడని భక్తిరన్న చెప్పెననియు, ఆ శిష్యుల సంతానమే నేఁటి గొల్లసుద్దులనియు నొక ప్రతీతి. ఈ పంద్రెండుమంది

శిష్యులకే కాక, పదమూఁడవ వానిగా కొమ్ములవానికిఁగూడ భక్తిరన్న యధికారమిచ్చెనని చెప్పుదురు. పల్నాటి వీరకథలను జెప్పు నధికారము మాలలగు వీరవిద్యావంతులకున్నట్లే. కాటమరాజు కథలను బాడు నధికారము నిజమును మాదిగలగు కొమ్ములవారికి మాత్రమే కలదు. గొల్లసుద్దులు లేక సుద్దులగొల్లలు కొమ్ములవారి తరువాత నెన్నఁదగినవారు మాత్రమే.

ఈ గొల్లసుద్దులవారు పెద్దగుడారమును వేసి, అందు కాటమరాజు కథావృత్తాంతములు బొమ్మల రూపమునఁ జిత్రింపఁ బడిన తెరచీరను గట్టి, వీరణములు కొమ్ములు తాళములు తిత్తి మున్నగు వాద్యములతో నా గుడారము నందు కాటమరాజు కథలను పాడుదురు. వీరగాథలలోని ఘట్టములను బొమ్మల రూపమునఁ జూపుట తెలంగాణమున పాండవులవారును జేయుచున్నారు. విదేశములలోఁగూడ నిట్టి పద్ధతి కలదు.

అయ్యలరాజు నారాయణామాత్యుఁడు తన *హంస వింశతి*లో సుద్దుల గొల్లలను విపులముగా వర్ణించి యున్నాఁడు (2-88, 89). ఈ గొల్లసుద్దులు మేకలను పెంచుచుందురు.

పొడపోతులవారు :

వీరు విశాఖమండలములో (నేటి విజయనగరము జిల్లాలో)నున్నారు. వీరు "చెఱుకూరి జంగముల" శాఖకు చెందిన జంగము కులమువారు. వీరు ప్రధానముగా ఉత్తరాంధ్ర జిల్లాలోని యాదవులను (ఆలగొల్లలను) యాచింతురు. ప్రస్తుతము వీరు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు, ఉభయ గోదావరి జిల్లాలలోను, కృష్ణాజిల్లాలోను ఉన్న ఎఱ్ఱగొల్లలు, పూజగొల్లలు మొదలగువారిని కూడ యాచించుచున్నారు. అండమాన్ - నికోబార్ దీవులలో స్థిరపడిన యాదవులను కూడ వీరు దర్శించి యాచించుట విశేషము.

ఈ పొడపోతులవారి ప్రధానవృత్తి కాటమరాజు కథలను పాడుచు యాదవులను యాచించుట. సంవత్సరములో ఆఱునెలల పాటు వీరు సంచార జీవనము చేయుచు, యాదవుల యిండ్ల దగ్గఱ కాటమరాజు కథలను చెప్పుదురు. వీరు కాటమరాజుకథలను చెప్పుటకుగల కారణము ''పోలురాజుకథ''లో నున్నది. పోలురాజు 'చెఱుకూరు' దగ్గఱ తన ఆలమందలను మేపుకొనుచుండెను. అప్పుడు శ్రీరంగ పట్టణమునేలు "చోడానిరాజు" కావేరి చెఱువు నిర్మాణములో వెట్టిచేయుటకు చెఱుకవాడలోని కొందఱు జంగములను నిర్బంధించెను. వారు పోలురాజు శరణుఁజొచ్చిరి. అతఁడు వారి కభయమిచ్చి, కల్లందు మారినీఁడు, మసిలినాయుఁడు మొదలు యాదవవీరులను ఆ జంగములకు తోడుగా నిచ్చి, వారిని శ్రీశైలమునకు భద్రముగా పంపివేసెను. ఈ చర్యతో చోడానిరాజు కోపించి, "ముక్కంటి" అను వీరుని ససైన్యునిగా పోలురాజుపైకి పంపెను. చెఱుకువాడ సమీపములోని చిలకలమఱ్ఱి రాణ్యము దగ్గఱ నిరుపక్షముల వారికిని పెద్దయుద్ధము జరిగెను. అందు పోలురాజు చనిపోయెను. తమ్ము రక్షించుటకై ప్రాణములొడ్డిన యాదవవీరులకు కృతజ్ఞతతో ఈ చెఱుకూరి జంగములు అప్పటి నుండియు కాటమరాజు కథలను పాడుచున్నారఁట.

పొడపోతులవారి కథాగానములో ఒక కథకుడు, ఇద్దఱు వంతలు నుందురు. వీరు ఏ విధమైన వాద్యములను ఉపయోగింపరు. కాని వీరికడ నొక పెద్ద తెరపటము మాత్రముండును. దానిమీఁద మధ్యలో యాదవుల కులదైవమైన గంగమ్మ చిత్రము పెద్దదిగా నుండును. దానిచుట్టును దేవతల బొమ్మలు, ప్రసిద్ధ యాదవవీరుల బొమ్మలు ఉండును. ఈ బొమ్మలను చూపుచు కథకుఁడు కథను చెప్పును. ఇద్దఱు వంతలును "ఆఁ" కొట్టుదురు. ఈ పొడపోతులవారు కాటమరాజుకథలలోని పోలురాజుకథ, కాటమరాజు పుట్టుక (పెద్దిమాదేవి నోములు), చంద్రగుప్త మహారాజు కథ, దుర్వాస మహాముని కథ (ముసలందుడ్డు పుట్టుక కథ), పల్లికొండ పుట్టుక, కాటమరాజు దక్షిణాది ఆవులమేపు కథ, ఆలవారి పాపమ్మ సువ్విపాటలు, పాపనూక కథ, పాపనూక వలపోత, కొచ్చర్లవారి కొమరమ్మ కథ, ఎఱ్ఱన్న కోటపాడు కోదాడు తేవడం, బొల్లావు పుట్టుక, బొల్లావు యుద్ధం, బత్తుడన్న కథ మొదలైన కథలు పాడెదరని వీరిని గుఱించి పరిశోధన చేసిన ఆచార్య మఱ్ఱిబోయిన జయదేవ్‌గారు తెలియజేయుచున్నారు (చూ. వారి "యాదవుల జానపద ప్రదర్శన కళలు". పుట. 132).

బీరన్నలవారు :

యాదవులను కొమ్ములవారు, సుద్దులగొల్లలు, పొడపోతుల వారు యాచించినట్లే, తెలంగాణమున

యాదవులలో నొకశాఖ యగు 'కురుమ గొల్లల'ను బీరన్నలవారు యాచింతురు. బీరన్న వీరి కులదైవము. ఆ బీరన్నకథలను బాడుటచే వీరికీపేరు సిద్ధించియుండును. వీరు వాయించెడి వాద్యమునకు 'ఒగ్గు' అని పేరు. ఇది బుడబుక్కలవారి చేతనుండు డమరుకముయొక్క ఆకారములో దానికన్నఁ బెద్దదిగా నుండును. ఈ యొగ్గును వాయించుటచే వీరికి 'ఒగ్గువారు' లేక 'ఒగ్గోళ్లు' అనియుఁ బేరువచ్చినది. వీరు చెప్పు కథలను 'ఒగ్గు కథలు' అందురు. వీరు యాచించు కురుమవారికి బీరప్ప లేక బీరన్న ఆరాధ్యదైవము. ఇతఁడు కాటమరాజుకథలోని బీరినీఁడు కావచ్చును. లేదా శైవుల దైవము 'వీరభద్రుడు' కావచ్చును. బీరన్న కథను, కొమిరెల్లి మల్లన్న కథను బీరన్నలవారు పాడుచుందురు. మల్లికార్జున స్వామికూడ కురుమలకు ఇలవేల్పు.

గాథాకారులందఱును తమ కథలను రాత్రులందుఁ బాడుచుండఁగా, నీ బీరన్నలవారు మాత్రము తమ కథలను మిట్టమధ్యాహ్న వేళలలోఁ బాడుట విచిత్రముగా నున్నది. బీరన్నలవారు, కాపులకును బ్రాహ్మణులకును బుట్టియుందురని కొమరెల్లి మల్లన్న కథనుబట్టి యూహింపవచ్చును. బీరన్నలవారు గాథాగానమున నొగ్గుతోపాటు పెద్దపెద్ద డోళ్లు, తప్పెటలు కూడ నుపయోగించుచుందురు.

జంగములు :

తెలుఁగులో పల్నాటి వీరకథలను కాటమరాజు కథలను పాడు గాథాకారుల తరువాత నెన్నఁదగినవారు జంగములు. తెలుఁగు వీరగాథాసంపదలో సగభాగ మీ జంగములవలననే పరిపుష్టమైనది. వీరావేశముతోఁ గథను బాడుటలో జంగములకు జంగములే సాటి. వీరు ఒక ప్రత్యేకమైన రగడలోఁ గథలను బాడుదురు. ఈ రగడ వీరావేశమునకుఁ దగినట్లుగా నుండును. బొబ్బిలి, దేసింగురాజు, ముగ్గురు మరాటీలు, కాంభోజరాజు, బాలనాగమ్మ మున్నగు వీరగాథలను వీరినోటనే వినవలెను. బొబ్బిలివరుసలో నుండు కథలను కీర్తనలతోను పద్యములతోను నింపి, యక్షగాన ధోరణికి మలఁచి, 'జంగంకథ'లను నొక ప్రత్యేక ప్రక్రియను వెలయించినది ఈ జంగములే. సిరియాళ చరిత్ర, భల్లాణరాయ చరిత్ర, వామన విజయము, దేవయాని-మున్నగునవి ఇట్టి జంగంకథలకు ఉదాహరణములు.

కథకుఁడు కుడిచేతితోఁ దంబుఱ మీటుచు, నెడమచేతితో నందెలు వాయించుచుఁ, గాళ్లకు గజ్జెలు కట్టుకొని గంతులు వేచుచు, మహోద్రేకముతోఁ గథను బాడుచుండఁగా, నతని కిరుప్రక్కలనుండు వంతలు గుమ్మెటలను ధణధణ మ్రోఁగించు చుందురు. ఈ గుమ్మెటలను 'గుమ్మెత, బుడిగె, బుబ్బ, డక్కీ, డిక్కీ, డిమ్కీ' అను పేర్లతో వివిధ ప్రాంతము లందుఁ బిలుచుచున్నారు. తెలంగాణమున గుమ్మెటను 'బుడిగె' యందురు. బుడిగెల నుపయోగించు జంగములను 'బుడిగె జంగము'లందురు.

జంగము లందఱును వీరశైవులు. అన్ని జాతుల శైవులను వీరు యాచింతురు. తెలంగాణమున వీరు బలిజలను, పంచదాయకులములవారిని, కోమటులను యాచింతురని రామరాజుగారు తెలుపుచున్నారు. అడిదము సూరకవి తన రామలింగేశ శతకమున 'జంగాలపాలు దేవాంగుల విత్తంబు' అనుటచే వీరు ప్రధానముగా దేవాంగుల నడిగికొని జీవింతురని భావింపవచ్చును. దేవాంగులనఁగా వీరశైవులగు సాలెవారు.

జంగములు ప్రాచీనకాలమునుండియుఁ గథలుపాడుటలోఁ దెలుఁగునాట మిక్కిలి ప్రసిద్ధికెక్కి యున్నారు. ధేనువకొండవారి విరాట పర్వము జంగంకథలో జంగముల వర్ణన బాగుగనున్నది:

"భారతమొక కథచేయుమనుచు నను - ప్రార్థింపగ జూచి
నే రచియింపగబూనితి జంగము - వారికి నుపకృతిగా
నీటుగ విభూతిరేఖలు దీర్చియు - నిల్వుటంగీల్తొడిగీ
వేటు రుమాలాల్ పేటుపాగా ల్వల్లె - వాటు లొనర దాల్చీ
జోడు గుమ్మెటల్ దట్టుచు వంతలు - బాడుచు మరియొకడు
పోడిమిగా చేబూని సితారా - భుజమున ధరియించీ
గజ్జెలు మువ్వలు అందెలు పదముల - ఘల్లని మ్రోయగనూ
తఝణుత తకయని నాట్యము సల్పుచు - తంబుర మీటుచునూ
సంగతిగా సభవారికెల్ల ప్ర - సంగ పూర్వకముగా
చెంగున దుముకుచు జంగంబులకును - జీవనధన మనగా."

శారదకాండ్రు :

వీరు తెలంగాణమున వ్యాపించియున్నారు. వీరి వేషములు, కథలు చెప్పు తీరునంతయును జంగములవలెనే యుండును. జంగములకు 'జంగం రగడ'వలెనే, శారదకాండ్రకును నొక ప్రత్యేకమగు వరుసయున్నది. దీనిని 'శారద వరుస' యందురు. (శారద వరుస లక్షణములకై

'వీరగాథల ఛందస్సు' అను 20వ ప్రకరణమును జూడుఁడు.) ఇది అంత్యప్రాసలతో సాఁగు దరువు. శారద రామాయణము, శారద హరిశ్చంద్ర, శారద సారంగధర- మున్నగు కథలను వీరు పాడుచుందురు.

శారదకాండ్రు శైవులు. వీరిలోఁ గొందఱు లింగధారులు గలరు. వీరికి జంగములు గురువులు.

పూసల బలిజలు :

రాయలసీమలో, ముఖ్యముగా చిత్తూరు మండలమున వీరు వ్యాపించియున్నారు. పూసలమ్ముచుండుటచే వీరికీపేరు వచ్చినది. వీరు జంగములను శారదకాండ్రను బోలియుందురు. వారివలెనే వీరగాథలను గానము చేయుదురు. బొబ్బిలి, దేసింగురాజు, బాలనాగమ్మ, కాంభోజరాజు, ముగ్గురు మరాటీలు, చిన్నమ్మ లక్ష్మమ్మ, కామమ్మ మున్నగు సాంప్రదాయిక వీరగాథలను వీరు పాడుచుందురు. వీరి వేషమంతయు జంగముల వేషమువలెనే యుండును.

ఈ పూసల బలిజలు వైష్ణవులు. కంచి ప్రాంతములోని శ్రీవైష్ణవులు వీరి గురువులు. వీరు తమిళదేశమునుండి వచ్చి చిత్తూరు మండలమున స్థిరపడినట్లున్నారు. వ్యవసాయము, పూసలమ్ముకొనుట వీరి వృత్తులు. జంగములు వీరశైవులయినను వారు పాడెడి కథలలో శైవపక్షపాతము లేనట్లే, పూసల బలిజలు వైష్ణవులయినను వీరు పాడు కథలలో వైష్ణవపక్షపాతము లేదు. వీరు అన్నిరకముల కథలను బాడు చుందురు. అయినను, వీరు వేంకటేశ్వరుని కథను, వరాహావతార చరిత్ర (పందికథ)ను, చిన్నమ్మకథను కొంత ప్రత్యేకశ్రద్ధతోఁ బాడుచురనుట సత్యమే. అట్లే జంగములు సిరియాళుని కథను, శ్రీశైల మహాత్మ్యమును బాడుటలోఁ గొంత వైశిష్ట్యమును బ్రదర్శింతురు.

పూసల బలిజలు ప్రాచీనవీరగాథలనేకాక, ఆధునిక సంఘటనలపైఁగూడఁ గథలనల్లి పాడుచున్నారు. 'సుబ్బిరెడ్డి కథ చెన్నకృష్ణారెడ్డి కథ, యల్లమంద నాయుఁడు కథ, ఒడ్డుకింద భయారెడ్డి కథ, కలిచెర్ల నరసింహారెడ్డి కథ' మున్నగునవి చిత్తూరు మండలమునఁ పూసల బలిజలచే నల్లఁబడిన అత్యాధునిక వీరగాథలు.

ఈ పూసలబలిజలలోఁ గొందఱు 'గడస్తంభం (గరుడ స్తంభం) దాసరులు' అను పేర వైష్ణవ వేషముతో జేగంటను వాయించుచు వేంకటేశ్వరుని కథను వేమన కథను పాడుచున్నారు. వీనిని 'జాగట కథలు' అందురు. 'జేగంట కథ'లే జానపద వ్యవహారమున 'జాగట కథలు'గా మాఱినవి. ("జేగంట"=చేతిగంట.)

దక్కలవారు- మాష్టీలు:

మాదిగలను యాచించువారు 'దక్కలవారు'; మాలలను యాచించువారు 'మాష్టీలు'. వీరు హైందవ సంఘమున నత్యంత నిమ్నకులులుగాఁ దలంపఁబడుచున్నారు. వీరు రాయలసీమలోఁ కర్నూలు మండలమందును, తెలంగాణమున మహబూబునగరు మండలమందును నధికముగా నున్నారు. వీరి వాద్యము పేరు 'మెట్ల కిన్నెర'. ఇది మూఁడు సొరకాయలతోఁ జేయఁబడును. అత్యంత శ్రావ్యమగు ధ్వనినిచ్చును. మియాసాబు కథ, పండుగ శాయన్న కథ, వెంగళరెడ్డి కథ, మలగర బాలేసాబు కథ, నక్కపల్లి రాముఁడు కథ- మున్నగు గజదొంగల గాథలను వీరు పాడుచుందురు. ఇందు కథకుఁ డొక్కఁడే పాడును. వంతలుండరు. కథకుని గానమునకు మెట్లకిన్నెరయే మధురముగా వంతపలుకును. వంతలు లేకుండ గాథాగానమొనర్చుట ఆ కిన్నెరకథలలోని ప్రత్యేకత. ఈ కథలలో వేఱొక ప్రత్యేకత కూడఁ గలదు. వీరగాథలు ఆవేశప్రధానములు. కావున గాథాకారులెప్పుడును నిలబడి చిందులు త్రొక్కుచుఁ బాడుట పరిపాటి. కాని ఈ కిన్నెర కథలలో గాథకుఁడు కూర్చొనియే పాడును. ఇదియొక వింత. (పైన చెప్పిన పిచ్చుకుంట్లలో రాయలసీమలోని పిచ్చుకుంట్లు కూడఁ గూర్చొనియే గాథాగానము సాఁగింతురు.) వీరి మెట్లకిన్నెర ధ్వని అచ్చుముగా 'బలు బులు తారు' ధ్వనివలె మిక్కిలి శ్రావ్యముగా నుండును.

ఆంధ్రదేశమున నింకను నిట్టి గాథాకారు లెందఱో కలరు. వారియందు ముఖస్థ రూపముననున్న వీరగాథలు నాగరికతా ప్రభావముచే నశించి పోవకముందే వానిని సంరక్షించు కొనవలసిన బాధ్యత ప్రతి సాహిత్య తపస్వికిని గలదు.



ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావు విరచితము
'తెలుఁగు వీరగాథా కవిత్వము' గ్రంథం నుంచి

కన్నడ ప్రసార భారతి

– రాజేశ్వరి దివాకర్ల

అత్తిమబ్బె కన్నడ సంస్కృతికి, పరంపరకు ఉదాత్తమైన వైభవాన్ని కలిగించిన శ్రేష్ఠ మహిళ. ఆమె తెలుగు వారింటి ఆడపడుచు కావడం ఒక విశేషం. అత్తిమబ్బె వేంగీ మండలం, పుంగనూరులో జన్మించింది. ఆమె పదవ శతాబ్దం, పశ్చిమ చాళుక్యుల పరిపాలనా కాలంలో జీవించింది. ఆమె 'లక్కుండి'ని తన కార్యక్షేత్రంగా కావించుకుని కర్నాటక సాహిత్య, ధార్మిక, రాజకీయ రంగాలకు ఘనమైన సేవను కావించింది. చాళుక్యరాజు తైలపుడు, అతని కుమారుడు ఇరివ బెడంగ సత్యాశ్రయుడు, ఆమెకు రాశిచక్రి గౌరవమిచ్చి పూజించారు.

అత్తిమబ్బె 'దాన చింతామణి', 'కవివరకామ ధేను'వని కీర్తిని పొందింది. అత్తిమబ్బెను గురించి రన్న కవి అజిత పురాణంలోని ఆది అంత్యాశ్వా సాలలో సమగ్రంగా తెలిపాడు. అత్తిమబ్బె జీవన విశేషాలను తెలిపి 'అజిత పురాణం' కన్నడ ఇతిహాసానికి ఒక అపూర్వ మహిళా చరిత్రను కానుక చేసిందని విద్వాంసులు రన్న కవికి కృతజ్ఞతలను తెలిపారు. అజిత పురాణంతో బాటు, రన్నకవియే రాసాడనుకుంటున్న 'లక్కుండి' శాసనం, బ్రహ్మ శివుని 'సమయపరీక్ష' గ్రంథంలోని మూడు పద్యాలు కూడా అత్తిమబ్బె అమోఘ చరిత్రను మన కళ్ళముందు నిలపడానికి దోహదం చేసాయి.

అత్తిమబ్బె పూర్వజులు కమ్మెనాడు బ్రాహ్మణులు. వారు వేంగీ పరిసరాల నుండి కార్యార్థంగా కర్నాటకానికి వచ్చారు. అత్తిమబ్బె పుట్టినిల్లు మెట్టినిల్లు. రెండూ కూడా వీరులకు, త్యాగధనులకు పెట్టింది పేరు. వారు చాళుక్య రాజులను ప్రాణాలొడ్డి సేవించారు. కవి పండితులకు ఆశ్రయమిచ్చి, సాహిత్య పోషకులుగా, ఉత్తమ అభిరుచిని చూపారు. అత్తిమబ్బె తండ్రి, పినతండ్రులు ఆదరించిన పొన్నకవి, వారిచ్చిన ప్రోత్సాహంతో 'శాంతినాథ పురాణం' రచించాడు. అత్తిమబ్బె పుట్టి పెరిగిన వాతావరణం ఆమెకు సహజమైన సారస్వతాభిలాషను ఉదారబుద్ధిని వికాస శీలతను కలిగించింది. అత్తిమబ్బె తాత మహాదాని, జై నాగమ పరిణతుడు అయిన నాగమయ్య. తండ్రి మల్లపయ్య, పినతండ్రి, పొన్నమయ్యలు దండనాయకులుగా సైన్యాధిపత్యం వహించారు. పొన్నమయ్య మహా ధైర్యశాలిగా రాజును రక్షిస్తూ యుద్ధంలో ప్రాణాలను కోల్పోయాడు. చాళుక్య చక్రవర్తికి ముఖ్య సచివోత్తముడైన దల్లపుడు ఆమె మామగారు. 'సుభట చూడామణి' 'అతులిత బలశాలి' అని ప్రసిద్ధికెక్కిన 'నాగదేవుడు' ఆమె భర్త. నాగదేవుడు ఎంతోకాలం జీవించలేదు. అతడు రణరంగంలో శత్రువులను చెండాడుతూ వీరస్వర్గం అలంకరించాడు.

అత్తిమబ్బె చెల్లెలు గుండమబ్బె. ఆమె అత్తిమబ్బెకు సపత్ని. భర్త నాగదేవుడు పోరాటంలో వీరమరణం పొందినప్పుడు గుండమబ్బె అక్కకు బదులుగా తాను పతితో సహగమనం చేసింది. తమ వంశాకురమైన "అణ్ణిగ దేవుని" సంరక్షణ భారాన్ని అక్కకు ఒప్పగించింది. జైన సంప్రదాయంలో సతీ పద్ధతికి ఆస్పదం లేదు. కాని గుండమబ్బె ఆ ఆచరణను కావించడానికి ఆనాటి సమాజంలోని అనివార్య పరిస్థితులు కారణం అయి వుండవచ్చు. లేదా గండమబ్బె, వీరపత్నిగా అది తన కర్తవ్యం అని తలచి ఉండవచ్చు. ఆమె పొందిన సార్వత్రిక ఆమోదాన్ని అంగీకరిస్తూ నిష్ఠావంతుడైన జైన కవి 'రన్న' కూడా గుండెమబ్బె కార్యాన్ని 'హహాసతీ సముచితా చారమని' 'శుభ చరితద మరణం' అని పేర్కొన్నాడు. గుండమబ్బె సహగమనం అత్తిమబ్బెపై గాఢమైన ప్రభావాన్ని చూపింది. ఆమె ఆ సంకట సమయంలో ఎంతో సంయమనం కనుపరచింది. చెల్లెలు 'దహనార్చి'లో పడి తనువును వీడితే తాను కఠినమైన వ్రతాచరణను చేసి దేహాన్ని మనసును జ్వలింపజేసుకుంది.

అత్తిమబ్బె వైధవ్యాన్ని శాపంగా భావించని ధీర మహిళ. ఆమె తనకు సంభవించిన పతీ వియోగాన్ని సమాజపరమైన ప్రయోజనాలకు ఉపయోగించదలచింది. సన్యాసినిగా విరక్తి చెందక లౌకికమైన జీవితాన్ని అవలంబించి బ్రతుకును సార్థకం కావించింది. పతితో సహగమనం చేసి 'సతి'గా

పేరు పొందే స్వార్థం కంటే ఆంతరంగిక బహిరంగ జీవితాలను లక్ష్యంతో సాగించాలన్న నిర్ణయానికి వచ్చింది. కుటుంబ యోగక్షేమాన్ని కాపాడడం ప్రధాన బాధ్యతగా గుర్తించింది. సహజమైన ఆపేక్షతో జైన ధర్మాన్ని రక్షించి, సాహిత్య ప్రచారం కావించదలచింది. కుమారుడు 'అణ్ణిగ దేవుడి'ని 'పడవణతైల' 'కర్పూరవర్ష' బిరుదాంకితునిగా తీర్చిదిద్దింది. వీరమాతగా మారి తన ప్రథమ కర్తవ్యంగా సఫలవంతంగా నిర్వహించింది.

అత్తిమబ్బె 'ఆంధ్ర దేశంలో పుట్టిన కన్నడ వాఙ్మయ ప్రసారభారతి అత్తిమబ్బె కన్నడ సాహిత్య ప్రచారం కావించిన ప్రథమ మహిళ. ఆమె మొట్టమొదటి కావ్యసంపాదకురాలు. కావ్య ప్రకాశకురాలు. తన పూర్వీకుల కాలంలో 'పొన్న' కవి రాసిన 'శాంతినాథ పురాణం' లుప్తమౌతున్నప్పుడు, ఆమె ఆ కావ్యానికి వేయి వ్రాతప్రతులను తయారు కావించింది. తాళపత్రాల మీద వేయి ప్రతులను వ్రాయించడం ఎంతో కష్టమేకాక ఎంతో వ్యయంతో కూడిన పని. ఇదివరకెవ్వరూ తలపెట్టని అలాంటి కఠినమైన పనిని వ్యయ ప్రయాసలకోర్చి పూర్తి కావించింది. ఆ ప్రతులను ఉచితంగా పంచి ఇచ్చింది. ఆ విధంగా వాఙ్మయ ప్రసారమే కాదు. వేయి మంది లేఖకులకు పనిని కల్పించి ఉపాధినిచ్చింది.

అత్తిమబ్బె కన్నడ కవిత్రయం, రత్నత్రయం అని ప్రసిద్ధిని పొందిన ముగ్గురు కవులలో కవిచక్రవర్తి బిరుదాంకితుడైన 'రన్న' కవికి ఆశ్రయమిచ్చి, మహిళా మకుటాయమానమైన ఘనత వహించింది. పోషకురాలు కావడమేకాక ఆ కవిచే 'అజిత పురాణం' కావ్యాన్ని రాయించింది. రన్నకవి అంతకు మునుపు మహాభారత కథ ఆధారంగా 'గదాయుద్ధ' కావ్యాన్ని రాసాడు. అజిత పురాణంలో జైన తీర్థంకరుడు 'అజితనాథుని' చరిత్రను ప్రధాన విషయంగా గ్రహించాడు. ప్రధాన కథతోబాటు తనకు ఆశ్రయదాతయైన అత్తిమబ్బె వ్యక్తిత్వ నిరూపణను అత్యంత శ్రద్ధతో కావించాడు. ఆమెను తనివితీరా శ్లాఘిస్తూ ఆనాటి జైన సమాజ నడవడికను సమగ్రంగా నిరూపించాడు. అత్తిమబ్బెను అనేక విధాల ప్రశంసిస్తూ 'భవ్యమనోరథ జన్మభూమి' 'ఆసన్నభవ్య' 'జినధర్మపతాక' 'మహాసతి' 'గుణదంక కార్తి' 'జినశాసనదీపిక' 'కవివర కామధేను'వంటి విశేషణాలతో ఆమెను సత్కరించాడు. ఆమె కథను వింటే బాలికల 'ఖలదోషాలన్నీ భగ్నమౌతాయి అని ఫలశ్రుతిని చెప్పాడు. ఆమె అంగనలందరిలో శీలగుణాదులలో మిన్నయైన రామాంగన. ఆమె దర్శన విశుద్ధిని కలిగించు జయతాంబిక. అజిత జినాంబిక అని ఇత్యాదిక కొనియాడాడు. మరొక కవి బ్రహ్మశివ సమయ పరీక్షలో గుణదకణి, దానచింతామణి, విమలచరిత్ర, సజ్జనైక చూడామణి, జినశాసన రక్షామణి అని పలు విధాల అత్తిమబ్బెను ప్రశంసించాడు. అత్తిమబ్బె ఉజ్జ్వల శీల గుణావళిని కలిగిన స్త్రీగా మాత్రమే కాక మహిమాన్వితురాలైన దివ్యాంగనగా జనులచే పూజితురాలైంది. అత్తిమబ్బె తన జీవిత కాలంలోనే పౌరాణిక వ్యక్తిగా మన్ననలందుకుంది.

దాన చింతామణి అత్తిమబ్బె కావించిన దానాలు అనితరసాధ్యమైనవి. తాను దానమిచ్చే వస్తువు అత్యుత్తమమైనదై ఉండాలి. ఆ వస్తువు ఉపయుక్తమై ఉండాలి అన్న సమర్పక భావంతో దానమిచ్చిన ఔదార్యం ఆమెది. అత్తిమబ్బె తన ఘనతను చాటుకోవాలని ఎంచక చతుర్విధ దానాలను సంకల్ప బలంతో ధార్మిక నిష్ఠతో కావించింది. ఆమె 'శాంతినాథ పురాణం' వేయి ప్రతులను దానమిచ్చి దానాలలోకెల్ల మిన్నయైన శాస్త్ర దానాన్ని చేసి 'కావ్యసురభి' అయింది. అంతేకాక 1500 జైన మూర్తులను విచిత్ర మణిగంటలతోనూ, రత్న తోరణాలతోనూ, దీపమాలికలతోనూ విరాజిల్లే మణి ఖచిత పూజాసనాలతో పాటు తయారు చేయించి ఎందరికో దానమిచ్చింది. 'లక్కుండి'లో ఆదినాథుని సుందర చైత్యాలయ నిర్మాణం కావించింది. జైన వసతి ఆలయాలను కట్టించింది. వాటిని తన గురువైన అర్హనంది పండితునికి గౌరవపూర్వకంగా సమర్పించింది. తాను కావిస్తున్న ధార్మిక సంఘటనలతో సమాజ శ్రేయస్సును కూడా సంకల్పించి అనేక కార్మకారులకు, వాస్తు శిల్పకారులకు, లిపికారులకు ఉద్యోగావకాశాలను కలిగించి సాటిలేని అభ్యుదయాన్ని సాధించింది.

అత్తిమబ్బె ధర్మాన్ననుసరించిన వారికి అనుగ్రహ శక్తిగా ధర్మవిరోధులకు 'అసిలత'గా పరిణమించింది. ఆమె వీరనారిగా అజరామరమైన దేశాభిమానంతో పోరాడి శత్రుగణాన్ని గెలిచిందని, 'ఆతైల జనని మీసమున్న వాడెవ్వడూ ఎదిరించి నిలువలేడు' అని 'రన్న' కవి వర్ణించాడు. తాను కూడా మీసమున్నవాడే అయినా, తాను అభిమానించిన వనితను కీర్తించడమే పుణ్యంగా భేషజాలను వదిలాడు.

అత్తిమబ్బె జీవితంలో అనేక మహిమాన్విత సంఘటనలు జరిగాయి. అందులో రన్నకవి చెప్పిన 'అకాల వృష్టి' వృత్తాంతం ఒకటి. ఆమె బాహుబలి దర్శనానికి కుక్కుటేశ్వర గోమఠానికి కఠిన ఉపవాసంతో కాలి నడకన వెళ్ళగా ఆమెకు కలిగిన మార్గశ్రమ నివారణకు అకాల వృష్టి కురిసిందట. ఒకసారి ఆమె నిత్యం పూజించే జినబింబం నదిలో పడిపోగా, ఆ మూర్తి తిరిగి తన చేతికి దొరికేవరకూ ఎనిమిదిరోజులు ఆమె కటిక ఉపవాసం చేసిందట. మరొకసారి చక్రవర్తి ఆజ్ఞననుసరించి జినమూర్తిని నెత్తిమీద పెట్టుకుని ఉధృత గోదావరి ప్రవాహంలో కాలినడకను ఆరంభించగా ఆ ప్రవాహం అంతా అణగి ఆమెకు నది దారినిచ్చిందట. ఆ వృత్తాంతాన్ని బ్రహ్మశివకవి తాను కళ్ళారా చూసినట్లుగా చెప్పాడు. ఆ ప్రవాహ వృత్తాంతం లక్కుండి శాసనంలో కూడా ఉదాహృతమైంది. ఒకప్పుడు చాళుక్యరాజు సైన్య శిబిరంలో అగ్ని వ్యాపిస్తే, ఆ చక్రవర్తి అత్తిమబ్బెకు మొరపెట్టుకున్నాడట. ఆమె జిన గంగోదకాన్ని చల్లి ఆ అగ్నిని నివారించిందట. ఆమెలోని దిట్టతనానికి, కవులు ఆమెను ఛలదంకకార్తి' అని కూడా పిలిచారు.

అత్తిమబ్బె రన్న కవితో కావ్యాన్ని వాయించడమే కాదు, స్వయంగా పండితురాలు. బ్రహ్మకవి ఆమెను శౌచి ఘటాంతకి అని పేర్కొనడం గమనించదగినది. ఆమె బౌద్ధ విద్వాంసులను వాదంలో గెలిచి ఘటాంతకి అన్న పేరును పొంది ఉండవచ్చని పరిశోధకుల భావన.

అత్తిమబ్బె కథ అంటే ఒక చారిత్రక వ్యక్తి దివ్య వనితగా ఎదిగిన అమోఘ వృత్తాంతం. ఆమె అచంచలమైన దీక్షతో మహత్తరమైన కార్యాలను సాధించింది. పూర్వ తెలుగు కావ్యాలలోనూ, శాసనాలలోనూ ఎక్కడా కనబడని స్త్రీ స్తుతి ప్రశంసలు కన్నడ సాహిత్య ఆరంభ కాలంలోనే లభించడానికి అత్తిమబ్బె కావించిన ఘనకార్యాచరణలే కారణం. మి

డాక్టర్ రాజేశ్వరి దివాకర్ల

Statement about ownership and other particulars of **MISIMI**

FORM - IV (SEE RULE - 8)

1.	Place of Publication	:	Hyderabad
2.	Periodicity of Publication	:	Monthly
3.	Printer's Name	:	ALAPATI BAPANNA
	Whether citizen of India	:	Yes
	Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. Telangana State
4.	Publisher's Name	:	ALAPATI BAPANNA
	Whether citizen of India	:	Yes
	Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. Telangana State
5.	Chief Editor's Name	:	CHENNURU ANJANEYA REDDY
	Whether citizen of India	:	Yes
	Address	:	1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. Telangana State
6.	Names and Addresses of Individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total capital	:	Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. Telangana State

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

ALAPATI BAPANNA
Publisher

Date : March 25, 2015.

జార్జి గోర్డాన్ లార్డ్ నోయిల్ బైరన్

బైరన్ మతవిశ్వాసాల మధ్య పెరిగినా, మనిషి దుఃఖానికి దేవుడే కారణమని (అతనంటూ ఉంటే) నమ్మి – భౌతిక సుఖాల వేటలో నైతిక సూత్రాలను కూడా శృంఖలాలు గానే భావించి, స్వేచ్ఛాజీవిగా బ్రతకటానికి సాహసించాడు. అతన్ని తానున్న లండన్ సమాజం విమర్శలతో వెక్కిరించింది. అసూయతో అందలమెక్కించి తీరాలను దాటించింది. తన జీవితంలో సగభాగం పైగా కాందిశీకునిగా ఇటలీ, గ్రీకు ద్వీపాలలో గడిపాడు. ఎన్నో సాహసయాత్రలు చేశాడు – అద్భుతమైన కవితా ఖండికలు – దీర్ఘ కవితలు శ్రావ్యంగా గానంజేశాడు. మనిషి స్వేచ్ఛకోసం సమాజంతో పోరాడి–పోరాడి అలసిపోయాడు. అతని జీవితాన్ని ఏ సూత్రాలలో కొలవాలి, నైతికతా, మతవిశ్వాసమా? లేక దేవుని *పది ఆదేశాలతోనా?* చివరికి ఎక్కడ తేలాడు? తన వనరులన్నీ అవసరంలో వున్నవారికే ఉపయోగించాడు. పరాయి దేశమయిన గ్రీసుని – టర్కీల కోరల్నుంచి రక్షించాలని తన శక్తి, సమయాన్ని, ధనాన్ని వెచ్చించి చివరికి తన ముప్పయి ఆరవ ఏడు నిండకుండానే తనూ ఖర్చయిపోయాడు. అతని యాత్రల నుంచి, జీవితానుభవం నుంచి ఉద్భవించింది అద్భుతమైన కవితాధార – అమృత కవితాసుధ! దానిని చవి చూడాలంటే ఆ వ్యక్తి జీవితాన్ని తరచి చూడాలి –

“... మేధోవర్గపు శత్రువులు – నిరంకుశులు
కాకారాయుళ్ళు – వీరితోనే పోరాటం,
మానవజాతిని విడుదల చేయాలి
రాజుల నుంచి – జనసమూహాల్నుంచి
మీ నుంచి – నా నుంచి !
యుద్ధం పేరుతో మారణకాండ
సైనిక విజయాలని – రిబ్బన్లు, మెడల్సు!
ఒక బంగారు బిళ్లకోసం – బతుకును బలిచేయటం
కేవలం బులెటిన్‌లో పేరు పడాలంటే
శరీరంలో బులెట్ దిగాలా?
ఒక్క కన్నీటి బిందువు ఆరిపోవటం కంటే
కీర్తి, గౌరవం పేరుతో ఉప్పొంగే సముద్రాలు
ఎండిపోవటం మేలుకదా?...”

తన కవిత్వం ‘ఆధునికం’ అంటాడు బైరన్. సైనికుల గుండెల్లో మారుమ్రోగాలి – నాయకుల అహంకారానికి, బాధల పాలైన సామాన్యుల స్థితిగతులను విప్పి చెప్పాలి.

“... గులకరాళ్ళకు కూడా బోధిస్తాను –
నేల మీద నిరంకుశులకు వ్యతిరేకంగా నిలబడమని!
మళ్ళీ రాళ్ళలాగా మారి – సింహాసనాలకు పీఠంలా మారవద్దని!
ప్రపంచానికి స్వాతంత్ర్యం రాకపూర్వం – ఎలా ఉండేదో – ఎలా ఉందో
మన తర్వాతి తరాలకు చూపాలి! –
కథానాయకులందరూ ఒంటరి గాళ్లే
తప్పుడు గుంపులను వ్యతిరేకిస్తూ ...”

ఈ ప్రయాణంలో మీకు తారసపడే వ్యక్తులందరూ తమ జీవితాలను నిజాయితీగా గడిపినవారే. ఏదో అన్వేషణలో తిరిగేవారు. అడుగడుగునా మిమ్మల్ని పలకరించి వెళ్ళిపోతారు. కొందరు గతంలోకి, మరికొందరు సమాధుల వనంలోకి. ఈ కీర్తి, ఈ సంపద చివరికి చేరేది ఎక్కడికి? ఈ ప్రశ్నకు సమాధానం ఈ ప్రయాణంలో లభించవచ్చు. బైరన్ జీవిత చరిత్ర త్వరలో మీ ముందుకు మిసిమి ద్వారా రాబోతుంది. ఈ నెల **ముఖచిత్రం :** బైరన్ కవిత రాసిన ముగ్ధ. (చిత్రకారిణి : మేరియా ఎస్టఫాన్) **రెండో అట్ట :** బైరన్ నివసించిన ఇటాలియన్ పెలాజో లోని పాలరాతి మెట్లు. **మూడవ అట్ట :** అతను దర్శించిన స్పెయిన్ లోని మ్యూజియం. **నాలుగో అట్ట :** అల్బేనియన్ దుస్తుల్లో లార్డ్ బైరన్. (చిత్రకారుడు : థామస్ ఫిలిప్స్ – 1813)

– ఎ.కె

మిసిమి పాతికేండ్ల పండుగ

"నేను నేనే. నేనుకు అర్థం చెప్పుకోవడానికి నేను నా నుంచి బయటికి పోవలసిన పనిలేదు. జీవితంలో అనేక సన్నివేశాలు ఎదురవుతూ ఉంటాయి. వాటిల్లో నా పాత్రను నేను నిర్వహిస్తూ ఉంటాను. మామూలుగా ఈ పాత్రల పరంగా నేను 'ఇది', 'ఫలాన' అని చెప్పుకొంటాం. కేవలం నేను తండ్రి, భర్త, స్నేహితుడు మొదలైన పాత్రల సంయోగం మాత్రమే కాదు. అంతకంటె ఎక్కువ. నాకు కొన్ని ఆశంసనలు, ఆకాంక్షలు, లక్ష్యాలు ఉంటాయి. నన్ను నేను వాటి పరంగా నిర్వచించుకొంటాను. జీవనం కోసం ఏదో ఒకటి చేస్తూ ఉంటాను. అదే జీవితం కాదు. అదే నేను కాదు.

"నేను పట్టుదలతో పనిచేస్తే నేను 'ఏదైనా' కాగలను. కాని 'అన్నీ' నేనే కాలేను. ఈ 'కాగలిగే శక్తే' నాలోని సహజమైన 'నేను'. మామూలు అలవాట్లలో పడి, గాడి జీవితంలో పడి, 'ఏది బడితే అది కాగల శక్తిని', విస్మరిస్తాము. 'నీవు నీవు కా, నీవు నీవుగా బ్రతుకు'. నీవు నీవుగా ప్రేమించు, అనుభవించు, ఇలా జీవించడంలోనే నీ 'అసలు తనం' ఉంది అదే 'నీవు'. అదే 'నేను' " ఇది రవీంద్రనాథ్ జీవన సిద్ధాంతం.

ఆయన ప్రోత్సాహం ఇచ్చిన చాలామంది అప్పట్లో పేరు ప్రతిష్ఠలు లేనివారైనా దరిమిలా కళా, సాహిత్య రంగాలలో లబ్ధ ప్రతిష్ఠులయ్యారు. విశ్వవిద్యాలయాల గుర్తింపు పొందారు. సత్కారాలు, సన్మానాలు అందుకున్నారు. "1948లో చిన్న పాదుచేసి, నీరు పోసి, నేను పెరగడానికీ, బతకడానికీ దోహదం చేసిన దయామూర్తి" రవీంద్రనాథ్ గారేనని డాక్టర్ రావూరి భరద్వాజ ఆరాధనా భావంతో తలచుకొనేవారు.

'జ్యోతి' ద్వారా రవీంద్రనాథ్ "చాలా దీపాలను వెలిగించారు - చౌడేశ్వరీదేవి, శివం, వెంచాశా, శారద, భుజంగరావు, శార్వరి, పోలవరపు శ్రీహరిరావు, అమరశ్రీ, తాళ్ళూరి నాగేశ్వరరావు, హితశ్రీ, భరద్వాజ..." ఇంకా చాలమంది....

పేరున్నవారికే సాధారణంగా పత్రికలు పెద్ద పీట వేసే ఆ రోజుల్లో, ప్రతిభ వుందని తనకి తోస్తే అలాంటి వారికి చిరునామా లేకపోయినా గొడుగై నిలిచారు రవీంద్రనాథ్.

ఆయన థామస్ గ్రే పద్యం గుర్తుపెట్టుకున్నారు : "కాంతులు వెలిగక్కే విలువగల మణులెన్నో చీకటులు చిమ్మే సముద్ర గర్భంలో దాగివున్నాయి; సౌందర్యానికి సౌరభానికి ఆలవాలమైన పూలెన్నో నట్టడివలో నిరర్థకంగా రాలిపోతున్నాయి." అజ్ఞాత ప్రతిభామూర్తులు చాలామంది వున్నారు. వారిని పసిగట్టి, **మిసిమి** ద్వారా లోకానికి పంచాలని ఆయన తపన పడ్డారు. సాహితీ సాంస్కృతిక రంగాలలో ఎక్కడ ఏ మూల చిన్న 'మెరుపు' కనిపించినా ఆ మెరుపును భూమార్గం పట్టించి తెలుగు వారికి అందుబాటులోకి తీసుకురావడమే వారి ఏకైక తపన.

జస్టిస్ పి.ఎ. చౌదరిగారు వర్ణించినట్లు "ఆయన పాదు కట్టి పెంచిన మొలకవంటివాడు కాదు.
ఉద్గమన శక్తి ప్రౌఢమై, భూమి పెకల్చుకొని వచ్చినవాడు."

పుస్తకాలు ఆయన ప్రియ నేస్తాలు. జ్ఞానార్జన తీరని దాహం. సాహిత్యం, తత్వ శాస్త్రం, ఆధునిక దర్శనాలు, టైము, ఎన్‌కౌంటర్ లాంటి పత్రికలు, లైంగిక శాస్త్ర గ్రంథాలు - ఒకటేమిటి ఆలోచనా పరుల మేధకు పదును పెట్టేవేవీ ఆయన వదలలేదు. ఏకాగ్రతతో అధ్యయనం చేశారు, ఆకళించుకున్నారు. తాను పొందిన అనుభూతిని, ఆర్జించిన విజ్ఞానాన్ని స్నేహితులతో పంచుకోవాలని తపన పడేవారు.

1990లో ***మిసిమి*** ప్రారంభించారు. ప్రారంభ సంచిక నుంచి, ఆయన చివరి శ్వాసవరకు, ***మిసిమి***యే ఆయనకు

సర్వస్వమైంది. ***మిసిమి*** ద్వారా ఆ తపన కొంత వరకు చల్లారేది.

ఆయన సంపాదకత్వంలో ***మిసిమి*** మిసమిసలాడింది. మూసలో నడుస్తున్న శీర్షికల జోలికి ఆయన వెళ్లలేదు. దానికి భిన్నంగా మానవుని బలహీనతలకు దర్పణం పట్టేలా *మధురవాణితో ఇంటర్వ్యూలు* పురాణం సుబ్రహ్మణ్యంతో చేయించారు. అవి యిప్పటికీ తెలుగు సాహిత్యంలో వెలుగులీనుతూనే ఉన్నాయి. అలాగే ఐరావతీ కార్వే *మహాభారతపు పరిశీలన* వ్యాసాలను ***మిసిమి*** ద్వారా పాఠకులకు అందించారు.

అలాగే మేధావుల మెతకలు అంటూ లబ్ధప్రతిష్ఠులైన సిద్ధాంత కర్తల బలహీనతలను వెలుగులోకి తీసుకొచ్చారు.

ఆయన తరువాత సంపాదకునిగా బాధ్యత తీసుకొన్న అన్నపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ***మిసిమి*** ప్రమాణాలను కాపాడుతూనే బౌద్ధానికి పెద్దపీట వేశారు. ప్రతి సంవత్సరం బుద్ధ జయంతి ప్రత్యేక సంచికను, అనేకానేక బౌద్ధ సాహిత్య వ్యాసాలతో ప్రచురించారు. ఆ విధంగా దశాబ్దం పైనే నడిచింది.

వెంకటేశ్వరరెడ్డి ఆరోగ్య రీత్యా విశ్రాంతి తీసుకోగా ఇప్పటి సంపాదకుల పర్యవేక్షణలో ***మిసిమి*** పరిమాణాన్ని పెంచుతూ మరింత విస్తృతంగా, ఒక్క సాహిత్యమే కాకుండా నాట్యం, నాటకం, సంగీతం, చిత్రకళ మొదలైన అన్ని సారస్వత పార్శ్వాలను స్పృశిస్తూ వ్యాసాలను ప్రచురిస్తూంది.

మాక్స్‌వెల్ పెర్కిన్స్ (Maxwell Perkins) అన్న సంపాదకుడు *(Editor to Author* అనే పుస్తకంలో) ... హెమింగ్వే, పిట్జ్‌గెరాల్డ్, థామస్‌వుల్ఫ్ మొదలయిన రచయితలు – (తర్వాత ప్రపంచ ప్రఖ్యాతి గాంచినా) ప్రారంభ దశలో వాళ్ల రచనలు చదివి అవి ఏ విధంగా పనికి వస్తాయోనని మథనపడి, ప్రోత్సహించి, ఆర్థికంగా సహాయం అందించాడు. విలియం సారోయన్ లాంటి కథా రచయితలు – తిండికి లేక అల్లాడి పోతుంటే – తక్షణమే ఆదుకుని తర్వాత వారితో కథలు రాయించుకున్నాడు – పెర్కిన్స్ లాంటి వారు పై రచయితలను ఆదుకుని – సాహిత్యానికి ఎంత సేవ చేశారో మనకు తెలిసింది. ఆయా రచయితల్లో వున్న నిప్పురవ్వల్ని ప్రతిభగా వెలికి తీయటం, సంపాదకుని ప్రథమ కర్తవ్యం. బూడిద, మట్టిని జల్లెడ పట్టి బంగారు రజను తీయటం లాంటిదే.

ఈ పరంపరలో త్యాగరాజు, ముద్దుపళని గురించి ప్రచురించిన వ్యాసాలు పాఠకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

విషయ సేకరణ– వస్తు ప్రదర్శన ఈ రెండు పార్శ్వాలలోను అలాగే *విశ్వరూపం, (Grand Design) ఆరోహణ (Ascent of Man)* లాంటి రచనలు ఆసక్తికరంగా సాగినట్లు పాఠకులే ఉత్తరాలు రాశారు. సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతల రచనల, సమగ్ర పరిశీలన రావినూతల సత్యనారాయణ ప్రత్యేకించి రాస్తున్నారు. తూర్పు దేశాల కవిత్వాన్ని ముకుంద రామారావు పరిచయం చేస్తున్నారు. ప్రపంచ సంగీతపు పోకడలపై నండూరి పార్థసారథి రాసిన పరిశోధనాత్మక వ్యాసాలు ప్రచురించాము. *రినాజాన్స్ చరిత్ర* తెలుగులో మొదటిసారి ***మిసిమి*** అందించింది.

ప్రపంచ నాటకం గురించి గొల్లపూడి మారుతీరావు, చాట్ల శ్రీరాములు, సి.యస్ రావు, పతివాడ సూర్యనారాయణ గార్ల రచనలు ఔత్సాహికుల అభిరుచిని కొంతవరకైనా తీర్చగలిగింది. సాహిత్యంలో ఎక్కడో మూలపడివున్న వీరగాథలు, గిరిజన సాహిత్యం, నూజివీడు, వెంకటగిరి, బొబ్బిలి, విజయనగరం సంస్థానాల చరిత్రపై ***మిసిమి*** వెలుగును ప్రసరింపచేసింది.

మళయాళ భాషలో మొదటి ఐదు నవలల్లో ఒకటిగా చెప్పబడుతున్న చెందుమీనన్ రచన *ఇందులేఖ* నవల పరిచయం ద్వారా ***మిసిమి*** మరో గవాక్షాన్ని తెరిచింది. ప్రముఖుల స్వంత కథలతో పాటు, సామాన్యుని స్వగతం లాంటి వ్యక్తి చరిత్రలను ముందుకు తీసుకువచ్చింది. వచన కవిత్వం, వార్తాకథనాల కథలు, రాజకీయ ప్రచార సాహిత్యానికి దూరంగా ఉంది. పాపులర్ సినిమాను భుజానికెత్తుకోలేదు. లేపాక్షి, హంపీ, హాళిబేడు, బేలూరు, శిల్ప కళల ప్రత్యేక వ్యాసాలు ***మిసిమి*** లో చోటు చేసుకున్నాయి. *కాశీనాథుని నాగేశ్వరరావు, ఆంధ్రపత్రిక, భారతి,* వివిధ రాష్ట్రాలలోనున్న తెలుగువారి స్థితిగతులు *రేడియో చరిత్ర,* సామినేని ముద్దుకృష్ణ, ఒద్దిరాజు సోదరులు, మానేపల్లి కవి, కిన్నెర పత్రిక నడిపిన పందిరి మల్లికార్జునరావు లాంటి భిన్నమైన శీర్షికలతో వ్యాసాలు ప్రచురించబడ్డాయి. ***మిసిమి*** లాంటి శాస్త్రీయ

ప్రమాణాలతో కూడిన పత్రికను తెలుగులో నడపటం ఒక సాహసం. సాహసం చేయటం ఆలపాటి వారికి కొత్త కాదు. తెలుగు పత్రికా రంగం మద్రాసు కేంద్రంగా ఎందుకు ఉండి పోవాలి? తెనాలి నుంచి *జ్యోతి, రేరాణి, కినిమా* లాంటి పత్రికలను నిర్వహించిన సాహసం ఆయనది. ఆ సాహసం ఆయనకు మాత్రమే పరిమితం కాదు. వారి తదనంతరం వారి వారసులైన కళాజ్యోతి ప్రాసెస్ ఇప్పటి అధినేతలు బాపన్న ప్రభృతులు ***మిసిమి*** ని ఒక సామాజిక బాధ్యతగానే పాతికేండ్లుగా నిర్వహిస్తున్నారు. వారికి పాఠకుల తరపునా రచయిత పక్షాన అభినందనలు తెలియజేస్తున్నాం.

పాతికేండ్ల మిసిమి సంచికను ఆవిష్కరిస్తున్న ఆలపాటి మిసిమి.
ప్రక్కన : వోలేటి, నర్రా కోటయ్య

ఆలపాటి రవీంద్రనాథ్‌గారి వారసులు, బాపన్న, కార్తీక్ ప్రభృతులు.

సగిలి సుధారాణి

ఆచార్య బేతవోలు రామబ్రహ్మం



శ్రీ గొల్లపూడి మారుతీరావు



కెఎన్నార్ బుద్ధగోషుడు

మిసిమి శ్రేయోభిలాషులు

మిసిమి ప్రధాన సంపాదకులు : చెన్నూరు ఆంజనేయరెడ్డి,
కుర్రా జితేంద్రబాబు, నగ్నముని

పండుగ జరిగిన విధంబెట్టిదనిన ....

ఆ రోజు నవంబరు 4, 2014. ఒక ప్రశాంత సాయంత్రం. ఉద్యోగస్థులు ఇంటిదారి పట్టే వేళ. సాహితీ ప్రియులు, ఇంటి నుంచి బయలు దేరారు. తాము ఎంతగానో అభిమానించిన ***మిసిమి*** సారస్వత సమ్మేళనమునకు హాజరు కావడానికి తొందరపడుతున్నారు. అది ***మిసిమి*** పాతిక సంవత్సరాల పండగ జరుపుకొంటున్న రోజు. నర్రా కోటయ్య, పతివాడ సూర్యనారాయణ, చాట్ల శ్రీరాములు, అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, గిరిధర్ గౌడ్, సురేష్ ఒక్కరొక్కరుగా ప్రభృతులంతా సభాప్రాంగణానికి చేరుకుంటున్నారు. ఆహ్వాన సంఘం తరుపున చెన్నూరు ఆంజనేయరెడ్డి, వల్లభనేని అశ్వినీ కుమార్, కాంద్రేగుల నాగేశ్వరరావు, వోలేటి పార్వతీశం మొదలైన వారంతా అక్కడే ఉన్నారు. కొద్దిసమయంలో ***మిసిమి*** ని తోడ్కొని ఆలపాటి వారి కుటుంబం ఆ ప్రాంగణానికి చేరుకుంది. అప్పుడంతా ఒకటే సందడి. సహృద్ భావ (షా) వాతావరణం.

శ్రీ పెద్ది సత్యనారాయణ

మిసిమి – పాతిక సంవత్సరాల పండుగ, ఆహ్వానితుల ఆగమనం – విందు – సమావేశం ప్రారంభం, వోలేటి పార్వతీశం – స్వాగతం పద్యంతో ప్రారంభమైంది. ఒక దార్శనికుని ఆలోచన నుంచి వచ్చిన అక్షర సంపుటి, జ్యోతిలో వచ్చిన గాంధీ మరణం – కళాజ్యోతి ప్రచురణాలయం – సంపాదకులు ఆలపాటి గారిపై లఘు చిత్రం ప్రదర్శన జరిగింది. తదనంతరం ఆహుతులు ఈ విధంగా శుభాకాంక్షలు తెలిపారు:

పతివాడ సూర్యనారాయణ : మొట్ట మొదటి నుంచి ఆలపాటి వారి ప్రచురణలతో పరిచయం – జగ్గయ్య నుంచి ***మిసిమి*** పత్రికలు తెచ్చుకునేవాడిని – ***మిసిమి*** భారతిని అధిగమించింది. స్పృశించని విషయం అంటూ ఏమీలేదు. మిసిమిలో యాడ్స్ లేవు – పత్రిక విలువ ఎక్కువ.

గుత్తి చంద్రశేఖర రెడ్డి : ***మిసిమి***లో మా వ్యాసాలు ప్రవాసాంధ్రులవి (బళ్ళారి) ప్రచురించారు. ఏ పత్రికకైనా ప్రకటనలతో సాంద్రత తగ్గుతుంది. కొత్త విషయాలు ఎన్నో చెబుతున్నాయి. కొత్త విశేషాలతో మధుర భావనలతో నడుస్తుంది. భరద్వాజగారి కథకి మరియు జైలుకు సంబంధించిన సంగతిని ఉటంకించారు.

కోడూరి పుల్లారెడ్డి : బూదరాజు రాధాకృష్ణ, తాళ్ళూరు నాగేశ్వరరావు, ధర్మారావు గార్లు చర్చించి, ఆలపాటి వారికి ***మిసిమి*** పేరు సూచించారు. మనుచరిత్రలో – మిసిమి అనే పదబంధం ఉంది. 91 నుంచి ***మిసిమి*** వచ్చేది. ప్రస్తుత సంపాదకీయాన్ని ప్రస్తుతించారు. విషయం ఉంటేనే ప్రచురిస్తున్నారు. రచయితల పేరును బట్టికాదు. ఇంత చక్కటి కలర్ ప్రింటింగ్ మరే పత్రికలోనూ లేదు.

వోలేటి : అధ్యయన మనే గొప్ప సంస్కారం ఆలపాటి గారిది. ***మిసిమి*** అంటే నవనీతం, నూతనకాంతి అనే అర్థంలో తెనాలి రామకృష్ణుని ప్రయోగం వుంది.

మిసిమి పాతికేళ్ళ ప్రత్యేక సంచిక ఆవిష్కరించబడింది – ప్రత్యేక సంచిక ప్రతినొకదాన్ని నర్రా కోటయ్యగారికి ***'మిసిమి'*** ద్వారా అందజేశారు.

మిసిమి అభిమానితో కార్యనిర్వాహకులు

తనికెళ్ళ భరణి : తానిక్కడ నిలబడడానికి ఏకైక అర్హత ***మిసిమి*** పాఠకుణ్ణి కావడమే. ***మిసిమి*** ఛత్రఛాయలో లేకుంటే ఇంత సారస్వతాన్ని చదవగలిగేవాళ్ళమా?

మిసిమి పాతికేళ్ళ ప్రయాణం, వైవిధ్యమైన ముఖచిత్రాలతో లఘు చిత్రం చూపించారు.

నర్రా కోటయ్య : అందమైన **మిసిమి** ముఖచిత్రాలను ఒక సంచికలా తేవాలని అభిలషించారు.

చాట్ల శ్రీరాములు : ***మిసిమి*** చదవటం ద్వారా నన్ను నేను పెంచుకుంటున్నాను – యువతను సాహిత్యానికి దగ్గర చేసే

ఆలోచన చేయాలి. ***మిసిమి*** భూతకాలానికి దర్పణం పడుతుంది. వర్తమానాన్ని ప్రతిబింబిస్తుంది. భవిష్యత్తును ఆవిష్కరిస్తుంది.

అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి : నవంబర్ 4 ఆలపాటి వారి జన్మదినమనే విషయం గుర్తు చేశారు. 90 నుంచి నేను ఐచ్ఛిక ఎడిటర్‌గా ఉన్నాను. *"సైకాలజీ ఆఫ్ సైన్స్, సాహిత్యం గురించి ఎన్నో పత్రికలు ఉన్నాయి. అందులో నాదొకటి కాకూడదు"* అని ఆలపాటివారు అనేవారు. వారు పరమపదించినప్పుడు *తెలుగు విద్యార్థి, ఆంధ్రభూమి* పత్రికలు ఎడిటోరియల్ వ్రాసాయి – హిందూలో ప్రత్యేక వ్యాసం వచ్చింది. ***మిసిమి***లో వ్యాసం పడటమంటే డాక్టరేట్‌తో సమానం అని పాఠకులు భావించేవారు. *"పాపులారిటీ అంతగా అవసరం లేని ఒక పాఠక శ్రేణి **మిసిమి** కి ఉంది. దానిని నిలబెట్టుకుంటే చాలని"* అనేవారు ఆలపాటి గారు.

చెన్నూరి ఆంజనేయరెడ్డి : కృతజ్ఞతలు చెప్పారు. 1975 నుంచి ఆలపాటి వారితో పరిచయం వుండేది. అప్పటికి ***మిసిమి*** ప్రారంభం కాలేదు.

*"**మిసిమి** ఎంతకాలం నడుపుతారు? ప్రకటనలు లేకుండా అని అడిగితే, ఫర్వాలేదు మొదలెట్టాము, మీరు అసోసియేట్ కాకూడదా?"* అన్నారు. బాపన్న గారి సపోర్టు లేకపోతే ఇది ఇంతకాలం నడిచేది కాదు. విలువలు తగ్గకుండా, ఎన్నాళ్ళయినా నడపమని కోరారు ఆలపాటి వారు. మార్పు లేకపోతే ఏదీ survival కాదు. Social Science కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. Local History తెలుగులో రావటంలేదు. Performing arts వ్రాసే రచయితలు లేరు. ఇన్ని limitations ఉన్నాయి. ప్రతి ఒక్కరు మ్యాగజైన్ బాగుందంటారు కాని సర్కులేషన్ మాత్రం పెరగటం లేదు. పాఠకులలో ఎక్కువ భాగం సీనియర్ సిటిజన్సే! దానికి ఇంగ్లీషు మీడియం కొంతవరకూ కారణం. Compulsory Telugu has to be reinforced in schools. Intellectual రచన తెలుగులో తగ్గిపోతుందా? అనే సందేహం కలుగుతుంది. ***మిసిమి*** సర్క్యులేషన్ 10,000 అయితే తప్ప self sufficient కాలేము.

అతిథులను ఆహ్వానిస్తున్న శంకర్

లంకా సూర్యనారాయణ : నేను ***మిసిమి*** తొలితరం పాఠకుణ్ణి. మండలి శ్రీరామమూర్తి, వెలగా వెంకటప్పయ్యగారి ద్వారా ***మిసిమి*** పరిచయం జరిగింది. కొన్ని Paintings ఆలపాటి వారి కోరికపై నేను పంపిస్తే, వాటిని బైండ్ చేసి gold letters లో నా పేరు ప్రింట్ చేసి నాకు తిరిగి పంపారు. ***మిసిమి*** మూడు సంచికలు తప్ప మిగిలినవన్నీ నా వద్ద ఉన్నాయి.

అంపశయ్య నవీన్ : చలసాని ప్రసాద్ ద్వారా ***మిసిమి*** పరిచయం. కాలక్రమేణా వచ్చిన మార్పులతో ***మిసిమి*** బాగుంటుంది. అన్ని విషయాలను స్పృశిస్తున్నారు. writers shortage ఉంది. Expect చేసిన స్థాయిలో వ్యాసాలు రావటం లేదు. Literary క్రిటిసిజం ఇంకొంచెం పెంచితే బాగుంటుంది. పుస్తక సమీక్ష, విశ్లేషణ మరింత ఎక్కువగా ఉండాలి.

డా॥ విజయలక్ష్మి పండిట్ : కవయిత్రి, రచయిత – నేను ***మిసిమి*** అభిమానిని. ప్రచురించబడిన వ్యాసాలకు నిర్దిష్ట ప్రమాణాలున్నాయి. మరి ఈ పరిశోధనాత్మక వ్యాసాలు యువతకు చెందుతున్నాయా? Content ను chronological గా online display చేయాలి. పరిశోధనాత్మక విలువగల – యువతకు సంబంధించిన విషయాలను ఒక ప్రత్యేక కాలమ్ వేయాలి. వ్యక్తిత్వ వికాసము గురించి పురాణాల్లో ఉన్నాయి. ఇవి యువతకు తెలియవు. వాటిని ***మిసిమి***లోకి తీసుకురావాలి.

సి.యస్.రావు : *"నా కథ, నా గురించే ఏమన్నా ఉంటే చదువుతా, లేకుంటే లేదనే"* దృక్పథంతో కొందరు రచయితలు ఉన్నారు అంటూ చిన్న Humorous incident చెప్పారు. Reading habits పోతున్నాయి, Looking habits వచ్చాయి. ***మిసిమి*** హస్త భూషణమే కాదు మనో వికాసం కూడా. Schools & Institutions కు వెళ్ళే ప్రయత్నం చేయాలి. చిత్రకళ ద్వారా కథలు, సంఘటనలు, వాస్తవ పరిస్థితులు అన్ని తెలుస్తున్నాయి.

నగ్నముని : "నేను అసెంబ్లీలో ఛీఫ్ రిపోర్టర్‌గా పని చేసినపుడు జ్యోతి ప్రెస్‌లో అసెంబ్లీ Proceedings proof మాకు చూపించేవారు.

ఆలపాటి గారు విలక్షణమైన వ్యక్తి – అనేక ఇంగ్లీషు పత్రికలు తెప్పించేవారు. వడ్డాది పాపయ్య గారిని రేరాణి ద్వారా

పరిచయం చేశారు. వడ్డాది పాపయ్య గారి అట్టలన్నీ పుస్తకంగా వేయండి. విషయం ప్రధానం. రీడర్‌షిప్‌ను తయారు చేసుకోవాలి. పర్యాటక రంగం నిర్లక్ష్యానికి గురి అవుతుంది. ప్రభుత్వాన్ని కూడా మేల్కొనేలా చేయాలి.

తల్లావజ్ఝల శివాజీ : Research oriented field లోని వాళ్ళు మిగతా field గురించి వ్యాసాలు చదవరు. బౌద్ధానికి సంబంధించిన వ్యాసాలు బాగుంటున్నాయి.

డాక్టర్ గురువారెడ్డి : – Analytical ఆర్టికల్స్ బాగున్నాయి. బాపన్న గారు Simplified personified. True Gentleman. నా Hospital లో మిసిమి అట్టమీద బొమ్మలు Frame కట్టి పెట్టాను. ఎవరైనా మోకాళ్ళ నొప్పులతో నా వద్దకు వస్తే, అతను మిసిమి చందాదారుడైతే నేను రాయతీ ఇస్తానన్నారు, నవ్వుల మధ్య. కుర్రకారు పరిధి వేరు. దృక్పథం వేరు. వారిపై దేనినీ రుద్దాల్సిన అవసరం లేదు. మనలాంటి వాళ్ళు చదువుకున్నా చాలు.

పెద్ది సత్యనారాయణ : ఆలపాటి వారిని గురువుగా భావిస్తాను. వారి ద్వారా రచనా పద్ధతిని తెలుసుకొన్నాను. ***మిసిమి*** పత్రిక అట్టలు, గ్లాస్కో బేబీ బుగ్గలు నిమురుతున్నట్లు ఉంటాయి.

సుధారాణి : సాహిత్య విందును అందజేశారు. 25 ఏళ్ళు నిండినా వన్నె తగ్గక మిసిమిసగా, తీసుకువస్తున్న సంపాదక వర్గానికి వందనాలు. ఎటువంటి ప్రకటనలకు తలవొగ్గక, భావ ప్రకటనలకే పరిమితం చేశారు. జానపద సంపద, చరిత్ర సేకరించి ***మిసిమి*** లో ముద్రిస్తే తర్వాత తరాలకు అందించినవారవుతారు.

అరుణ : మొదట్లో ముఖచిత్రం ఆకర్షించి ***మిసిమి*** కొన్నాను. చదివిన తరువాత భారత దేశాన్ని అధ్యయనం చేయడానికి ఇది పనికొచ్చేదిగా అనిపించింది. కొత్త ప్రపంచానికి తలుపులు తెరిచింది. ఎందరో మహానుభావులతో పరిచయం కావటం సంతోషం. కొందరికి చదవటం పట్ల ఆసక్తి వుండదు. కానీ వినటంలో ఆసక్తి ఉంటుంది. వీళ్ళ కోసం కొన్ని వ్యాసాలు చదివి వినిపిస్తాను. ***మిసిమి*** కొనండి, ఇది మీ ఇంటికి గౌరవం ఇస్తుందని చెబుతాను. ప్రతినెల ఐదు పుస్తకాలు కొని కొందరికి ఇస్తాను. నచ్చితే చదవండి, చందాదారులుగా చేరండి అని చెబుతాను.

బేతవోలు రామబ్రహ్మం : భారతి పత్రిక కూడా సొంత డబ్బులతో నడవలేదు. అమృతాంజనం మొదలైన వ్యాపారంపై ఆధారపడింది. రాసేవాళ్ళు లేని ఇబ్బంది భారతికీ వచ్చింది – ఆగిపోయింది. నేను *వాఙ్మయి* పత్రిక నడిపాను, సంయుక్త సంచికలా ఆరు నెలలకు ఒకసారి ప్రచురించేవాళ్ళం. తదనంతరం వల్లభనేని అశ్వినీకుమార్‌గారి రచన ***ఏరియల్*** (షెల్లీ జీవితగాథ) పుస్తకాన్ని ఆవిష్కరించి, *ఏరియల్*‌ని విపులంగా సమీక్షించారు.

గొల్లపూడి మారుతీరావు : ***మిసిమి*** ఒక ఉద్యమం. It is not a publication. It is a movement. To buildup a character to a magazine, it takes time. We are proud of ***Misimi*** Telugu Magazine. ఇక్కడే వున్న బాపన్న గారి కుటుంబ సభ్యుల అంకిత భావం పట్ల కృతజ్ఞతగా సభ్యులంతా కరతాళ ధ్వనులతో standing ovation ఇవ్వాలని సూచించగా, సభాసదస్యులంతా ప్రతిస్పందించారు.

భమిడిపాటి జగన్నాథరావుగారు : ***మిసిమి*** లాంటి బంగారుపళ్ళానికి, మొదటి నుండి మంచి గోడ చేర్పు అమిరింది. ***మిసిమి*** సంస్థాపక సంపాదకులు **ఆలపాటి రవీంద్రనాథ్** గారి విలువలతో కూడిన నిబద్ధత, ఈనాటి యాజమాన్యం కూడా పాటించటం, సమర్థమైన సంపాదక వర్గాన్ని ఎన్నుకొని, వారికి స్వేచ్ఛ నివ్వడంతో –25 ఏళ్ళుగా ***మిసిమి*** తన కాంతులను తెలుగు పాఠకలోకంలో నింపింది అంటూ కోయంబత్తూరు నుండి తమ సందేశాన్ని పంపారు.

కాండ్రేగుల నాగేశ్వరరావు : వందన సమర్పణ చేస్తూ కళాజ్యోతి పేరుతో ముద్రణాలయాన్ని, దేవాలయంగా మార్చి ముఖచిత్రాలను కళాత్మకంగా చిత్రించి, ఆలపాటి వారి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న బాపన్నగారికి మరియు ఆలపాటి వారి కుటుంబ సభ్యులకు, సాహితీ ప్రియులందరికీ, ***మిసిమి*** పాతికేళ్ల పండుగను యింత కన్నుల పండుగగా నిర్వహించటానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపటంతో సభ ముగిసింది.

ఈ పండుగ సందర్భంగా వచ్చిన సాహితీ ప్రియులకు కొన్ని గ్రంథాలు బహుమతులుగా యివ్వబడినవి. తదనంతరం ఆహ్లాదకరమైన వాతావరణంలో రుచికరమైన విందు ఏర్పాటు చేయడమైనది.

సంకలనం : నీలకంఠం నరసరాజు, హైదరాబాదు

కృష్ణగిరి తెలుగు తేజాలు

– జి. చంద్రశేఖర్

ప్రపంచంలో ప్రతి దేశానికీ ప్రతి ప్రాంతానికి కొన్ని విశిష్టతలు ఉంటాయి. ఇది ప్రకృతి నైజం. అలాగే మానవుల్లో కూడా కొన్ని ప్రత్యేకతలుంటాయి. పుట్టిన ప్రతి మనిషి ఉన్నతుడు కాకపోవచ్చు. కాని కొందరు కృషిచేసి, పట్టుదలతో ప్రతిభను పెంచుకొని, ఏదైనా సాధించి సమాజాన్ని ప్రభావితం చేసి ప్రజల హృదయాలపై తమదైన ముద్ర వేస్తుంటారు. అటువంటి వారు సమాజంలో అరుదుగా కనిపిస్తుంటారు. గొప్ప వ్యక్తులను గూర్చి తెలుసుకోడానికి ఎవరైనా ఉత్సాహించడం సహజం.

కృష్ణగిరి జిల్లాలోని అనేక సామాజిక వర్గాలకు చెందిన వివిధ ప్రత్యేకతలను సంతరించుకొన్ని తెలుగు తేజాలను ఇక్కడ పేర్కొని సంక్షిప్తంగా పరిచయం చేయడం జరిగింది.

తెలుగు భాషాభిమానం:

కన్నడ, తమిళ, ఉర్దూ భాషల బలమైన తాకిడి, ఆంధ్ర దేశానికి దూరంగా ఉండటం – అధికార భాషగా ఉన్న తమిళ భాష యొక్క ప్రాబల్యం – ఈ సమస్యల వలయంలో కృష్ణగిరి జిల్లాలో చిక్కుకొన్న తెలుగు భాష, తెలుగు జాతి నిరంతరం అంతర్మథనంతో పోరాటాల్ని పరంపరగా సాగిస్తోంది. అయినప్పటికీ ఈ ప్రాంతంలో విద్య, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, రాజకీయ మొదలైన ప్రముఖ రంగాల్లో తగినంత ప్రగతిని సాధించినవారున్నారు.

వ్యక్తుల పరంగాను, వ్యవస్థల పరంగాను ఈ అభివృద్ధి జరిగింది. వాటిని రేఖా మాత్రంగా మీ ముందుంచడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశము.

కీర్తిశేషులు శ్రీ కె.యస్. కోదండరామయ్య గారు :

ఈయన తెలుగు తేజాన్ని ప్రజ్వలింపజేసిన మహామనీషి. ఉత్తమ ఉపాధ్యాయుడుగా విద్యార్థుల మరియు సహ ఉపాధ్యాయుల అభిమానాన్ని చూరగొన్నాడు. ఈయన గొప్ప రచయిత, విశ్లేషకుడు కూడా అని చెప్పడానికి వీరి వ్యాస పరంపరలే తార్కాణం.

వీరి వ్యాసాలు భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక మొదలైన ప్రసిద్ధ పత్రికల్లో అనేకాలు వెలువడ్డాయి.

రచనలు :

నన్నయ భట్టు ఏ ప్రాంతంవాడు? దక్షిణాపథంలో ప్రాచీన భాష ఏది? వంటి ఆసక్తికరమైన అన్వేషణాత్మక వ్యాసాలను కొన్ని ఉదాహరణములుగా తీసుకొనవచ్చును. వీరు అనేక గ్రంథాలను రచించి ముద్రించారు. కొన్ని రచనలను విద్యార్థులకు పాఠ్యగ్రంథాలుగా నియమించడం జరిగింది.

ఈయన రచనల్లో మహాత్మాగాంధీ, రాయలను ఆశ్రయించిన అష్టదిగ్గజాల తొలి కవి ఎవరు? మొదలైనవి ముద్రించబడి ప్రాచుర్యాన్ని పొందాయి. తాళపత్ర గ్రంథాలు, శాసన ఆధారములు సేకరణ కోసం అమితమైన ఆసక్తి చూపేవారు. శోచనీయమైన విషయమేమంటే ఈయన రచనల్లో అనేకములు అముద్రితాలుగానే మూలపడి ఉన్నాయి.

ప్రజాప్రతినిధి – సేవాదృక్పథము :

కీ.శే. కె.యస్. కోదండరామయ్యగారు 1967లోను, 1971లోను స్థానిక ప్రజల చేత నియోజకవర్గ శాసనసభ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

తమిళనాడు శాసన సభలో మొట్టమొదట తెలుగువాణిని వినిపించిన ఘనత ఈతనిదే. స్థానిక తెలుగు ప్రజల అనేకానేక సమస్యలను అవగాహనతో ప్రభుత్వ దృష్టికి తీసుకొనిపోయి పరిష్కరించారు. తెలుగు భాషను అధికారిక స్థాయిలో ఉపయోగించబడేందుకుగాను పాటుపడి కృతకృతులయ్యారు.

వీరు హోసూరు నగరాభివృద్ధి, పారిశ్రామికాభి వృద్ధులకేగాక తెలుగు ఉపాధ్యాయ శిక్షణ పాఠశాలకు పాటుపడి, ఫలితాలను సాధించారు. వీరు అధిక భాగం కాలి నడకతోనే హోసూరు, డెంకనీకోట, వేపనపల్లి ప్రాంతాల్లో తిరిగి ప్రజా జీవన స్థితిగతుల్ని మెఱుగు పరిచారు.

ప్రత్యేకించి వీరి కృషి ఫలితంగా రోడ్డు నిర్మాణాలు, బస్సు వసతులు, చెఱువుల నిర్మాణాలు చేపట్టబడినాయి.

పైగా కొడియాళం చెక్ డ్యాం, కెలవరపల్లి డ్యాంల ఏర్పాటు చేయడం మూలంగా నేడు వేలాది ఎకరాల్లో పైరుసాగు చేయుట జరుగుతూంది. ఈ ప్రాంతపు రైతుల బతుకులు వీటివల్ల మూడుపూలు ఆరు కాయలైనాయనడంలో అతిశయోక్తి లేదు.

విశేషంగా కోదండరామయ్య గారిది బహు భాషా పాండిత్యం ప్రశంసనీయమైన విషయంగా చెప్పొచ్చు. ప్రత్యేకించి ఆంగ్లభాషపై పట్టు పేర్కొనదగినది. నిరాడంబరత్వం, సాత్విక స్వభావం, చమత్కార భాషణం, పరిశోధనా దృక్పథం అమితమైన సాహిత్యాభిమానం, అన్నింటికీ మించి మానవతా విలువలు నిండిన హిమనగమంత మూర్తిమత్వం వీరిది. వీరు నాటికి నేటికి ప్రజలకూ రాజకీయ నాయకులకూ గొప్ప ఆదర్శమూర్తి.

ఆంధ్ర సాంస్కృతిక సమితి వ్యవస్థాపన :

స్థానిక తెలుగు ప్రజల భాషాభిమానాన్ని పునాది చేసుకొని కోదండ రామయ్యగారు హోసూరు నగర నడిబొడ్డున ఆంధ్ర సాంస్కృతిక సమితిని ఉపాధ్యాయుల ప్రధాన సహకారాన్ని తీసుకొని 1970లో స్థాపించారు. 1983లో శ్రీకృష్ణదేవరాయల 471వ పట్టాభిషేక మహోత్సవాలను ప్రారంభించి ఏటేటా ఆ పండుగను జరిపే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

ఆంధ్ర సాంస్కృతిక సమితి దినదిన ప్రవర్థమానమై నేటికీ తెలుగు వెలుగుల్ని విరజిమ్ముతోంది. ఈ సంస్థ ద్వారా అనేకానేక సాహిత్యోప న్యాసాలు, అష్టావధానాలు, నాటక ప్రదర్శనలు, చర్చలు, కవి సమ్మేళనాలు, కళా ప్రదర్శనలు, సారస్వత పోటీలు, ఉపాధ్యాయులకు అవగాహనా శిబిరాలు, అర్థవంతంగా రసవత్తరంగా ఉపయోగకరంగా నాటినుండి జరుపబడి భాషాభిమానాన్ని ఉద్దీపనం చేయబడుతోంది.

ఈ సంస్థ వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులను ఆహ్వానించి వారిచేత పలు కార్యక్రమాలను నిర్వహించి తెలుగు హృదయాలను సంతోషపు కడలిలో ముంచి తేల్చుతున్నది.

పరోపకారార్థం ఇదం శరీరం అన్న సూక్తికి దృష్టాంతంగా కోదండరామయ్యగారు వెలుగొందారు.

1909 ఆగస్టు 5న కనువెలుగు – 1984 జూన్ 4న కనుమరుగు అయిన ధన్యజీవి కోదండరామయ్యగారు. ఇప్పుడు లక్ష్మీనారాయణ, సుబ్బనారాయణమూర్తి, రామ లింగారెడ్డి, అన్నయ్యప్ప, సంపంగి రామయ్య, ముత్తకృష్ణ మొదలైనవారి కృషితో ఈ సంస్థ ప్రవర్థమానంగా విరాజిల్లుతోంది. ప్రస్తుతం హోసూరు శాసన సభ్యులు కె. గోపీనాథ్, తళి శాసన సభ్యులు టి. రామచంద్రన్, మాజీ శాసనసభ్యులు బి.వెంకటస్వామి, మాజీ శాసన సభ్యులు కె.ఎ. మనోహరన్‌లు ఈ సంస్థకు దన్నుగా ఉన్నారన్నది ఈ సందర్భంలో ముఖ్యంగా పేర్కొనాలి.

ఆంధ్రేతర ప్రాంతంలో తెలుగు భాషా సంస్కృతుల కోసం ప్రజాజీవనం మెరుగు పరచడానికి కృష్ణగిరి జిల్లా స్థానిక నియోజక వర్గాలైన హోసూరు, ఉద్ధనపల్లి, తళి మొదలైన మాజీ శాసన సభ్యులు అహరహం కృషి చేస్తున్నారు.

ముఖ్యంగా పేర్కొనాలంటే స్థానికంగా మూడుసార్లు నియోజకవర్గ శాసనసభ సభ్యులుగా తెలుగు ప్రజాసేవ చేసిన బాంధవుడు బి. వెంకటస్వామిగారు. వీరు కూడా కోదండ రామయ్యగారి మార్గదర్శకత్వంలో తెలుగు సంఘాలన్నింటిలో పాల్గొని ఘనత వహిస్తున్నారు.

ప్రస్తుత హోసూరు నియోజక వర్గ శాసన సభ సభ్యులు కె. గోపీనాథ్ గారు కూడా వరుసగా మూడుసార్లు గెలుపొందారు. వీరు తమిళనాడు శాసన సభా ప్రతిపక్ష నాయకుడుగా కూడా ఉండటం విశేషం. వీరు తెలుగు వాణిని శాసనసభలో వినిపించ మైనారిటీ భాషల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి, సమస్యల పరిష్కారానికి నడుము కట్టడం విశేషం.

వీరి చొరవతో హైయ్యర్ సెకండరీ పాఠశాల స్థాయిలో తెలుగు మాధ్యమ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలోని ప్రశ్నా పత్రములు – తెలుగు మాధ్యమంలో వచ్చే విధంగా చేయడం జరిగింది. వీరు ఈ ప్రాంతపు పాఠశాలల అభివృద్ధికి, మైనారిటీ హక్కుల పరిరక్షణకు, రైతులకు సహాయకారిగా పరిశ్రమాభివృద్ధికీ నిరంతరమూ పాటుపడుతున్నారు. వీరు ప్రస్తుత భాషా సమస్యలను పరిష్కరిస్తారని ఇచటి తెలుగు జనత గట్టిగా నమ్ముతోంది.

కృష్ణరసం :

కృష్ణగిరి జిల్లాలో ప్రముఖ తెలుగు రచయితల సంఘాలు కూడ కొన్ని ఉన్నాయి. కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం కృష్ణరసం అనే సంక్షిప్త నామంతో గత ఏడేళ్లుగా ప్రతి నెలా మొదటి ఆదివారం ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆవరణంలో సమావేశమవుతుంది. ఇందు ఉత్సాహవంతులైన సుమారు ఏభైమంది యువత పాల్గొని తమ పద్య, వచన, కవితలను, కథానికలను చదివి శ్రోతలకు వినిపిస్తారు. కొన్ని సమయాల్లో వివిధ వైజ్ఞానిక సంబంధ విషయాలను ప్రసంగించడం, చర్చించడం జరుగుతుంది.

ఆయా రచయితల రచనలను ఒకటిగా కూర్చి కొన్ని సంపుటాలుగా ఈ సంఘం ఇదివరకే వెలువరించింది. ఇటీవల ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేక సంచికలో వచ్చిన 25 కథలను 'చిటుక్కు పటుక్కు చెనిక్కాయలు' అనే పేరుతో ఒక సంపుటి వెలువరించడం జరిగింది. నా.రా. బసవరాజు రాసిన ఈ కథల్లో హోసూరు ప్రాంతపు జానపదుల జీవితం, ఇచ్చటి మాండలిక భాషతో గుబాళిస్తోంది. అట్లే జతగాడు-కతగాడు, కథల సంపుటి కెం. మునిరాజు కలిసి రాశారు. అలాగే ఈ ప్రాంతపు ప్రసిద్ధ హరికథకుడు దాసు నారాయణరెడ్డి రాసిన తెలుగు ప్రబోధ గీతాలు కూడా ఈ సందర్భంలో పేర్కొనాలి. అందులో భాషాభిమానం నిండుగా దట్టింపబడింది.

అలాగే డా॥ వసంత రచించిన తెల్ల కొక్కెర్ల తెప్పం అనే కతల సంపుటి ఆంధ్రదేశంలో కూడ ప్రాచుర్యం పొందింది. వివిధ కథకులు రాసిన ఎరినూగుపూలు కథా సంపుటి కూడా ప్రచురించడం జరిగింది.

ఈ సంస్థ నాగొండపల్లి కృష్ణప్ప అధ్యక్షతన చాలా సమర్థవంతంగా నడుపబడుతోంది. అందులో అశ్వత్థరెడ్డి, నంద్యాల నారాయణ రెడ్డి, కలువకుంట నారాయణపిళ్లై, జి. నారాయణ రెడ్డి, డా॥ వసంత, జయరాం, జి. చంద్రశేఖర్, పాండురంగం, పూనపల్లి శ్రీనివాసప్రసాద్ మొదలైన వారు ప్రముఖులు, సభ్యులుగా ఉన్నారు. కీ.శే. డా॥ గుర్రప్ప చౌదరి గారి పాత్ర ఈ సంఘంలో చాలా ప్రముఖ్యమైనది. వారి సినారె సాహిత్య పరిశోధనలు, వివిధ రచనలు ఈ సంస్థ సభ్యులకు స్ఫూర్తిని కలిగించాయి.

తెలుగు సాహిత్య పరిషత్తు :

కామ్రేడ్ రామస్వామిరెడ్డి గారి నేతృత్వంలో ఈ సంస్థ ఒక దశాబ్దంగా వివిధ సాంస్కృతిక సాహిత్య కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కీ.శే. కె.యస్. కోదండరామయ్య గారి అనుగు శిష్యులైన వీరు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రముఖ తెలుగు కవులను, పండితులను ఆహ్వానించి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థకు వచ్చిన ప్రముఖులు గరికపాటి, వాడ్రేవు చినవీరభద్రుడు, పద్మాకర్ వరవరరావు, ఆర్.వి.యస్. సుందరం, గద్దర్ వంటి గాయకులు ప్రసంగించారు. భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి పత్రికల్లో గత నాలుగు దశాబ్దాలుగా ప్రచురింపబడిన పాత మత్తగిరి సుబ్రహ్మణ్యం గారి వచన కవితలను ఈ సంస్థ జీవన వేదం పేరిట ఒక సంపుటాన్ని ప్రచురించింది. ఈ సంస్థకు చెందిన సత్యనారాయణరెడ్డి ఒక ప్రసిద్ధ పత్రికా విలేఖరి. వీరి విశ్లేషణాత్మకమైన తెలుగు వ్యాసాలు ఎన్నో వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి.

బస్తీ యువక బృందం :

హోసూరులో డా॥ వసంత్ నాయకత్వంలో బస్తి యువక బృందం ప్రతి ఉగాది పండుగకు సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా తెలుగు భాషా కోసం కృషి చేస్తున్న రాజకీయ నాయకులను, కవులను, పండితులను సత్కరిస్తున్నారు. అలాగే ఒక కవితా సంచికను కూడ ప్రచురిస్తున్నారు.

కళావేదిక :

ఈ సంస్థ ద్వారా కె. సీతారాం, నరసింహ మూర్తి, శ్రీనివాస్ మొదలగువారి నేతృత్వంలో వివిధ నాటక ప్రదర్శనలు, మిమిక్రీ ప్రదర్శనలు, హరికథలు, అష్టావధానాలు మొదలగు సాంస్కృతిక కార్యక్రమాలను జనరంజకంగా చేశారు. ప్రత్యేకించి కారుపల్లి సీతారాంగారు కృష్ణ పాత్రలో కె.యస్. నరసింహమూర్తి దుర్యోధన పాత్ర ద్వారా ప్రసిద్ధులైనారు.

వికాస వేదిక :

బి.కె. ప్రభాకర్, చంద్రశేఖర్, శ్యాంసింగ్, మిత్రబృందం ద్వారా ఉగాది వేడుకల సందర్భంగా నిర్వహించు కార్యక్రమాలు రసభరితంగా ఉంటున్నాయి.

స్వరాలయం :

ఈ సంస్థ మూలంగా కె.యస్. గోపాలకృష్ణయ్య తమిళాంధ్ర రాష్ట్రాలలో జరిగే ఘంటసాల సంగీత కార్యక్రమాలను సమీక్షించడంతోబాటు వివిధ సాహిత్య కార్యక్రమాలు చేస్తున్నారు.

హోసూరు తెలుగు మహాసభలు :

దేవిశెట్టిపల్లి శ్రీనివాసరెడ్డిగారి నేతృత్వంలో జరిగిన సభలు ఇచట తెలుగు జనతకు ఒక గొప్ప స్ఫూర్తిని కలిగించిందన్నది ఒక సత్యం. ఇందులో అక్కినేని, సినారే, గజల్ శ్రీనివాస్ మొదలైన ప్రముఖులు పాల్గొన్నారు.

హోసూరు మిత్ర బృందం :

శ్యాంసింగ్, విజయకుమార్ వారి మిత్ర బృందం తెలుగు ఘంటసాల పాటల కచ్చేరీలను యువకులకు పాటల పోటీలను నిర్వహించి, ఘంటసాల గాన మాధుర్యాన్ని పంచుతున్నారు. అదేవిధంగా ఇండియన్ ఏర్‌లైన్స్‌కు చెందిన నారాయణస్వామి, హెచ్.వి. కృష్ణప్ప, రామస్వామిరెడ్డి మొదలగువారి ఆధ్వర్యంలో ఘంటసాల జయంతి పాటల పోటీల కార్యక్రమాలను అతి

వైభవంగా చేస్తున్నారు. ఇందులో పాఠశాల బాల బాలికలు పాల్గొందురు. సంగీత రంగంలో పేరుగాంచిన మరికొందరు ఆంధ్రసాంస్కృతిక సమితి పరంగా సంగీత విద్వాంసుడు దేవరాజు బాలబాలికలకు సంగీతం నేర్పిస్తున్నారు. టైటాన్ కృష్ణ, శ్యామన్న, పట్టాభిగార్ల వాద్య బృందాలు స్థానికంగానే గాక చెన్నై, బెంగుళూరు ప్రాంతాల్లో కూడా ప్రసిద్ధిపొందారు. ప్రత్యేకించి బేరిక జానకీరాంగారు సంగీతపు పోటీల్లో గెలుపొంది వివిధ సంస్థలచేత బహుమతులను పొందారు. డోలు విద్వాంసుడు డెంకణీకోట మునిరత్నం ఆల్ఇండియా రేడియో కార్యక్రమాల్లో అనేక ప్రదర్శనలిచ్చాడు. తబలా విద్వాంసుడు కోనేరుపల్లి వేణుగోపాల్ ఈ ప్రాంతంలో ప్రసిద్ధిపొందాడు.

ఉపాధ్యాయ తేజాలు :

వృత్తులన్నింటిలో ఉపాధ్యాయవృత్తి ఉత్తమమన్నారు పెద్దలు. కారణం వారు దేశ నిర్మాతలు కావడమే. భావిభారత పౌరుల్ని సంస్కృతి సంప్రదాయాలవైపు సంస్కరించడంలోను, మాతృభాష, దేశాభిమానాలను పెంచడంలోను వారి పాత్ర గణనీయమైనది.

ఉపాధ్యాయ వృత్తిలో స్థానికంగా రాణించిన వారు లెక్కకు మిక్కుటంగా ఉన్నారు. వారిలో కొందరిని ప్రభుత్వం గుర్తించి, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన పండుగ దినాన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో ఏటేటా బహుమతి ప్రదానం చేస్తున్నది.

నాటక రంగం :

జానపదులకు వీధినాటకాలు ఒకప్పుడు మేటి వినోదదాయకం. నేటికీ ఈ నాటకాలు సజీవంగా అరుదుగా ఇచట ప్రదర్శింపబడుతున్నాయి.బేరికలోని లేపాక్షి రామాయణం ఈ సందర్భంలో పేర్కొనదగ్గది. ఇది వారంరోజులపాటు జరిగే ఒక దృశ్యరూపం. అందులో ప్రధానంగా జానకీరాం రాముని పాత్రను ధరించి తన గాత్ర మాధుర్యంతో ప్రేక్షక రసజ్ఞులను మెప్పిస్తున్నారు.

బాగలూరు పరిసర ప్రాంతాల్లో వేంకటేశాచారి గురుత్వంలో అలసపల్లి చంద్రారెడ్డి, రాజారెడ్డి, నటరాజు, శ్రీనివాసరెడ్డి, మునిరాజు, తిమ్మయ్య, అనుమారెడ్డి, డెంకణీ కోట రామకృష్ణ, భారత, భాగవత సంబంధమైన నాటకములలోని ప్రధాన పాత్రధారులుగా ప్రదర్శనలిచ్చి ప్రజలను మైమరపింప జేస్తున్నారు.

ఆధ్యాత్మి రంగం :

హోసూరులోని కైవారం నారాయణతాత పీఠాధిపతి బ్రహ్మశ్రీ వేంకటేశ్వరస్వాముల తరపున ఆధ్యాత్మిక కార్యక్రమాలు గత ఏభైఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు ధార్మిక అంశాలను బోధిస్తున్నారు.

నారాయణతాత, పాటలు, భజనలను నిర్వహిస్తున్నారు. స్వర్గీయ బుట్టప్ప స్వాముల ఆరాధనోత్సవాలు బేరిక గ్రామంలో ప్రతిఏటా వైభవంగా చేస్తున్నారు. స్వర్గీయ పద్మనాభస్వామి నవ్యరీతుల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసి ప్రజల్ని చైతన్య పరిచారు. కోడిపల్లి గీతా శ్రమము, బాగలూరు రామాచార్యుల చేత అచల వేదాంతంలో ప్రభావితులైనవారు దయానాథం మొదలగువారు.

విలేకరులు :

వివిధ ప్రసిద్ధ దినపత్రికలకు ఈ ప్రాంతపు వార్తలను చేరవేస్తున్న వారిలో పేర్కొన దగినవారు రామమూర్తి, రామచంద్ర, రామకృష్ణ, ఎ.పి. సురేశ్, చంద్రశేఖర్, సత్యనారాయణ రెడ్డి, రమేశ్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, మంజునాథ్, నారాయణ రెడ్డి, సూర్యప్రకాశ్ మొదలగు వారు. ఈ ప్రాంతానికి ప్రత్యేకించిన స్థానంలో ప్రజల స్థితిగతుల్ని నిత్యం తెలియజేసి ప్రజల్లో చైతన్యాన్ని నింపుతున్నారు.

తెలుగు విద్యార్థులకు వాచకాలు, కరదీపికలు మొదలగునవి తెలుగులో కడు శ్రద్ధగా అచ్చువేసి ఇవ్వడంలో ముందున్నవారు జూపిటర్ ప్రింటర్స్ సూర్యప్రకాశ్‌గారు. కృష్ణగిరి జిల్లాలోని తెలుగు తేజాలను వీలైనంతవరకు సంక్షిప్తంగా పరిచయం చేయడానికి ఈ చిన్న వ్యాసం ద్వారా ప్రయత్నం జరిగింది. కానీ ఈ అంశం పై లోతైన విస్తృతమైన పరిశోధన ఎంతైనా చేయాల్సి ఉందని సవినయంగా మనవి చేస్తున్నాను.

జి. చంద్రశేఖర్

(ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక 2012)

తెలుగులో సూక్ష్మికలు

- కొల్లూరు లావణ్య

పెరుగన్నం ఆవకాయ కమ్మదనం, పున్నమి చంద్రుని వెన్నెల, చల్లదనం శ్రావణ మాసపు తొలకరి జల్లుల హాయి, నెచ్చెలి కౌగిలింత మాధుర్యం, ప్రాణమిత్రుని పలకరింపులోని ఆత్మీయత వీటన్నిటినీ ఎన్నిసార్లు వర్ణించినా తనివి తీరదు. పైగా వీటిని అందరికీ పరిచయం చేయవలసిన అగత్యమూ లేదు. అందరికీ అనుభవైక్యమైన విషయాలు ఇవి. జగమెరిగిన నిజాలు. ఆ విధంగానే ఆంధ్ర పాఠకలోకానికి షడ్రుచులను తన రచనల ద్వారా అందించిన గొల్లపూడి మారుతీరావు గారి రచనల గురించి నేను కొత్తగా అందించాల్సిన పరిచయం ఏవీ అక్కర్లేదు. కాకపోతే తినే తొందరలో, ఆర్తిలో కొన్ని రుచులు తప్పిపోయే ప్రమాదం ఉంది కనుక, ఆ షడ్రుచులను ఆయన రాసిన 'జీవనకాలమ్'ల ద్వారా మీకు అందించాలన్న ఆదుర్దాయే ఈ ప్రయత్నం.

1981 సెప్టెంబరు, తొమ్మిదిన తేదీన *ఆంధ్రజ్యోతి* దినపత్రికలో ప్రతీ మంగళవారం ధారావాహికగా ప్రారంభమయ్యి 1999 ఆగస్టు 28 వరకూ కొనసాగిన సూక్ష్మిక గొల్లపూడి మారుతీరావుగారి *'జీవనకాలమ్'.* మొత్తం సంఖ్య 566. స్పృశించని అంశమూ లేదు, చర్చించని కోణమూ లేదు. సామాజికం, రాజకీయం, సాహిత్యం, మానసికం, చలనచిత్రం, వ్యక్తిగతం, అంతర్జాతీయం ఇలా అన్ని విభాగాలూ ఆ *జీవన కాలమ్*లోనే. సామాజికంలో సామాజిక జీవనానికి సంబంధించిన ప్రతీ అంశమూ ఉంది. వివిధ వ్యవస్థల పని తీరు, ఆచార వ్యవహారాలు, వేషధారణ, మతం, సంప్రదాయం, దేవుడు - భక్తి, భాష-రాష్ట్రం ఇలా చెప్పుకొంటూ పోతే ఇంకొక 566 పుటలూ అవుతాయి. కనుక నా మనసులో నాటుకుపోయిన కొన్ని సూక్ష్మికల శకలాలను మీ పైకి విసరదలచుకున్నాను. ఒడుపుగా పట్టుకోండి.

జీవన కాలమ్‌లోని మారుతీరావుగారి భాష అంతా వ్యావహారికమే. భాషలో ఎటువంటి మాండలికాలు గానీ, యాస గానీ కనిపించవు. భాష అంతా ఓ ప్రవాహంలా సాగుతుంది. నిరంతర వాక్ ప్రవాహపు భావాల ఝరి జీవనకాలమ్. ఆ ఝరి పాఠకుల దాహార్తిని తీర్చి, వారిని ఆలోచింపజేసే తరంగాల విస్తరి. ప్రస్తుత విషయం మీద తనదైన అభిప్రాయాన్ని తెలిపేది సూక్ష్మిక. ప్రతీ సూక్ష్మికుడు (కాలమిస్ట్) తన సూక్ష్మిక ద్వారా తన వ్యక్తిగత అభిప్రాయాన్ని తెలియపరుస్తాడు. కనుక ఒకే విషయం మీద అనేకమంది సూక్ష్మికులు రాయడానికి అవకాశం ఉంది. కానీ అందరికంటే ఓ విభిన్న కోణంలో ఆ అంశం మీద దృష్టి సారించడం ఓ ప్రత్యేకత. ఇటువంటి ప్రత్యేకతను బాణీగా అలవరచుకొన్న వారే వీరు. ఎన్.టి.ఆర్. గారి వివాహం. ఈ అంశాన్ని తీసుకుందాం. నందమూరి తారక రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే లక్ష్మీపార్వతిని వివాహం చేసుకున్నారు. దీనిపై అనేకమంది విమర్శలు చేశారు. గొల్లపూడి గారూ విమర్శించారు. కానీ ఆ విమర్శ సహేతుకంగా ఉంటుంది. అదేవిటో మీరూ రుచి చూడండి:

'అయితే, కీర్తి, ప్రతిష్ఠ, నాయకత్వం ఒక బాధ్యత. తాను కుటుంబానికేకాదు, సమాజానికి, జాతికే శ్రేష్ఠుడు. 'యద్యదాచరతి శ్రేష్ఠః' అన్నది భగవానువాచ. కనుక ఒక చర్య తనకి మంచిదయినా, సమాజానికి చెడ్డదని తోచినపుడు దాన్ని ఆచరించకపోవడం విజ్ఞత. తనకి కావల్సిన దానికి కారణాలు వెదుక్కొనడం, దానికి ఆదర్శాల రేపర్లు చుట్టడం ఆత్మవంచన.

ఇది 'అన్నా-అన్నన్న' (జీవనకాలమ్-2) సూక్ష్మిక ద్వారా గొల్లపూడి గారి విమర్శ. ఎంతటి విమర్శ అయినా ఆ విమర్శకు గురైన వ్యక్తి కూడా ఆలోచించలేకుండా

ఉండలేకపోవడం, బయటపడడానికి అహం అడ్డొచ్చినా అంతర్గతంగానయినా ఆ విమర్శ ఒప్పేనని ఒప్పుకోకుండా ఉండలేడు. ఇంతేకాదు ఈ సూక్ష్మికలోనే వివాహం గురించి కొత్త కోణాన్ని ఆవిష్కరించారు.

'ఒంటరితనాన్నీ భర్తీ చెయ్యడానికి మనిషికి ఊతం కావాలి. కొందరికి ఆ ఊతం ప్రజాహితం. కొందరికి దేవుడు. కొందరికి సహధర్మచారిణి. అందుకనే శారీరక అవసరాలు తీరాక మనిషి భార్యలో గొప్ప స్నేహితుణ్ణి చూసుకొంటాడు. ఆ స్నేహం కన్న కొడుకు, కూతురు, డబ్బు ఏదీ ఇవ్వలేనిదీ.' ఇది ఒక విధంగా సమర్థన. విచక్షణా శక్తికి మచ్చుతునక. వ్యక్తి చేసే చర్యలపట్ల ప్రతికూలతే కానీ, వ్యక్తిపట్ల అననుకూలత లేదన్న విషయం విదితం. ఆ ప్రతికూలత లోనూ కూడా అననుకూలత లేదన్న విషయం స్పష్టం. ఆ ప్రతికూలతలోనూ కూడా అనుకూలతనం పొందపరచగలిగే తర్కవాది. ఇటువంటి తర్కం, విజ్ఞత, విచక్షణ, వివేకం మనకు అడుగడుగునా గోచరమవుతూ జీవనకాలమ్‌లు ఆసాంతం ప్రకాశిస్తూ వుంటాయి.

ప్రతీ అంశాన్నీ సునిశితంగా పరిశీలించి లోతులకు పయనించి పరిశోధించే తత్త్వం వీటిలో మనకు కనిపిస్తుంది. అత్యంత స్వల్ప విషయమే అయినా అత్యంత సూక్ష్మంగా పరిశీలించాలనుకొని సూక్ష్మగ్రాహిత్యం కూడా గోచర మవుతుంది. ఉదాహరణకు 'వెక్కిరింత' (జీవనకాలమ్-2) అనే సూక్ష్మికను తీసుకుందాం. వెక్కిరింత అందరూ చేసే పని కదా. దీన్ని విశ్లేషించిన తీరుని గమనించండి.

'వెక్కిరింత - చిన్నతనం నుంచి అందరూ అసాధారణంగా చేసే పని. చిన్నతనంలో అయితే వెక్కిరింత చాలా సుళువుగా బాధపెడుతుంది. మనిషిలోనో, మాటలోనో, ప్రవర్తనలోనో - ఏదో లోపాన్ని భూతద్దంలో చూపించడం వెక్కిరింత. ఇందులో మూడు రకాలు. వెక్కిరించేవాళ్లు, ఆ వెక్కిరింతకు బాధపడేవాళ్లు, తమని తామే వెక్కిరించుకునేవాళ్లు. ఆఖరిదాన్ని 'సెన్సాఫ్ హ్యూమర్' అంటాం. అన్నింటిలోకి అతి వుత్తమమయిన అదృష్టం తన లోపాన్ని తాను ఎరగడం. దాన్ని చూసి తనే నవ్వుకోవడం.

వెక్కిరింత అనేది సర్వసాధారణమే అయినా వెక్కిరింతను సృష్టించినంత అవగాహన కలిగి వుండడం ప్రశంసనీయం.

రచయితకు ముఖ్యంగా వుండాల్సిన మరో లక్షణం చిత్తశుద్ధి. చిత్తశుద్ధి, నిజాయితీ లోపించిన ఏ రచనయినా ఖ్యాతికెక్కదు. అందులోనూ సూక్ష్మికులకుండవలసిన ప్రాథమిక లక్షణం అది.

'ఎప్పుడు కెమెరా ముందుకొచ్చినా - పాత్ర తప్ప మరేది కనిపించదు. ఆ పాత్ర కోసమే పుట్టినట్టు. అంతకంటే ఆ పాత్రకి మరే ఆహార్యం, ఆంగికం, వాచికం అక్కర్లేదనిపించేంత నికార్సుగా అతుక్కుపోతాడు. ధరించే పాత్రలో పరకాయ ప్రవేశం చేస్తాడు. జాతీయ స్థాయి బహుమతులంటూ ప్రారంభించాక నటనకు దక్కిన ఒకే ఒక బహుమతి ఇది. ఇది నటనకు పట్టాభిషేకం, వాస్తవిక నటనకు కితాబు.'

ఇదంతా నటుడు పి.ఎల్. నారాయణ గారు జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకుంటున్న సందర్భంలో ఆయన గురించి రాసిన 'జాతీయ నటుడు' జీవనకాలమ్-2 సూక్ష్మికలోని వాక్యాలివి. తను కూడా ఓ నటుడయ్యుండి, తన నటనకు కూడా అనేక సలాములు, అభినందనలు అందుకున్న వారయ్యుండి, సాటి నటుడిని, నటనని కీర్తించగలిగారంటే అది గొల్లపూడి గారి నిజాయితీ, చిత్తశుద్ధి. నిష్కల్మష హృదయం మాత్రమే ప్రశంసించగలదు ఏ ముసుగూ వేసుకోకుండా. నిర్మల మనసు మాత్రమే ఎదుటివారి ప్రతిభను గుర్తించగలదు.

వ్యంగ్యం జీవనకాలమ్‌ల మరో అస్త్రం. ఈ అస్త్రాన్ని సంధించి వదిలితే సూటిగ, పదునుగ, సున్నితంగా హృదయపు లోతుల్లోకి చొచ్చుకొనిపోతుంది. వ్యంగ్యాన్ని వ్యంగ్యంగా కాకుండ, సునిశిత హాస్యరసాన్ని జోడించే తేనె పూసిన కత్తిలా మెత్తగా దింపబడుతుంది.

'కొందరు ఏ పని చేసినా ఏడుస్తూ చేస్తారు. మరికొందరు పెన్సిలు చెక్కుకోవడం కూడా జాతీయ దినోత్సవంలాగా చేస్తారు. అన్నగారు ఏ పని చేసినా అత్యంత వైభవంగా చేయాలనుకుంటారు. ఆయన కొత్త తలపాగా పెట్టినా దేశంలో అందరికీ టోపీలు మార్చినంత ఘనంగా, పదిమందీ, పది పత్రికలు చెప్పుకునేలాగ చేస్తారు. ఆదాయం పన్ను ఎగువేత కేసులో హాజరు కావలసివచ్చినా అమరావతి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి తరలి వెళ్లినట్లు బాకాబూరలతో, వందిమాగధులతో ఊరేగింపులాగే వెళ్తారు.'

ఎన్.టి. రామారావు గారి గురించి 'మరో అవతారం' - జీవనకాలమ్-2. ఆయనని విమర్శించడంలో సంధించిన

వ్యంగ్యాస్త్రం, సున్నితమయిన, హాస్యయుక్తమైన చురక. ఆ పదాల వేడిని, వాడిని అర్థం చేసుకొంటే ఆ చురక చురుక్కుమనిపించక మానదు.

జీవనకాలమ్‌లలో కనిపించే మరొక విశిష్ఠ లక్షణం సూక్ష్మికకు, రచయిత ఎన్నుకునే పేరు. వినాయక లీలలు, వసుధైక కుటుంబం, చిదంబర రహస్యం, మరో భారతం, భారతదర్శనం, నేటి 'వైతరణి', 'నోబెల్' ఆలోచనలు ఇంకా ఎన్నో సూక్ష్మికల పేర్లు ఉత్కంఠభరితంగా, ఉత్సుకతని కలిగించే విధంగా ఉంటాయి. వినాయక లీలలు అన్న పేరు చదవగానే ఈ వినాయకుడెవ్వరు అని ఆసక్తి పెరిగి పాఠకుడు చదవడం ప్రారంభిస్తాడు. కానీ, వినాయకుడు అంటే ఒక వ్యక్తి కాదని, వినాయకుడిని అడ్డం పెట్టుకొని గూండాలు, రాజకీయవాదులు చేసే లీలలు వినాయక లీలలు. ఆ విధంగానే వసుధైక కుటుంబం, చిదంబర రహస్యం తమిళ నాయకురాలు 'జయలలిత'ను ఉద్దేశించి రాసినవి. 'నోబెల్' ఆలోచనలు ఫూలన్‌దేవి, వీరప్పన్ లాంటి దొంగల గురించి రాసిన సూక్ష్మిక. నేటి 'వై'తరుణి విద్యావ్యాపారం గురించిన సూక్ష్మిక, మరోభారతం దేవీలాల్ గురించి, భారతదర్శనం పి.వి. గారికి తీహార్ జైలులో ప్రత్యేక గది ఏర్పాటుకు సంబంధించినవి. సముచితమైన, సమంజసమైన, విలక్షణమైన పేరు పెట్టి ఆ నామసార్థకతను సాధించే దిట్ట మారుతీరావు గారు.

ఇంకొక వైవిధ్య లక్షణం ఎత్తుగడ, ముగింపు. ఒక సూక్ష్మికకు ప్రాణం ఈ రెండే. ఎందుకంటే పాఠకుడికి అప్పటికే ప్రస్తుత అంశం తాలూకు వివరాలు తెలిసే ఉంటాయి. కానీ ఆ పాఠకుడిని ఆద్యంతం చదివించాలంటే తప్పనిసరిగా అవసరమయ్యే లక్షణం ఇది. ఎత్తుగడ ఒక ఎత్తయితే, ముగింపు ఒక ఎత్తు. అత్యద్భుత ముగింపుతో ముక్తాయింపును కళాత్మకంగా, వివరణాత్మకంగా, వ్యంగ్యాత్మకంగా మొత్తం సూక్ష్మిక సారాంశాన్ని చివరి వాక్యంలో ప్రతిష్ఠింప చేయగలిగే రససిద్ధత ఈ 'జీవనకాలమ్'లలో నిత్య ప్రవాహం. చివరి వాక్యం, చెరగని ముద్ర వేయడం ఖాయం. గాంభీర్యంగా, ఔన్నత్యంగా, సలక్షణమైన ముద్రవేసి పాఠకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు రచయిత.

వినాయక లీలలు సూక్ష్మిక ముగింపు గమనిద్దాం.

'ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా 'మతం' అన్ని పార్టీలకీ, మెజారిటీలకి, ప్రయోజనాలకి, అప్రయోజనాలకి ఆయుధం అయివున్న కాలంలో 'వినాయకుడు' ఓ పరికరం. ఓ ఎక్స్క్యూజ్, ఓ సింబల్, చివరగా నిస్సహాయంగా, నిశ్శబ్దంగా ఆఖరి రోజున మురికి కూపంలో దూకి మాయమయ్యే మట్టిబొమ్మ'

నిజాన్ని నిర్భయంగా, బాహాటంగా, స్పష్టంగా క్లుప్తంగా, సరళంగా, సూటిగా, సున్నితంగా వ్యక్త పరచగల ధీయుక్తత సుస్పష్టం.

అక్షరం విలువను గ్రహించి పదాలను ఒడుపుగా, విరువుతో, సమయస్ఫూర్తితో, చురకత్తిలా సమస్య విశ్లేషణ అనే పద్మవ్యూహంలోకి దిగి బయటపడగలిగే సాహితీ అభిమన్యుడు గొల్లపూడి గారు. అవసరమయిన చోట సున్నితంగా, అవసరమయిన చోట కరకుగా చెంపదెబ్బ కొట్టగలిగే సవ్యసాచి.

వెరసి భాషను భావంతో మలిచి, బరువయిన సమస్యను అతి తేలికగా విశ్లేషించగల పటిమతో, సరళభాషలో పదునైన వ్యంగ్య విమర్శనాస్త్రాలను సున్నితంగా, సహేతుకంగా, సంధించగల సమయస్ఫూర్తితో, నిజాన్ని నిజంగా నమ్మి, చిత్తశుద్ధితో, నిజాయితీతో, నిర్భయంగా నిర్మొహమాటంగా వ్యక్తపరచగలిగే దార్శనికతతో, ఎటువంటి ముసుగూ లేని సామాజిక స్పృహతో, నిష్కల్మష హృదయంతో, అత్యద్భుతమైన ఎత్తుగడ, ముక్తాయింపులతో సూక్ష్మిక కళను ఆకళింపు చేసుకొని, కాలమ్‌తోనే తన కాలం, తన కలం అని నిరూపించుకోవడం ఈ జీవనకాలమ్ - 1,2,3 ల ద్వారా మనం గ్రహించకమానం.

కొల్లూరు లావణ్య
సౌత్ ఏసియన్ లాంగ్వేజెస్ & సివిలిజేషన్స్
ది యూనివర్సిటీ ఆఫ్ షికాగో
యు.యస్.ఏ



స్వాతంత్ర్యోద్యమం :

మద్దూరి అన్నపూర్ణయ్య

– *సి.వి. రాజగోపాలరావు*

1921లో బి.ఎ. చదువుకు స్వస్తిచెప్పి, స్వాతంత్ర పోరాటంలోనికి దుమికిన మద్దూరి అన్నపూర్ణయ్య 1922లో రాజమండ్రిలో ఆంధ్ర యువజన స్వరాజ్య సభ తరపున తన సంపాదకత్వాన "కాంగ్రెస్" వార పత్రికను ప్రారంభించాడు.

ఈ పత్రిక తొలి సంచిక 1922 మార్చిలో వెలువడింది. ఇది ప్రారంభంలో ఒక ఫుల్‌స్కేప్ కాగితంపై సైక్లోస్టైల్ పత్రికగా వచ్చేది. తరువాత డాక్టర్ సుబ్రహ్మణ్యం గారి జాతీయ విద్యాలయం ప్రెస్‌లో ప్రింట్ అయింది. అప్పుడది రాయల్ సైజులో 14 పేజీలతో వెలువడేది.

గోదావరి జిల్లా నాయకులు డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారు రాజమండ్రి సమీపంలోని సీతానగరంవద్ద గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమాన్ని 1924లో స్థాపించినప్పుడు, యీ పత్రిక ఆశ్రమానికి మారింది. అక్కడ పత్రికకు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారు ఒక జర్మన్ ట్రెడిల్ టిప్‌టాప్‌ను కొనిపెట్టారు; రెండు మూడు వేలు పౌనుల టైపును కూడా విరాళంగా ఇచ్చారు. కాంగ్రెస్ పత్రికా సంపాదకుల నైదుగురిని వివిధ సందర్భాలలో ప్రభుత్వం కారాగారంలో బంధించింది. వారు మద్దూరి అన్నపూర్ణయ్య, కాండ్రేగుల రామచంద్రరావు, చంద్రుపట్ల హనుమంతరావు, క్రొవ్విడి లింగరాజు, రామచంద్రుని వెంకటప్ప.

1924లో పత్రికకు 600 మంది చందాదారులు వుండేవారు. 1929లో పత్రికకు 900 మంది చందాదారులు వున్నారు; జాబ్‌వర్క్ కూడా బాగా చేసేవారు. పత్రిక స్వయం పోషకమైంది. మద్దూరి కృష్ణమూర్తి, వంగల సత్యనారాయణ కంపోజింగ్ నేర్చుకుని, ఆ పని చేసేవారు. క్రమంగా యీ సంఖ్య రెండువేలయింది. అయితే పత్రిక ప్రభావం మాత్రం ఆంధ్రదేశంపై విపరీతంగా ఉండేది.

ఈ పత్రిక సంపూర్ణ స్వాతంత్ర్య వాదాన్ని బలపరుస్తూ, బ్రిటిష్ ప్రభుత్వాన్ని తీవ్ర పదజాలంతో దుమ్మెత్తిపోసేది. ఈ ఘాటును భరించలేక, ప్రభుత్వం 1923లో *కాంగ్రెస్, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, స్వధర్మ* పత్రికలకు అడ్వర్టయిజ్ మెంట్లను నిలిపివేసింది. ఇంగ్లీషు పత్రికలలో 'స్వరాజ్య', 'నవయుగ' ఉన్నాయి. 1925లో సవరించిన యీ జాబితాలో కూడా యీ పత్రికలు ఉన్నాయి. నాటికి 'మాతృసేవ', 'శారద', 'స్వతంత్ర రాజ్య' పత్రికలు చేరాయి.

ఆర్థికపరంగాను, ప్రభుత్వ పరంగాను ఎన్నో ఇబ్బందులు, అడ్డంకులు, చిక్కులు వచ్చేవిగాని పత్రిక మాత్రం తప్పనిసరిగా వెలువడేది. ఈ పనిని కూడ సిబ్బంది దేశసేవలో భాగంగానే భావించేవారు. సంపాదకులు, కంపోజిటరు అనే భేదం లేకుండా, అందరూ అన్నిపనులూ చేసేవారు. పత్రికను కట్టలు కట్టడం, పోస్టాఫీసుకు తీసుకుపోవడం, పరిస్థితులనుబట్టి పత్రికను రహస్యంగా ఇతర ప్రాంతాలకు చేర్చడం చేసేవారు. అవసరమైతే తమ జేబులలోని డబ్బునే ఖర్చుపెట్టేవారు.

నేలమీద చాపలపై వ్రాతబల్లల ముందు కూర్చుని పనిచేసేవారు. 1929 మే 8, 9 తేదీలలో గాంధీజీ ఈ ఆశ్రమంలో ఉన్నప్పుడు 'కాంగ్రెస్' కార్యాలయంలో పనితీరును చూసి ఆశ్చర్యపోయారు.

"కాంగ్రెస్" పత్రికకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. తన ఆశయాలకు విరుద్ధంగా అడ్వర్టయిజ్‌మెంట్లను తీసుకొనేది కాదు; బ్రిటిష్ వస్తువులు, మత్తు పదార్థాలు, విదేశబట్టలు వంటి ప్రకటనలను ప్రచురించేవారు కాదు. హిందీ భాషా వ్యాప్తికి కృషి చేసింది. తెలుగు లిపిలో హిందీ పాఠాలను ప్రచురించడం ఒక ప్రత్యేక లక్షణం. పత్రిక అధినివేశ ప్రతిపత్తికి ప్రతికూలం; సంపూర్ణ స్వరాజ్య వాదనను బలపరచింది.

1923లో అన్నపూర్ణయ్య అరెస్ట్ :

"కాంగ్రెస్" పత్రికను ప్రారంభించిన పది మాసాలకే ఆ పత్రిక సంపాదకుడు మద్దూరి అన్నపూర్ణయ్యను ప్రభుత్వం రాజద్రోహ నేరం క్రింద 1923 జనవరి 23న అరెస్టు చేసింది. అప్పుడాయన ఒకటిన్నర సంవత్సరాలు కఠిన శిక్షను అనుభవించాడు.

అన్నపూర్ణయ్య 1922 నవంబర్ 9, 10 తేదీలలో రాజమండ్రిలో ఇచ్చిన ఉపన్యాసాలు రాజద్రోహం నేరం క్రిందికి రాగలవని ప్రభుత్వం భావించింది. కాని 10వ తేదీ ఉపన్యాసమే కేసుకు తగినదని అడ్వొకేట్ జనరల్ తెలియజేయడంతో, ఆ ఉపన్యాసానికి ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం అనుమతిని ఇచ్చింది.

ఈ కేసుతీర్పులో జిల్లా మేజిస్ట్రేట్ ఈ విధంగా పేర్కొన్నాడు. "ముద్దాయిపైన 124-ఎ సెక్షన్ క్రింద కేసు చేయుటకు రాష్ట్రీయ దొరతనము వారంగీకరించిరి. రాజమహేంద్రిలో 1922 నవంబర్ 10వ తేదీన ముద్దాయి యిచ్చిన ఉపన్యాసమే యీ కేసుకాధారము. ఆ ఉపన్యాస మందలి ఒక్క వాక్యము తప్ప తక్కినదంతయు నిర్దుష్టము. 'ఈ దొరతనమును తొలగించవలెను; ఎంత త్వరగా తొలగించిన నంతమంచిది' అని ముద్దాయి ఆ ఉపన్యాసమున నుడివెను.

ఆ ఉపన్యాసమునొక పోలీసు ఇన్‌స్పెక్టర్ వ్రాసెను. అతడు ఒక సాక్షి. దానిని (ఉపన్యాసాన్ని) హ్రస్వలిపిలో వ్రాసి, పిమ్మట మామూలు అక్షరములలో వ్రాసెను. ఆ సాక్షి సరిగా వ్రాయలేదని ముద్దాయి ఆక్షేపించెను.

చాలా అనుభవముగలవాడు గాన అతడు పొరపాటుగా వ్రాసెనని నమ్మ వీలులేదు. ప్రభుత్వ పద్ధతిని తొలగించవలె నంటిని కాని ప్రభుత్వమును తొలగింపవలెనని తెలుపలేదు అని ముద్దాయి స్టేట్‌మెంట్‌లో తెలిపాడు. ఒక సాక్షి తప్పు వ్రాసెనని నమ్ముట కవకాశములేదు. ఒకవేళ నమ్మినను, అతనికెట్టి లాభమును కలుగదు. ప్రభుత్వ విధానమునకును, ప్రభుత్వమునకును భేదములేదు. ఈ ప్రభుత్వము ఆంగ్లేయుల ప్రభుత్వము, దీనిని తొలగింప వలెనని ముద్దాయి మనః పూర్వకముగా బోధించెను.

ముద్దాయి స్టేట్‌మెంట్‌లోని తక్కిన విషయాలన్నీ ప్రజలవలంబించ వలసిన పద్ధతులను సూచిస్తున్నాయి. సత్యమునే పలుకవలెను. దౌర్జన్యమెంత మాత్రము కూడదు అని ముద్దాయి చెప్పెను. అదియే ముద్దాయి నిశ్చితాభిప్రాయ మని నమ్మినను, అతడు ప్రభుత్వము అంతమయ్యేదాకా - అది ఆంగ్లేయ ప్రభుత్వమని తెలిసి - ప్రజలకు ద్వేషమును కలిగింప యత్నించెను. శబ్దార్థమున మాత్రమే దానిని గ్రహించి, విన్నవారికి కలుగు భావములనే ప్రధానముగ చూడవలెను. ప్రభుత్వముపై ప్రజలకు ద్వేషభావము కలిగించుటకు ముద్దాయి ప్రయత్నించెననుట నిశ్చయము.

ముద్దాయి పీనల్ కోడ్ 124-ఎ సెక్షన్ క్రింద నేరము చేసెను.

ముద్దాయి సూచనలను బట్టి ప్రజలు దౌర్జన్యమ వలంబించుటయే ఫలితమగు ననుట నిశ్చయమైనను, ముద్దాయి దౌర్జన్యమును బోధించలేదు. కనుక నేనతనికి ఒక సంవత్సరము కఠిన శిక్షయును, రూ. 500/- జరిమానాయు, జరిమానా చెల్లించనిచో మరి ఆరునెలలు కఠిన శిక్షయు విధించితిని" అని మేజిస్ట్రేట్ తన తీర్పులో పేర్కొన్నాడు.

అన్నపూర్ణయ్య జుల్మానా చెల్లించకపోవడంవల్ల ఒకటిన్నర సంవత్సరాలు జైల్లో ఉన్నాడు. ఈ శిక్షనాయన రాజమండ్రి, వెల్లూరు సెంట్రల్ జైళ్ళలో అనుభవించారు.

దేశ చరిత్రలోని కథే :

శ్రీ అన్నపూర్ణయ్య తన తరఫున డిఫెన్సు పెట్టుకోలేదు. కాని లిఖిత పూర్వకమైన వాఙ్మూలాన్ని జిల్లా మేజిస్ట్రేట్‌కు సమర్పిస్తూ, తాను ఎలాంటి నేరమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ వాఙ్మూలంలో యీ విధంగా పేర్కొన్నారు.

"8-5-1929 నాటి 'కాంగ్రెస్' పత్రికలోని "చిచ్చుల పిడుగు"ను ప్రచురించినవాడను నేను. 1857 సంవత్సరం నాటి భారత స్వాతంత్ర్య యుద్ధము యొక్క నిజమయిన స్వరూప చిత్రమును చూపుటే నా యుద్దేశము.

చిచ్చుల పిడుగొక నాటకము. అభిప్రాయ ప్రకటనకు నాటకమొక పద్ధతి. ఇంగ్లీషువారి యకృత్యముల నొక్కొక్కటి చూచి యొక సిపాయి - మంగళపాండ్యా - ఓర్వలేక పోయినాడు. కసి తీర్చుకొన తలపడినాడు. సైన్యమును విడిచి, తుపాకిని, కత్తిని చేతబూని, జయ జయ ధ్వని చేయుచూ నోటికి వచ్చినట్లు తన కడుపునిండ ఇంగ్లీషు వారిని తిట్టి, ఇద్దరు ఇంగ్లీషు అధికారులను తృటిలో కాల్చి చంపి, తన్ను కాల్చుకొనెను. కాని తన ప్రాణం పోలేదు. ఉరిశిక్షకు లోనయ్యెను. సిపాయిలు "మంగళపాండ్యాకు జై" అనిరి.

ఇది నిజమయిన కథ. దేశచరిత్రలోని ఈ కథయే "చిచ్చుల పిడుగు" నాటకమున కాధారము. ఈ నాటక రచయిత రామచంద్రుని వెంకటప్ప. దీని పబ్లికేషను విషయమై ఎడిటర్లయిన అన్నపూర్ణయ్యను, లింగరాజును అప్పటి ప్రభుత్వాధికారులు దీని రచయితపేరు చెప్పమని ఎంత వేధించినను ప్రచురణకర్తలుగా రచయిత పేరు తమకు తెలుసని, కానీ చెప్పమని ఖరాఖండీగా అధికారుల మొహాన్నే చెప్పారు.


చిచ్చుల పిడుగు రచయిత వెంకటప్ప

మంగళపాండ్యా ధైర్యశాలి. కథానాయకుడు - కాని అతని నాదర్శప్రాయునిగ చూపియుండలేదు. నేను దౌర్జన్య రహిత వాదిని. అతను నాకెట్లు ఆదర్శ పురుషుడగును? మంగళపాండ్యా ఆతురత పడినాడు. ఆ యాతురత అతనికి లేకుండ యుండినచో ఇండియాకు స్వరాజ్యమెన్నడో వచ్చి యుండెడిది.

మంగల్ చెప్పిన మాటలు నావిగావు, "సతి" పద్ధతిని తొలగించినందుకు సంతసించితిని. విధవా పునర్వివాహ చట్టము నాకు సమ్మతము. సముద్రయానమునకు నేను సిద్ధము. కాని మంగల్ ఒక్క హిందూ ధర్మశాస్త్రమునకు బద్ధుడు. హిందూ మతమును నాశనము చేసి, భారతీయులను బానిసలుగ చేయువారిని కడతేర్చవలయునని శపథము పట్టినాడు. అతడు హింసను సమర్థించెను. నేను అహింసావాదిని. ఈ విషయములో అతనికి, నాకు హస్తిమసికాంతరము.

వెనుక జరిగిన సుప్రసిద్ధ చరిత్రాంశములను పలు రకములుగ పునరుజ్జీవింపచేయుట రాజద్రోహము కాదు. అన్ని దేశములలోను ఇట్టి రాజద్రోహములు జరిగినవి; జరుగుచున్నవి. చరిత్రను బోధించుటే నేరమయినచో స్కూలు టీచర్లు, కాలేజి ప్రొఫెసర్లు, గొప్ప గొప్ప చరిత్రకారులు అందరును శిక్షింపబడవలయును.

నేను దౌర్జన్యరాహిత్య వాదిని. నా పత్రిక యందు దౌర్జన్య విధానము కించిత్ అయినా కనపడదు. నేను సభ్యుడుగా ఉన్న కాంగ్రెస్ నందు గాని, యువజన సంఘమునందు గాని దౌర్జన్యమను మాటయే లేదు. ఇక నాయందు దౌర్జన్యమెట్లు వచ్చును? సర్వమత సమత్వము అక్షరక్షరమును ఆచరణ యందుంచు యువజన సమితి కధ్యక్షుడను - మత విద్వేషమునెట్లు పెంచగలను?" అని వాఙ్మూలంలో పేర్కొన్నాడు.

నాటక రచయిత పేరును గురించి ముద్దాయిని ప్రభుత్వ న్యాయవాది ప్రశ్నించెను. కాని ఆయన పేరు చెప్పదలచుకోలేదని అన్నపూర్ణయ్య సమాధానం ఇచ్చాడు.

దీనితో యీ విచారణ ముగిసినది. మేజిస్ట్రేట్ యిచ్చిన తీర్పును ''అన్నపూర్ణయ్య గారికి మొత్తము 2 1/2 సంవత్సరముల శిక్ష" అన్న శీర్షికతో 'ఆంధ్రపత్రిక' యీ విధంగా ప్రచురించింది.

'కాంగ్రెస్' పత్రిక సంపాదకులగు శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య గారి కేసులో జిల్లా మేజిస్ట్రేట్ బ్రౌన్‌గారు నేడు (1929 ఆగస్టు 12) తీర్పు చెప్పిరి. 124-ఎ సెక్షను ప్రకారము రెండు సంవత్సరముల కఠిన శిక్ష, రూ. 500/- జరిమానా, తప్పిన ఆరునెలల విడిఖైదు విధించిరి. 153-ఎ సెక్షన్ ననుసరించి ఒక వత్సరము కఠిన శిక్షను విధించిరి. రెండు శిక్షలు ఒకేసారి ప్రారంభమగును. మొత్తము రెండు సంవత్సరములు. జరిమానా చెల్లించనిచో అధికముగా ఆరునెలలు కారాగారావాస మనుభవించ వలెను."

అన్నపూర్ణయ్య వీడ్కోలు సందేశం :

అన్నపూర్ణయ్య అరెస్టయినప్పుడు ఇచ్చిన వీడ్కోలు సందేశాన్ని 'కాంగ్రెస్' పత్రిక ప్రచురించింది. ఈ సందేశంలో ఆయన ఇలా పేర్కొన్నారు.

"జాతీయ పత్రికను నిర్వహించే బాధ్యతను వహించిన వారు ప్రభుత్వం చేతుల్లో ఇలాంటి దమనకాండకు గురికాక తప్పదు. దేశస్వాతంత్ర్యం కోసం తహతహలాడే యువకుల నందరినీ ప్రభుత్వం ఏదో ఒక మిషపై జైళ్లలో కుక్కి ఉద్యమాన్ని కాలరాయాలని చూస్తోంది. ఆంధ్రదేశంలో ఇలాంటి

ప్రయత్నాలకు శ్రీ సాంబమూర్తి అరెస్టు నాంది. అందుచేత నన్ను అరెస్టు చేయడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. వారివారి శక్త్యానుసారం స్వాతంత్ర్య దేవతను కొలిచే నావంటి యువకులను అరెస్టు చేయడం వల్ల సంపూర్ణ స్వాతంత్ర్యోద్యమం కనుమరుగై పోతుందని భావించడం తెలివితక్కువతనమే. ఆంధ్రదేశంలోని యువకులు ఇలాంటి అరెస్టులకు ఎంతమాత్రం భయపడరనీ, అలా భయపడేవారే లేరనీ, ఈ అరెస్టులను లెక్కచేయరనీ ఋజువు చేసే బాధ్యత యువకులపై ఉంది. మన ఈ పత్రిక ఆవిర్భావం నుంచీ ప్రభుత్వ ఆగ్రహానికి గురవుతూనే వున్నదని ఆంధ్రదేశానికి తెలిసిన విషయమే.

''ఈ పత్రికను కొందరు పేదయువకులు ప్రారంభించారు. అందువల్ల దీనిని తేలికగా త్రొక్కివేయ వచ్చునని ప్రభుత్వం ఊహించింది. ఈ భావంతోనే ఈ పత్రికను ప్రారంభించిన ఒకటిన్నర సంవత్సరాలలో పత్రికా సంపాదకుల నిద్దరిని కారాగారానికి పంపి, పత్రిక ఎలా నడుపుతారని సవాల్ విసిరింది. అప్పుడు నా నాయకులు బి. సుబ్రహ్మణ్యం, ఇతర మిత్రులు ఈ సవాలుకు సమాధానంగా నేను జైలు నుంచి తిరిగి వచ్చేవరకూ మరెన్నో రెట్ల నేర్పుతో పత్రికను నిర్వహించారు. ప్రారంభం నుంచీ మాకు ఆంధ్రప్రజానీకం ఆదరాభిమానాలు, అండదండలు ఉండటం వల్లనే పత్రిక ద్వారా ప్రభుత్వాన్ని ఎదిరించి నిలబడగలిగాం.

ఈ తరుణంలో మమ్మల్ని జైళ్లకు రమ్మని ప్రభుత్వం ఆహ్వానించిందంటే, అందుకు అసలు ఉద్దేశం పత్రికా నిర్వహణకు అవరోధాలు, అవాంతరాలు కలుగ జేయడమే. కాని ఇంతవరకు సోకిన బాలారిష్టాల నన్నిటినీ అధిగమించి నిలబడిన ఈ పత్రిక ఇకముందు ఎలాంటి చిక్కులనయినా దాటగలదనడంలో నాకేమాత్రం సందేహం లేదు. ఆంధ్రులకు ఆదరణీయంగా ఉన్నంతకాలం పత్రికను లవలేశమయినా కదపలేమని ప్రభుత్వం గుర్తించగలదనే నా విశ్వాసం. ఈ పత్రిక పూర్తిగా జాతీయ పత్రికగానే ప్రారంభమయింది. అప్పటి నుంచి జాతీయోద్యమాన్ని వ్యాప్తి చేయటంలో ఎటువంటి ఇబ్బందులు, కష్టాలు వచ్చినా వాటిని లెక్కచేయకుండా నడచింది. ఈ పత్రిక సంపూర్ణ స్వాతంత్ర్య భావాన్ని ప్రచారం చేస్తోంది. స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసి, స్వాతంత్ర్య దేవతకు భక్తులుగా వేలాది వీరులను - ఎక్కడ ఏ ప్రాంతంలో ఉన్నా - ఆరాధిస్తోంది. ఇంతవరకు మాదిరిగానే ఇకముందు కూడా సంపూర్ణ స్వాతంత్ర్య సాధనకు 'కాంగ్రెస్' కృషిచేసే విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలకూ తావులేదు. మేము ఈ ఉద్యమంలో సేవచేయడానికి ప్రధాన కారకులు సుబ్రహ్మణ్యం గారే. ఆయనే ఈ ఆశ్రమాన్ని స్థాపించారు. ఆయన ఆచరణాత్మక మార్గదర్శకులు; మైత్రీభావం ఆయన సొమ్ము; ఆయన పత్రికకు చేసిన సేవ అమోఘం. ఆయనకు నేను హృదయపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. ప్రగాఢ అభిమానంతో పత్రికను ప్రోత్సహిస్తున్న ఆంధ్ర ప్రజానీకానికి ప్రత్యేకంగా శతాధిక వందనాలు. ప్రభుత్వం నాకు తిరిగి అవకాశం ఇచ్చినదే తడవుగా ఆంధ్రప్రజ సేవలకు పునరంకితం కాగలనని స్పష్టం చేస్తున్నాను."

అన్నపూర్ణయ్య ధర్మపత్ని శ్రీమతి వెంకట రమణమ్మ కూడా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వీర వనిత. 1932 జనవరిలో ఈమె విదేశీ బట్టల దుకాణాలవద్ద పికెటింగ్ చేసి అరెస్ట్ అయ్యారు. అప్పుడామెకు నాలుగు నెలల జైలు శిక్ష విధించగా, ఆమెను కన్ననూరు, వేలూరు జైళ్ళలో నిర్బంధించారు. అన్నపూర్ణయ్య అవసానదశను దుర్భర దారిద్ర్యంలో గడపవలసి వచ్చింది. ఆయన 1953 సెప్టెంబర్ 11వ తేదీన పరమపదించారు.

జైల్లో భర్తను గోచీగుడ్డతో చూసి...

హరిసర్వోత్తమరావుకు 18 వ ఏటనే వివాహమైంది. భార్య రామాబాయి. చిత్తూరు జిల్లాకు చెందినవారు. ఈమె తండ్రి చిన్న ప్రభుత్వోద్యోగి. 1908లో రావుగారికి ప్రభుత్వం మూడేండ్లు కఠిన శిక్ష విధించినపుడు ఈమె వయస్సు 15 సంవత్సరాలు; ఏడు మాసాల గర్భవతి. ఒకమారు భర్తను చూడడానికి జైలు వద్దకు వెళ్ళారు. కాని భార్యాభర్తలు మాట్లాడుకునే అవకాశం లేదు సరికదా దగ్గరకు వెళ్ళే వీలు కూడా లేకపోయింది. జైల్లో ఉన్న భర్తను దూరం నుంచి మాత్రమే చూడనిచ్చేవారు. సర్వోత్తమరావును చూడడానికి బంధువులామెను తీసుకు వెళ్ళారు. ఖూనీలు చేసి జైలుకు వచ్చిన వారి మధ్య గోచీగుడ్డతో నరకబాధ ననుభవిస్తున్న భర్తను చూసి, ఆమె గుండె నీరైపోయింది. పట్టరాని దుఃఖంతో ఆమె అచేతనమైపోయింది. అప్పుడామెను కొమర్రాజు లక్ష్మణరాజు గారు సముదాయించారు.

ఆమె సనాతన బ్రాహ్మణ కుటుంబానికి చెందినా, క్రమంగా భర్త అభిప్రాయాలకు అనుగుణంగా మారి, జీవితాంతం ఆయనకు అండగా నిలిచింది.

భూలోక నరకంలో "సన్మానాలు"

ఆ రోజుల్లో జైళ్ళు అక్షరాల 'భూలోక నరకాలే', అప్పుడు రాజకీయ ఖైదీలకు అసలు సౌకర్యాలే లేవు. వీరికీ, దొంగలు, హంతకుల వంటి ఖైదీలకూ తేడా ఏమీ లేదు. అంతా ఒక్కటే. వారి మాదిరిగానే వీరికి తలకు మురికి టోపీ కాళ్ళకు ఇనుప కడియాలు, లాగులు తొడుగుకోవడం ఉండేది; గొంగళ్ళపై పడక, మట్టి చిప్పలలో మజ్జిగ లేకుండా పప్పు, పులుసులతో అన్నపు ముద్దల భోజనం, మట్టి ముంతలతో నీరు త్రాగడం, వీటికి తోడు పిండి విసరడం, రాళ్ళు కొట్టడం వంటి పనులు – ఇదీ జైలు జీవితం.

ఆ సమయంలో గదర్ పార్టీ విప్లవకారుడుగా అరెస్టు కాబడిన దర్శి చెంచయ్య నాటి జైలు పరిస్థితులను యీ విధంగా అభివర్ణించారు.

శ్రీ హరిసర్వోత్తమరావు గారిని అతి కౄరంగా శిక్షించి వెల్లూరు జైలులో నిర్బంధించిరి. ఆ కాలంలో జైళ్ళలో ఖైదీలను పెట్టుచుండిన బాధలు వర్ణింప సాధ్యముకాదు. ఈ బాధలన్నిటికి ఆయన గురి అయ్యారు. ఇతర ఖైదీల వలెనే రాజకీయ ఖైదీయైన హరిసర్వోత్తమరావు గారి బట్టలు తీసివేసి రెండు గోచీలు యిచ్చిరి. మూరెడు చదరం గల రెండు తువ్వాళు యిచ్చిరి. పడుకొనుటకు చిన్న ఈత చాప యిచ్చిరి. అన్నం తినుటకు మట్టి చట్టి, నీళ్ళు త్రాగుటకు మట్టిముంత, మల మూత్ర విసర్జనకు మరొక చట్టి మాత్రమే యిచ్చిరి. కాలికి లావాటి కడియం, మెడకు మరొక ఇనుప కడియం చేసి ఒక కొయ్యముక్కను దూర్చివేసిరి.

మట్టితో పండ్లు తోముకోవాలి. అధికారులు నిర్ణయించిన టైముకే మల విసర్జన చేయాలి. స్నానానికి మూడు నాలుగు ముంతల నీరు యిస్తూ ఉండిరి. తినుటకు రాగి సంకటి ముద్ద, ఆ ముద్దలో పుల్లలు, రాళ్ళు, మట్టి ఉండేవి. ఆకులలములతో ఉడకబెట్టిన పులుసు నీరు, వాటిలో వుండిన పురుగులనైనా కడిగివేయరు. ఈలాగు తయారయిన పులుసు నీళ్ళలో ఉడికి చచ్చిన పురుగులు తేలుచుండేవి. మొలత్రాడు, జంధ్యము తీసివేశారు. తల బోడి చేశారు. ఎన్ని విధాల మనుష్యులను అగౌరవ పరచడానికి సాధ్యమో, అన్ని విధాల అగౌరవ పరుస్తూ, దేహబలాన్ని, మనోబలాన్ని అణగద్రొక్కి ప్రజలు దేశ సేవకు, మానవ సేవకు ప్రయత్నించకుండా వుండేలాగు జైలు పద్ధతి ఆంగ్లేయ సామ్రాజ్య వాదులు చేసిరి."

దీనిని బట్టి హరిసర్వోత్తమరావు గారు ఎంత దుర్భర జైలు జీవితం అనుభవించారో ఊహించుకోవచ్చు. తర్వాత కాలంలో జతీన్ దాస్ గుప్తా వంటి విప్లవకారులు జైలు సంస్కరణల కోసం ఆమరణ నిరాహార దీక్షలు చేసి, ఆత్మార్పణ గావించారు. రాజకీయ ఖైదీలకు సౌకర్యాలు కావాలని దేశంలో ఆందోళన జరిగింది. వీటి ఫలితంగా ఎ, బి, సి తరగతు లేర్పడ్డాయి. రాజకీయ ఖైదీలకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పడ్డాయి. ఉద్యమం ప్రారంభంలో ప్రభుత్వం ఎంత కౄరంగా నిర్బంధాలు, కఠిన శిక్షలు విధించినా జాతీయ స్వాతంత్రోద్యమ పురోగతిని నిరోధించలేకపోయారు.

దేశభక్తుల జైలు శిక్షలు

జాతీయ నాయకుల పైన, ప్రజలపైన పోలీసు దౌర్జన్యాలను కాంగ్రెస్ పత్రిక తీవ్రంగా విమర్శించింది. మహర్షి సాంబమూర్తిని సబ్‌ఇన్‌స్పెక్టర్ వారెంటు లేకుండా అరెస్టు చేశాడు. దోపిడీ దొంగలకు వర్తించే 151వ సెక్షన్ కింద కొండా వెంకటప్పయ్యను అరెస్టు చేశాడు. మహాత్మాగాంధీని న్యూసెన్స్ కేసుకు సంబంధించిన సెక్షన్ క్రింద అరెస్టు చేశారు.

ఆ రోజులలో ఖద్దరు బట్టలు ధరించి వెళ్ళేవారిని నడిరోడ్డుపై పట్టపగలు వివస్త్రలనుగా చేసి, ఖద్దరు బట్టలను తగులబెట్టి, వారికి విదేశీ వస్త్రాలు ఇచ్చేవారు. తుపాకీ బోనెట్టుతో నోరు తెరిపించి కల్లు పోసేవారు. గోదావరి జిల్లాలో రాజమండ్రి పోలీస్, డిప్యూటీ సూరింటెండెంట్ ముస్తఫాలీ దురంతాలకు హద్దులేదు. దేశంకోసం త్యాగం చేయవలసిన అవసరం గురించి కాంగ్రెస్ పత్రిక తన సంపాదకీయంలో నీ దేశం బ్రతికున్నప్పుడు నీవు చచ్చిపోతే కలిగే నష్టం ఏమిటి? నీ దేశం సర్వనాశనం అయిపోతే నీవు ఉండి ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నించింది.

ఆరోజుల్లో జైళ్ళు అక్షరాలా భూలోక నరకాలే. అప్పుడు రాజకీయ ఖైదీలకు దొంగలు, హంతకుల వంటి ఖైదీలకు తేడాలేదు. వారి మాదిరిగానే వీరికీ తలకు మురికి టోపీ, కాళ్ళకు ఇనప కడియాలు, లాగూలు తొడుక్కోవటం ఉండేది. గొంగళ్లపై పడక, మట్టి చిప్పలలో మజ్జిగ లేకుండా



పప్పు, పులుసులతో అన్నపు ముద్దల భోజనం, మట్టి ముంతలతో నీళ్లు త్రాగటం, వీటికి తోడు పిండి విసరటం, రాళ్ళు కొట్టటం వంటి పనులతో ఉండేది జైలుజీవితం.

గదర్ పార్టీ విప్లవ కారుడిగా అరెస్టు కాబడిన దర్శి చెంచయ్య పరిస్థితులను ఈ విధంగా అభివర్ణించారు. ఇతర ఖైదీల వలెనే రాజకీయ ఖైదీలకు బట్టలు తీసి రెండు గోచీలు ఇచ్చేవారు. మూరెడు చదరం గల రెండు తువాళ్లు ఇచ్చేవారు. పడుకొనుటకు చిన్న ఈత చాప అన్నం తినడానికి మట్టి చట్టి, నీళ్లు తాగుటకు మట్టి ముంత, మలమూత్ర విసర్జనకు మరొక చట్టి మాత్రమే ఇచ్చేవారు. కాలికి లావాటి కడియం, మెడకు మరొక ఇనప కడియం చేసి కొయ్యముక్కను దూర్చేవారు.

మట్టితో పండ్లు తోముకోవాలి. అధికారులు నిర్ణయించే సమయానికే మలవిసర్జన చేయాలి. స్నానానికి మూడు నాలుగు ముంతల నీరు. తినుటకు రాగిసంకటి ముద్ద. ఆ ముద్దలో పుల్లలు, రాళ్లు, మట్టి ఉండేవి. ఆకులలములతో ఉడకబెట్టిన పులుసు నీరు, వాటిల్లో ఉండిన పురుగులనైనా కడిగివేయరు. ఇలాగు తయారయిన పులుసు నీళ్లలో ఉడికి చచ్చిన పురుగులు తేలుతుండేవి. మొలతాడు జంధ్యము తీసివేసేవారు. తల బోడి చేసేవారు. ఎన్ని విధాల మనుషులను అగౌరవ పరచడానికి సాధ్యమో అన్ని విధాల అగౌరవ పరుస్తూ, దేహబలాన్ని, మనోబలాన్ని అణగద్రొక్కి, ప్రజలు దేశసేవకు, మానవసేవకు ప్రయత్నించకుండా ఉండేలా జైలు పద్ధతిని ఆంగ్లేయ సామ్రాజ్యవాదులు రూపొందించారు.

విప్లవకారులు జైలు సంస్కరణల కోసం ఆమరణ నిరాహార దీక్షలు చేసి రాజకీయ ఖైదీలకు సౌకర్యాలు కావాలని దేశంలో ఆందోళన జరిగింది. వీటి ఫలితంగా ఎ.బి.సి తరగతులు ఏర్పడ్డాయి. రాజకీయ ఖైదీలకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పడినాయి. మి



రచయిత సి.వి. రాజగోపాలరావు **వందేమాతరం నుంచి క్విట్ ఇండియా: ఆంధ్రాలో కేసులు – శిక్షలు** అనే పేరుతో నాలుగు వందల పేజీల నిడివి గల పుస్తకం రాశారు. అందులో ఆనాటి స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి సామాజిక పరిస్థితులు, ప్రభుత్వ విధానాలతో కూడిన ఘట్టాలతో కళ్ళకు కట్టినట్టుగా చారిత్రక ఋజువులతో రచన సాగించారు.

డా॥ సి.వి. రాజగోపాలరావు
బాగ్ అంబర్‌పేట, హైదరాబాదు.



సప్తపర్ణి చూడగానే ఇది ఒక Monumental work అని తెలుస్తుంది. ఇది ఒక నవలలాగా ఏకబిగిని చదివేది కాదు. దాచుకొని దాచుకొని కాస్తకాస్త ఆస్వాదిస్తూ చదివేది. Contentకి నీటుగా సప్తపర్ణిని ఉన్నత సాంకేతిక విలువలకు అందంగా తీర్చిన కళాజ్యోతి టీమ్ ఎంతైనా అభినందనీయం.

Rohini Kumar

సప్తపర్ణి

సప్తపర్ణి (₹ 777/-) **మిసిమి** పాఠకులకు
కేవలం ₹ 500/- లకే అందజేస్తున్నాము.

Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.

ఆకాశవాణి బాణి

- పి.ఎస్. గోపాలకృష్ణ

మన దక్షిణభారతదేశంలోరేడియో ప్రసారాలు ప్రారంభం కావడానికి కారకులు తెలుగు వారయిన రావుబహదూర్ సి.వి. కృష్ణస్వామి సెట్టి. మద్రాసులోనూ మాంచెస్టర్‌లోనూ విద్యాభ్యాసం చేసిన ఆయన 1914లో మద్రాసు నగర పాలక సంస్థలో ఎలెక్ట్రికల్ ఇంజనీర్‌గా చేరారు. ఆ నగర వీధులలో మొదటిసారి విద్యుద్దీపాలు ఏర్పాటు చేసినవారు ఆయనే. 1910లో విమాన ప్రయాణం చేసిన తొలి భారతీయులలో ఆయన కూడా ఒకరట. 1924లో మద్రాస్ రేడియో క్లబ్ ద్వారా ఆయన రేడియో ప్రసారాలు మొదలుపెట్టారు. ఈ రేడియో క్లబ్‌లో పుర ప్రముఖులు ఎందరో సభ్యులుగా ఉన్నా ఆ సంస్థ కార్యదర్శిగా ఉన్న కృష్ణస్వామి సెట్టి పాత్ర ప్రధానమైనది. రేడియో క్లబ్ నెలకొల్పాలని ప్రతిపాదించి ఆ క్లబ్ ద్వారా ప్రసారాలు జరగడానికి ఆయన ఎంతో కృషి చేశారు. 1924 మే 16న ఏర్పడిన మద్రాసు ప్రెసిడెన్సీ రేడియో క్లబ్ 1924 జూలై 31 నాడు ప్రసారాలు మొదలుపెట్టింది. అయితే ప్రసారాలలో సంగీతానికే ఎక్కువ ప్రాధాన్యం ఉండేది. 1927 అక్టోబర్‌లో మద్రాస్ ప్రెసిడెన్సీ రేడియో క్లబ్ మూతపడింది. అయితే కృష్ణస్వామి సెట్టి గారి పూనికతో 1930 ఏప్రిల్ 1 నుంచి మద్రాసు నగర పాలక సంస్థ రేడియో ప్రసారాలు ప్రారంభించింది. కాని ఆ రేడియో ప్రసారాలు పరిమితమైనవే.

ఈ ప్రసారాలలో తెలుగు పాటలు వినిపించినా తెలుగు నాటకాలు వంటివి వినిపించినట్టు ఆధారాలు లేవు. పోలీసువారి ప్రకటనలు, ఆరోగ్య విశేషాలు కొన్ని ప్రసారం చేసేవారు. బడి పిల్లల కోసం కొన్ని కార్యక్రమాలు వినిపించేవారు.

ఈ ప్రసారాలు చిత్తూరు, వెంకటగిరి మొదలయిన చోట్ల వినిపించేవి. వాతావరణం అనుకూలించినప్పుడు బంగాళాఖాతం తీరం వెంబడి ఉన్న ఊళ్లలో విశాఖపట్టణం దాకా వినిపించేదని అప్పటి వార్తల వల్ల తెలుస్తున్నది.

1933లో మహబూబ్ అలీ అనే తపాలాశాఖ ఉద్యోగి హైదరాబాదులో చిరాగ్ అలీ సందులో, 200 వాట్ల శక్తి గల రేడియో కేంద్రం నెలకొల్పాడు. 1935 ఫిబ్రవరి 3 నుంచి అది నిజాం అధీనంలోకి వచ్చింది. ఆ రేడియో కేంద్రంలో ప్రసారభాష ఉర్దూ. ప్రసారణ శక్తి బాగా తక్కువ కావడం వల్ల ప్రసారాలు పరిమితమైన దూరాలకే వినిపించేవి.

1939 జూలైలో ఐదు కిలోవాట్ల శక్తిగల ప్రసారిణి ఒకదాన్ని సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసి దక్కన్ రేడియో పేర ప్రసారాలు మొదలయ్యాయి. ఉర్దూతో బాటు తెలుగు, కన్నడ, మరాఠీ భాషలలోనూ ప్రసారాలు చేసేవారు. అయితే ఉర్దూతో పోలిస్తే తక్కిన భాషల ప్రసారాలు పరిమితంగా ఉండేవి. మొహర్రం నెలలో ప్రసారాలు ఉండేవి కావట. కొన్నాళ్ల తర్వాత స్టూడియోను సరూర్‌నగర్ నుంచి ఖైరతాబాదు లోని యావర్‌మంజిల్‌కు మార్చారు. ప్రసారిణి సరూర్‌నగర్‌లోనే ఉండేది. తెలుగు ప్రసారాలకు మొదట తక్కువ వ్యవధి ఇచ్చేవారట. కాలక్రమాన రోజుకు గంటసేపు ప్రసారాలు చేసేవారు. ఈ కేంద్రం ఉదయం ఏడున్నర నుంచి తొమ్మిదిన్నర దాకా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల దాకా సాయంకాలం ఐదున్నర నుంచి రాత్రి పదిన్నరదాకా ప్రసారాలు చేసేది. హిందూస్థానీ సంగీతానికి ప్రాధాన్యం ఇచ్చేవారు. చాలా ఏళ్ల తర్వాత కర్ణాటక సంగీతానికి కొంత సమయం కేటాయించసాగారు. ముస్లిం వనితల కోసం పరదా పద్ధతి, వారి కోసం విడిగా వాకిలి ఏర్పాటు చేసారు. వసీంఖాన్ అనేవారు తెలుగు కార్యక్రమాల అధికారిగా పనిచేశారు. రాయప్రోలు రాజశేఖర్ సహాయ దర్శకులుగా, భాస్కరభట్ల కృష్ణారావు, దుర్గాచలం కార్యక్రమ నిర్వాహకులుగా పని చేసేవారు. కురుగంటి సీతారామయ్య, మహారథి సంభాషణలు, వార్తలు వంటివి వ్రాసేవారు. కె.ఎల్. నరసింహారావు గ్రామీణ కార్యక్రమాలు నిర్వహించేవారు. లలిత, వేంకటేశ్వర్లు వార్తలు

చదివేవారు; ప్రకటనలు చేసేవారు. మల్లిపాటలు, ఎల్లిపాటలు మొదలైన శీర్షికలతో జానపద గీతాలు ప్రసారమయ్యేవి.

1936లో అప్పటి ఆంగ్లేయ ప్రభుత్వం భారతదేశంలో రేడియో వ్యాప్తి గురించి పరిశీలించడానికి నిపుణులను నియమించింది. అప్పుడు మద్రాసు రాజధానిలో తమిళ జిల్లాలతోపాటు కొన్ని తెలుగు కన్నడ మలయాళ జిల్లాలు కూడా కలిసి వుండేవి. మద్రాసు నుంచి నాలుగు భాషలలో ప్రసారాలు చేయాలని విజయవాడ నుంచి కానీ, రాజమండ్రి నుంచి కానీ తెలుగు ప్రసారాలు చేయాలని అనుకొన్నారు. చివరికి తెలుగు కార్యక్రమాలను మద్రాసు నుంచే ప్రసారం చేయాలని నిర్ణయించారు.

1935లో హైదరాబాదు తర్వాత సెప్టెంబర్ 10 నాడు మైసూరులో ఒక రేడియో కేంద్రం మొదలయింది. మైసూరు విశ్వవిద్యాలయంలో మనస్తత్వ శాస్త్రాచార్యులుగా ఉన్న డాక్టర్ ఎం.వి. గోపాలస్వామి ఆ కేంద్ర సంస్థాపకులు. దానికి ఆయన 'ఆకాశవాణి' అని పేరుపెట్టారు. ఆ పేరును రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ సూచించారని చెబుతారు. 1937 సెప్టెంబర్ 30 నాడు తిరువాన్కూరు సంస్థానం ఒక రేడియో కేంద్రాన్ని నెలకొల్పింది.

హైదరాబాదులో నుంచీ మద్రాసు నగరపాలక సంస్థ రేడియో నుంచి ప్రసారమైన తెలుగు కార్యక్రమాల వివరాలు తెలియవు. కనుక రేడియోలో తెలుగు ప్రసారాల గురించిన ప్రస్తావన తెలుసుకోవడానికి 1938 జూన్ 16 నాడు మొదలయిన మద్రాసు రేడియో కేంద్రం చరిత్రను పరిశీలించాలి. ఆనాడు ఆ కేంద్రాన్ని అప్పటి మద్రాసు గవర్నర్ ఎర్స్కిన్ ప్రభువు (Lord Erskine) రాష్ట్ర ప్రధానమంత్రి (ఇప్పటి మాటలలో చెప్పాలంటే ముఖ్యమంత్రి) రాజగోపాలచారి (రాజాజీ) ప్రారంభించారు. అప్పటికే ఆల్ ఇండియా రేడియో అనే పేరుతో ప్రభుత్వ వ్యవస్థలో ఏర్పాటు చేసిన ఆ సంస్థను వ్యవహరిస్తున్నా రాజాజీ ఆంగ్లంలో చేసిన తమ ప్రారంభోపన్యాసంలో 'హిందుస్థాన్ ఆకాశవాణి' అని ప్రస్తావించారు. ఆ కేంద్రం ఆ సాయంకాలం ఐదున్నరకు సౌరాష్ట్ర రాగంలో శ్రీ త్యాగరాజ స్వామివారు రచించిన 'శ్రీగణపతిని సేవింపరారే' అనే తెలుగు కృతిని తిరువెన్కాడు సుబ్రహ్మణ్యపిళ్లై అనే విద్వాంసులు నాదస్వరంపై వాయిస్తుండ గానే మొదలయింది. రాజీజీ ప్రారంభోపన్యాసం తర్వాత సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ గాత్రకచేరీ, తిరిగి సుబ్రహ్మణ్య పిళ్లై గారి నాదస్వర సభ ప్రసారమయ్యాయి. ఆ వెంటనే రాత్రి 8 గంటల 15 నిమిషాలకు 'భారతదేశము – రేడియో' అనే విషయం గురించి సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడు తెలుగులో ప్రసంగించారు. జస్టిస్ పార్టీ నాయకులలో ఒకరయిన ఆయన 1937 ఏప్రిల్ 1 నుంచి జూలై 14 దాకా ఉమ్మడి మద్రాసు రాజధాని ప్రధానిగా పని చేశారు. కాగా మద్రాసు కేంద్రం నుంచి తొలి ప్రసంగం చేసినవారుగా ఆయన చరిత్రకెక్కారు. ఆయన ప్రసంగంలోని తొలి వాక్యాలు ఇవి: "నేనిప్పుడు చెన్నపట్నం నుండి మాట్లాడుచున్నాను. మీరెక్కడ నుంచి వినుచున్నారో నేను చెప్పజాలను. కాని అనేక స్థలముల యందు ఉండి వినుచున్నారని తలచుచున్నాను. నేనీ రోజున చెప్పవలసిన దేమనగా 'ఆకాశవాణి' యొక్క ఉపయోగములే. దీన్నే ఇంగ్లీషులో 'రేడియో' అందురు." రేడియోకు తెలుగు పర్యాయపదంగా 'ఆకాశవాణి'ని వాడిన కె.వి. రెడ్డినాయుడు తమ ప్రసంగం ముగింపులో చెప్పిన అభిప్రాయాలు నేటికీ ప్రసార సాధనాలకు వర్తిస్తున్నాయి. ఆయన "ఎంత మంచి వస్తువయినను మంచికే కాక చెడునకు కూడ ఉపయోగింప నగును. కొన్ని దేశములందు వివిధ రాజకీయ పక్షముల వారు తమ పక్షముల గొప్ప చెప్పుకొనుటకును వైరులను తక్కువచేసి చెప్పుటకును ఉపయోగింతురు. ప్రస్తుతము మన దేశమునందు అన్నిటికంటె విద్యావ్యాప్తి చాల ముఖ్యము కనుక ఆకాశవాణిని సర్వజనోపయోకరమైన విషయము లందును ఆనందము కలుగజేయు పనులయందును స్వచ్ఛ మనసుతో ఉపయోగింపవలెనని నా హెచ్చరిక" అన్నారు.

1938 జూన్ 18 నాడు రామమూర్తి పంతులు 'సజీవమయిన తెలుగు' అనే విషయం గురించీ 1938 జూన్ 21 నాడు 'మన ఇల్లు–వాని అందము చందము' గురించి కోలవెన్ను రామకోటేశ్వరరావు, 1938 జూన్ 23 నాడు 'రవీంద్రుడు' శీర్షికన బెజవాడ గోపాలరెడ్డి ప్రసంగించారు (ప్రసార వ్యవధి 15 నిమిషాలు; ప్రసార సమయం రాత్రి 8 గంటల 15 నిమిషాలు). జానపద సంగీతం కూడా వినిపించాలనే ఉద్దేశంతో అడపాదడపా 'పల్లెపాట' (మొదటి ప్రసారం 1938 జూన్ 25 రాత్రి 8 గంIIల 15 నిIIలు) ప్రసారం చేసేవారు. అయితే ఈ 'పల్లెపాటలు' పాడినవారు నాగరికులే; జానపద కళాకారులు కారు; శాస్త్రీయ సంగీతంలో కొంత లలితమైనవిగా భావించే పదాలనూ, జావళీలనూ ప్రత్యేకంగా వినిపించేవారు. అలా వినిపించినప్పుడు తెలుగు రచనలతోబాటు తమిళ రచనలనూ వినిపించేవారు.

మద్రాసు రేడియో కేంద్రం నుంచి తమిళంలోకన్నా తెలుగులోనే ఎక్కువ ప్రసారాలు జరుగుతున్నాయనే ప్రచారం ఒకటి ఆ రోజుల్లో కొనసాగుతూ ఉండేది. 1939లో తిరుచిరాపల్లిలో రేడియో కేంద్రం ఏర్పడి దక్షిణ తమిళ జిల్లాలపై దృష్టి నిలిపింది.

రేడియో కార్యక్రమాల గురించి శ్రోతలకు తెలియ జేయడానికి మద్రాసు కేంద్రం 1938 జూన్ నుంచి తెలుగులో 'వాణి', తమిళంలో 'వానొకలి' పక్షపత్రికలను ప్రచురించడం మొదలుపెట్టింది. కొన్ని సంచికల తర్వాత 'వాణి' ఆగిపోయింది. 1948లో విజయవాడ కేంద్రం ప్రారంభమైన తర్వాత తిరిగి 'వాణి' ప్రచురణ మొదలయింది. క్రమంగా ఆదరణ కరవై 1980 ప్రాంతాలలో ఆగిపోయింది. 'వాణి'లో వివిధ కేంద్రాలనుంచి ప్రసారమైన ప్రసంగాలు, కవితలు, గోష్ఠులు, సంగీత పాఠాలు వంటివి ఎన్నో వెలువడుతూ ఉండేవి. తొలి సంచికలో రేడియో కేంద్రం లక్ష్యాలను వివరిస్తూ "ఈ స్టేషను రాష్ట్రములోని జనులందరికీ ఉపయోగకరంగా ఉండగలదు. ఈ స్టేషనులో గ్రామస్థుల వినోదార్థము ఒక గంట ప్రత్యేకించబడ్డది. ఇంతేకాకుండా తక్కిన విషయాలు కూడా ప్రజలలోని వివిధ తరగతుల వారికి అనుకూలముగా నుండేటట్లుగా ఏర్పరుపబడ్డవి.." అని చెప్పారు.

తొలి ప్రసారాలనుబట్టి మద్రాసు కేంద్రం వివిధ ప్రక్రియలలో ప్రసారం చేసేదని తెలుస్తుంది. సాహిత్య విషయాల గురించే కాక ఇతర విషయాల గురించీ సరళమైన భాషలో ప్రసారాలు మొదలుపెట్టింది.

ప్రసంగాలనేకాక నాటకాలనూ గేయాలనూ వినిపించింది. ఏ కొందరోతప్ప తక్కినవారు సరళమైన భాషలో ప్రసంగాలు చేసేవారు. రేడియో ప్రసంగంకానీ, నాటకంకానీ వినగానే మొదటిసారి అర్థంకావాలి. అంటే కఠినమైన అన్వయంకల పొడుగు వాక్యాలు పనికిరావు. భాష సమాస భూయిష్టం కాకుండా తేలికగా ఉండాలి. 'మయ నాగరికత' గురించి మల్లంపల్లి సోమశేఖరశర్మ ప్రసంగం రేడియో పద్ధతిలో రాసినట్టు కనిపిస్తుంది. తేటతెలుగులోని ఆ ప్రసంగం నుంచి కొన్ని వాక్యాలు:

"ఈ యుగం ఎంత చిత్రమైనదో? ఇదంతా పరిశోధక యుగం. వైజ్ఞానిక యుగం. ప్రతి విషయంలోనూ పరిశోధనే! నిప్పు–నీరూ, గాలీ–ధూళీ... ఇంతెందుకు పంచేంద్రియాల ద్వారా గ్రహించే ప్రతి విషయమూ అఖండ పరిశోధనకు పాటుపడుతున్నది. నిప్పును శోధిస్తున్నారు. నీటిని గాలిస్తున్నారు. గాలిని చీలుస్తున్నారు. రాతిని పగుల గొడుతున్నారు. భూమిని తవ్వి పోగులు పెడుతున్నారు."

1939 నాటికి గేయాల ప్రసారం దారిలో పడింది. 1939లో మల్లవరపు విశ్వేశ్వరరావు రాసిన 'బిల్హణీయం' సంగీత నాటకం ప్రసారమయింది. సూరి నారాయణ మూర్తి రూపొందించిన ఈ సంగీత నాటకానికి బి.వి. నరసింహారావు సంగీతం సమకూర్చి నాయక పాత్ర పోషించారు.

లలిత సంగీతమన్న పేరు ప్రాచుర్యంలోకి రాని ఆ రోజుల్లో 'గీతావళి' పేరుతో భావగీతాలు ప్రసారం చేసేవారు. ఈ కార్యక్రమాలలో గాయనీ గాయకులు పాడడానికి కొత్త గీతాలు కావలసి వచ్చాయి. పండుగలు వస్తే ప్రత్యేకంగా పాటలు రాయించి పాడించేవారు.

రేడియోకు ప్రత్యేకమయిన 'ప్రక్రియ, రూపకం' (ఆంగ్లంలో దాన్ని 'ఫీచర్' Feature అంటారు). రేడియోకు ప్రత్యేకమైనవి కనుక రూపకాల రచన, రూపకల్పన విలక్షణంగా ఉంటాయి. తెలుగులో ప్రసారమయిన తొలి రూపకం 'కృష్ణదేవరాయ వైభవం'. 1941 జనవరి 15 నాడు ప్రసారమయిన ఈ రూపకం మౌలిక రచన చేసినవారు ఆకుండి వేంకటేశ్వరరావు. రేడియోకు అనువుగా రూపక రచన చేసి దానికి ప్రాణం పోసినవారు ఆచంట జానకిరాం. చరిత్రను రసవత్తరంగా వినిపించడానికి చేసిన ఆ ప్రయత్నం ఎందరినో ఆకర్షించింది.

1938 అక్టోబర్ 3 నుంచి పాఠశాల విద్యార్థుల కోసం ప్రసారాలు మొదలయ్యాయి. తరగతులలో చెప్పే పాఠాలను మరింత బాగా తెలుసుకోవడానికి ఈ రేడియో ప్రసారాలు తోడ్పడాలని ఆశించారు. పిల్లలకు ఆసక్తి పెంచే తీరులో ఆటపాటలనూ, నాటికలనూ వాడి, పాఠాలు చెప్పడానికి ప్రయత్నించారు. 1938 నవంబర్ 2 నుంచి తెలుగులో గ్రామస్థుల కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించాలన్నది ఈ కార్యక్రమాల ధ్యేయం. వ్యవసాయం, పశుపోషణ, పారిశుద్ధ్యం, సహకారం మొదలయిన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. పురాణ పఠనం, జానపద గేయాలు ఈ కార్యక్రమాలలోని తక్కిన అంశాలు. వ్యవసాయానికి సంబంధించిన విషయాలను వ్యవసాయశాఖ నిర్దేశకుల పర్యవేక్షణలో రూపొందించేవారు. అప్పట్లో మద్రాసు రాజధానిలో వ్యవసాయ శాఖ నిర్దేశకులుగా ఉన్న పి.హెచ్. రామరెడ్డి ప్రసారం కోసం తాము ఆమోదించిన ప్రసంగాలు రాసిన అధికారులకు

ఒక్కొక్క ప్రసంగానికి ప్రభుత్వం నుంచి కాక తామే ఐదేసి రూపాయలు ఇచ్చేవారు! ఒకటి రెండు సందర్భాలలో ఆయనే స్వయంగా కార్యక్రమాలలో పాల్గొనేవారు.

1939 సెప్టెంబర్ 5 నుంచి ఉదయమూ మధ్యాహ్నమూ ప్రసారాలు మొదలుపెట్టారు. 1939 అక్టోబర్ 1 నుంచి తెలుగులో వార్తాప్రసారాలు ప్రారంభించారు. 1939 నవంబర్ 2 నుంచి కళాశాల విద్యార్థుల కోసం కార్యక్రమాలు వినిపించసాగారు.

ఇన్ని కార్యక్రమాల నేపథ్యంలో రేడియోకు కొన్ని బాధ్యతలు ఏర్పడ్డాయి. ఉచ్చారణకు సంబంధించి వరవడి దిద్దడంతోబాటు శాస్త్ర సాంకేతిక విషయాల ప్రసారంలో కొత్త పదాల వాడుకను స్థిరపరచవలసి రావడం, శ్రోతల స్థాయిని బట్టి వారి వయసును బట్టి ఉనికిని బట్టి అనువైన వాడుక భాషను అలవాటు చేయడం, సంగీత సాహిత్యాలకు సంబంధించి శ్రోతలలో అభిరుచి పెంపొందించడం, జానపద కళారూపాలనూ పాటలనూ గుర్తించడం, ఔత్సాహికులకు తమ ప్రతిభను కనబరచడానికి అవకాశాలు కల్పించడం, సామాన్య ప్రజల అభిప్రాయాలనూ అనుభవాలనూ వినిపించడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడంవంటివి ఆ బాధ్యతలలో కొన్ని.

తెలుగుకు సంబంధించి రేడియో వాడుకలోకి తెచ్చిన కొన్ని పదాలు సరైన అవగాహనతో వాడినట్లు అనిపించదు. ఉదాహరణకు relay అనే ఆంగ్ల పదానికి దగ్గరగా ఉండే తెలుగు మాట 'అంచె'. తమిళంలో నేటికీ ఆ తెలుగు మాటను పోలిన 'అంజల్' అనే మాట వాడినా ఆకాశవాణి తెలుగు కేంద్రాలు 'రిలే' అనే వాడుతుంటాయి. ఉష్ణోగ్రతల విషయంలో maximum అనే మాటకు 'గరిష్ఠ' అనీ maximum అనే మాటకు 'కనిష్ఠ' అనీ వాడడంలోని ఎక్కువ తక్కువలు అర్థం కావు. వ్యవసాయానికి సంబంధించి 'ఆశించడం' అనే పదం 'సోకడం' అనే అర్థంలో వాడుకలో ఉంది. 'పడమటి గోదావరి' అని ఎవరూ అనరు. 'పశ్చిమ'ను 'పచ్చిమ' అని చాలా మంది పలికేస్తూ ఉంటారు. కాకుంటే దేశాల పేర్లు, ఊర్ల పేర్లు, వ్యక్తుల పేర్లు సరిగా పలకడానికి ఆకాశవాణి ఎప్పటికప్పుడు సూచికలు రూపొందించుకొంటూ ఉంటుంది. ఒక రకంగా నేటి తెలుగు ఎలెక్ట్రానిక్ మాధ్యమాలన్నిటికీ ఆకాశవాణి 'మూలపుటమ్మ' అనవచ్చు.

1954 దాకా మద్రాసు కేంద్రంలో లలిత సంగీత విభాగం ప్రత్యేకంగా ఏర్పడకపోయినా ప్రధానమైన నాలుగు దక్షిణ భారత భాషలలో లలిత గీతాల ప్రసారం 1939 నుంచి తరచుగానే సాగుతూ ఉండేది. 'బిల్హణీయం' విశేషమైన ఆదరణ పొందడంతో ప్రముఖులైన కవులతో రాయించిన సంగీత నాటకాలు ఎన్నిటినో మద్రాసు వినిపించింది. అటువంటి సంగీత నాటకాలలో కొన్ని కృష్ణశాస్త్రి రాసిన 'శర్మిష్ఠ', 'ఊర్వశి', 'శబరి', 'గుహుడు', 'అతిథిశాల', 'దక్షయజ్ఞం', 'కృష్ణాష్టమి' మొదలైనవి; విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'కిన్నెరసాని', 'కోకిలమ్మ పెళ్లి', 'సుమిత్ర', 'ఊర్మిళ', 'మారీచుడు', 'గోదావరి' మొదలైనవి; రజని (బాలాంత్రపు రజనీకాంతరావు) రాసిన 'మధురానగర గాథ', 'చండీదాసు' 'మేఘసందేశం', 'విశ్వవీణ' మొదలైనవి; శివశంకరశాస్త్రి (స్వామి) రాసిన పద్మావతీ చరణ చారణ చక్రవర్తి; శ్రీశ్రీ రాసిన 'మోహినీ రుక్మాంగద', 'ప్రేపల్లె'.

ఉమర్‌ఖయ్యాం జీవితాన్నీ అతని తత్త్వాన్ని ఆవిష్కరించింది 'అతిథిశాల'. ఉర్దూ, అరబ్బీ, పారశీక పదాలతో కృష్ణశాస్త్రి సృష్టించిన మధ్య ప్రాచ్య వాతావరణాన్ని అందుకు తగిన సంగీతం సమకూర్చి శ్రవ్య కావ్యంగా తీర్చినవారు రజని. కృష్ణశాస్త్రి రాసిన 'దక్షయజ్ఞం' సాలూరి రాజేశ్వరరావు సంగీతంలో రూపొందిన అద్భుతం.

టేప్ రికార్డింగ్ సదుపాయాలు లేని ఆ రోజులలో కార్యక్రమాలన్నీ అప్పటికప్పుడు ప్రత్యక్షంగా ప్రసారమయ్యేవి (live broadcasts). అందువల్ల ఎన్నో గొప్ప కార్యక్రమాలు రేడియో పరిభాషలోనే చెప్పాలంటే గాలిలో కలిసిపోయాయి.

శ్రీశ్రీ రాసిన 'బలి', గ్రామఫోను రికార్డుల తిరుగుబాటు అనే రేడియో నాటికలు 1939-40లలో ప్రసారమయ్యాయి. రేడియో నాటక రచన ఎట్లా చేయాలో తెలిసిన రచయితలు కొందరే. అటువంటి కొందరు తెలుగు రచయితలలో శ్రీశ్రీ ఒకరు. లభిస్తున్న ఆధారాలనుబట్టి మొత్తం మీద 1939 నుంచి 1984 దాకా శ్రీశ్రీ రేడియో కోసం 14 నాటికలు రాశారు.

'మరో ప్రపంచం' పేరుతో శ్రీశ్రీ రేడియో కోసం నాటిక రాశారు. అందులో ప్రధాన పాత్ర పేరు 'కనుపాప'. ఇరవై ఒకటవ శతాబ్దానికి చెందినవాడు. ఇరవై ఐదవ శతాబ్దంలోకి వెళ్లబోయి యాంత్రిక లోపంతో ఇరవయ్యవ శతాబ్దిలోకి వస్తాడు. ఆ పాత్ర ఆ నాటికలో ఒక చోట "భాష చాలా అసమగ్రమైన పనిముట్టు. ఏ ఊహనీ అది విస్పష్టంగా అసందిగ్ధంగా తెలియజెయ్యలేదు" అంటుంది!

పి.వి. రాజమన్నార్, కొడవటిగంటి కుటుంబరావు, గోరాశాస్త్రి మొదలయినవారు ఆ రోజుల్లో రేడియో కోసం నాటకాలు రాసిన వారిలో కొందరు.

1939 నాటికే మద్రాసు కేంద్రం స్త్రీల కోసం, పిల్లల కోసం కార్యక్రమాలు మొదలుపెట్టింది. బాలల కార్యక్రమాలను ఒక వారం దుర్గాబాయమ్మ (దుర్గాబాయ్ దేశ్‌ముఖ్), తర్వాతి వారం న్యాయపతి కామేశ్వరి నిర్వహించేవారు. కొన్నాళ్లకు దుర్గాబాయమ్మ తమ తక్కిన పనుల తొందరవల్ల రేడియోకు రాలేకపోయారు. అప్పుడు కామేశ్వరితోబాటు ఆమె భర్త న్యాయపతి రాఘవరావు రేడియో కార్యక్రమాల నిర్వహణకు పూనుకొన్నారు. ఇద్దరూ బాలల కార్యక్రమాలు నిర్వహించినా, స్త్రీల కార్యక్రమాలను కామేశ్వరి నిర్వహించేవారు. ఆ దంపతులు 'రేడియో అక్కయ్య', 'రేడియో అన్నయ్య' పేర్లతో ప్రసిద్ధులయ్యారు. ఇద్దరూ బాలల కోసం రచనలు చేసేవారు. తెలుగులో బాల సాహిత్యం పెంపొందడానికి రేడియో చేసిన సేవ చిరస్మరణీయం. బాలల కోసం పాటలు, నాటికలు రాయడంతోబాటు వాటిని బాలలతోనే నిర్వహించడం 'ఆటవిడుపు' అనే ఆ ఆదివారాల కార్యక్రమం సాధించిన విజయం! ఆ తర్వాత 'బాలానందం' పేర శనివారాలలోనూ కార్యక్రమాలు వినిపించేవారు.

రెండు రోజులకొకసారి 'మహిళా మండలి' కార్యక్రమాలు మధ్యాహ్నాలలో ప్రసారమయ్యేవి. ఆ కార్యక్రమాల చివర వినిపించే 'మంగళహారతి' ఆ రోజుల్లో చాలా ఇళ్లలో శుభకార్యాలలో పాడుతూ ఉండేవారు. స్త్రీల పట్ల వివక్ష ఎక్కువగా ఉన్న ఆ రోజులలో 'మహిళా మండలి' ఎందరో స్త్రీల 'వాణి' కాగలిగింది.

అప్పటి ఉమ్మడి మద్రాసు రాజధానిలో ఉన్న తెలుగు జిల్లాల్లో ఉన్న సంగీత కళాకారులెందరో మద్రాసు రేడియో కేంద్రం నుంచి తమ సంగీతం వినిపించినవారే. తెలుగు పాట విలువను ప్రపంచ వ్యాప్తం చేసిన ప్రముఖ గాయకుల తొలి కార్యక్రమాలు మద్రాసు రేడియో కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి. మంగళంపల్లి బాలమురళీకృష్ణ పదకొండేళ్ళ వయసులో 1941 జూలై 2 నాడు తమ మొదటి రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు (ఆ తర్వాత కొన్నేళ్ల తర్వాత విజయవాడ, మద్రాసు, హైదరాబాదు రేడియో కేంద్రాలలో ఆయన ఉద్యోగం చేయడం, రేడియో సంగీత చరిత్రలో ఒక అధ్యాయం). ఘంటసాల వేంకటేశ్వరరావు 1944 సెప్టెంబర్ 30 నాడు శాస్త్రీయ సంగీతం వినిపించారు. ఆ తర్వాత లలిత సంగీత కార్యక్రమాలలోనూ సంగీత ప్రధానమైన నాటకాలలో పాల్గొంటూ వచ్చారు. దీపావళి కోసం సముద్రాల రాఘవాచార్యులు రాసిన 'వెలుగు వెల్లువ' అనే సంగీత నాటకంలో ఘంటసాల, భానుమతి ప్రధాన పాత్రధారులు. విశ్వనాథ రాసిన *కిన్నెరసాని* సంగీత నాటకానికి ఘంటసాల సంగీతం సమకూర్చారు. 'లైలామజ్ను' సంగీత నాటకంలో ఘంటసాల–మజ్నూ పాత్ర ధరించి పాడిన 'గుడారమెత్తివేశారు' 'ఎందుచూచిన గాని లైలా' ఎంతో ప్రసిద్ధికెక్కాయి (రచన: యండమూరి సత్యనారాయణ; సంగీతం: రజని). 1945లో ఘంటసాల పాడిన రజని గేయం 'ఘనాఘనా గర్జింపవో' ఢిల్లీ నుండి జాతీయ కార్యక్రమంలో ప్రసారమయింది.

రెండవ ప్రపంచ యుద్ధం రోజులలో మద్రాసు నగరం నుంచి షార్ట్‌వేవ్ రేడియో ప్రసారిణిని ఢిల్లీ తరలించారు. 1942 నుంచి 1945 దాకా తెలుగు, తమిళ కార్యక్రమాలు ఢిల్లీ నుంచి కూడా ప్రసారమయ్యాయి. మద్రాసు నుంచి కొత్త బలహీనమైన ప్రసారం వ్యవస్థ ద్వారా తెలుగు, తమిళ ప్రసారాలు కొనసాగినా ఆ రోజుల్లో ఢిల్లీ కార్యక్రమాల పట్ల శ్రోతలు ఎక్కువగా ఆకర్షితులయ్యేవారు.

1947లో దేశం స్వాతంత్ర్యం సాధించిన నాటికి ఆల్ ఇండియా రేడియో వ్యవస్థలో ఢిల్లీ, కలకత్తా (కోల్కతా), బొంబాయి (ముంబై), మద్రాసు (చెన్నై), లక్నో, తిరుచిరాపల్లి కేంద్రాలు మాత్రమే ఉండేవి. మద్రాసు నుంచే కాక దక్కన్ రేడియో నుంచి, మైసూరు నుంచి (అరుదుగా ఎప్పుడయినా) తెలుగు ప్రసారాలు జరిగేవి. స్వాతంత్ర్యం తర్వాత సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ సమాచార ప్రసార శాఖ మంత్రి అయ్యారు. ఆయన పర్యవేక్షణలో దేశంలో రేడియో వ్యాప్తికి కృషి మొదలయింది. 1956 నుంచి సంస్థను 'ఆకాశవాణి'గా పేర్కొంటున్నారు.

1948 అక్టోబర్ 12 నాడు విజయవాడలో రేడియో కేంద్రం మొదలయింది. విజయవాడ కేంద్రం ఏర్పడడంతో మద్రాసు నుంచి ప్రసారమయ్యే తెలుగు కార్యక్రమాలు తగ్గుతూ వచ్చాయి.

దక్కన్ రేడియో (హైదరాబాదు, ఔరంగాబాదు) కేంద్రాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. 1950 ఏప్రిల్ 1 నాడు హైదరాబాదు రేడియో కేంద్రం ఆల్ ఇండియా రేడియోలో అంతర్భాగంగా ప్రసారాలు మొదలుపెట్టింది. 1955 నవంబర్ 2 నాడు మొదలయిన బెంగుళూరు కేంద్రం, 1963 జూన్‌లో

మొదలయిన పోర్ట్‌బ్లేయర్ కేంద్రం కూడా తెలుగులో ప్రసారాలు చేస్తున్నాయి. 1957 అక్టోబర్ 3 నాడు మొదలైన 'వివిధ భారతి' ప్రసారాలలో తెలుగు పాటలు రోజూ అరగంట వినిపించే ఏర్పాటు చేశారు. 1969 సెప్టెంబర్‌లో ఢిల్లీ, పాట్నా, రాంచీ, సిమ్లా కేంద్రాల నుంచి తెలుగు నేర్పే పాఠాలు ప్రారంభించారు. 1971 మార్చి 2న హైదరాబాదు, విజయవాడలలో వాణిజ్య ప్రసారాలు మొదలుపెట్టారు.

కాలక్రమాన కడపలోనూ, విశాఖపట్టణంలోనూ ఆకాశాణి కేంద్రాలు మొదలయ్యాయి. స్థానికంగా (జిల్లాస్థాయిలో) రేడియో సేవలు అందించాలనే ఉద్దేశంతో మొదలుపెట్టిన స్థానిక కేంద్రాలలో ఆదిలాబాద్ కేంద్రం ఒకటి. వరంగల్లులో 1990 ఫిబ్రవరి 17 నాడు ప్రారంభమైన ఆకాశాణి కేంద్రం ఆకాశవాణి వ్యవస్థలో ఏర్పడిన నూరవ కేంద్రంగా చరిత్రకెక్కింది! ప్రస్తుతం ఆకాశవాణి వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాదు, విశాఖపట్టణం, కడప, ఆదిలాబాదు, కొత్తగూడెం, వరంగల్లు, నిజామాబాదు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, మార్కాపురం మొదలయిన చోట్ల కేంద్రాలు తెలుగులో కార్యక్రమాలు రూపొందిస్తున్నాయి. మాచెర్ల, కరీంనగర్, సూర్యాపేట మొదలయిన చోట్ల ప్రసార వ్యవస్థలున్నాయి. 100 వాట్ల సామర్థ్యం గల ప్రసారిణులు ఒంగోలు, నెల్లూరు, కామారెడ్డి, బాన్స్‌వాడ, నంద్యాల, ఆదోని, కాకినాడ మొదలయిన చోట్ల ఏర్పాటు చేశారు.

తెలుగు ప్రసారాలకు సంబంధించి హైదరాబాదు, విజయవాడ కేంద్రాలు చేసిన కృషి, తక్కిన కేంద్రాల కృషికన్నా రాశిలో వాసిలో ఎంతో ఎక్కువ. అన్ని తరగతుల శ్రోతలనూ ఆకర్షించడానికీ రెండు కేంద్రాలు ఎన్నో కార్యక్రమాలు రూపొందాయి. సాహిత్య విభాగం తీసుకొంటే ప్రసిద్ధుల ప్రసంగాలు, గోష్ఠులు, సంచికా కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, సమస్యా పూరణం వంటివి ఎన్నో ప్రసారమయ్యాయి, అవుతున్నాయి. భద్రాచలంలో జరిగే సీతారామ కల్యాణం, శ్రీశైలంలో శివరాత్రి, తిరుమల బ్రహ్మోత్సవాలు మొదలయిన సందర్భాలలో ప్రత్యక్ష వ్యాఖ్యానాలు వినిపించి రేడియో కొత్తదారులు తొక్కింది.

కథలు నవలలు మొదలయినవి ప్రసారం చేయడంలోనూ ఆకాశవాణి తనదే అయిన ప్రత్యేకతను నిలుపుకొంటూ వస్తున్నది. ఏ కొందరో తప్ప ఆధునిక కథా రచయితల కథలను ఆ రచయితల ద్వారా వినిపించడంలో ఆకాశవాణి విజయవంతమైనది. కొన్ని సందర్భాలలో ప్రముఖుల కథలను నిలయ కళాకారుల ద్వారా చదివించడమూ జరుగుతుంటుంది.

విశ్వనాథ సత్యనారాయణ తమ 'బద్దన్న సేనాని' నవలలను విజయవాడ కేంద్రం నుంచి తామే వినిపించడం రేడియో చరిత్రలో అపూర్వమైన విషయం. 1979 తర్వాత హైదరాబాదు కేంద్రం 'నవలా స్రవంతి' పేరిట నవలల ప్రసారం ప్రారంభించింది. 'నవలా స్రవంతి' పేరిట నవలల ప్రసారం ప్రారంభించింది. 'నవలా స్రవంతి'లో ఎన్నో తెలుగు నవలలు ప్రసారమయ్యాయి. తక్కిన కేంద్రాలు కొన్ని నవలలు వినిపించాయి.

1959 జనవరి 25 నాడు మొట్టమొదటి జాతీయ కవిసమ్మేళనం ప్రసారమయింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది జనవరి 25 నాడు ప్రసారమయ్యే ఈ కవి సమ్మేళనాలలో చోటుచేసుకొనే తెలుగు కవితలను తక్కిన భారతీయ భాషలలోకి అనువదించి ప్రసారం చేయడం, తక్కిన భాషల కవితలను తెలుగులోకి అనువదించి ప్రసారం చేయడం జరుగుతున్నవి. ప్రముఖ కవుల కవిత్వాన్ని వాళ్ల నోట పలికించి పదిలపరచడం లోనూ ఆకాశవాణి ముందంజ వేసింది. ఉదాహరణకు హైదరాబాదు కేంద్రం సి. నారాయణ రెడ్డి గానం చేసిన 'విశ్వంభర'ను పదిలపరచింది.

వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల గళాలను పదిలపరచే కృషిలోనూ ఆకాశవాణి నిమగ్నమై ఉంది. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఎందరితోనో చేసిన సంభాషణ లను ఆకాశవాణి భద్రపరచింది. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా రేడియో కోసం ప్రముఖుల జీవిత చరిత్రలను వాళ్లతో సంభాషణల రూపంలో నిక్షిప్తం చేస్తూ వస్తున్నది. అటువంటి కొన్ని సంభాషణలను ప్రసారం చేసే ప్రయత్నమూ మొదలయింది.

శాస్త్రీయ సంగీత సంప్రదాయ పరిరక్షణ ఆకాశవాణి కర్తవ్యాలలో ఒకటి. అన్నమాచార్య కీర్తనలు, క్షేత్రయ్య పదాలు, ఆధ్యాత్మ రామాయణ కృతులు, భక్త కవులు ఎందరో రాసిన తత్త్వాలు, భక్తి గీతాలు ఆకాశవాణి ద్వారా బహుళ ప్రచారం పొందాయి. ప్రముఖ వాగ్గేయకారుల రచనలను పదిలపరిచే ఉద్దేశంలో శ్రీ త్యాగరాయస్వామి వారి ఉత్సవ సంప్రదాయ కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు మొదలైన వాటిని బాలమురళీకృష్ణ వంటి ప్రముఖ విద్వాంసుల ద్వారా పాడించింది ఆకాశవాణి. అరుదైన రచనలను సంగీత శిక్షణ ద్వారా నేర్పడం ఆకాశవాణి

విజయవాడ కేంద్రం పెట్టిన వరవడి. ఓలేటి వెంకటేశ్వర్లు నేర్పిన తెలుగు కృతులను దక్షిణ భారతదేశంలో ఎందరో నేర్చుకొనేవారు.

లలిత సంగీతం విషయంలో విజయవాడకూ, హైదరాబాదుకూ పోటీ ఉండేది. రెండు కేంద్రాలూ లలిత గీతాలతో బాటు సంగీత నాటకాలు, సంగీత రూపకాలు, యక్షగానాలు ప్రసారం చేసేవి. 1955 నుంచి హైదరాబాదు కేంద్రం ప్రతి రోజూ 'గీతావళి' పేరిట లలిత గీతాలు ప్రసారం చేయసాగింది. దాశరథి, నారాయణరెడ్డి రాసిన పాటలెన్నో రేడియో ప్రసారం చేసింది. 1957 లో దేవులపల్లి కృష్ణశాస్త్రి హైదరాబాదులో ప్రయోక్తగా చేరారు. ఎనిమిది సంవత్సరాలు ఆకాశవాణిలో ఉద్యోగం చేశారు. "రేడియో వాళ్లు నా చేత రాయించకపోతే నేను రాసిందాంట్లో చాలా భాగం రాసి ఉండేవాణ్ణికాను" అని ఆయన చెప్పేవారు.

1960లలో రజని సంగీత సంవిధానంలో కృష్ణశాస్త్రి రాసిన 'క్షీరసాగర మథనం', 'విప్రనారాయణ', 'మాళవిక యక్షగానాల'ను హైదరాబాదు కేంద్రం ప్రసారం చేసింది.

పాలగుమ్మి విశ్వనాథం ఎన్నో లలిత గీతాలకూ, సంగీత నాటకాలకూ అజరామరమైన సంగీతం అందించారు. ఆయన స్వరపరచిన లలిత గీతాలలో, కృష్ణశాస్త్రి రాసిన 'నారాయణ నారాయణ అల్లా అల్లా', 'శివశివ అనరాదా', 'పదములె చాలు రామా' మొదలయినవీ, దాశరథి రాసిన 'భూధరమో సాగరమో' మొదలయినవీ, సి. నారాయణరెడ్డి రాసిన 'ఈ నల్లని రాలలో', 'ఏటిదాపుల తోటలోపల', 'కుక్క మొరిగిందిరా' మొదలయినవీ, అరిపిరాల విశ్వం రాసిన 'శివ పాదమునంట నేను' ఎంతో ప్రచారం పొందాయి. విశ్వనాథం సంగీతం సమకూర్చిన సంగీతనాటకాలలో దాశరథి రాసిన 'మీర్జాగాలిబ్' నారాయణరెడ్డి రాసిన 'రామప్ప', 'హరిచరణ దాసి మీరా', కృష్ణశాస్త్రి రాసిన 'వేణుకుంజం', 'ఏడాది పొడుగునా', 'శివక్షేత్ర యాత్ర'; దాశరథి కృష్ణశాస్త్రి కలిసి రాసిన 'కొత్త కవిలె' శ్రోతలను ఎంతో సంతోషపరిచాయి. 'రామప్ప' జాతీయ రూపక కార్యక్రమంలో భాగంగా పన్నెండు భారతీయ భాషలలో ప్రసారమై ప్రత్యేకత సంతరించుకొన్నది.

పుట్టపర్తి నారాయణాచార్యులు రాసిన 'శివతాండవం' జాతీయ స్థాయిలో ఆకాశవాణి వార్షిక పురస్కారం అందుకొన్నది. దాశరథి హైదరాబాదులోనూ, మద్రాసులోనూ ఎన్నో గొప్ప కార్యక్రమాల రచన చేశారు. ఇక నాటకాల విభాగానికి వస్తే విజయవాడలో బందా కనకలింగేశ్వరరావు, హైదరాబాదులో స్థానం నరసింహారావు నాటక ప్రయోక్తలుగా పనిచేశారు. రెండు కేంద్రాలలోనూ తమ గాత్రాలతో రెండు మూడు తరాల శ్రోతలను మైమరపింపజేసిన కళాకారులు ఎన్నో నాటకాలలో పాల్గొన్నారు; మరెన్నిటినో రూపొందించారు. తెలుగు నాటకాలెన్నో హిందీ అనువాదాలుగా రూపొంది తక్కిన భారతీయ భాషలలో జాతీయ కార్యక్రమాలుగా ప్రసారమయ్యాయి.

జానపద సంగీతాన్ని జానపద కళారూపాలనూ పరిరక్షించడంలో హైదరాబాదు, విజయవాడ కేంద్రాల కృషి ఎన్నదగినది. జానపద కళాకారులను రేడియో కేంద్రానికి పిలిపించడం ద్వారా, ఆకాశవాణి బృందాలు మారుమూల గ్రామాలలోనూ పల్లెటూళ్లలోనూ ఉన్న కళాకారుల దగ్గరికే వెళ్లడం ద్వారా జానపద సంగీతాన్ని భద్రపరచడానికీ శ్రోతలకు వినిపించడానికీ కృషి జరుగుతున్నది. ఆకాశవాణి పూనిక లేకుంటే తెలుగు ప్రజల మౌఖిక జానపద కళారూపాలెన్నో మరుగునపడి ఉండేవి.

తెలుగువారికే ప్రత్యేకమైన పద్యాల ప్రసారంలో ఆకాశవాణి ప్రత్యేకత చూపుతుంటుంది. 'సమస్యా పూరణం' సాహిత్య ప్రియులైన శ్రోతలకు ప్రియమైన కార్యక్రమాలలో ఒకటి. రంగస్థల పద్యాల పట్ల శ్రోతలలో ఉండే ఆసక్తిని గుర్తించి వాటిని ప్రముఖుల గళాల ద్వారా వినిపిస్తుంటుంది.

ప్రసిద్ధ నాటకాలను పదిలపరచే ప్రయత్నాలతోబాటు తన శబ్ద భాండాగారంలోని కొన్ని గొప్ప నాటకాలను కేసెట్లుగా సీడీలుగా విడుదల చేసింది. ప్రముఖులు ఎందరో తాము ఆకాశవాణి కోసం చేసిన రచనలను పుస్తకాలుగా ప్రచురించడాన్ని కూడా ఇక్కడ గుర్తు చేసుకోవాలి.

భాషాబోధన కోసం ఆకాశవాణి ప్రసారం చేసిన పాఠాలనూ, సంస్కృత పాఠాలు చెప్పిన కేశవపంతుల నరసింహ శాస్త్రి వంటి వారినీ వార్తలకు వరవడి దిద్దిన పన్యాల రంగనాథరావు, జగ్గయ్య వంటివారిని మరచిపోవడం ఎలా?

కార్యక్రమాల రూపకల్పనను ఉద్యోగధర్మంగా కాక పవిత్రమైన కర్తవ్యంగా భావించిన తెలుగువారెందరో ఆకాశవాణిలో పనిచేయడం సంస్థ అదృష్టం. అందువల్లే కార్యక్రమాలు శ్రోతలను ఆకట్టుకొన్నాయి. ప్రసంగ కార్య క్రమాలు, బాలల కార్యక్రమాలు, స్త్రీల కార్యక్రమాలు, యువవాణి మొదలైనవి వాటిని నిర్వహించిన (రావూరి భరద్వాజ, తురగా జానకీరాణి,

ప్రయాగ వేదవతి వంటి) వారి సేవ వల్ల రాణించాయి. 1950ల తర్వాత రేడియోలో ప్రయోక్తలుగా చేరిన పింగళి లక్ష్మీకాంతం, నాయని సుబ్బారావు, కృష్ణశాస్త్రి, బందా, స్థానం మొదలయినవారూ అంతకుముందు రేడియో ఉద్యోగం చేసిన జాషువా చేసిన సేవలు ఎంతో గొప్పవి.

క్షేత్రాలలో జరిగే ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలతోబాటు ఆకాశవాణి కొన్ని ప్రత్యేక సందర్భాలలో ప్రత్యక్ష వ్యాఖ్యానాలు ప్రసారం చేస్తూ ఉంటుంది. నాయకుల అంతిమ యాత్రలకు సంబంధించిన ప్రత్యక్ష వ్యాఖ్యానాల ప్రసారాలకు ఆకాశవాణి ఎన్నో జాగ్రత్తలు తీసుకొంటుంది.

క్రీడలకు సంబంధించి తెలుగులో ప్రత్యక్ష వ్యాఖ్యానాలు ప్రసారం చేయడంలోనూ ఆకాశవాణి ప్రత్యేకత సాధించింది. వివిధ సందర్భాలలో క్రికెట్, కాలిబంతి ఆట, హాకీ, కబడ్డీ మొదలయిన క్రీడల ప్రత్యక్ష వ్యాఖ్యానాలు ప్రసారం చేసి శ్రోతలను ఆకర్షించింది. 2007లో ప్రపంచ 'కప్' క్రికెట్ పోటీల గురించి ఆకాశవాణి (హైదరాబాద్) ప్రత్యక్ష వ్యాఖ్యానాలు వినిపించి మన్ననలు పొందింది.

శాస్త్ర సాంకేతిక విజ్ఞాన విశేషాలు సరళమయిన రీతిలో చెప్పడం ఆకాశవాణి నిరంతర సాధనలలో ఒకటి. విజ్ఞాన విశేషాల ధారావాహికలు ఎన్నిటినో తెలుగులో రూపొందించి ప్రసారం చేసింది. ఆరోగ్యం గురించీ వైద్య సదుపాయాల గురించీ ప్రసారాలు సాగిస్తున్నది. పరిమిత కుటుంబాల ఆవశ్యకత, టీకా, మందుల అవసరం, ఎయిడ్స్ నివారణ మొదలైనవెన్నో ప్రసారాంశాలే!

స్వాతంత్ర్యోత్సవ స్వర్ణోత్సవాన్నీ మొదటి స్వాతంత్ర్య సమరానికి 150 ఏళ్లు నిండిన సందర్భాన్నీ మహా నాయకుల శత జయంతులను జరుపుకొనే సందర్భాలలో ఆకాశవాణి తెలుగులో ఎన్నో ప్రక్రియలలో ప్రసారాలు జరిపింది.

ఆకాశవాణి వైవిధ్యానికి కారణాలు :

అసామాన్యులు, సామాన్యులు ఎందరో కార్యక్రమాలలో పాల్గొనడం, ఎప్పటికప్పుడు కొత్తవారి కోసం అన్వేషించడం. గ్రామ సీమలనూ, రైతులనూ మరచిపోకుండా నిత్యమూ ప్రసారాలు చేస్తున్నది. వ్యవసాయ పాఠశాల, ఆదర్శ కర్షకుల అనుభవాలు, నిపుణులతో రైతుల చర్చలు ఆకాశవాణికి పేరు తెచ్చిపెట్టాయి.

నిపుణుల సలహాలతో రైతులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటి కప్పుడు అందించే ప్రయత్నాలలో భాగంగా రైతులు ఫోన్ చేసి తమ సందేహాలు తీర్చుకోవడానికి వీలుగా ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తున్నది. వ్యవసాయానికీ దాని అనుబంధ విషయాలకూ సంబంధించి రోజూ దాదాపు మూడు సార్లు ప్రత్యేకంగా ప్రసారమవుతుంటాయి. హరిత విప్లవంలోనూ క్షీర విప్లవంలోనూ, ఆకాశవాణి పాత్ర ప్రశంసార్హమైనది.

గ్రామీణ స్త్రీలకు సంబంధించి 'గ్రామలక్ష్మి' వంటి కార్యక్రమాలను ఆకాశవాణి ప్రసారం చేస్తున్నది. తెలుగు బాలల కోసం ఆకాశవాణి చేసిన అద్వితీయమైన కృషి గురించి పెద్ద గ్రంథమే రాయవచ్చు.

1970 డిసెంబర్ 20 నుంచి హైదరాబాద్ కేంద్రం రోజుకు నాలుగున్నర గంటల 'యువవాణి' కార్యక్రమాలు మొదలుపెట్టింది. తక్కిన తెలుగు కేంద్రాల నుంచి కూడా యువజనుల కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయి. గడచిన నలభై ఏళ్లలో యువవాణి కార్యక్రమాలలో పాల్గొని, తమ ప్రతిభలు ప్రదర్శించిన వారెందరో!

ప్రస్తుతం ఉన్నత పదవులలో ఉన్న కొందరు తమ యువవాణి రోజులను ఎంతో ఆనందంగా గుర్తుచేసుకుంటూ ఉంటారు.

ఎఫ్.ఎం. రేడియో విస్తరణ భాగాలుగా హైదరాబాద్, విజయవాడ, వివాఖపట్టణం కేంద్రాల నుంచి 'రైన్‌బో' ప్రసారాలు మొదలయ్యాయి. ఈ వాహికలలో ఆకాశవాణి సంతరించుకొన్న విలువలను సడలనీయకుండా కార్యక్రమాలు రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎందరో పండితులు, రచయితలు, మేధావులు, సంగీత కళాకారులు, 'గాత్ర' సంపన్నులు ఆకాశవాణిలో ఉద్యోగాలు చేసి సంస్థకు గొప్ప పేరు తెచ్చిపెట్టాయి.

2000 సంవత్సరంలో ప్రైవేట్ రంగంలోని సంస్థలు ఎఫ్.ఎం. (FM-Frequency modulation) రేడియో కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చునని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తొలి దశలో 12 నగరాలలో 22 కేంద్రాలు మొదలయ్యాయి. విశాఖపట్టణంలో మొదలయిన విశాఖ ఎఫ్.ఎం. వాటిలో ఒకటి. రెండవ దశలో హైదరాబాదులో 2006 లో రేడియో మిర్చీ, రేడియో సిటీ, బిగ్ ఎఫ్.ఎం., ఎస్.ఎఫ్.ఎం. (రెడ్ ఎఫ్.ఎం.) వాహికలు, 2007లో తిరుపతిలో బిగ్ ఎఫ్.ఎం., రెడ్ ఎఫ్.ఎం. వాహికలు, విశాఖపట్టణంలో 2007లో రేడియోసిటీ, 2008లో రేడియో మిర్చీ, బిగ్ ఎఫ్.ఎం.,

2007లో విజయవాడలో రేడియో మిర్చీ, రెడ్ ఎఫ్.ఎం., 2008లో వరంగల్లులోనూ, రాజమండ్రిలోనూ రెడ్ ఎఫ్.ఎం వాహికలు ప్రారంభమయ్యాయి. నాలుగేసి కేంద్రాలకు ఆస్కారం ఉన్న ఊళ్ళు: కాకినాడ, కర్నూలు, నెల్లూరు, మూడేసి కేంద్రాలకు ఆస్కారం ఉన్న రాష్ట్రవ్యాప్తంగా ఇరవై ఆరు.

ప్రస్తుతం ప్రసారాలు చేస్తున్న ప్రైవేట్ ఎఫ్.ఎం., రేడియో వాహికలు ప్రధానంగా యువజనులను ఉద్దేశించినవీ, వినోదానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవి కావడం వల్ల కార్యక్రమాలలో (పాటల మధ్య) వినిపించే మాటలలో ఇంగ్లీష్ పదాల మధ్య తెలుగు పదాలు ఇమిడ్చి మాట్లాడేవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇంగ్లీష్‌లో ఆలోచించి తెలుగులో మాట్లాడడానికి ప్రయత్నించేవాళ్లూ కొందరు వినిపిస్తూ ఉంటారు.

నిత్య వ్యవహారంలో లేని 'మరియు' వంటి రూపాలు, కృతకమైన బహువచన రూపాలు వాడడం కొందరి ప్రత్యేకతలు.

కొందరు మాట్లాడే తెలుగు వింటున్నప్పుడు వినోదంగా ఉన్నా తెలుగు పడుతున్న అవస్థలు చూసి (విని) విషాదం కలుగుతూ ఉంటుంది. అన్ని వాహికలలోనూ అందరూ తెలుగు పట్ల శ్రద్ధ చూపడం లేదని చెప్పడం సబబు కాదు. తెలుగు బాగా మాట్లాడేవాళ్లూ ఉన్నారు. అయితే మొత్తం పరిస్థితినీ సమీక్షించి చూస్తే తెలుగు వాడుక విచారాన్ని కలిగిస్తున్నది.

ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు విద్యా విజ్ఞానాల వ్యాప్తి కోసం విశాఖపట్టణంలోనూ, హైదరాబాదులోనూ ఏర్పాటు చేసిన 'జ్ఞానవాణి' ఎఫ్.ఎం. వాహికలు తెలుగులో ప్రసారాలు చేస్తున్నాయి.

ఒక పరిమిత సముదాయానికి ప్రసారాలు అందించే కమ్యూనిటీ రేడియో కేంద్రాలు కొన్ని తెలుగులో ప్రసారాలు చేస్తున్నాయి. అవి హైదరాబాదు, భీమవరం, మచ్నూరు (మెదక్ జిల్లా), తిరుపతి మొదలయిన చోట్ల ఉన్నాయి. వీటిలో విద్యా సంస్థలు నిర్వహిస్తున్నవే ఎక్కువ. మచ్నూరులోని 'సంఘం రేడియో' ఆసియా ఖండంలో గ్రామీణ స్త్రీలు నిర్వహించే తొలి సముదాయ ప్రసార వ్యవస్థగా ప్రసిద్ధికెక్కింది.

క్రైస్తవ మత సంబంధమైన ప్రసారాలు చేసే రేడియో కేంద్రాలు కొన్ని ఉన్నాయి. అమృతవాణి (రేడియో వెరితాస్–ఆసియా) విశ్వవాణి (ట్రాన్స్ వరల్డ్ రేడియో) మొదలయినవి తెలుగులో ప్రసారాలు చేస్తున్నాయి. 'జీవజలములు రేడియో పరిచర్యలు' నర్సాపురంలో 1954లో మొదలయింది. రేడియో వెరితాస్ వంటివి పాటలు, నాటకాలు, కథలు, ప్రసంగాలు వంటివీ ప్రసారం చేస్తూ వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నవి. అంతర్జాలం (Internet)లో మత సంబంధమైన ప్రసారాలు చేసే కేంద్రాలు ఉన్నాయి.

విదేశాలలో ఉండే తెలుగువారు ఏర్పాటు చేసిన రేడియో వ్యవస్థలు కొన్ని అంతర్జాలంలో ఉన్నాయి. వీటిలో కొన్ని వారానికి ఒకరోజే ప్రసారాలు చేస్తుంటాయి. ఆధ్యాత్మిక గీతాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు మొదలైనవి ప్రసారం చేసే 'రేడియో సాయి' కూడా తెలుగులో ప్రసారాలు చేస్తున్నది.

అంతర్జాలంలో తెలుగు ప్రసారాలు చేసేవారిలో చాలామంది చాలా ఉత్సాహంగా ధ్వనిస్తుంటారు. అయితే కొందరు మాట్లాడే తెలుగు మాత్రం ఉత్సాహాన్ని కలిగించదు.

శ్రీలంక ప్రసార సంస్థ చాలా ఏళ్లపాటు తెలుగులో ప్రతిరోజూ పరిమితంగా ప్రసారాలు చేసేది (wavelength అనే పదాన్ని 'అలవరుస'గా ప్రకటించేది) ఉత్తర శ్రీలంకలో మారిన పరిస్థితుల దృష్ట్యా ఈ ప్రసారాలు ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ సంస్థ వారి "తెండ్రల్" అనే తమిళ వాహిక (వీలుంటే) వారానికి ఒకసారి తెలుగు సినిమాల పాటలు 15 నిమిషాలు (ఎప్పుడైనా ఇంకా కొంచెంసేపు) వినిపిస్తున్నది. ఆ సంస్థ తెలుగులో ఇంకా ఏవయినా కార్యక్రమాలు ప్రసారం చేస్తున్నదేమో తెలియదు.

ఆగ్నేయ ఆసియాలో ఉన్న తెలుగు వారి కోసం ఆకాశవాణి 1990 ఉగాది (మార్చి 27) నాడు 30 నిమిషాల కార్యక్రమాలు ప్రసారం చేయడం మొదలుపెట్టింది. ఈ తెలుగు 'సేవ' మొదట ఢిల్లీ కేంద్రంగా పనిచేసేది; ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ప్రతిరోజూ ప్రసారమవుతున్నది. దూరదర్శన్ ఏర్పాటు చేసిన 'డిడి డైరెక్టర్ ప్లస్' డిటిహెచ్ (డైరెక్ట్ టు హోమ్) వేదిక నుంచి ఆకాశవాణి తెలుగు కార్యక్రమాలను వినిపిస్తున్నది. వివిధ ఆకాశవాణి కేంద్రాలలో రూపొందించిన కార్యక్రమాలను వినిపించడం ఇందులోని విశేషం.

రేడియో ప్రసారాలలో తెలుగు గురించి విశ్లేషించి చూస్తే ఇప్పటికీ ఆకాశవాణి పాత్ర ప్రముఖమైనదిగా కనిపిస్తున్నది. ఇందుకు ఆకాశవాణి కార్యక్రమాలలోని వైవిధ్యం కారణం. తెలుగు ఉచ్చారణ విషయంలో తక్కిన రేడియో వాహికలకన్నా ఆకాశవాణి ఎంతో కొంత మెరుగ్గా ఉందని చెప్పవచ్చు. అయితే కార్యక్రమ ప్రకటనల విషయంలోనూ వార్తల అనువాదాల విషయంలోనూ అడపాదడపా తప్పులు

దొర్లుతూనే ఉన్నాయి. అంకెల విషయమే తీసుకొంటే ఎంది (ఎనిమిది), పదకండు (పదకొండు), పద్మూడు (పదమూడు), వెయ్య (వెయ్యి), ఎణభై (ఎనభై) వంటివి వినిపిస్తుంటాయి. 'నిమిషానికి' 'గంటలకి' వంటివి ప్రాంతీయ భేదాలయితే 'ఆదితాళం'లో త్యాగరాజ స్వామి కీర్తన' 'రూపక తాళంలో గానం చేస్తారు' వంటివి అవగాహన లేకపోవడంవల్ల వచ్చేవి.

వార్తల అనువాదాల గురించి సంగ్రహంగా చెప్పడం కష్టం. వడివడిగా అనువాదాలు చేసి వేడివేడిగా చదవవలసి వచ్చినప్పుడు ఎదురుచూడని తప్పులు అడపాదడపా చల్లగా దూరిపోతుంటాయి. ఇటీవల విన్న ఒక ఆణిముత్యం: విచారణ (In Camera) జరపమని కోర్టువారు ఆదేశించారన్న వార్త తెలుగులో 'విచారణ కెమెరా'తో చిత్రించమన్నట్టు అనువాదం కావడం!

మీడియం వేవ్ రేడియో పరికరాలు దొరకడం అరుదవుతున్న ఈ రోజులలో ఆకాశవాణి తరిగిపోతున్న శ్రోతలను ఆకర్షించడానికి త్వరగా ప్రత్యామ్నాయాలు వెదికితే ఆ రకంగా కూడా తెలుగుకూ తక్కిన భారతీయ భాషలకూ సేవ జరుగుతుంది.

రేడియో ప్రసారాల భాష ఎట్లా ఉండాలి? స్వతంత్ర భారతదేశపు తొలి సమాచార ప్రసార శాఖల మంత్రి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 1947లో చెప్పిన అభిప్రాయం ఇది: "సామాన్య శ్రోతల అభిరుచినీ, అభిప్రాయాలనూ దృష్టిలో పెట్టుకోవాలి. ఆ శ్రోతలు డ్రాయింగ్ రూముల్లోనో, గ్రంథాలయాల్లోనో కూచుని రేడియో వినేవాళ్లు కాకపోవచ్చు.

వాళ్లు ఇప్పటికే చౌక ధర రేడియో ఉన్నవాళ్లయినా కావచ్చు. త్వరలో చౌక ధరకు దొరికే రేడియో కొనేవాళ్లయినా కావచ్చు. వాళ్లకు ఈ దేశంలోనూ ఈ దేశం బయటా జరుగుతున్న విషయాల గురించి తెలుసుకోవాలన్న తపన ఉంటుంది. కనుక సామాన్య శ్రోతలకు అర్థమయ్యే భాషను ప్రోత్సహించడమే ఆల్ ఇండియా రేడియో విధానం! ఆకాశవాణి మాత్రమే కాక రేడియో ద్వారా ప్రజాసేవ చేయాలనుకొనే వారందరికీ నేటికీ వర్తించే సూత్రం ఇది."

వినోదం ఒక్కటే జీవితపు విలువను పెంచదు. విద్య, విజ్ఞానం రెండూ, దేశంలో ఇంకా చాలామందికి అందవలసి ఉంది. అందుకు రేడియో సామాన్యుల భాష మాట్లాడవలసిన అవసరం ఉంది. దేశ ప్రగతి గురించి ప్రజా జీవితంతో పెనవేసుకొన్న అంశాల గురించి సంస్కృతి గురించీ ఎక్కువ మందికి తక్కువ ఖర్చుతో అందించగల మాధ్యమంగా రేడియో విలువను గుర్తించవలసిన అవసరం కూడా ఉంది. మి

డాక్టర్ పి.ఎస్. గోపాలకృష్ణ
(ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక 2012)

హాస్యం అరుదైపోయిందా?

ఒకప్పుడు సమాజంలోని బహుకొద్దిమంది జీవితాల్లో, ప్రవర్తనలో హాస్యాస్పదత్వం కొట్టవచ్చినట్లు కనుపించేది. అందుకు కారణం ఆ రోజుల్లో సాంఘిక జీవనంలో కొన్ని నీతులు, నియమాలు, ప్రమాణాలు, మర్యాదలు పాటించేవారు. అవి తగ్గుముఖం పట్టినప్పుడూ, అడ్డదారిన నడక సాగినప్పుడూ తత్కారణాలైన అతి తెలివిని, అమాయకత్వాన్ని, స్వార్థపరత్వాన్నీ ఎత్తి చూపడంలో హాస్యం, వ్యంగ్యం విరివిగా పెల్లుబుకుతూ వచ్చాయి. గురజాడ కన్యాశుల్కంలో, కందుకూరి, చిలకమర్తి ప్రహసనాల్లో వెల్లివిరిసినవే! పానుగంటి వారి రచనల్లో హాస్యం కన్నా వ్యంగ్యం పాలు అధికం, వీరేశలింగం పంతులుగారి *సత్యరాజా పూర్వదేశయాత్రలు* వ్యంగ్యానికి పరాకాష్ఠ.

ఆధునిక యుగంలో అది మరోదారి పట్టింది. మధ్యతరగతి సంసారిక జీవితంలోని సమస్యలతో పాటు, మధురిమను అందంగా అలంకరించి చూపారు మునిమాణిక్యంగారు తన *కాంతం* కథలు ద్వారా! భమిడి పాటివారు మరో రకంగా ప్రదర్శించారా నాటి సమాజాన్ని హాస్య, వ్యంగ్య భరితంగా! ఇతరత్రా నాటకాల్లో, కథల్లో చివరికి కవితల్లో కూడా ఎంతో కొంత హాస్యం, వ్యంగ్యం చోటు చేసుకున్నా ఆ తరంలో లబ్ద ప్రతిష్టులైన వారు వీరిద్దరూ, *బారిష్టర్ పార్వతీశం* మొక్కపాటి వారూను.

- చలసాని ప్రసాదరావు (రసన పుస్తకం నుంచి....)

సంగీత గజారోహణ

కొచ్చెర్లకోట రామరాజు

కొచ్చెర్లకోట రామరాజు

- తనికెళ్ళ భరణి

రామరాజుగారు వాయులీనాన్ని రెండుచేతులతోనూ వాయించగల నేర్పరి. తూర్పుగోదావరి జిల్లా, కోనసీమలోని రాజోలు వద్దనున్న తాటిపాక మండలం వీరి స్వస్థలం. (ఇది ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రమైన ఆదుర్రుకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది.) వీరి తల్లిదండ్రులు వెంకటనారాయణ, జానకాంబలు. రామరాజుగారు సంగీతం అంటే ఇష్టపడే విద్యార్థులకు ఉచితంగా సంగీత విద్యను బోధించడమే కాక, ఉచిత భోజన వసతి లాంటి సదుపాయాలను వర్ణ భేద రహితంగా సమకూర్చేవారు.

రామరాజుగారి దౌహిత్రుడైన కొచ్చెర్లకోట ప్రభాకర సుందరరావు సుప్రీం కోర్టులో అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు. వీరు తమ తాతగారి పేర 2009వ సంవత్సరంలో కొచ్చెర్లకోట రామరాజు చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు. దీని ద్వారా ఒక వృద్ధాశ్రమాన్ని, అనాథ శరణాలయాన్ని, సంగీతపాఠశాలను నడుపుతున్నారు. ఆయన సంగీత రచనలను ముందు తరానికి అందించడమే వారి ప్రధాన లక్ష్యం.

కొచ్చెర్లకోట వారి రచనలలో ప్రముఖమైన వాటిలో కొన్ని : స్వరకర్తగా కర్ణాటక సంగీతంలో గీతాలు, జావళి, స్వరజతులు, వర్ణం, కీర్తన, భజన సంప్రదాయాలలో రచనలు సాగించారు.

*మోహన రాగంలో రచించారు. **బాల కృష్ణ మోహన** స్వరజతులలో ప్రసిద్ధమైనది.*

***శ్రీకృష్ణ కర్ణామృతంలో** 108 కీర్తనలున్నాయి.*

***శ్రీరామ కీర్తనం.** ఇది రామునిపై రాసిన కర్ణామృతం. ఇది 1932వ సంవత్సరంలో కోనసీమ ప్రెస్, అమలాపురంలో ప్రింటయినది. దీని వెల అప్పట్లో అర్ధరూపాయి. రామునిపై 100 కీర్తనలున్న ఈ రచన పంచరాగాలతో కూడిన హారతితో పూర్తవుతుంది.*

*శ్రీరాగంలో రచించబడ్డ **గిరిరాజ కుమారి;** భైరవీరాగంలో **శ్రీ త్రిపుర సుందరి;** కళ్యాణ రాగంలో **శ్రీ శంకరి;** పంచరాగమాల స్వరజతి **శ్రీఫలదాంబిక, హాయిగా;** శంకరాభరణ రాగంలో **శ్రీ గజ గజానని;** ఖరహర ప్రియ రాగంలో **వాణి శర్వాణి** లాంటి శ్రవ్యమైనా రచనలు, ఇప్పటికీ శ్రోతలను అలరిస్తున్నాయి.* **- మిసిమి**

పోలవరం ఒకప్పుడు సంస్థానం... ప్రస్తుతం శిథిలమైన పెద్ద దివాణం. ఒకప్పుడు ఎంత వైభవంగా వెలిగిందో తలుచుకుంటే బెంగ కలిగింది...

వార్ధక్యంతో పెచ్చులూడిపోయిన గోడలు...

గాజు కళ్లతో గతాన్ని గుర్తు తెచ్చుకుంటున్నట్టు ఉన్న పైకప్పు...

ఎంతమంది మహానుభావులు నా గుండా వెళ్ళారో అని గుండెలు బాదుకుంటున్న సింహద్వారం!... పడిపోవడానికి సిద్ధంగా ఉన్న తలుపులూ...

సంగీత సాహిత్యాల హోరులో కళకళ్లాడి.. ప్రస్తుతం... శ్మశాన నిశ్శబ్దంగా బావురుమంటూ బంగళా....

రాజువారి కిరీటం లోంచి తొంగిచూసే తురాయి లాగ...

గోడ సందుల్లోంచి ఎండిపోయిన గడ్డిపరకలూ...

ఏదైనా ఇంతే కాబోలు... కాలపురుషుడు ఎంత దయలేనివాడు...

'కారే రాజులు రాజ్యముల్ కలుగవే... వారేరీ సిరి



ఒకప్పటి కొచ్చెర్లకోట సంస్థానం

మూట కట్టుకుని పోవంజాలిరే' అంటాడు పోతన... భాగవతంలో...

కొచ్చెర్లకోట ప్రభువులు... సిరిమూట కట్టుకుపోలేదు గానీ...

బోల్డంత కీర్తిని మాత్రం మూటకట్టుకున్నారు!

ఆ కీర్తి పరిమళాలు ఇంకా ఆంధ్రదేశమంతా వ్యాపిస్తూనే ఉన్నాయ్...

కొచ్చెర్లకోట వంశం వారు ఆరువేల నియోగులు...

కొచ్చెర్లకోట వేంకట జగన్నాథం గారు... పోలవరాన్ని పాలించిన మొదటి పాలకులు...

పోలవరం సంస్థానాధీశులు దైవభక్తులు...

పక్కనే వున్న 'పట్టిసీమ' శైవ క్షేత్రానికి వంశపారం పర్యంగా ధర్మకర్తలు.

ప్రస్తుతం కొచ్చెర్లకోట వారు ఎక్కువమంది విదేశాల్లో స్థిరపడ్డా... ప్రతీసంవత్సరం 'శివరాత్రి'కి ఆ వంశంవారంతా అక్కడికి చేరి అభిషేకాలు చేస్తారని తెలిసింది!... వాళ్లకి వాళ్ల కుటుంబంపట్లా... ఆ సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఉన్న గౌరవానికి నమోవాకాలు.

పోలవరం సంస్థానం పచ్చగా ఉండే రోజుల్లో ఎంతోమంది సంగీత కళాకారుల్నీ, సాహితీవేత్తల్నీ గౌరవించి పోషించింది!

ఆ సంస్థానానికి చెందిన సంగీత విద్వాంసుడే కొచ్చెర్ల కోట రామరాజుగారు. తూర్పుగోదావరి జిల్లాలోని 'ఉప్పాడ' గ్రామంలో 1878లో జన్మించారు. బాల్యం నుంచీ సంగీత – సాహిత్య విద్యాధురీణులైన 'నాదయోగి' బ్రహ్మశ్రీ చేబోలు వెంకటరత్నం గారి దగ్గర సంగీత సాధన చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లు పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్ శిష్యులైన సి.యస్. కృష్ణస్వామి దగ్గర కొంతకాలం జంత్రగాత్రాలని అభ్యసించారు.

సాధన అంటే రాక్షస సాధన రాజు గారిది.

అదే దీక్ష. అదే పట్టుదల. అదే ధ్యాస.

అసలు అదే రహస్యం. ఏ విద్యన్నా పట్టుపడాలీ అంటే అర్జునుడికి కనిపించిన పక్షి కన్నులాగ... మరో దానిమీద దృష్టి ఉండకూడదు. అదే గద తపస్సంటే.

వాయులీనాన్ని ఆవాహన చేసుకున్నాడు రామరాజు.

రాముడి కోదండంలాగ... రామరాజుకి వాయులీనం...

కమాను సంధించాడంటే నాదవర్షం...

ఆఖరికి వాయులీన రహస్యాల్ని ఎంత ఆకళింపు చేసుకున్నాడంటే..

కమాను లేకుండా... కేవలం చేతివేళ్లతో తీగల్ని మీటే కావల్సిన ధ్వనుల్నీ.. రాగాల్నీ వాయించే స్థితికొచ్చాడు...

అంటే వాయులీనం ఆయన ఉచ్ఛ్వాస... నిశ్వాసం...

వాయులీనం... ఆయన గుండెకాయ...

వాయులీనం... ఈయనలో విలీనం...

సరళీస్వరాలు, జంట స్వరాలు సంగీతాభ్యాసకులకు ఉపయోగపడే విధంగా 'గాయక మనోరంజని' అనే సంగీత గ్రంథాన్ని రాశారు... స్వరపల్లవులు గూడ రాశారు... 'శ్రీకృష్ణ కర్ణామృతం' నూటయెనిమిది కీర్తనలు కూడా రాశారు.

ఈయన కీర్తిప్రతిష్ఠలు విని పోలవరం సంస్థానాధీశులు కొచ్చెర్లకోట కృష్ణారావుగారు, రామరాజుగారిని ఆస్థానానికి ఆహ్వానించి కచేరీ పెట్టించారు. పోలవరం సంస్థానంలో జరిగిన అద్భుతమైన కచేరీలో 'ఇదొకటి'గా శాశ్వతమైన అనుభూతి మిగిల్చిందట!

అలాగే 'శ్రీరామకీర్తన కర్ణామృతం' అనే మరో సంగీత గ్రంథం రాశారు.. అది పాడుకోడానికి సులువుగాను మధురం గానూ కూడా ఉందని... మిత్రులు కొంతమంది కోరగా అది ప్రింటు కావడం జరిగింది! అందులో శంకరాభరణం, ఖర హరప్రియ, కేదార, బిళహరి హరికాంభోజి, పుష్పతిలక, జంఝూటి, కానడ, నాదనామక్రియ, దర్బార్, చక్రవాకం వంటి ప్రసిద్ధ రాగాల్లో ఎన్నో కీర్తనలు రాశారు!

ఉదాహరణకి, ఖరహరప్రియ రాగంలో రాముడి చరితం

పల్లవి :

శ్రీ రఘురాముని చరితము వినుడీ...
రాతిని ప్రేమతో నాతిగ జేసీ, ఖ్యాతిగ విల్లుద్రుంచీ...,
సీతను గైకొని భూతలేశుడని పొరులు పొగిడిన,
వానర వీరుని వాలిని ద్రుంచీ,
దినకరపుత్రుని ఘనముగ బ్రోచీ,
అనిల సుతునికెంతో ఆదరమొసిగిన...
దారి కొరకు బలు వారధి కట్టి,
క్రూరుని లంకేశుని కూలగసేసి,
నీరజనేత్రని నేర్పుతో తెచ్చిన...

కృతికీ కీర్తనకూ గల లక్షణాలలో కృతికంటే, కీర్తనలో

సాహిత్యానికి ప్రాధాన్యత ఎక్కువ ఉంటుంది. కీర్తన పురాతనమైన రచన.. రామరాజుగారు అదే పాటంటారు.

అలాగే దైవాన్ని నిలదీసి దెప్పిపొడిచి తన కోరిక తీర్చమనే నిందాస్తుతి

ఏరా నాపై దయరాదు నేనెంత వేడుదునో రామా
చిన్ననాటి నుండి సేవ చేసెదనని చెప్పుకొంటి
కావుమని కరి రాజు ప్రార్థించగా గ్రక్కున ఏలుట అబద్ధమా!
మిత్రునితో బ్రోవ వచ్చేవు

వంటివి, ఎంతో ఆర్ద్రంగా హృద్యంగా వుంటాయ్.

1930లో రాజోలులో వకీలు సంఘం వారు రామరాజుగారి షష్ఠిపూర్తికి ఘనంగా సన్మానం చేశారు. సన్నాయిమేళం ఏర్పాటు చేసీ.. ఏనుగు అంబారీపై ఊరేగించారు.

ఆ సాయంత్రం ఏర్పాటు చేసిన పౌరసభలో ఊరు ఊరంతా చప్పట్లతో దద్దరిల్లి పోయేలా 'మహామహో పాధ్యాయ' అన్న బిరుదు కూడా ప్రదానం చేశారు.

ఎన్నో సత్కారాలూ సన్మానాలు పొందిన కొచ్చెర్లకోట వారు నిగర్వి. నిరాడంబరులు. చివరి దశలో తాను గోదావరి ప్రాంతంలోని 'తాటిపాక'లో స్థిరపడి, అక్కడ తన ఇంటనే పూజామందిరాన్ని ఏర్పాటుచేసి త్యాగరాజ స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసే ఆరాధనోత్సవాలు ఆరంభం చేశారు!

ఆ ప్రాంతంలోని అనేకమంది యువతీ యువకుల్ని చేరదీసి... ఉచిత భోజన వసతులు ఏర్పాటు చేసి, ఉచితంగా సంగీతాన్ని నేర్పించేవారు.

సంగీతం కోసం తమ సర్వస్వాన్నీ త్యాగం చేసిన మహానుభావులు ఎందరో వారిని స్మరించుకోవడం మన అదృష్టం. మి

తనికెళ్ళ భరణి
హైదరాబాదు

ఏరియల్ చదివి ...

- *పి.బి. షెల్లీ స్వప్న విషాదం 'ఏరియల్' పుస్తకం చదివి అతిసామాన్య పాఠకురాలినైన నేను ఏదో ఒక అనిర్వచనీయ అనుభూతికి లోనైనాను. 'ఏరియల్' పుస్తకమంతా ఒక ఎత్తైతే, ఎ.కె. గారి 'ఎటువంటి కవి' కవిత ఒక ఎత్తని పించింది. ఏమైనా ఈ పుస్తకాన్ని మిసిమి లో శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారు పరిచయం చేయగా మిసిమి ద్వారా తెప్పించుకొని చదివాను. ఇంత మంచి పుస్తకం చదవడానికి కారణభూతులైన శ్రీ బేతవోలు రామబ్రహ్మం గారికి, రచయితకి నా హృదయ పూర్వక కృతజ్ఞతాభినందనలు.*

  – యస్. కృష్ణవేణి, విజయనగరం

- *"... ఏరియల్ ఏకబిగిన చదివాను. మీరు షెల్లీని ఆవాహన చేసుకొని అద్భుతంగా తెలుగులో చెప్పారు. హృదయం ఆర్ద్రమైపోయింది, కన్నీరు తెప్పించింది.*

  – నారాయణ బాబు (నాటక రచయిత)



తెలుగులో తొలిసారి పెర్సీ బిష్ షెల్లీ జీవిత కథ!
మీ ప్రతి కోసం 'మిసిమి'ని సంప్రదించండి!

యడ్ల గోపాలరావు

విజయయాత్ర

– వేమలి త్రినాథరావు

నాటకం ఒక జీవకళ. భావ విప్లవానికి అద్భుతమైన సాధనం నాటకం. తెలుగువాడికి పాటమీద, పద్యంమీద మోజు తీరలేదు. నటుడు గుక్కపెట్టి రాగం సాగతీస్తుంటే (సాకి) ఉబ్బితబ్బిబ్బయ్యే వారింకా లేకపోలేదు (ఉన్నారు). తెలుగు నేలపై నవరసాలనొలికిస్తూ దాని ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంటుంది నాటకప్రక్రియ. సంఘ సంస్కరణకు ప్రధానమైన మాధ్యమం నాటకమనే అంశాన్ని అందరూ గుర్తెరగాలి. కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు, రాజనీతివేత్తలూ తమ అవిశ్రాంత కృషితో సంఘాన్ని సంస్కరించారు. కర్కశమైన మూఢవిశ్వాసాలూ, దురాచారాలూ, సమాజవృక్షపు తల్లివేరును కత్తిరించి, నిర్వీర్యం చేస్తున్న సందర్భంలో సంఘసంస్కరణ ఉద్యమాన్ని తమ జీవితంలో ఒక భాగంగా చేసుకొని పోరాటం చేసిన విప్లవ మూర్తులు ఎందరో ఉన్నారు. సంఘసంస్కరణను ఉపన్యాసాల ద్వారా, కవిత్వం, కళల ద్వారా చేయడం సులభమని వారు నమ్మారు. సాహిత్య ప్రక్రియల్లో నాటకమే తిరుగులేని ఆయుధమని అనుభవపూర్వకంగా రచయితలు తెలుసుకున్నారు. నాటకాన్ని చదవడం ద్వారా పొందే ఆనందానికన్నా, నాటక ప్రదర్శనాన్ని వీక్షించడం ద్వారా కలిగే రసానందం మిన్న. ఇది ఎవరికి వారు అనుభవపూర్వకంగా గ్రహించవలసిన విషయం. ఒక నాటకం జనరంజకంగా ప్రదర్శించడంలో రచయితకు, నటీనటులకు సమప్రాధాన్యం ఉంటుంది. కళామతల్లి కరుణకు జాతి, మత, కుల, ప్రాంతీయ, భాష భేదాలుండవు. అంతా ఆమె ముందు సమానమే. ఏ కళాకారుడు కఠిన క్రమశిక్షణతో, దీక్షతో కళాపోషణకు అంకితమైతే, ఆ తల్లి (కళామతల్లి) మరింతగా ఆశీర్వదిస్తుంది. తద్వారా నటుడు ధరించే పాత్రలలో అలవోకగా రాణించొచ్చు.

వాయువేగంతో కదిలే కాలంతోపాటు మనిషిలోని మానసిక సమస్యలూ పుట్టుకొస్తున్నాయి. మనోవేదనకు మందు వినోదమే. వినోదాల సమ్మేళన రూపమే నాటకం. ఇందులో సాంఘిక నాటకం ఒకటైతే, మరొకటి పౌరాణికం. ఆధునిక యుగంలో వ్యక్తి గుణగణాలు, వేషభాషలు, స్థితిగతులను రంగస్థలంపై ఆవిష్కరించేది సాంఘిక నాటకమైతే, తెలుగువారి ఆరాధ్య దైవాల జీవనాన్ని కళ్లకు కట్టినట్టు వెల్లడించేదే పౌరాణిక నాటకం. సర్వజన హితాన్ని కోరేది సాహిత్యం కాగా, అందులోనూ "కావ్యేషు నాటకం రమ్యం" అనే వాక్షిణికుల ఆర్యోక్తిని అనుసరించి పండిత పామరులను అలరించే ప్రక్రియలో ముఖ్యమైంది నాటకం. ప్రాంతాన్నిబట్టి ఆచారాలనుబట్టి కళలు ఉద్భవించినా భారతీయ కళలు మాత్రం మనోధర్మాన్ని కలిగివుంటూ కళాకారులచే ప్రదర్శించబడుతూ ఖండాంతరాలలో అందరిచే ఔరా! అని అనిపించుకునే విశిష్టతను కలిగి వున్నాయి మన పద్యనాటకాలు. అటువంటి ఘనత వహించిన పద్యనాటక ప్రక్రియకు పరపతిని, నూతన ఒరవడిని చేకూర్చిపెట్టిన గొప్ప నటులు యడ్ల గోపాలరావుగారు. ఆంధ్రదేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రం యావత్తు పద్యనాటక రంగంలో చరిత్ర సృష్టించిన విలక్షణ నటకిశోరం ఆయన.

తన 14 వ యేటనే *దేశంకోసం* అనే సాంఘిక నాటికలో ప్రధానపాత్ర ద్వారా తెరంగేట్రం (రంగప్రవేశం) చేసి దాదాపు అయిదు దశాబ్దాలు తను ధరించిన పాత్రల ద్వారా ప్రేక్షకులకు వినోదం పంచిపెట్టారు గోపాలరావు గారు. శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలంలో మందరాడ అనే మారుమూల పల్లెటూరులో లక్ష్మమ్మ రామమూర్తి పుణ్యదంపతులకు 4-5-1950న జన్మించారు. ఆంధ్రరాష్ట్రంలో గోపాలరావు అగ్రశ్రేణి నటులలో ఒకరుగా గుర్తింపునందుకొన్న కళాపిపాసి. తెలుగు పద్య నాటక రంగంలో పదికాలాలపాటు శ్రోతల హృదయాల్లో

నిలిచిపోయిన ఆణిముత్యాల్లాంటి పాత్రలు, ఆలపించిన పద్యాలు రసప్రవాహంలా పాడించి (సాగించి) ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. పరుగులిడే వంశధారా నది సవ్వడిని తలపిస్తూ... నవ వసంత మాలికలా ప్రేక్షకుల్లో స్పందన రేపుతూ, గోపాలరావు నాటకరంగంలో పద్యనాటకాన్ని సుసంపన్నం చేస్తున్న తీరు చూసి తీరాల్సిందే. వారి ఆంగిక, వాచిక, సాత్వికాభినయాలతో ఆహుతుల్ని మైమరపింపచేస్తారు. అజరామరమైన పద్యాన్ని... గోపాలరావు తన అద్భుత గాత్రంతో ప్రేక్షకుల నాడి కనుగుణంగా అందివ్వగలగడం ప్రేక్షకులకు గొప్ప అనుభూతినిస్తుంది. పద్యంపై వారికున్న శ్రద్ధను, భక్తిని, ప్రేమను ప్రదర్శించి అందరి మన్ననలతోపాటు, విమర్శకుల నుండి కూడా ఆశీస్సులందుకొంటున్నారు. సహజ నటనను మూర్తీభవింప చేసుకొని, ధరించిన పాత్రల్లో లీనమై, ఆయాపాత్రలకు జీవంపోసి, ఏ కళాసంస్థకు నాటకాన్ని ప్రదర్శించడానికి వెళ్ళినా, అనేక అవార్డులు, సత్కారాలు, సన్మానాలు అందుకొని, ఈ రోజున యద్దల గోపాలరావు అంటే ఆంధ్రదేశంలో, పౌరాణిక నాటకరంగంలో ఓ మహోజ్వల తారగా ప్రకాశిస్తున్నారు.

గోపాలరావు గారు పద్యం చదివే విధానం నేర్పు అనితర సాధ్యమైనది. అర్థయుక్తంగా, భావద్యోతకంగా, పద్యంలో రోగాన్ని మిళితం చేసి అత్యంత ఆకర్షణీయంగా, అభినయ పూర్వకంగా నటించి రసహృదయులను ఓలలాడిస్తున్నారు. ఆయన పోషించిన పాత్రలను గోపాలరావు నటనాప్రావీణ్యంతో, గళమాధుర్యంతో మలిచి సజీవ కళారూపంగా సంతరింపజేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యేకాక, దేవుడిచ్చిన వరాలు. గొంతులో రాగాన్ని రాణింపజేస్తూ, ముఖంలో అపూర్వమై భావాలు పండిస్తూ ప్రత్యేక బాణిలో పద్యపఠనమొనరిస్తూ ప్రేక్షకులను రంజింపజేస్తూ పౌరాణిక పాత్ర పోషణలో ఒక విప్లవం సాధించి రాటుదేలిన గోపాలరావుగారి గళం నుంచే పద్యాలు వినాలి అన్న కళాభిరుచిని, ఔత్సాహికుల్లోనూ, ప్రజల్లోనూ కలిగించిన సుప్రసిద్ధ నటుడాయన.

తెలుగు నాటకం పుట్టి దాదాపు 130 ఏళ్ళు పూర్తి కావస్తున్నా, పద్యనాటకంపై గల అభిమానం ఇంకా కొనసాగుతూనే ఉందంటే, కళాసంస్కృతి ఉద్ధరణకు మన తెలుగు ప్రేక్షక దేవుళ్ల సహకరిస్తున్న తీరు అనిర్వచనీయం. ఆధునిక సమాజం ఈ దశలో ఉండి ఇంత ఉన్నతిని పొందడానికి ఎందరో మేధావులు, మహానుభావుల కృషే కారణం. వారి సంఘుసంస్కరణాత్మిక దృక్పథం వల్లనే సంఘంలో ఇన్ని మార్పులు వచ్చాయి. సంఘంలో ఉన్న దురాచారాలను రూపుమాపి సంఘాన్ని సంస్కరించడం కోసం ఎందరో కృషి చేశారు. పాశ్చాత్య ప్రభావంతో కొట్టు మిట్టాడుతున్న నేటి సమాజంలో కళలు కృశించి పోవచ్చు గానీ, నశించిపోవని, అందులోనూ రంగస్థలానికి అదీ పద్య నాటకానికి ఒకప్పటి (ప్రభ) వైభవం తిరిగి వస్తూందని యద్దవారు ఋజువు చేస్తున్నారు. పౌరాణిక పాత్రల పోషణలో విశేష ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించి, తన నటనా ప్రావీణ్యంతో, గళ మాధుర్యంతో తను ధరించిన పాత్రలకు సజీవత సంతరింపజేసే ఘనాపాటి యద్ద గోపాలరావు. రంగస్థల నటనకు ప్రత్యేకంగా పౌరాణిక నాటకాలలో నటించే నటులకు మంచి రూపం (శిల్పం) వాచకం, సాత్వికాభినయం, మధురమైన కంఠం, సంగీతం నందు ప్రవేశం ఉండాలి. ఇటువంటి అన్ని అర్హతలు ఉన్న నటులు చాలా అరుదు. కాని గోపాలరావు గారిలో ఈ అర్హతలన్నీ పుష్కలంగా ఉన్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. గోపాలరావు గారి పద్యపఠనం విలక్షణ రీతిలో సాగుతుంది. అందరిలాగా అనుకరణ విధానాన్ని అనుసరించకుండా తమదైన ప్రత్యేక శైలిని అలవర్చు కొన్నారు. పద్యభావాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం, ఏ పద్యానికి ఏ రాగం అనువైనదో పరిశీలించి నిర్ణయించడం, ప్రచారంలో ఉన్న కొన్ని రాగాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆయా సందర్భానుకూలంగా రాగాలను ఉపయోగించడం వీరి ప్రత్యేకత. గంభీరమైన గాత్రంతో పద్యాన్ని విరిచి పాడడం గోపాలరావు గారికి వెన్నతో పెట్టిన విద్య. ఔత్సాహికులు వీరి పద్యాలు వింటున్నప్పుడు రస రమ్య లోకంలో విహరిస్తూ మధురానుభూతి కలుగుతుందని విశాఖపట్నానికి చెందిన కళాకారుడు అంబటి విజయరాఘవ అన్నారు. ఒక్కొక్క పౌరాణిక నాటకాన్నీ ఒక్క ఆంధ్రదేశంలోనే కాక, కలకత్తా, చెన్నై, బెంగుళూరు, కర్ణాటకలోని బళ్ళారి, సింధనూరు, ఒరిస్సాలోని ఖరగ్‌పూర్, భిలాయ్, బరంపురం, రాయిఘడ్ నగరాల్లోనూ అసంఖ్యాక ప్రదర్శనలిచ్చి, ఘనసన్మానాలు, బిరుదు ప్రధానాలు, అవార్డులు, రివార్డులు, ప్రశంసా పత్రాలందుకున్న కళాతపస్వి గోపాలరావు. అద్వితీయమైన

తమ నటనా కౌశలంలో తెలుగు పౌరాణిక నాటకాలను ప్రదర్శించి పేరెన్నికగన్న ప్రముఖ నటులలో యడ్ల ఒకరు.

పురివిప్పిన నెమలి నృత్యాన్ని తిలకించేందుకు రెండు కళ్ళు చాలవని విజ్ఞుల అభిప్రాయం. ఒకేసారి వందలాది నెమళ్ళ నాట్యాన్ని తిలకించడం సహస్రాక్షుడికి కూడా అనితర సాధ్యం అన్నది అక్షరసత్యం. ఇటువంటి అనితర సాధ్యమైన పద్యాన్ని కొన్ని వేలమంది ప్రేక్షకాభిమానులను మంత్రముగ్ధులను చేసారు గోపాలరావు. ఎంతో పేరుప్రఖ్యాతులున్న నటీనటులతో గోపాలరావు నటించి వారి నటనను మరింత సానపట్టించారు. కీర్తిశేషులు షణ్ముఖ ఆంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి, డి.వి. సుబ్బారావు, ఎ.వి. సుబ్బారావు, అమరాపు సత్యనారాయణ, రేబాల రమణ, డి. జయరాజ్, ఎమ్. విజయరాజ్, ఉయ్యూరు గోపాలస్వామి, కె. నాగేశ్వరరావు, బిళ్ళకుర్తి సూరిబాబు, జనా వీరభద్రాచారి, శొఠ్యాన అక్కన్నాచారా, శివశ్రీ, ఎమ్.వై. నాయుడు, జాడ సత్యన్నారాయణ, పృథ్వీ వెంకటేశ్వరరావు, కె.వి. రెడ్డి, గూడూరు సావిత్రి, షహీదా, సర్వశ్రీ పి. లక్ష్మణరావు, ఆచంట వెంకటరత్నం నాయుడు, తుర్లపాటి కృష్ణమూర్తి, మద్దల రామారావు, కె. వెంకటరావు గుప్త, గుమ్మడి గోపాలకృష్ణ, ఎ. వెంకటేశ్వరరావు, ఎ. నాగరాజు, జూనియర్ డి.వి. సుబ్బారావు, శ్రీమతి జమునారాములు, జయనిర్మల తదితరులతో నువ్వా నేనా అన్న చందంగా నటించి రంగస్థలంపై ఒక వెలుగు వెలిగిన గోపాలరావు గారికి జరిగిన సన్మానాలూ, సత్కారాలూ, లభించిన పురస్కారాలూ మరే కళాకారునికి జరగలేదంటే అతిశయోక్తి కాదు. కురుక్షేత్రం, గయోపాఖ్యనంలో శ్రీకృష్ణునిగా, శ్రీకృష్ణ తులాభారంలో నారద, శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరామ, సత్యహరిశ్చంద్రలో నక్షత్రక వంటి పౌరాణిక పాత్రలు – "దేశంకోసం', పావల, ఆగండి కొంచెం ఆలోచించండి తోను, సమర్పణ, ప్రెసిడెంటు పెంటయ్య, ఎవరికి పుట్టినబిడ్డ, పూలరంగడు, చిల్లరకొట్టు చిట్టెమ్మ వంటి సాంఘిక నాటకాల్లో స్త్రీ పాత్రల్లో నటించిన యడ్ల వారి నటన, నాటకం ఉన్నంతకాలం ఔత్సాహికులకు ఒక నిఘంటువుగా, కరదీపికగా, మార్గదర్శకం అవుతుంది. మనోతంత్రులను మీటే శక్తివంతమైన కళాప్రక్రియల్లో నాటకానికున్న ప్రాముఖ్యత, ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. తెలుగు నాట ఇప్పటికీ ఎప్పటికీ నటనే ఊపిరిగా నాటకరంగ పురోభివృద్ధే పరమావధిగా పేద, వృద్ధ కళాకారుల సంక్షేమాన్ని కోరుకుంటారు యడ్ల. పాత్రోచిత నటనకు మారుపేరుగా నిలిచి, అయిదువేలకు పైగా గద్య పద్య నాటక ప్రదర్శనలిచ్చి జనం మెచ్చిన ఉత్తమోత్తమ నటుడుగా, అసంఖ్యాక బహుమతులు అందుకొని రాష్ట్రంలోనే అత్యుత్తమ కళాకారునిగా గుర్తింపు పొందారు యడ్ల. అందుకే నాటకరంగంలో గోపాలరావు పేరు నిత్యం ప్రతిధ్వనిస్తూనే ఉంది. సత్కారాలు, సన్మానాల కోసం పాత్రలో లీనమై ఆ పాత్రకు న్యాయం చేకూర్చడమే, కళాకారుడి లక్ష్యం కావాలని గోపాలరావు వర్ధమాన నటులకు సూచిస్తున్నారు. ఆధునికతతో రంగస్థల వినోదాలకు ఆదరణ తగ్గిపోయిందని గోపాలరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కల్పించుకొని కళలను ప్రోత్సహించాలని, వృద్ధ కళాకారులకు పెన్షన్లు, మరిన్ని సౌకర్యాలు, గుర్తింపు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. పద్య నాటక వైభవాన్ని భావితరాలకు తెలియజెపుతూ అభిమానుల్లో కళానురక్తిని పెంపొం దించేందుకు తనవంతు కృషి చేస్తున్నారు.

గోపాలరావు తను అభ్యసించిన కళ పదికాలాలపాటు ఉండేందుకు, పదుగురికి పంచేందుకు ఆంధ్రా తాన్‌సేన్ కీ॥శే॥ డి.వి. సుబ్బారావు, మహానటి శ్రీమతి గూడూరు సావిత్రి గార్లతో ఎ.వి.ఎమ్. కంపెనీవారి ఎల్.పి. రికార్డుల్లో నక్షత్రక పాత్రకు గాత్రధారణ, తెనాలి సంకీర్తనా కంపెనీవారి సత్యహరిశ్చంద్ర ఆడియో కాసెట్‌లో నక్షత్రక పాత్రకు గాత్రధారణ, విశాఖ మాతా ఎంటర్‌ప్రైజెస్‌తో మినగల్లు సుధాకర్, శ్రీమతి రూపవాణి, కె. గున్నేశ్వరరావు గార్లచే వారణాసి దృశ్యం ఆడియో రూపొందించి తన కళాతృష్ణను ఋజువు చేశారు. పద్య నాటక రంగంలో ఆణిముత్యంలా గుర్తింపు పొందిన "సత్యహరిశ్చంద్ర" నాటకాన్ని పూర్తిగా రంగస్థల కళాకారులతో గొప్ప సినిమాగా మలిచారు యడ్ల గోపాలరావు. ప్రధానపాత్ర సత్యహరిశ్చంద్రగా "మంగాదేవి" అనే మహిళతో నటింపజేసిన గొప్ప ధీశాలి మన యడ్ల. కలియుగ నక్షత్రకుడుగా గుర్తింపు పొందిన ఆయన సినిమాలో నక్షత్రకుడిగా నటించడమే కాకుండా సత్యహరిశ్చంద్ర చిత్రానికి దర్శకత్వం కూడా చేసారు. చంద్రమతిగా కివారి లక్ష్మి నటించగా, ఇంతటి కళాఖండానికి నిర్మాణ సారథ్యం వహించినవారు కొత్తపల్లి సీతారాం. ఈయనకు పద్యం అన్నా, తెలుగు భాష అన్నా

అమితానందం. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఇటీవల జూలై 13 న జరిగిన సత్యహరిశ్చంద్ర ప్రివ్యూకి సినీదర్శకుడు కోడిరామకృష్ణ, దర్శక నిర్మాత, నటుడు, ఆర్. నారాయణమూర్తి, సాహితీవేత్తలు భారవి, డా. లక్ష్మీపార్వతి, డి. విజయ్‌భాస్కర్ వంటి పెద్దల మన్ననలు అందుకున్నారు. విశేషమేమంటే ఇందులో నటించిన పాత్రదారులంతా రంగస్థల కళాకారులే కావడం విశేషం. అది ఆయన నిబద్ధతకు నిదర్శనం. పద్యం అంతరించిపోకూడదనే, తరతరాలకు పద్యం నిలవాలనే లక్ష్యంతో కష్టమైనా, నష్టమైనా హరిశ్చంద్ర నాటకాన్ని సినిమాగా తీసారని, దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నటరాజు ఆశీస్సులు ఉండాలనీ వారి ఇష్టదైవాన్ని కోరుతున్నారు. అంతేకాక ఆధునిక కళాప్రక్రియను జోడించి సత్యహరిశ్చంద్ర నాటకాన్ని సంపూర్ణ పద్య చలనచిత్రంగా నిర్మించినందుకే నటరాజుకు నమ్మినబంటు గోపాలరావు. నాటకరంగ సామ్రాజ్యమ్మున ఇంతటి వెలుగొందుచున్న, ప్రేక్షకుల హృదయ తంత్రులు (విపంచిని) మీటగల నటనా నైపుణ్యం కలిగి ఉండటం మా అదృష్టం. కావుననే నయనానందకరమైన నటనతో, శృతిబద్ధమైన మీ గాత్రంతో ప్రేక్షకులనే కాకుండా విమర్శకులను కూడా గొప్ప అనుభూతికి లోబరుచుకోవడం ఆయన నైపుణ్యానికి నిదర్శనం.

డాక్టర్. వేమలి త్రినాథరావు
హైదరాబాదు

చక్రపాణి

నాకు బి.ఎన్. రెడ్డి గారితో వ్యక్తిగతమైన పరిచయం ఏర్పడకముందు, మద్రాసులో ఉన్నానని తెలిసి, మిత్రులు కె.వి.రెడ్డి గారి ద్వారా కబురు చేసి, స్వర్గసీమ చిత్రం ఇతివృత్తం చెప్పి, నన్ను వ్రాయమన్నారు. నాకు చిత్రకథ ఎలా వ్రాయాలో తెలియదన్నాను. 'అదంతా మేము చూసుకుంటాం - నువ్వు వ్రాయి' అన్నారు. ఇది 1943 జూలైలో జరిగింది. 1944 జనవరిలో కథ పూర్తిచేసి, నేను వెళ్ళిపోతానన్నాను. 'తెనాలి వెళ్ళి ఏం చేస్తావు? పుస్తకాలు వెయ్యడమే గదా. ఇక్కడే లాడ్జిలో ఉండొచ్చు. బి.యస్.కె. ప్రెస్‌లో పుస్తకాలు వేసుకోవచ్చు' అన్నారు. నేను మద్రాసులో ఉండిపోయాను. 1944లో నాగిరెడ్డి గారితో పరిచయం బలపడింది. ఆయన అపుడు బి.యస్.కె. ప్రెస్ చూస్తుండేవారు. నాగిరెడ్డికి పత్రిక నడపాలన్న ఉత్సాహం ఎంతో ఉండేది. ఆ రోజుల్లో బి.యస్. గుప్తాగారు నడుపుతున్న *ఆంధ్రజ్యోతి* వారపత్రిక ఆగిపోయింది. అది నాగిరెడ్డి సోదరులు తీసుకున్నారు. 1945 జూలైలో నా సంపాదకత్వం క్రింద *ఆంధ్రజ్యోతి* మాసపత్రికగా ప్రారంభమైంది. 1947 జూలైలో *చందమామ* మొదలు పెట్టాం. 1949 జూలైలో నిర్మాతగా సినీరంగంలో నేను ప్రవేశించడం జరిగింది. నేను పత్రికారంగంలో అడుగుపెట్టినపుడు, నాకు పత్రికానుభవం ఏమాత్రం లేదు. ఐనా, *ఆంధ్రజ్యోతి* ప్రముఖ రచయితల సహకారంతో ప్రథమశ్రేణి మాసపత్రికగా రూపొందింది. అలాగే, సినీ రంగంలో కూడా, ప్రొడ్యూసర్‌గా నాకు ఏ విధమైన అనుభవం లేదు. ఐతే బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి, ఎల్.వి.ప్రసాద్‌గార్ల వంటి ప్రముఖ దర్శక నిర్మాతల సలహాల ద్వారా, వారితో చర్చల ద్వారా కొన్ని విషయాలను తెలుసుకోగలిగాను.

- చక్రపాణి : (చక్రపాణీయం నుంచి)

చక్రపాణిగా ప్రసిద్ధి పొందిన ఆలూరి వెంకట సుబ్బారావు (1908-75) ఆంధ్రుల్ని అప్ టు డేట్ చేసిన వారిలో ముఖ్యులు. *యువ, చందమామ* పత్రికల ద్వారాను, *షావుకారు, మాయాబజార్, మిస్సమ్మ* మొదలైన చలన చిత్రాల ద్వారానూ ఆయన పత్రికా, సినిమా రంగాలలో పెట్టిన వరవడి, నిలబెట్టిన విలువలు, సాధించిన విజయాలు భవిష్యత్ తరాలకు కూడా స్ఫూర్తిదాయకమే. బెంగాలీ రచయిత శరత్‌బాబును తెలుగువాడిగా భ్రమింపచేసిన ఘనత చక్రపాణిదే.

(కొమ్మలు రెమ్మలు నుంచి...)

నిఘంటు నిర్మాణంలో

వెలగా వెంకటప్పయ్య కృషి

– కొడాలి సుదర్శనబాబు

డిసెంబరు 2014 మిసిమి – మాసపత్రికలో గుడిపూడి సుబ్బారావు గారు కృషి రూపెత్తిన రుషి డాక్టరు వెలగా వెంకటప్పయ్యగారి మూర్తిచిత్రణ చాలా సమగ్రంగా కూర్చినందుకు అభినందనలు. కానీ వారు గత పదేళ్ళుగా వెలగావారు నిఘంటు నిర్మాణంలో చేసిన కృషి వివరణ మాత్రం లేదు. వాస్తవానికి వెలగావారి నిఘంటువుల నిర్మాణం వాటి వికాసంపై 1970 దశకంలోనే కొంత అధ్యయనం చేశారు. తెలుగు నిఘంటు వికాసం అనేవారి పరిశోధనాత్మక రచనను 1975 హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో ప్రచురించారు. తదుపరి ఇదే గ్రంథాన్ని 2013లో తిరుపతిలో జరిగిన నాలుగవ తెలుగు ప్రపంచ మహాసభ పునర్ముద్రించింది. దీన్నిబట్టి నిఘంటువులపై వెలగావారి కృషిని, ఈ గ్రంథ ప్రాధాన్యాన్ని మనం గమనించవచ్చు.

డాక్టరు వెలగావారు గత పదేళ్ళుగా నిఘంటు నిర్మాణంలో తదేకదీక్షతో కృషిచేశారు. తొలుత శంకరనారాయణ 1900లో కూర్చిన ఇంగ్లీషు – తెలుగు – తెలుగు – ఇంగ్లీషు నిఘంటువులను సమూలంగా పరిష్కరించారు.

ఇందు ముఖ్యంగా –

1. తెలుగు భాషను పూర్తిగా నవీకరించారు. తెలుగు పదాలను సజీవమైన వ్యవహార రూపంలోకి మార్చారు.

2. శతాబ్ద కాలంలో భాషలో వచ్చిన మార్పులకు అర్థాలు ఈ దిగువ రీతిలో సవరించడమైనది.

మూలపదం	తొలి అర్థం	సవరణ
Bumpkin	పల్లెటూరివాడు	పల్లాయిదు
Bungle	మడ్డిగా కృషిచేయువాడు	పనిమనిషి
Computer	లెక్కించేవాడు, గణించేవాడు	కంప్యూటరు
Drover	పశువులు, మేకలు మొదలగు వాటిని తోలేవాడు	పశువుల, మేకల కాపరి
Photograph	యంత్రమువలన తీయబడిన రూపము, చిత్తరువు లేదా పటము	ఫోటో
Playwriter	నాటకములు రాయు కవి	నాటకకర్త
Rural	నాటుపురము	పల్లెటూరు
Syllabus	ఒక గ్రంథము ముఖ్య విషయముల పట్టిక	పాఠ్యప్రణాళిక
Young Lady	వివాహము కాని యాదుది	అవివాహిత

3. నూతనంగా వాడుకలోకి వచ్చిన AIDS, Bar code, CD Rom, Nylon, Hector, Remote Control, Vision మొదలైన పదాలు సుమారు వెయ్యి నూతన పదాలను చేర్చడం జరిగింది.

4. ఇంకా 500 మల్టీకలరు చిత్రాలు రూపొందించి తెలుగు ప్రామాణికమైన ఉచ్చారణ అదనంగా చేర్చారు.

5. విద్యార్థి లోకజ్ఞానానికి అవసరమైన పలు విషయాల 400 పుటల సమగ్ర సమాచార సమాహారం, సి.డి. ఈ నిఘంటువు ప్రత్యేకత. ఇన్ని విశేషాలు మరే నిఘంటువులోనూ ఇప్పటివరకు తెలుగులో లేవు. ఇదే నమూనా సి.పి. బ్రౌను ఇంగ్లీషు – తెలుగు, తెలుగు – ఇంగ్లీషు నిఘంటువులు 2012లో పరిష్కరించారు.

అంతకుముందే వారు గ్రంథాలయ శాస్త్ర విద్యార్థుల కోసం గ్రంథాలయ విజ్ఞాన సర్వస్వం కోసం Encyclopedic Dictionary of Library Science అనీ, సమాచార విజ్ఞాన సర్వస్వం కోసం Encyclopedic Dictionary of Information Science అనీ హైదరాబాదులోని నీల్‌కమల్ సంస్థ ద్వారా 2000లో రెండు నిఘంటువులు ప్రచురించి విద్యార్థి లోకానికి మహోపకారం చేశారు.

ఇహ 2013లో వారు సిద్ధం చేసిన అతి ప్రతిష్ఠాకరమైన నిఘంటువు **తెలుగు జాతీయాలు.** ఇందు జనసామాన్యంలో వాడుకలోగల సుమారు పదివేల జాతీయాలు అర్థవివరణతో ఇందు చోటు చేసుకున్నాయి.

దీనికి అనుబంధంగా మరొక రెండు వేల జాతీయాలు సేకరించి, ప్రచురణకు సిద్ధం చేశారు. ఇది ప్రచురణ కావలసి ఉంది.

డాక్టరు వెలగావారి దైనిక వ్యాపకం ఏమంటే - దినపత్రికలలో, కొత్త పుస్తకాలలో నూతనంగా రూపొందించిన పదాలను గుర్తించి వాటిని భద్రపరచటం. తెలుగు జాతీయాల నిఘంటువు ఇలా ఏర్పడిందే. ఇటీవలి బాలలకోసం, సచిత్రంగా 5-9, 10-14 వయసుల వారికి తెలుగు నిఘంటువులను వేరువేరుగా రూపొందిస్తున్నారు. 2015లో ఈ గ్రంథాలు తప్పక వెలుగుచూసే అవకాశం ఉంది.

ఇవన్నీ ఒక ఎత్తు, ఒక సగటు మనిషి తన ఖర్చులు తగ్గించుకొని, తాను స్వార్జితంగా నిర్మించుకున్న ఇల్లు ఇప్పటికీ లేనప్పటికి - రెండు మాసాల పెన్షన్‌తో రెండు గ్రంథాలయాలకు, రెండు అనాథాశ్రమాలకు సాయపడడం వారిలో గల మానవతా కోణానికి ఒక మేలి ఉదాహరణ. అంతేగాక చదవాలనుకున్న గ్రంథాన్ని వెంటనే కొని చదవటం వారికో సరదా.

నవరత్నవారి మేలైన ఐదు నిఘంటు రత్నాలు :

1. *శంకరనారాయణ ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు*

సుమారు 45 వేల ఆంగ్ల పదాలకు తేట తెలుగులో అర్థాలు, తెలుగులో కొత్తగా వాడుకలోకి వచ్చిన సుమారు నాలుగు వేల పదాలకు వివరణ. యువత కోసం భాష నవీకరణ. ఇది కేవలం పునర్ముద్రణ కానేకాదు. పూర్తి పరివర్ధిత ప్రచురణ. 500 మల్టీకలరు చిత్రాలు, ఆంగ్ల పదాలకు తెలుగులో ఉచ్చారణ గల తొలి నిఘంటువు. ఈ నిఘంటువుతోపాటు సి.డి. ఉచితం (1344 పుటలు రూ. 450/-)

2. *శంకరనారాయణ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు*

సుమారు 45 వేల తెలుగు పదాలకు ఆంగ్ల సమానార్థకాల వివరణ, భౌతిక రసాయన, జీవశాస్త్రాల వృక్షశాస్త్ర పారిభాషిక పదాలు (బొటానికల్ నేమ్స్) ఇందలి ప్రత్యేకత. యువత కోసం భాష నవీకరణ. (960 పుటలు. రూ. 450/-)

3. *సి.పి. బ్రౌను ఇంగ్లీషు - తెలుగు నిఘంటువు*

సుమారు 35 వేల ఆంగ్ల పదాలకు తేట తెలుగులో అర్థాలు వివరణ. బాలబాలికలకు అవసరమైన పలు అనుబంధాల చేర్పు. నిఘంటువులకెక్కని, ఈనాడు వాడుకలోగల పదాలు ఎక్కువగా ఉండడం ఈ నిఘంటువు ప్రత్యేకత. యువత కోసం భాష నవీకరణ. ఆంగ్ల పదాలకు తెలుగులో ఉచ్చారణ చేర్పు. (980 పుటలు.రూ. 450/-)

4. *సి.పి. బ్రౌను తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు*

నవీకరించిన 35 వేల తెలుగు పదాలకు ఆంగ్లంలో అర్థాలు, వివరణ. వాడుకలో గల తెలుగు పదాలు. మాండలికాల చేర్పు ఈ నిఘంటువుల ప్రత్యేకత. యువత కోసం భాష నవీకరణ. (970 పుటలు. రూ. 450/-)

5. *బహుజనపల్లి సీతారామాచార్యులవారి శబ్దరత్నాకరము*

సుమారు 40 వేల పదాలకు అర్థ వివరణ. తెలుగులో తేనెసొనలు అనదగిన జాతీయాలు, సామెతలు, జంట పదాలు, పారిభాషిక పదాలు తదితర చేర్పు, యువతకు అనువుగా పరిష్కరణ. (1040 పుటలు. రూ. 450/-)

ఈ నిఘంటువుల సంపాదకులు : డాక్టరు వెలగా వెంకటప్పయ్య.

నవరత్న వారి ఐదు ఆణిముత్యాలు

1. *తెలుగు శతక మంజరి*

బాలలలో సృజనాత్మకశక్తి, ధారణశక్తి, భాషానైపుణ్యం, సదవగాహన పెంచే నూరు శతకాల నుంచి సుమారు 600 పద్యాల సమాహారం ఈ గ్రంథం. సామాజిక విలువల పెంపు, నీతి బోధ, వ్యంగ్య సౌరభాలతో సమ్యగ్రుచిరంగా, సుబోధకంగా ఈ గ్రంథంలో ఉంటాయి. (512 పుటలు. రూ. 300/-)

2. *పొడుపు కథలు*

తెలుగువారి కుటుంబ వ్యవస్థ, కట్టుబాట్లు, అలవాట్లు, ఆచారాలకు ఈ గ్రంథం ఒక నిలువుటద్దం. ఆలోచనలకు పదునుపెట్టి విజ్ఞానం, వివేకం పెంచే జ్ఞానసోపానాలు (512 పుటలు. రూ. 300/-)

3. *తెలుగు సామెతలు*

తెలుగు జాతి జనజీవనంలో మిళితమై, సందేశం, సద్భావన గుభాళించే సుమారు 30 వేల సామెతల కదంబం ఈ గ్రంథం. ముఖ్యంగా మన కుటుంబాలలో, ఆనవాయితీలు, అలవాట్లు, చమత్కారాలు తెలిపే పలు సామెతల సమాహారం. విదేశీ ఉద్యోగి కెప్టెన్ కార్ సేకరించిన సామెతలు ఈ గ్రంథానికి ప్రత్యేక అలంకారం. తెలుగువారి అమృతభాండం ఈ సామెతలు. (512 పుటలు. రూ. 300/-)

4. *బాలల గేయాలు*

గ్రామీణ ప్రాంతాలలో విశేషంగా ప్రచారంలో ఉండి పాడుకొనేందుకు వీలైన సుమారు వెయ్యి కమ్మని బాలగేయాలు. ఈ గేయాలు బాలలలో ఉత్సాహాన్ని, వావివరుసలను, సామాజిక స్పృహను పెంపొందిస్తాయి. ఆలోచనాశక్తిని పెంచే తొక్కు పలుకులు ఈ గ్రంథానికి ఒక ప్రత్యేకత. ఇందలి సుమారు 500 రేఖాచిత్రాలు బాలలను ఆకట్టుకుంటాయి. (512 పుటలు. వెల రూ. 300/-)

5. *తెలుగు జాతీయాలు*

తెలుగు జాతి జీవనస్రవంతికి దర్పణంగా నిలచే సుమారు 20 వేల జాతీయాల వివరణ, ఇటీవల వాడుకలో వచ్చిన వేలాది నూతన జాతీయాల చేర్పు ఈ గ్రంథానికి ఒక ప్రత్యేక అలంకారం. ఇవి భాషకు జవజీవాలు కల్పించడమేగాక పలుకుబడినీ, అవగాహన శక్తినీ పెంచుతాయి. యువత కోసం ప్రత్యేకంగా పరిష్కరణ, భాష నవీకరణ, (512 పుటలు రూ. 300/-)

సంపాదకులు : డాక్టరు వెలగా వెంకటప్పయ్య

కొడాలి సుదర్శనబాబు, తెనాలి

లక్ష పద్యాల పండితులు జనమంచి శేషాద్రి శర్మ

గంటకు వందల సంఖ్యలో పద్యాలు వ్రాయటం అనేది నమ్మశక్యం కాని విషయం. ఒకవేళ ఇది నిజమైతే కేవలం సరస్వతీ కటాక్షం అయి ఉంటుంది. జనమంచి శేషాద్రిశర్మ విషయంలో ఈ రెండు యదార్థమే.
ఆధునిక ఆంధ్ర కవులలో పురాణ వాఙ్మయము పట్ల మక్కువ చూపిన నలుగురైదుగురు పండితులలో జనమంచి ఒకరు. 1882లో జిల్లాలోని కలువాయి గ్రామంలో కామాక్షి, సుబ్రహ్మణ్యశర్మ దంపతులకు జన్మించారు. జిల్లాలో చదువు పూర్తి కాగానే కడప మండలంలో ఉద్యోగం నిర్వహించారు. వీరు ఉభయ భాషా పాండిత్యంలో దిట్ట. పౌరాణిక తత్త్వ పరిజ్ఞానం పరిపూర్ణ పాండిత్య సంపన్నులు. మంత్రజ్యోతిష్య శాస్త్రములలో అపారమైన పరిజ్ఞానం పొందారు. వీరు ఉపనిషత్తులు చదివి సూత్ర భాష్యములో మంచి పట్టును సాధించారు. అందువలనే వీరికి కవితా వ్యాసంగం సులభతరమైంది. వీరు లక్షకు మించి పద్యములు వెలువరించారు. ఈ విషయం తెలుగు నాట ఒక సంచలనం అయింది. వీరి లక్ష పద్యాలు అప్పట్లో పలువురు తెలుగునాట చర్చల్లో ఉదహరించేవారు. లక్ష పద్యాలు అప్పట్లో పలువురు తెలుగునాట చర్చల్లో ఉదహరించేవారు. లక్ష పద్యాలను సింహపురి మండల సర్వస్వములో కూడా బడి గురవారెడ్డి కూడా ఉదహరించారు. వీరికి విశేషమైన దైవభక్తి, అందుకే వీరి గ్రంథాలన్నీ భగవత్పదములని చెప్పవచ్చు. నెల్లూరు సమీపంలోని జొన్నవాడ క్షేత్రమునగల పెన్నాతీరంలో అనేక నెలల తరబడి నివసించటమే కాక, తపస్సు చేస్తుండేవారు. ఇది ఏదో పురాణ కాలం నాటి గాథ కాదు. అలాంటి ఉపాసనా ప్రభావం చేతనే సాహిత్యంలో మహా ఉత్సాహంతో పాల్గొనే వారని అప్పటి సాహితీ వేత్తలు, తెలిసిన మిత్రులు కూడా వ్యాఖ్యానించేవారు. వీరి తపశ్శక్తి లేదంటే వారి పాండిత్య ప్రభావం ఏదైతేనేం గంటకు వందల కొలది పద్యాలు వ్రాసేవారు. అంతకు మించిన ప్రాముఖ్యత తెలుగునాట వీరికుండేది. పురాణ వాఙ్మయం వెలువరించే సుప్రసిద్ధులలో వీరు ఒకరు కావటం వీరి పాండిత్యం వలె సహృదయులు. చెడు విమర్శలు, తూలనాడటం, దురహంకారం లాంటివి వీరి దరిదాపుల్లో ఉండేవి కావు. వీరి కవిత్వం ధారాధోరణి కలది. 22 కావ్యాలు అప్పట్లోనే ముద్రణ అయ్యాయి. ఎన్నో గ్రంథాలు, కావ్యాలు ముద్రణ సౌకర్యం లేక వీరి ఇంట పడిగాపులు పడుతుండేవి. బ్రహ్మపురాణం, బ్రహ్మాండ పురాణం, సర్వమంగళా పరిణయము, లలితోపాఖ్యానం, శ్రీమద్రామాయణము, విచిత్ర పాదుకాపట్టాభిషేకం, పాండవాజ్ఞాతవాసం, దైవజ్ఞ సార్వభౌమ విజయం, సువ్రత, కీరవాణి, సీతా స్వయంవరం, హృదయానందం, కవి విలాసం లాంటివి వీరి అనేక గ్రంథాలలో కొన్ని మాత్రమే.

- ఈతకోట సుబ్బారావు



సారంగపాణి పదములు

– కొచ్చెర్లకోట శ్రీలేఖ

సారంగపాణి క్రీ.శ. 1800 కాలానికి చెందిన వాగ్గేయకారుడు. ఇతను తెలుగు, సంస్కృతములో ఎంతో జ్ఞానము కలిగినవాడు. మహరాజ వేంకట పెరుమాళ్, కార్వేటి నగరం ఆస్థానంలో విద్యాధికారిగా పనిచేసేవాడు. ఇతనికి సంగీతం ఎంత బాగా వచ్చునో నాట్యశాస్త్రం కూడా అంతే బాగా వచ్చు. ప్రఖ్యాత సంగీతకారుడు గోవిందస్వామి సమకాలీకుడు సారంగపాణి.

సారంగపాణి దాదాపు 400 పదములు రచించాడు కేవలం 200 నేడు లభ్యం ఇవి శృంగారపదములు, దేశీ పదములు, జానపద పదములు మరియు వైరాగ్య పదములుగా విభజింపబడ్డాయి. ఈ పదములు "వేణుగోపాల" ముద్ర కలిగి ఉన్నాయి. అంటే సారంగపాణి, తనచే రచింపబడ్డ పదములు తన ఇష్టదేవత వేణుగోపాలునికి అంకితము చేసాడు.

ప్రొఫెసర్ గంగప్పగారు "సారంగపాణి పద సాహిత్యం" మరియు ఇరువారం లోకనాథంగారు "కార్వేటి నగరం సారంగపాణి పదములు" అని ప్రఖ్యాత పుస్తకములు రాసారు.

సారంగపాణి రాసిన జాతీయపదములు ఎంకిపాటలు వంటివి. పాత్రకు తగిన భాష ఔచిత్యంగా ఉండాలి. సారంగపాణి నీచ పాత్రల భావాలు నీచ భాషలో చెప్పారు.

ద్వితీయ భాగంలో దేశీయ పదములు ఉన్నవి. ఇందులో సామాన్య శృంగారము వర్ణించారు. ఇందులో భాష, భావము శిష్టజనులు సంప్రదాయంగా మాట్లాడుకొనే వ్యవహారభాషలో మనోహరంగా ఉంది. ఇందులో భాష అతి సులభము, లలితము, భావములు కూడా అతి కోమలము.

ఈయన పదములు నాకు క్షేత్రయ్య పదములకు పోలికలో కనిపిస్తున్నాయి. భావము, భాష, శైలి, ముద్ర, ఇద్దరి పదములు "వేణుగోపాలుని" ముద్ర కలిగి వున్నాయి. సారంగపాణి రచించిన ఒక పదముని పరిశీలిద్దాము.

పల్లవి: మాటాడరా వేణుగోపాలా యింత
మౌన మేమిర వేణుగోపాలా యిది

అనుపల్లవి: ఏటి మర్మము వేణుగోపాలా యిక మా
కెవరు దిక్కు వేణుగోపాలా
"మోము జూపర వేణుగోపాలా నీ
సొమ్మేమి బోనుగోపాలా
యేమి జెప్పవు వేణుగోపాలా ఒక్క"
"రక్షించరా వేణుగోపాలా నన్ను
పేక్ష సేయకు వేణుగోపాలా
కక్షి గట్టకు వేణుగోపాల సుంత
కరుణ జూడర వేణుగోపాల ఒక్క"
"చేరదీయర వేణుగోపాలా నన్ను
చెట్ట బట్టర వేణుగోపాలా
పేరు సేయకు వేణుగోపాలా కా
ర్వేటి నగర వేణుగోపాలా ఒక్క"

ఈ పదము శంకరాభరణం రాగం – చాపు తాళంలో నిర్దేశింపబడి వున్నది. సారంగపాణి తన పదములు అన్నీ ముందే ఏ తాళం, ఏ రాగంలో పాడాలో నిర్దేశించారు.

ఈ పదమును రెండు విధములుగా నర్తింపవచ్చును. ఒకటి శృంగార భరితంగా విప్రలంభ శృంగారము చూపుతూ, నిర్వేదము, గ్లాని, శంక, అసూయ, శ్రమ, చింత మొదలగునవి అభినయించాలి. ఇందులో నాయిక విరహోత్కంఠిత అని చెప్పవలసి వుంటుంది. నాయకుని రాకకై ఎదురు చూస్తూ సంతాపం, చిన్నపోవడం, దేహము వణకడం, కన్నీరు కార్చడం వంటి అవస్థలకు గురి అవుతుంది.

రెండవ రకంగా చేయడం భక్తి ప్రధానంగా కరుణరసంతో అభినయించడం. ఇక్కడ నాయిక జీవాత్మ "కార్వేటినగర వేణుగోపాలుడు" పరమాత్ముడు. ఈ జీవాత్మా–పరమాత్మల అనుసంధానమే నృత్యం పరమావధి.

ప్రపంచంలో ఎన్నో నృత్యరీతులున్నాయి. ఎందరో నర్తకులు, నర్తకీమణులు ఉన్నారు. కొందరికి కళ ఒక వ్యాపకం. కొందరికి కళ ఒక వ్యసనం. ఇంకొకరికి ఒక వ్యాపారము. కొంతమందికి కళ ఒక ఆరాధన. కళ ఆరాధన అవడమే భారతీయ కళ యొక్క గమ్యం.

కార్వేటి నగరం – కళాసేవ :

కార్వేటి నగరం చిత్తూరు జిల్లా పుత్తూరు తాలూకా కేంద్రానికి ఎనిమిది మైళ్ళ దూరంలో చిత్తూరు–పుత్తూరు రహదారిపై ఉంది. ఇది ఎంతో ప్రాచీనమైన నగరం. తమిళంలో 'కాడు' అంటే అరణ్యం, 'వెట్టి' అంటే పరిశుభ్రం చేయటం. ఒక అరణ్యాన్ని శుభ్రం చేసి కట్టిన నగరం కాబట్టి దీన్ని కాడువెట్ట నగరం అనీ, తరువాతి కాలంలో 'కార్వేటి నగరం' అని పిలువసాగారు. ఇక్కడి నదులు నగరి, నారాయణవనం. ఇవి వానాకాలంలో పొంగి పొరలి మిగిలిన కాలంలో ఎండిపోతుంటాయి.

కార్వేటి నగర రాజుల సంస్థానం కొంత ఉత్తరార్కాడు మండలంలోనూ, కొంత చిత్తూరు మండలంలోనూ వ్యాపించి ఉండేది. పుత్తూరు తాలూకాలో 542 చ.మై., తిరుత్తణి తాలూకాలో 401 చ.మై., మొత్తం 943 చ.మై. వైశ్యాలం కలది ఈ సంస్థానం. ఋణబాధల పాలైన ఈ సంస్థానంలో, 120 గ్రామాలు విడదీసి 'చెట్టినాడు' అనే జమీందారిని ఏర్పరిచారు. కార్వేటి నగర సంస్థానంలో కొంత భాగం తిరుమల–తిరుపతి వారు కొన్నారు. దీనిలోని మొత్తం గ్రామాలు 792, తిరుత్తణి, పల్లిపట్టు, నారాయణవనం అని మూడు రెవెన్యూ విభాగాలు. 1882లో పేష్కషు 187 వేలు. సాలీనా ఆదాయం 1885లో దాదాపు ఏడెనిమిది లక్షలు అని తెలుస్తున్నది. సాళ్వ వంశీయులైన మాకరాజు వారు కార్వేటి నగర సంస్థాన పాలకులు. క్రీ.శ. 1700 ప్రాంతంలో పాలించిన వెల్లంటి కసవరాజు సంగీత–సాహిత్య విద్యాపోషకుడు. ఋగ్వేది వేంకటాచల కవి చంపూ రామాయణాన్ని ఆంధ్రీకరించి, కసవరాజుకు అంకితం చేశాడు. ఋగ్వేది వేంకటనారాయణ కవి సంగీత–సాహితీవేత్త. జయదేవుని గీత గోవిందాన్ని ఆంధ్రీకరించిన మహాకవీ, వాగ్గేయకారుడూ అయిన సారంగపాణి ఈ కాలంవాడే.

సారంగపాణి ఏ కాలంవాడు? :

సారంగపాణి కార్వేటి నగరంలో వర్ధిల్లిన వాగ్గేయకారుడు. క్షేత్రయ్యతో సమానమైన, సుందర పదములు రచించాడు. ఈయన 400 పదములు రచించినా, కేవలం అందులో సగమే నేడు లభ్యం. వాఙ్మయం కోల్పోవడము మన తెలుగు వారికి అలవాటే కదా! మన సంస్కృతిని కాపాడుకోవాలనే తీరిక, కోరిక, ఓపిక మన తెలుగువారికి లేదు. వాక్కును గేయముగా కూర్చేవాడు వాగ్గేయకారుడు. శబ్దాను శాసన జ్ఞానం, అభిదాన ప్రవీణత, ఛన్దః ప్రభేద విదిత్వం, అలంకార కౌశలం, అశేష భాషావిజ్ఞానం కలవాడు వాగ్గేయకారుడు అని సంగీత రత్నాకరంలో చెప్పబడి వుంది. భగవంతుని పదములు చేరటం కోసం శ్రీ పదార్చన చేయడం పదాల యొక్క పథం, ఆదిలో కేవలం దేవతల స్తుతి కోసం పదములు పుట్టినా, తరువాత శృంగార, వైరాగ్య, నీతి బోధకాలు కూడా అయ్యాయి. పదములలో శృంగారము అలౌకిక, దేవతాపరంగా ఉండాలని నిర్దేశింపబడింది. కాని ఆ నియమము అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు తప్ప మిగిలినవారు పాటించక నరాంకితములు, లౌకిక శృంగారం రచించారు. "శృంగారమయమై, ఎక్కువగా విలంబ కాలమందు క్వచిత్తుగా మధ్యమ కాలమందు నడుచుచు పల్లవాను పల్లవములు మూడింటికి తక్కువ కాని చరణములు గలిగి ప్రాచీన రక్తి రాగములలో చేయబడిన గేయ రచనకు పదములని పేరు" అని పదముల నిర్వచనం కలదు.

"సారంగపాణి పాటలలో త్యాగయ్యగారి నారదత్వము గాని, క్షేత్రయ్యగారి వాల్మీకిత్వము గాని, కనపడకపోయినా పల్లవి అనుపల్లవి చరణం పరస్పరానుబంధం కలిగి, ఆయన సహజ కవితా సామర్థ్యాలను వెల్లడిచేస్తూ ఉంటాయి" అని శ్రీ మండపాక పార్వతీశ్వరశాస్త్రి అన్నారు. సారంగపాణి ఎంతో వైవిధ్యముతో శృంగార, దేశీయ, జాతీయ పదములు, కీర్తనలు రచించారు. పదము ఆదిలో కేవలం భక్తి రస ప్రధానంగా ఉండెడిది. అన్నమయ్య కాలానికి శృంగార, ఆధ్యాత్మిక – రెండిటినీ పదములు అనెడివారు. క్షేత్రయ్య కాలం నాటికి కేవలం శృంగార పదములనే పదములు అనడం వాడుకలోకి వచ్చింది. పదము, కృతి, కీర్తన దగ్గరగా వుంటాయి. "సంగీత రచనా ప్రధానములగు త్యాగయ్యగారి రచనల వంటి వాటిని కృతులు అనుచున్నాం. భక్తి ప్రధానమైన రామదాసు పాటల వంటివి కీర్తనములు అనుచున్నాం. సంగీత సాహిత్యంలో రెండూను తేలికరకాలైన దేశీయ

రాగాలలో చిల్లర శృంగారపు మాటల గూర్చి పాటలను 'జావళ్లు' అనుచున్నాం. కృతులందువలె సాహిత్యంగాని, కీర్తనలందువలె సంగీతాన్నిగాని దిగమ్రింగుటకు పదములలో అనుమతి లేదు. రెంటికిని సమాన ప్రాధాన్యమీయగల సంగీత శిల్పికి తప్ప, తక్కినవారికిందులో పప్పుడకదు" అని రాళ్ళపల్లి అనంతకృష్ణ శాస్త్రి అన్నారు. పదములలో చరణములు సాధారణంగా రెండు లేదా మూడు వుంటాయి. సారంగపాణి పరవశంలో పది చరణాలు కూడా రచించాడు. సారంగాణి, క్షేత్రయ్య పదములు కవలపిల్లల వలె, భాష, భావము రసములలో చాలా దగ్గరగా వుంటాయి. క్షేత్రయ్య పదములు సారంగపాణి వాటిలో కలిసిపోయాయా? సారంగపాణి పదములు క్షేత్రయ్య పదములలో కలిసిపోయాయా? ఏ విషయం నిర్దిష్టంగా, నిర్దుష్టముగా తెలియటంలేదు. సారంగపాణి కాలము గురించి వాదోపవాదములు ఉన్నాయి. గంగప్ప, బాలాంత్రపు రజనీకాంతారావు వంటి పండితులు, సారంగపాణి క్రీ.శ. 1680–1750 మధ్య జీవించి ఉంటాడని అభిప్రాయపడ్డారు. కాని, తిమ్మావజ్ఝల కోదండరామయ్య, గల్లా చలపతి, కె.జె. కృష్ణమూర్తి, మండపాక పార్వతీశ్వర శాస్త్రి, వంటి వారు సారంగపాణి 1750–1850 క్రీ.శ. మధ్య జీవించి ఉంటాడని అభిప్రాయపడుతున్నారు.

ఇక్కడ గందరగోళానికి కారణం, సారంగపాణి గారి దౌహిత్రుని పేరు కూడా సారంగపాణియే! అంతేకాక, కార్వేటి నగరమును ముగ్గురు వేంకట పెరుమాళ్రాజులు పాలించారు. మొదటి వేంకట పెరుమాళ్రాజు కాలంలో సారంగపాణి జీవించి ఉంటాడని తూమాటి దొణప్పగారు అభిప్రాయపడ్డారు. కాని రెండవ వేంకట పెరుమాళ్రాజు ఈ వాగ్గేయకారుని ఆదరించారని కె.జె. కృష్ణమూర్తి అన్నారు. శ్రీ దీవి నరసింహాచార్యులు ఈ విధంగా అన్నారు: "వీరు శ్రీ వేణుగోపాలస్వామి భక్తులు. వీరు కార్వేటి నగర ప్రభువులైన శ్రీమన్మహా మండలేశ్వర కతారి కార్వేటి నగర ప్రభువులైన శ్రీమన్మహా మండలేశ్వర కతారి సాళ్వరాజ వేంకట పెరుమాళ్లు రాజావారి యాస్థానమున వైణిక పండితులుగా నుండిరి. శకవత్సరములు 1731వ సం.కు. సరియైన శుక్ల సంవత్సరమున సంస్థానములో దుర్గరాజపురమను శ్రోత్రీయ గ్రామమును వీరికి దానమిచ్చిరి" కృష్ణా స్రవంతి పేజి. 119, 1959. కానీ 1731 శకసంవత్సరం 1731+78= క్రీ.శ. 1809.

కార్వేటి నగర సారంగపాణి

చెన్నపురిలో 1867వ క్రీస్తు శకం సంవత్సరం సారంగపాణి పదాలు గ్రంథం అచ్చుపడింది. కార్వేటి నగరాధీశ్వరుల ఆజ్ఞచే గ్రంథకర్తయగు సారంగపాణి దౌహిత్రుడు గరిమెళ్ల వేంకట సుబ్బయ్యచే నేలటూరి సుబ్రహ్మణ్యం గారి విద్యావిలాస ముద్రాక్షర శాలయందు ముద్రింపబడింది అని సారంగపాణి పదములు సమీక్ష పుట 10లో వుంది. సాధారణంగా తాతకు, మనుమడికి వయస్సులో వ్యత్యాసం 50 లేదా 60 ఏళ్లు వుంటుంది. 1867 క్రీ.శ.లో పదకర్త సారంగపాణి మనుమడి వయస్సు ఎంత? ఇతను ఎప్పుడు పుట్టాడు? పదకర్త సారంగపాణి క్రీ.శ. 1680లో పుడితే, మనుమడు క్రీ.శ. 1867లో ఎలా బతికి వుంటాడు? కానీ పదకర్త సారంగపాణి 1750లో పుడితే, మనుమడు క్రీ.శ. 1800 ప్రాంతంలో పుట్టి క్రీ.శ. 1867లో తాతగారి పదములు పైకి తీసుకు వచ్చాడనటం సమంజసం. పదకర్త సారంగపాణి క్రీ.శ. 1680లో పుడితే మనుమడు 187 ఏళ్ళ తరువాత క్రీ.శ. 1867లో బతికి వుండటం అసంభవం. ఈ పరిశీలన ఇప్పటివరకూ ఎవరూ చేయలేదు. తాత, మనుమడి మధ్య వయస్సులో వ్యత్యాసం గమనించి, ఆలోచించి నేను చేసిన పరిశోధన ఇది. అందువలన పదకర్త సారంగపాణి క్రీ.శ. 1750–1850 మధ్య జీవించి వుండవచ్చును.

కొచ్చెర్లకోట శ్రీలేఖ
హైదరాబాదు.

సాహిర్ - ప్రీతమ్

సాహిర్ గీతాలు

– జె.పి. వైద్య

'కవిత్వాన్ని మాత్రం కొనకూ – వినకూ
అది ఉత్త మన్ను
వేలు పెడితే చాలు తగులుతుంది
ఎవడిదో కన్ను...'

అని ఒక బుచ్చికవి పలుకుతే, మీసాలు మెలేస్తూ మరో మహాకవి ఉరిమాడు.

'ఆఁ! ఏంటీ? వాడూ కవా? ఎవరికీ అర్థం కాకపోయేదే మేలు కవిత' అని ఉదారంగా ఒక సలహా కూడా ఇచ్చి మరీ సాగి పోయాట్ట.

మనం మామూలు మనుష్యులం. కవిత్వం గివిత్వం మనకు జీర్ణంకాదు. కాని, ఏం తెలియక పోయినా 'కవి సమ్మేళనాలకు' ఝామ్మంటూ వెళ్ళి ముందు వరసల్లో దూరి కూర్చుంటాం.

'ఓహో!' – 'ఆహా!' – 'వహ్వా' ఎప్పుడనాలో అనే ఇంగిత జ్ఞానం ఉండకపోతే ఎలా? 'ముషాయిరా' లో దులిపేయడం అంటే జోక్ కాదు. అలాంటి ఓ గమ్మత్తు దాదాపు 68 సంవత్సరాల క్రితం 'లుధియానా'లో జరిగింది. ఆ ముచ్చట్లు తెలుసుకోవాలంటే మనం 1939 నాటి 'ఖాల్సాకాలేజీ – విశాలమైన ప్రాంగణం'లో పాదం మోపాలి.

ఇసుక రాలనంత జనం, 'అఖిల భారతీయ ఉర్దూ కవి సమ్మేళనం' సాగుతోంది అక్కడ. కవిత్వం 'చప్పగా' సాగుతే 'హుఁ' అంటూ – జోరుగా సాగితే పూనకం వచ్చినట్టు ఆహా! ఓహో! వాహ్వా! అంటూ ఊగిపోతున్నారు శ్రోతలు. మైకులో ఎవరో 'అబ్దుల్ హాయీ' (Abdul Hayee) అని పలికారు.

ఒక బక్క పల్చటి ఇరవై సంవత్సరాల ప్రాయం 'కవిగారు' వేదిక మీది కొచ్చారు. దాదాపు ఐదున్నర అడుగుల ఎత్తు... మొహం మీద కొట్టొచ్చినట్టు స్ఫోటకం మచ్చలు... మర్యాదగా వెనక్కి దువ్వి పడుకున్న తలవెంట్రుకలు... 'ఆఁ! ఏంటటా? 'అన్నట్టు ఎదురు తిరిగి ఫాలభాగంలో ముచ్చటించుకునే రెండు మూడు కేశాల పాయలు... పొడుచుకొచ్చిన కొటేరు ముక్కు... పెదాలపై వెలిగే నవ్వులో నవ్వుకన్నా మొండితనం పాలు ఎక్కువగా ఉన్న కవిగారు 'కవి'కన్నా 'కాలేజి కుర్రాడి' రూపులో కన్పించే సరికి – జనాలు మొహాలు చూసుకున్నారు.

– "హుఁ ! తోవ తప్పి వచ్చినట్టున్నాడు"....

– "ష్ ! ఏం విన్పించి చంపుతాడో విననీవయ్యా మగడా...!"

– శ్రోతల్లో గుసగుసలు ఆగిపోయాయి.

పిల్లకవిగారు నోరు తెరచి 'గజల్' విన్పించారు. దాని పేరు 'తాజ్‌మహల్'!

"ఏ చమన్ జార్, ఏ జమ్నాకా కినారా, ఏ మహల్,
ఏ మునక్కష్ దరో దీవార్, ఏ మహెరాజ్, ఏ తాక్ !
ఇక్ షహెంషాహ్ నే దౌలత్ కా సహారా లేకర్
హమ్ గరీబోంకి మొహబ్బత్ కా ఉడాయా హై మజాక్!
మెరీ మెహబూబ్, కహీఁ ఔర్ మిలా కర్ ముఝ్‌సే !"

("ఈ ఉద్యానవనాలూ... ఈ యమునా నది ఒడ్డూ... ఈ రాజప్రాసాదాలూ... ఈ సుందర చిత్రాల కుడ్యాలూ. కమాన్లూ... ఈ అందాల గూళ్ళూ... ఒక చక్రవర్తి కాసుల సాయంతో మా గరీబోళ్ళ ప్రేమను ఎగతాళి పట్టించేసాడు చూడు సుమా! ఓ నా ప్రేయసీ...! మరోచోట ఎక్కడైనా వచ్చి కలువు నాతో..." అన్నది దాని అర్థం") కాసేపు ప్రాంగణం నిండా స్మశాన శాంతత... ఆ తర్వాత ఆగకుండా చప్పట్లూ... 'వన్స్‌మోర్'ల గోలా...! రాత్రికి రాత్రే ఆ లక్క 'కవితతో 'అబ్దుల్ హాయీ' ఆనాటి మేటి కవుల వరుసలో వెళ్ళి కూర్చున్నాడు. అతడ్ని కదిలించే దమ్ములెవరికీ లేకుండా పోయాయి. ఉర్దూలో కలంపేరును 'తఖల్లుస్' అంటారు.

నేడు మనం ఎంతో ప్రేమాభిమానాలతో అక్కున చేర్చుకున్న 'సాహిర్' ఆయన కలం పేరు. తర్వాతి రోజుల్లో

'సాహిర్ లుధ్యానవీ' హిందీ సినీగేయ సామ్రాజ్యాన్ని దాదాపు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలాడు.

ప్రారంభం రోజుల్లో 'సాహిర్' దునియా వేరు. జీవన విధానం వేరు. లుధియానాలోని సంపన్న జాగిర్దార్ 'ఫజల్ మొహమ్మద్' – 'సర్దార్ బేగం'ల ముద్దుబిడ్డ సాహిర్. జమీందార్‌లకు ఎన్ని అవలక్షణాలుండాలో వాటికన్న పిడికెడు ఎక్కువే ఉండేవి. ఫజల్ మొహమ్మద్‌గారికి. హవేలీలో అనునిత్యం 'నువ్వెంత?' అంటే 'నువ్వెంత' లే! జమీందారీ 'అతి' విలాసం వల్ల సాహిర్ తల్లిదండ్రుల మధ్య కీచులాటలెక్కువయ్యాయి. 8 సంవత్సరాల చిరుప్రాయంలో సాహిర్ తల్లి విడాకులు తీసుకున్నది.

ఉన్న ఫళంగా రోడ్డుమీద 'మామూలు మనుష్యుల్లా' చతికిల పడ్డాడు 'బాల సాహిర్' గారు. అష్టకష్టాలు, నిరాశా నిస్పృహలు చిన్నతనంలోనే అతడికి 'జిమ్మేదారీ'లు నేర్పాయి. 'ఖాల్సాకాలేజి'లో చదవడం కన్నా – రోడ్ల వెంట తిరగటం – కన్పించినవాడికల్లా ఆపి మరీ కవిత్వం విన్పించడం – అవసరం వస్తే టీ, సిగరెట్టులందించి మరీ సుత్తి వాయించడం, సాహిర్ దినచర్య అయిపోయింది.

మరో వైపు సాహిర్ కల విజృంభించి రాయసాగింది.

సినిమా ఫక్కీలో సాహిర్ ప్రేమలో పడ్డాడు. షేర్–ఓ–షాయరీ అందించిన తొలి బహుమతి అది.

సాహిర్ ముస్లిం... ప్రియురాలు 'సిక్కు'... అమ్మాయి ఇంట్లో గొడవలు....! వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. సాహిర్ ఒకప్పుడు బాగా ఉన్నవాడు.

సినిమాల్లో జరిగినట్టుగానే, అమ్మాయి తండ్రి 'సాహిర్'ను తన పలుకుబడితో కాలేజిలోంచి గెంటించాడు.

సాహిర్ ప్రియురాలు మామూలు మనిషి కాదు. పంజాబీలో పేరు ప్రఖ్యాతులతో వెలిగిపోయిన కవయిత్రి, విదూషీమణి 'అమృతా ప్రీతమ్'.... సాహిర్ అంటే ఎంతో ప్రేమ. కాని, పరిస్థితుల ప్రభావం అంటూ ఒకటి ఏడ్చి చచ్చింది కదా జీవితాల్లో.

ఆఖరు దాకా సాహిర్ 'భగ్న హృదయుడి'గానే జీవించాడు.

కలం 'భగ భగమంటూ మండింది... పేరు దశదిశల్లోనూ పాకింది.

కొన్నాళ్ళు 'అదబ్–ఏ–లతీఫ్' – 'షాహకార్' – 'సవేరా' లాంటి పత్రికలకు 'సంపాదకత్వం' వెలగ బెట్టినా సిగరెట్టు ఖర్చులు కూడా దక్కలేదు.

ఒళ్ళుమండి రాసిన వాస్తవికతల సంపాదకీయాలూ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కలవరపెట్టాయి. 'అరెస్ట్ వారెంట్' జారీ అయ్యేసరికి – 'వామ్మో' అని భయపడకుండా, జాగ్రత్తగా 'సాహిర్' తల్లితోపాటు, తెల్లవారకముందే 'ఢిల్లీ'లో వచ్చివాలాడు. కొన్నాళ్ళు ఢిల్లీ వీధుల్లో రోడ్లపొడవులూ, వెడల్పు గట్రా లెక్కబెట్టాడు.

'నా అవసరం ముంబాయికే' అని ఝూమ్మంటూ ముంబైలోకి వాలాడు. అది మనం చేసుకున్న అదృష్టం.

'ఠండీ హవాయే లహరాకే ఆయే' (నౌజవాన్) సచిన్‌దేవ్ బర్మన్ సంగీతంతో పాటు సాహిర్ పేరు 'చల్లగాలి జోరుతో' యావత్ భారతదేశం పాకిపోయింది.

'బాజీ' పాటలతో అటు 'బర్మన్', ఇటు 'సాహిర్' పర్మనెంట్ ముంబయి వాళ్లయిపోయారు. *ఆజ్ కీ రాత్ పియా – తద్బీర్‌సే బిగడీ హుయీ తక్‌దీర్ బనాలే* (బాజీ/1951). పాటలకు మనమూ పులకించిపోయి వాళ్లను నెత్తిన పెట్టుకున్నాం. శరపరంపరల్లా 'సాహిర్' కలం అందమైన సదాబహార్ గీతాలనందించింది. ఆయన కలం 'రేంజ్' ఎంతో వైవిధ్యమైంది. పకడ్బందీగా సాగే అక్షరమాల... గుండెలో గిలిగింతలు పెట్టే *హల్కా* – ఫుల్కా గీతాలూ... నిర్దయగా జీవిత సత్యాలను దర్శించే సీరియస్ గీతాలూ... నిరాశావాదం కన్నా వాస్తవిక వాదాన్ని ఎత్తి చూపిన తాత్త్విక గీతాలూ... ముఖ్యంగా విప్లవ భావాల హోరుగీతాలు... అందరినీ అలరించిన ప్రేమ గీతాలూ....

మనం సర్వ స్వతంత్రులం కాబట్టి ధైర్యంగా కొన్ని గీతాలకు గున్ గునాయించుకుందాం!

మై జిందగీకా సాథ్ నిభాతా చలా గయా	**(హమ్‌దోనో / జయదేవ్)**
జో వాదా కియా	**(తాజ్‌మహల్ / రోషన్)**
కభీ కభీ	**(కభీ కభీ / ఖయ్యామ్)**
హమ్ ఆప్‌కి ఆంఖోమే – జానేక్యా తూనే కహీ	**(ప్యాసా)**
వహ్ సుబహ్ కభీతో ఆయేగీ	**(1958)**
తుమ్ అగర్ ముఝ్ కో నచాహో	**(దిల్ హితో హై / 63)**

విషాద గీతాల్లో సాహిర్ స్వంత దుఃఖాన్ని రంగరించే వాడేమో కాని, అవి అటు పంజాబ్‌లో అతనికి ప్రియురాలినీ, ఇటు మనకూ కంట తడి పెట్టించాయి.

కభి ఖుద్ పే కభి హాలత్ పే రోనా ఆయా	**(హమ్‌దోనో)**
జాయేతో జాయే కహాం	**(టాక్సీ డ్రైవర్ / 54)**
దుఃఖి మన్ మేరే సున్ మెరా కహనా	**(ఫంటూష్ / 56)**

రంగ్ ఔర్ నూర్ కి బారాత్ కిసే పేష్ కరూఁ (గజల్/ 65)
జీవన్ కే సఫర్ మే రాహీ (మునీమ్ జీ ' 55)

ఉర్దూలో ఆయన కలం *తాజ్‌మహల్, నూర్జహాన్, బహూబేగమ్* లాంటి చిత్రాల్లో హొయలొలికిస్తే – శుద్ధ హిందీలో *ఆమ్రపాలీ* లో శాస్త్రీయంగా కదం తొక్కింది.

కవ్వాలీ గీత నిర్మాణంలో రోషన్‌ను మించిన వాళ్ళు లేరు. అంతే ఉన్నతంగా చెలరేగి రాశాడు సాహిర్. ఎప్పుడైనా ఓపిగ్గా *న తో కారవాఁ కీ తలాష్ హై – ఆజ్ క్యోం హమ్ పే పర్దా హై* – ఏ హై ఇష్క్ ఇష్క్ విని చూడండి. *కవ్వాలీ బహార్ – నజాకత్ – అందాజ్* ఏమిటో అర్థమవుతాయి.

ఒకప్పుడు తన పుస్తకాలను అచ్చు వేయించుకోవడం కోసం పిచ్చెక్కినట్టు అడ్డమైన వాళ్ళందరినీ వేడుకున్న సాహిర్ గీతాలు *తఖ్లియా – గాతా జాయే బంజారా* లు డజన్ల సార్లు పునర్ముద్రణకు నోచుకున్నాయి. అది చాలదూ ఆయన గీతాల సత్తా ఏమిటో తెలపటానికి? ఎన్నో భాషల్లో అనువదించబడ్డాయి కూడా.

సుప్రసిద్ధ ఉర్దూ కవులు గుల్జార్, కిషన్ చందర్ ల దగ్గరే పర్ఛాయియాఁ (నీడలు) అనే అత్యాధునిక బంగళాలో, కవులకుండే శోకులన్నీ ఆనందించే సాహిర్ గుండెలో ఎక్కడో ఏమూలో *భగ్న ప్రేమికుడు* ఆఖరుదాకా అంటుకునే ఉండిపోయాడు. కలం గుండె దగ్గుత్తికతో రాసుకుంది.

చంద్ కలియాఁ నిషాత్‌కి చున్‌కర్
ముద్దతోఁ మహవే యాస్ రహతా హూఁ
తేరా మిలనా ఖుషీకీ బాత్ సహీ
తుఝ్‌సే మిల్‌కర్ ఉదాస్ రహతా హూఁ

(కొన్ని ఉల్లాసాల మొగ్గలనేరుకొని ఎంతో దుఃఖంలో మునిగి తేలుతుంటాను. నిన్ను కలవడం ఎంత ఆనంద దాయకమైనా, ఎందుకో మరి కలిసాక దిగులు పడి పోతుంటాను.)

రిమిక్స్‌ల హోరెత్తించే – నిరర్థక లొల్లి సంగీతంలో ఎంత మంది కొట్టుకుపోయినా, సేదతీర్చే సాహిర్ గీతాలున్నన్ని రోజులు మనకు ఢోకా లేదు. బర్సాత్ రాకున్నా "జిందగీ భర్ నహీ భూలేగీ వో బర్సాత్ కి రాత్" అని హాయిగా పాడుకోవచ్చు. తడితడిగా మధుబాలలున్న వాళ్ళు నిజంగానే అదృష్టవంతులు – దట్సాల్! మి

డా॥ జె.పి. వైద్య
ఆదిలాబాద్

దైవ పద్ధతి

పంగనామములను వడ్డి కాసులవాని
కండ్లు మూయనేమి కారణంబు?
కన్నుగప్పి సొమ్ము కైంకర్య మొనరింప
హృదయవర్తి యీ మహీధరోక్తి

హేల రావణుండు కైలాసగిరి నెత్తె
శైవ ధనువు నెత్త జాలడాయె
ఇందులోన మోసమేదొ కద్దని తోచు
హృదయవర్తి యీ మహీధరోక్తి

మహీధర నళినీమోహన్

చదవండి...

– ఎన్నార్కె



✦ **సాహిత్య డైరీ :** జయంతి పబ్లికేషన్సు వారు ప్రచురించిన కవుల, రచయితల జనన మరణాల పట్టిక. 176 పేజీలున్న ఈ పుస్తకం వెల : ₹100/- సంకలన కర్త మువ్వల సుబ్బరామయ్య.

✦ **నవ్యకథా పరిమళం :** రచయిత డా।। కపిలవాయి లింగమూర్తి. తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి గాంచిన పద్యాలు, వాటి చుట్టూ అల్లబడ్డ కథలను సరళంగా ఆబాలగోపాలానికి అర్థమయ్యే రీతిలో రచన సాగింది. మొత్తం 14 వ్యాసాలు. వెల : ₹70/-, పేజీలు 90. కావలసిన వారు ఫోన్ : 9000185437 ను సంప్రదించగలరు.



✦ **తెలుగు ప్రచురణ రంగం :** జయంతి పబ్లికేషన్సు సమర్పణలో మువ్వల సుబ్బరామయ్య ఎన్నో వ్యయ ప్రయాసలకులోనై ప్రచురణ కర్తలపై వివరణలతో తయారుచేసిన పుస్తకం.

పేజీలు : 175, వెల : ₹100/-, ప్రతులకు – జయంతి పబ్లికేషన్స్, కార్ల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ – 520002.

✦ **ధర్మదీపం** వారు బౌద్ధ సంప్రదాయ సంస్కృతుల పరిరక్షణ, విస్తరణలో భాగంగా రెండు పుస్తకాలు ప్రచురించారు. అందులో మొదటిది చైనా యాత్రికుడు **ఫాహియాన్** *భారతదేశయాత్ర.* ఫాహియాన్ చైనా నుంచి గుప్తుల కాలంలో భారతదేశం వచ్చేడన్నది మినహా మరేమీ తెలియని సామాన్య పాఠకునికి అతని సందర్శన కాలంలో విస్తృతంగా పరిఢవిల్లిన బౌద్ధ ధర్మం గురించి వివరాలు ఉన్నాయి. ఇది సామ్యూల్ బీల్ ఆంగ్లానికి తెలుగు అనువాదము. పేజీలు 86, వెల : ₹ 100/-. రెండవ పుస్తకం **అశోకావదానం.** బౌద్ధ మతాన్ని విశ్వమతంగా వ్యాప్తి చేసిన అశోకుని జీవిత చరిత్ర. ఇందులో అశోకుని ధర్మవీరమే ముఖ్యాంశం. దాని చుట్టూ కరుణ, మైత్రి, త్యాగం, వైరాగ్యం, దానం, మొదలైన భావాలు సుందరంగా అల్లబడ్డాయి. 112 పేజీలు గల ఈ పుస్తకం వెల 120. పై రెండు పుస్తకాలు రచించిన వారు **శ్రీ మోక్షానంద.** పుస్తకాలు ఆర్ట్స్ & లెటర్స్. (ఫోన్ : 9704640273)లో లభ్యమవుతాయి.





✦ **అపస్మారక స్థితి :** దీర్ఘకవిత – మోదు రాజేశ్వరరావు, నానాటికీ దిగజారుతున్న రాజకీయాల పట్ల, ప్రజలలో పేరుకు పోయిన స్వార్థం పట్ల విముఖతతో రచయిత పూరించిన శంఖారావం.

పేజీలు : 40 వెల : ₹ 40/-, ప్రతులకు – విశాఖ సాహితీ మిత్రుల ప్రచురణ.



✦ **హగ్ మి క్విక్ :** *విశాలాంధ్ర, ప్రజాశక్తి, చినుకు,* పత్రికలలో ప్రచురితమైన డా।। కె.ఎల్.వి. ప్రసాద్ వ్రాసిన 26 కథల సంపుటి.

పేజీలు : 166, వెల : ₹ 150/-, ప్రతులకు – ఫోన్ : 9866252002

✦ తెలుగు నాటకరంగంలోని మలుపులు, మజీలీలతో నిండిన **తెరతీయగరాదా.** నటులు, ప్రయోక్త డా॥ చాట్ల శ్రీరాములు, మరియు అధ్యాపకులు, పరిశోధకులయిన డా॥ కందిమళ్ల సాంబశివరావులు సంయుక్తంగా చేసిన రచన. తెలుగు నాటక రంగంలో ప్రాతః స్మరణీయులైన ఔత్సాహిక నటులు, వారి జీవన విశేషాలతో ఆసక్తికరంగా సాగిన కథనంతో రచన కొనసాగింది. ఇది ఆంధ్రనాటక కళాపరిషత్తు, హైదరాబాదు వారి ప్రచురణ. ఇందులో వ్రాయబడ్డ ప్రతి వ్యక్తి గురించి ఫొటోలు పొందుపరచబడ్డాయి. నాటకాభిమానులు ఆవశ్యం కొని తమ దగ్గర ఉంచుకోదగ్గ పుస్తకం.



పేజీలు : 200, వెల : ₹ 200/-, ప్రతులకు – శ్రీ అన్నమనేని ప్రసాదరావ్, ఆంధ్రనాటక కళాపరిషత్తు, 6-2-913, ప్రోగ్రెసివ్ టవర్స్, హైదరాబాదు – 04.



✦ **నాటకరంగ తరంగాలు :** చాట్ల శ్రీరాములు తన జ్ఞాపకాల పుటలనుంచి బయటకు తీసిన అనుభవసారం. ఇందులో ఆయన తనకు నాటకాలతో, నాటక సంస్థలతో, నటులతో, రచయితలతో తనకున్న అనుభవాలను, కొన్ని చారిత్రక సంఘటనలను ఏర్చి కూర్చి వ్రాసిన వ్యాస సంపుటి. అరుదైన, విలువైన ఈ పుస్తకాన్ని ఆవంత్ససోమసుందర్, కళాకేళి ప్రచురణలు, పిఠాపురం వారు ప్రచురించటం ముదావహం.

పేజీలు : 180, వెల : ₹ 150/-, ప్రతులకు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సోల్ డిస్ట్రిబ్యూటర్స్.

✦ **జోగిని :** రచయిత్రి వి. శాంతి ప్రబోధ. తెలంగాణా ప్రాంతంలో తరతరాల దురాచారాలపై ప్రత్యక్ష పరిశీలన జరిపి రాసిన వాస్తవిక కథ ఇది. సాహితీ పురస్కారం పొందిన నవలిది.

పేజీలు : 170, వెల : ₹ 60/-, ప్రతులకు – ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాదు.

✦ **ప్రాచీన శ్రేష్ట భాషగా తెలుగు చరిత్ర కొన్ని కొత్త చూపులు :** ఇదొక పరిశోధనా గ్రంథం. ఇందులో తెలుగు పుట్టుపూర్వోత్తరాలు సహేతుకంగా చర్చించబడింది. ద్రావిడ భాషాకూటమిలో దక్షిణాది భాషల్లో తెలుగు భాష తొలి కాన్పుబిడ్డ అని నిరూపించారు రచయిత **డా॥ ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ.** తెలుగు భాష క్లాసికల్ ఉద్యమంలో వారు కీలక పాత్ర వహించారు. తెలుగు నా మాతృభాష అని సగర్వంగా చెప్పుకునే భాషాభిమానులకు ఇదొక నిత్య పారాయణ గ్రంథ మవుతుందనటంలో సందేహం లేదు. వెల : ₹ 120, పేజీలు : 160, ప్రతులకు రచయిత సెల్ నెం: 9441809566 సంప్రదించండి.



✦ అరుదైన పుస్తక ప్రచురణకు కేరాఫ్ అడ్రసుగా మారిన రాజా చంద్ర ఫౌండేషన్ తిరుపతివారి నుంచి వచ్చిన మరో కానుక. **శ్రీ రామ తీర్థస్వామి** జీవిత చరిత్ర. రచయిత పేరు పేర్కొనబడలేదు. పేజీలు : 36, వెల : ₹30, నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాదు దీని సోల్ డిస్ట్రిబ్యూటర్స్.



✦ **భాషా నవ్యతకు బాటలు వేద్దాం :** తెలుగు సాహిత్యంలో భాషా ప్రయోగంలో వస్తున్న రచయిత ఎలనాగ. భాషలో తరుచుగా వస్తున్న అచ్చుతప్పులను, సందర్భరహిత పదబంధాలను విశ్లేషించి సరియైన పదజాలం ఉపయోగించాలని ఆ విధంగా భాషను మెరుగు పరచుకోవాలని సూచించన దీర్ఘ వ్యాస మీ రచన.

పేజీలు : 30, వెల : ₹ 30/-, ప్రతులకు – విశాలాంధ్ర.

మిసిమి *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

మిసిమి పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా **₹300/-** తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా **₹30/-** కలపండి.

1. పేరు : ....

2. చిరునామా :

ఇం.నెం. ....

వీథి ....

పేట ....

ఊరు ....

పిన్ ....

సెల్ ....

3. సంతకం : ....

Our A/c Details for Online Transfer :-

Bank	:	STATE BANK OF INDIA
Account	:	MISIMI
A/c. No.	:	10261569316
Branch	:	Saifabad, Hyderabad, INDIA
IFS Code	:	**SBIN0007315**

★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **నా కథ *చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి.**

మీరు బహుమతిగా **మిసిమి** మాసపత్రిక పంపండి.

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా.

మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు.

ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం.

మీ ఊరి గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర ₹ 300 పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింద గడులలో ఇవ్వండి.

మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

1. అంతర్వీక్షణం, 2. దూర తీరాలలో,
3. అగాధం, 4. ఓ ఖైదీ వీరగాథ,
5. నాలో నేను, 6. మిసిమి వ్యాసాలు (డా॥ ఇన్నయ్య),

చిరునామా :

....

....

....

....

....

మిసిమి
మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

స్పెయిన్‌లో మ్యూజియం

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.03.2015

అల్బేనియన్ దుస్తుల్లో లార్డ్ బైరన్